
ఇస్కూలు పిలకాయల కత

పిల్లల భాషలో *Algebra*

చదువులా? చావులా??

మా అమ్మ చెప్పిన కతలు

పిల్లల్తో మాట్లాడాల్సిన మాటలు



# నామిని ఇస్కూలు పుస్తకం


ఇస్కూలు పిలకాయల కత

పిల్లల భాషలో ***Algebra***

చదువులా? చావులా??

మా అమ్మ చెప్పిన కతలు

పిల్లల్తో మాట్లాడాల్సిన మాటలు



# నామిని ఇస్కూలు పుస్తకం

టామ్ సాయర్ బుక్స్

ఫ్లాట్ నం. 206, అన్నమయ్య టవర్స్

యాదవ కాలనీ, తిరుపతి-517 501

ఫోను : (0877) 2242102

# ఇస్కూలు పుస్తకం

**– నామిని**

**ఇస్కూలు పిలకాయల కత, పిల్లల భాషలో *Algebra,* చదువులా? చావులా??, మా అమ్మ చెప్పిన కతలు, పిల్లల్తో మాట్లాడాల్సిన మాటలు**

**– ఈ అయిదు పుస్తకాలూ కలిసిన సంపుటానికి...**


**మొదటి ముద్రణ** : మే 2010

**బొమ్మలు** : బాపు

**ప్రచురణ** : టామ్ సాయర్ బుక్స్
తిరుపతి

**పుస్తకాలకు** : విశాలాంధ్ర ప్రచురణాలయం
అన్ని బ్రాంచీలూ...
నవోదయ బుక్‌హౌస్,
కాచిగూడ, హైదరాబాద్

**ముద్రణ** :



**నామిని అడ్రసు** : ఫ్లాట్ నం. 206, అన్నమయ్య టవర్స్
యాదవ కాలనీ, తిరుపతి–517 501
ఫోను : (0877) 2242102



**ధర : 200 రూపాయలు**

# సంగతి ముద్దలు

**నే**నూ నా పుస్తకాలూ వీధుల్లోనూ, పిల్లల్లోనూ ఈ మాత్రం తిరుగులాడుతున్నా మంటే... నా వెనకానా, నా పుస్తకాల వెనకానా ఎంతో మంది వుండారు!

పద్ధతేమంటే మనకి మేలు చేసిన వారిని కడుపులోనే పెట్టుకోవడం. ఆ పద్ధతిని ఈరోజు కొత్తగా నేనెందుకు తప్పుతున్నానంటే–

పదేండ్లుగా వొంటి చేత్తో నేనొక్కణ్ణే పుస్తకాలు రాసీ, అచ్చు వేసీ, వాటిని లక్ష లాది మంది పిల్లలకు చదివి వినిపించీ, చేర వేసేస్తున్న మొగలాయినని బడాయికి పోలేక భయపడి...!

వీళ్లెవరికీ పేర్లు చెప్పడం యిష్టం లేకపోయినా చేసిన మేలును ఇన్నేండ్లకైనా తలుచుకోక పోతే నాకే మనస్తాపంగా వుండి....!

ఆంధ్ర ప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్‌గా చేసిన సీ సుబ్బారావూ, ఐ.పి.ఎస్. అధికారి సి.ఆర్. నాయుడూ, ఐ.ఎ.ఎస్. అధికారి ఫణి కుమారూ, కొడుకు వయసున్న నన్ను కూడా స్నేహితుడని చెప్పుకునే మా ఇద్దరు చిన్నాయనలు బాపూ రమణా, మిట్టూరోడి పుస్తకం చదవడం వల్ల నా కొడుకుని నారప్ప మనవడిగా భావించి చదివిస్తున్న విశాఖ 'గీతమ్' యూనివర్శిటీ పెద్దాయన ఎం.వి.వి.ఎస్. మూర్తీ, అనాధ శరణాలయాల్లో పిల్లలకు నీ పుస్తకాలివ్వాలయ్యా అని అణాపైసలతో లెక్కగట్టి నా దగ్గిర చీటికి మాటికి పుస్తకాలు కొని నా జేబులో నాలుగు రూపాయలు పెట్టే స్నేహ వినైల్ దుర్గా ప్రసాదూ, ప్రపంచంలోనే ప్రసిద్ధి గాంచిన ప్రగతి ప్రింటర్స్ అధినేత నరేంద్రా, అప్పుడప్పుడూ మిట్టూరోడి పుస్తకాన్ని చదవక పోతే మా ఇంటిల్లి పాదికీ నోరు చవి చెడి పోతుందని నాకు తప్ప అందరికీ చెప్పుకునే నూజివీడు సీడ్స్ అధినేత్రి ఆశాలతా, నాకంటే పెద్దవాడైనా నన్ను బావా బావా అని పిలిచే ముద్రికా ప్రింటర్స్ కృపాకర్ రావూ, ఈ పిచ్చోణ్ణి కూడా మహర్షి అని భ్రమించే చార్టెర్డ్ అకౌంటెంటు పిడూరి రాజశేఖరూ, మీర్రాసిన పుస్తకాలు ప్రతి పిల్లాడి చేతిలో వుంటే ఎంత బాగుంటుందో కదాని వంద మంది చేతుల్లో ఈ పుస్తకాల్ని పెట్టిన

సాంఘిక సంక్షేమ హాస్టళ్ల డిప్యూటీ డైరెక్టర్ రఘురామూ, ఒక్క పుస్తకం కొనినప్పుడల్లా నాకు వెయ్యిన్ని నూట పదార్లు చదివించుకునే కార్పొరేషన్ బ్యాంకు మధుసూదన రావూ, అమెరికా నుంచి తిరుపతి వచ్చి నన్ను కలిసి నా దగ్గిర 20 రూపాయల విలువ చేసే ఒక్క చదువులా? చావులా? పుస్తకం కొనుక్కొని మా పిల్లల చేతుల్లో పదివేల రూపాయలు పోసి పోయిన 'తానా' మాజీ అధ్యక్షుడు జంపాల చౌదరీ, 25 వేలు తీసుకుని మరీ నెలనాళ్లు నేను రానీపోనీ లెక్కలు చెప్పడం వల్లనే 'మా బిడ్డ సృజన్ ఇంజనీరయ్యాడ'ని పదేండ్లయినా మరిచిపోని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి అచ్యుత రామయ్యా, నేను హైద్రాబాద్‌లో వున్న రోజుల్లో నన్ను మినర్వా హోటల్‌కి పిలిపించుకుని రోజుల తరబడి విందూ వినోదాలు పంచిన ఎస్.ఆర్.ఎస్. శాస్త్రీ, విద్యకు సంబంధించి ఓనమాలు రాని ఈ గాడిదని కూడా విద్యావేత్తగా గౌరవించే నిఖార్సయిన విద్యావేత్త ఎస్.ఆర్. పరిమీ, అమెరికాలో మైక్రోసాఫ్ట్‌లో పనిచేసే మల్లికార్జున్ యలమంచిలీ, వాళ్ళమ్మ ఝాన్సీబాయీ, పొరపాటున కూడా నేను నెలల కొద్దీ ఫోను చేయక పోయినా, ఏదో పనిమీద తిరుపతికి రాంగానే 'నీ యబ్బా వస్తావా, చస్తావా' అని నన్ను బూతులు తిడుతూనే నేనంటే పడి చచ్చే లాంకో గ్రూప్ డైరెక్టర్ శ్రీనివాసూ, 'ఈ పుస్తకాలతోనే మీరు ఎట్లా బతుకుతారు సార్' అని నా గురించి అనవసరంగా ఆందోళన పడిపోయే హైద్రాబాద్ నవోదయ కోటేశ్వర రావూ, 'బతుకు గోరే తల్లి' అంటే నాకు ప్రాణం అని చెప్పుకునే తెలుగు విశ్వ విద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ ఆవుల మంజులతా, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్ళలో వుండే బీద పిల్లలకి మీ కతలు వినిపించీ, కాసింత ఆల్జీబ్రా నేర్పించీ, వాళ్ల చేతుల్లో పుస్తకాలు పెట్టండి, డబ్బు కత నేను చూస్తానని నన్ను అమెరికా నుంచి శతపోరే రవికిరణ్ తిమ్మిరెడ్డీ, ఆయన స్నేహితుడు హనుమంతరావూ, మా అక్క కూతురు తులసీ పెళ్లికి, 'నువ్వు నయాపైసా ఖర్చుపెడితే తోలు తీస్తా నాయాలా, నాకు కూడా ఆ పాప అన్న కూతురే వాయ్' అని అమెరికా నుంచి ఎనిమిది లక్షలతో పరుగెత్తుకొచ్చిన మా మేనత్త కొడుకు డాక్టర్ దేవరాజులు బావా, అరుణక్కా, నన్ను తండ్రి మాదిరిగా అనుకొని నేను చేసిన మాట సహాయానికి రోజూ దండం పెట్టుకుంటూ వుంటానని తిరప్తి అంతా చెప్పుకునే రాయదుర్గం శేఖర్‌బాబూ, సెలవుల్లో వూరికెళ్లి నప్పుడల్లా ఆడోళ్లను ముందర బెట్టుకుని మిట్టూరోడి పుస్తకం చదివి వినిపించడమే నా పని అంటూ నా దగ్గర వందల కొద్దీ పుస్తకాలను

కొనుగోలు చేసి ఫుల్ రేటు ఇచ్చే సబ్ రిజిస్ట్రార్ జి.వి. కొండారెడ్డీ, నాతో నేరుగా మాట్లాడక పోయినా నా యోగ క్షేమాలను రోజూ కనుక్కునే కృష్ణాజిల్లా తెన్నేరు రైతు బిడ్డా, ఆడిటరూ దేవినేని మధుసూదన రావూ, ఖమ్మం సమతా హాస్పిటలాయన శ్రీధరూ, 15 కిలోల కోళ్లు పెంచే బంజారా హిల్స్ ఆసామీ విఠలూ, ఒక్క మిట్టూరోడి పుస్తకానికి 150 రూపాయలివ్వండి సార్ చాలు అని మొర పెట్టుకున్నా లక్షరూపాయ లిచ్చినా తక్కువేరా పిచ్చోడా అని నన్నభిమానించే జూబ్లీహిల్స్ క్లబ్ సెక్రటరీ హనుమంత రావూ, నా పుస్తకాల ద్వారా నేను 'హుందా'గా బతగ్గలిగితే కుశాలతో వుప్పొంగి పోయే మల్లారపు ప్రసాదూ, పిలిచినా పిలవక పోయినా పలికే సోక్రటీసూ, ట్రెజరీ శీనూ, మా అనంతపురం అన్న డాక్టర్ ఎల్. విజయ మోహన్ రెడ్డీ... ఇంకా సాకం నాగరాజ పేరు కూడా ఏమని చెప్పుకోను నా దరిద్రం గాకపోతే!

వీళ్లల్లో 40, 50 శాతం మందికి నా పుస్తకాలు తప్ప నా ముక్కూ మొహం తెలీక పోయినా... పదేళ్లుగా వీళ్లు పెట్టిన సంగటి ముద్దలే తిని బతుకుతున్నా. ఇందుకు ప్రతిఫలంగా వుప్పుకీ, వూరగాయకీ పనికి రాని ఈ కృతజ్ఞతా స్తుతుల్ని ఏ ఏట్లో పోయను?

– నామిని

**( రెక్కల కష్టంతో నా పుస్తకాలమ్మి లక్షల్లక్షలు ఎట్లా సంపాయించానో ఇలావరిగా వొక పుస్తకం రాసేదాకా ఈ గుక్కెడు వూపిరి పోనివ్వను! )**

# పుస్తకం చదివే ముందర ఒక చిన్న మాట!

**నా** పుస్తకాల్ని చదివిన కొందురు నన్ను బట్టుకొని, "మీరు ఎమ్మే తెలుగా?" అనడుగుతుంటారు. "అబ్బెబ్బే నేను ఎమ్మెస్సీ మాథ్స్" అని చెప్తే ఎమ్మెస్సీ చేసి సాహిత్యంలోకి ఈ మనిషి ఎట్లా వచ్చాడా అని యిచ్చిత్ర పోతుంటారు.

చెప్పొచ్చేదేమంటే – నేను ఎమ్మే తెలుగు చదవడం వల్ల కాదు గదా మిట్టూరోడి పుస్తకాన్ని రాసింది! ఇక్కడ రెక్కల కష్టం చేసుకునే మా అమ్మతో పాటు మా వూరాడోళ్లు నాకు గురువులై భాష నేర్పించినట్టే...

ఎమ్మెస్సీ మాథ్స్ చేశాను గాబట్టి నేను ఇస్కూలు పిలకాయల కతనీ, పిల్లల భాషలో Algebra నీ, చదువులా? చావులా??... ఇవేవీ రాయలేదు! ఇక్కడ నాకు మా అక్క కూతురు తులసీ మొదలు వీధుల్లో తిరిగే పిలకాయలే నాకు గురువులై వీటిని రాయించినారు.

నేను సోక్రటీస్ స్కూల్‌లో పిలకాయలకు లెక్కల పాఠాలు చెప్పింది కూడా ఒక్క సంవత్సరమే– అదీ ఆంధ్రజ్యోతిలో వుద్యోగం చేస్తూ! పిల్లలు లెక్కల్లో చేసే తప్పులు నాకు చానా న్యాయంగా కనిపించినాయి. నేను ఆంధ్రజ్యోతి వీక్లీకి ఎడిటర్‌గా 1998 లో హైద్రాబాద్ వెళ్లాక కూడా నాకీ ఆసక్తి పోలేదు. పిల్లలు లెక్కల్లో ఎలాంటి తప్పులు చేస్తారో చూద్దామని సరదా కొద్దీ కొన్ని వేలమంది పిల్లల్ని స్కూళ్లకెళ్లి కలిసి మాట్లాడు తుండే వాణ్ణి. 1999 లో ఇస్కూలు పిలకాయల కత రాసినప్పుడు నేను పిల్లల భాషలో Algebra రాస్తానని ఆత్మలో కూడా అనుకోలేదు. అట్లాగే పిల్లల భాషలో Algebra రాస్తున్నప్పుడు చదువులా? చావులా?? రాస్తాననీ అనుకోలేదు.

మైనస్‌ల దగ్గిరా, గుణింతాల దగ్గిరా, బ్రాకెట్ల దగ్గిరా, భిన్నాల దగ్గిరా పిల్లలు ఎన్ని అగచాట్లు పడుతుంటారో చూసి మదన పడి ఈ అన్ని పుస్తకాల్లో 'ఇట్లా, చెప్పండయ్యా! ఇవయ్యా పిల్లల సమస్యలు!' అని టీచర్లతో మొర పెట్టుకున్నట్టుగా పదే పదే గొంతు చించుకున్నాను. వీటిని దయచేసి రిపిటీషన్స్‌గా అనుకోవద్దు. ఇంతకు ముందు అచ్చయిన ఈ పుస్తకాలను అన్నిటినీ కలిపి ఒకే పుస్తకంగా

వేస్తున్నప్పుడు కూడా యధాతథంగా వుంచానే గానీ తీసివేతల గురించీ, బ్రాకెట్లు వెయ్యడం గురించీ, తియ్యడం గురించీ అన్ని పుస్తకాల్లో వున్నా వాటిని ఎడిట్ చెయ్యాలని నాకు అనిపించలేదు.

చూడండి తమాషా, మొన్నటికి మొన్న ఈ 2010 ఏప్రిల్‌లో ప్రపంచంలోనే ప్రసిద్ధి పొందిన ఋషీవ్యాలీ స్కూల్లో మూడు రోజులు 'అతిధి' హోదాలో పిల్లల్తో గడిపినాను. వాళ్ళు చదివే ఇంగ్లీషు పుస్తకాలను చూసి బిత్తర పోయినాను. అయితే లెక్కల దగ్గిరకొచ్చే సరికి వాళ్లూ మామూలే.

ఎనిమిదో తరగతి పిల్లలు కూడా 331 ని 3 తో భాగించలేక పోయినారు. అందరి ఆన్సరూ 11.33 నే! నీళ్లులేని బాయిలోకి దూకి నడుములిరిగి చచ్చి పోవాలన్నంత అసింకమేసింది. 'లెక్కల్లో పిల్లలు చేసే తప్పులు' అనీ, 'అంకెలతో లెక్కలూ', 'x, y, z లతో లెక్కలూ' అనీ ఇట్లా మళ్లీ చెప్పిందే చెప్తూ, పుస్తకాలు రాసేయాలనిపించింది. రాసిన వాటినే టీచర్లు ఇన్నేండ్లుగా చదవక పోతే మళ్లా కొత్తవెందుకులే అని నోరు మూసుకొని గమ్మనుండా.

కొన్ని వందల సార్లు $(a+b)^3$ సూత్రాన్ని పిల్లలు కంఠస్తం పెట్టడం చూసిన ఈ పాపిష్టి కళ్లకు ఈ 'ఇస్కూలు పుస్తకం' లో చెప్పిన సంగతులు పదే పదే కని పించినా... ఎట్లా తుడిపేయగలను?

– నామిని

# ఇదీ వరస

పేజీ నెం.

**ఇస్కూలు పిలకాయల కత ... 10–87**

అస్సలెందుకు చదువుకోవాలంటే ... 11

ఎనిమిదో తరగతే అయినా ఒకటో తరగతి నుంచి ఇంగ్లీషు ... 22

ఎప్పుడొస్తే అప్పుడే ... 30

వేప్పుల్ల శాస్త్రం ... 40

ఇక్కణ్ణుంచి మొదలు బెట్టకపోతే ఎట్ట? ... 50

331 ని 3 తో భాగించడం ... 62

రుద్దడం కంటే గోడకుర్చీ మేలు ... 76

**పిల్లల భాషలో *Algebra* ... 88–177**

పెద్దలు చెయ్యాల్సింది ... 89

కూడికలూ – తీసివేతలూ ... 91

బ్రాకెట్ల ప్రాధాన్యత ... 98

ఆల్జీబ్రాలో గుణకారాలు ... 106

Algebric Expressions ... 111

Substitute చెయ్యడం (ప్రతిక్షేపించడం) ... 112

Algebric Equations ... 115

వయసు లెక్కలు ... 123

రెండంకెల సంఖ్యలతో లెక్కలు ... 129

ముఖ్య సూత్రాలూ – వాటి ఉపయోగాలూ ... 136

Bases and Powers ... 148

జామెట్రీ ... 162

త్రిభుజాలు ... 172

ఇవన్నీ టెక్స్ట్ బుక్స్‌లో లేవా? ... 175

**చదువులా? చావులా?? ... 178-256**

గొ్రైదాటు ... 179

పిల్లల మీద తల్లిదండ్రుల మోజు ... 183

తల్లీ, తండ్రీ, గురువూ... ఈ మూడు దెయ్యాల భాష! ... 196

Magic figure కోసం ఇదేమైనా పద్ధతిగా వుందా? ... 200

పిల్లల్లో సెక్స్ సమస్య; ఇదో పెద్ద నల్ల నాగుబాము ... 208

కోళ్ళ ఫారం పెట్టినట్టే! ... 213

మేధావుల పిల్లచేష్ట ... 219

తలకాయలైతే వున్నాయి గదా, ఆలోచిద్దాం! ... 225

కొంపలు కూల్చే ఫిజిక్స్ ... 228

పసి పిల్లలమై పోయి Maths చెప్పాలి ! ... 237

ఇంటర్‌లో ఏం జరుగుతోంది? ... 247

కామన్ సెన్స్ లేకే...! ... 252

**మా అమ్మ చెప్పిన కతలు ... 257-299**

కాకమ్మ - చీమమ్మ ... 258

అన్నదానంలో వున్న మహిమ ... 263

గువ్వ చాతుర్యం ... 268

లొట్టిగాడు ... 274

అబ్బోడు ... 278

డాం డాం డాం ... 282

ఎవరు బలశాలి! ... 286

ఆలీ – మొగుడు ... 289


పాపిష్టి పిల్లి ... 292

అవ్వ-పొటేలు ... 296

**పిల్లల్తో మాట్లాడాల్సిన మాటలు ... 300-323**

**[ఇస్కూలు పిలకాయల కత రాసింది 1999లో, పిల్లల భాషలో *Algebra* 2000 లో, చదువులా? చావులా?? 2001 లో, మా అమ్మ చెప్పిన కతలు 2002 లో, పిల్లల్తో మాట్లాడాల్సిన మాటలు రాసింది మాత్రం మొన్నటికి మొన్న 2010 ఏప్రిల్‌లో... ]**

# ఇస్కూలు పిలకాయల కత



# అన్నతెందుకు చదువుకోవాలంటూ



రిజర్వేషన్లనేటివి చానా మంచివి. నాకు బలే ఇష్టం.

ఇంటర్మీడియట్‌లో నా చదువు గురించీ, మా ప్రిన్సిపాల్ కొడుకు చదువు గురించీ, ఇంకొక పల్లెరెడ్డి చదువు గురించీ చెప్తా వినండి.

నన్ను ఇంజనీర్‌ను చేసేద్దామని మాయమ్మా నాయినా నన్ను ఎంపీసీలో చేర్పించినారు. దినామూ పది నుంచి నాలుగున్నర దాకా కాలేజీ. మా మిట్టూరు–తిరప్తికి ఆరు మైళ్ళ దూరం. చార్జీ వొచ్చి పోను అరవై పైసాలూ, రాను అరవై పైసాలూ. తిరప్తి – యెంగటేస్పర సామి దర్మాన మా వూరికింత దగ్గిరగా వుండబట్టే, చార్జీలు సలీసు గాబట్టే నేను కాలోజీ మెట్టెక్కగలిగినా.

ముందు మా బస్సుల గురించి కొంచిం. మా బందుగులంతా చంద్రగిరి రూట్‌లో అంటే పడమర రాజ్యాన వుండేటోళ్ళు. మా వూళ్ళల్లో ఏదన్నా కార్యం జరిగితే – మా పరంటు సైడు బందుగులకు బిత్తరెత్తుకునేది – నెత్తిన గుండేసినట్టు.

'రాయల్ చెరువు రోడ్డులో ఆ బస్సులెక్కి ఆ కార్యానికి పొయ్ రావాలంటే ఇప్పుడెట్టరా బగమంతుడా!' అని లబలబా నోరు గొట్టుకునే వోళ్ళు. అంత పేరెత్తు కున్నాయి మా రాయల్ చెరువు రూట్ బస్సులు. అప్పుడు – ఇప్పుడున్నంత మిడి

మేలంగా ఆర్టీసీ బస్సులు గూడా లేవు. ప్రైవేటు బస్సులే. కిందా మిందా యేసి జనాల్ని బస్సుల్లో తొక్కేవోళ్ళు. నాకు మా మండలంలో వుండే ప్రజలు ముక్కెంగా ఆడోళ్ళు అంత 'క్లోజు' అవడానికి కారణం ఈ బస్సు ప్రయాణాలే.

తెల్లారి ఎనిమిది గంటలకు పుస్తకాలూ కేరీరూ ఎత్తుకొని (ఆ రెంటికీ బ్యాగు వుండేది గాదు) మా కోనేటి దగ్గిర నిలబడితే – టాప్ మిందికి ఎక్కదామన్నా మా బస్సులు నిలబడేవి గావు. తొమ్మిదికి ఏదో ఒక వాటంగా బస్సులో అంత తావు దొరికి తొమ్మిదీ ముక్కాలుకంతా రాయల్ చెరువు బస్టాండులో దిగే వాళ్ళం. అక్కణ్ణించి మా ఎస్వీ జూనియర్ కాలేజీ – ఎన్ని అడ్డదోవల్లో దూరినా ఒకటి ఒకటిన్నర మైలు. ఫస్టు పీరిడ్డు ఎప్పుడూ ఇరై నిమిషాలు లేటే. మళ్ళ, కాలేజీ అయిపొయ్‌నాక ఇల్లు చేరే కొందికి కనాగష్టం ఎంత తక్కువేసుకున్నా ఆరూ ఆరున్నరవతాది.

మాయమ్మ ఎట్టలేదన్నా దినామూ రెండు రూపాయిలన్నా ఇచ్చేది. ఒక్కోసారి ప్రైవేటు బస్సులో – కనీసం వారానికి రెండు మూడు యావతులు టికెటు తీసుకునే వాణ్ణి గాదు. కండక్టరు అడిగితే, బయం బయంగా గొంతులోకి కరుకుదన్నాని తెచ్చుకుని, 'ఎన్నిసార్లు ఇవ్వాలయా టిక్కెట్టు? స్టేజీ స్టేజీకీ తీసుకోమంటావా ఏంది?' అని కార్వేటి నగరం కండక్టర్ని బెదరగొట్టేది. వాడు పాపం, 'ఓ ఓ ఆల్రెడీ తీసుకునేసినావా?' అనేసి పొయ్యేవోడు. ఈ కుశాలలో ఎస్వీకేఫుకు పొయ్ మసాలా దోసికి ఆర్డరేసే వోణ్ణి. అక్కడా మాంతమైన రష్షు. దోసి తినేసి తేపుకుంటా సైగ్గా వొచ్చేసి అక్కడ ఎనపై నయాపైసాలు మిగలబెట్టేసే వోణ్ణి. ఇట్లా మిగలబెట్టిన రూపాయా నలబై పైసాలతో మద్యానం పూట ప్రాక్టికల్స్‌కు మూడు నామాలు పెట్టేసి నేరుగా గ్రూపు తియేటర్స్ కాడికి చేరుకుని, అక్కడ మెట్టుతో కొట్టినట్టు డెబ్బై పైసాలు చెల్లించి టిక్కటు తీసే వోడిని. తెరకు దగ్గిరగా కాలు మింద కాలేస్కోని సిల్మా చూసి ఇల్లు చేరడం...

లెక్కలు, ఫిజిక్సు, కెమిస్ట్రీ – అయ్యవార్లు చెప్పిన నోట్ బుక్కులే గతి. ఇంట్లో నోటు పుస్తకాలు తీసిచ్చేవోళ్ళేగాని టెక్ట్సు పుస్తకాలు తీసియ్యమంటే, 'అయ్యవార్లు చెప్పే నోట్ బుక్కులు చాలవంట్రా. మళ్ళ అచ్చు పుస్తకాలు గూడా కావాల్నో?' అనేవోళ్ళు. దీంతో టెక్ట్సు బుక్కు మొకం మాకు తెలవదు.

మా మాథ్స్ లెక్చరర్లిద్దరు గూడా, 'అమ్మను జేస్తే తమ్ముడు పుడతాడు' అనే నా కొడుకులే. వాళ్ళు క్లాసు రూముల్లో ఒక్క మాట కూడా ఎగస్ట్రాగా మాట్లాడేవోళ్ళు గాదు. 'ఏమన్నా డౌట్లు వుంటే–' అని డ్యాష్ పెట్టేసే వోళ్ళు. ఆ డ్యాష్‌ను యెనక

బెంచీలో 'ఎట్లా మనం ఫెయిలే'అని తెగించిన ఒక పల్లెటూరి పిలగాడు, 'ట్యూషన్‌కొచ్చి అడగండి' అని పొల్లుబోకుండా పూరించే వోడు.

ఇంట్లో, 'నేను ట్యూషన్ జేరతా' అని నేనే ఏ పొద్దూ అన్లేదు. ట్యూషన్లు ఎటువంటోళ్ళు చేరతారంటే– తిరప్తిలో ఎవురి నాయన్లయితే వుజ్జోగాలూ, యాపారాలూ చేస్తుంటారో వోళ్ళ పిలకాయలు చేరతారు. ఇంకా, ఇంటికాడ పదీ పద్దైదెకరాల బూమి వుండి పిలకాయల్ని తిరప్తిలో హాస్టళ్ళలోనో, రూముల్లోనో పెట్టి చదవించే వోళ్ళు మాత్రమే ప్రైవేట్లకు పొయ్యేవోళ్ళు. మా మాదిరిగా దినామూ వూరి నుంచి వచ్చి పొయ్యే వోళ్ళు చేరడానికి వీలవనే అవదు.

ఇంగొక పాయింటేమంటే – మా అమ్మా నాయినా సేద్యం గదా చేసేది. నేనెంత కాలోజీకి పొయ్ చదువుకుంటా వుండినా – ఇట్ట వుండే పుల్ల అట్ట వెయ్యనంటే కుదరనే కుదరదు. వరి మళ్ళో కొంగల్ని మాయమ్మ వొచ్చి తోలాలంటే అవుతుందా? ఎన్ను మింద గువ్వల్ని – పుస్తకం చదువుకుంటానైనా తోలచ్చు గదా. ఉతారుకు శెనిక్కాయల మాసూలు కాలమనుకోండి. కొట్టంలో గొడ్లను ఎవురు వొదల్తారు? పరీక్షలకు ప్రిపరేషన్ హాలిడేస్ అని వుంటాయి. అప్పుడు కూడా ఇంట్లోనే పుస్తకం ముందర కుచ్చోని లెక్కలేసుకుంటా వుండలేం. గొడ్లు 'అంబా' అని అగోరిస్తా వుంటాయి. పైగా పచ్చిక కాలం. పుస్తకాన్ని చేతిలో పెట్టుకుని వాటిని అట్లా మడి కాడికి తోలుకు పోయి తిప్పుకొద్దామనిపిస్తుంది. ఎనుముల్ని విడస్తాను. వాటి మానాన వాటినొదిలేసి నా మానాన నేను త్రికోణమితిని చూసుకుంటా వుంటే అవి పోయి పచ్చని పైర్లో పడితే ఏ అత్తో ఒక అత్త, 'నా బట్టా! ఎనముల్ని నోటికొచ్చిన పైరుమింద తోలేసి పుస్తకం పట్టుకోనుండావంట్రా, నీ దూము గంగమ్మ నిన్ను తగలా!' అని తిడతా కోకెత్తి నా మొకాన వేసిసి వూపిరాడకుండా చేసేసును. వున్నట్టుండి నాలుగు చినుకులు రాలినాయనుకోండి. మాయమ్మ ఒకటీ చెనిక్కాయల్ని వుడ్డ దోస్తా వుంటే నేను ఫిజిక్సు పుస్తకం చేత బట్టుకుని చూస్తా వుంటానా? కాబట్టి ఒకటి సగం చదువే, తప్పనే తప్పదు.

అయినా నాకు 73% మార్కులు వచ్చినాయి గ్రూప్స్‌లో. లెక్కల్లో ఇంకా ఇంకా ఎక్కువొచ్చుంటాయి గానీ పేపరిచ్చిన నా కొడుకు ఆ సమ్మచ్చరం – అన్నీ వుదాహరణ లెక్కలే ఇచ్చి చచ్చినాడు. మా లెక్చరర్ ఉదాహరణ లెక్కల్ని ట్యూషన్‌లో చెప్తాడే గానీ క్లాసులో చెప్పడు గదా. మాకు కనీసం అచ్చు పుస్తకాలు లేవు గదా.

ఇంక, మా ప్రిన్సిపాలు కొడుకుని గురించి చెప్పాలంటే చానా వుంది. వక్క గొరికినంత సేపట్లో చెప్పుకోవాలంటే – వాడు మల్లెపువ్వు మాదిర్తో కాలేజీకి వొచ్చేవోడు. మెట్లు దిగంగానే ఇల్లు. మల్లెపువ్వు మాదిర్తో వున్నవాడు – కాలేజీ వదలంగానే చింత గింజ నలుపులో వున్న బూట్లను టకటకలాడించుకుంటా మా కండ్ల ముందరనే ఇంట్లోకి పొయ్ దూరుకునే వోడు.

అప్పట్నుంచి వోడికి చీమ తలకాయలో మెదడుంటాది చూడండి అంత పని కూడా వుండదు. ప్రతీ సబ్జెక్టుకూ ట్యూషను. అంతా చేస్తే మా కాలోజీకి వాడే ఫస్టు ర్యాంకు. అయినా 81 పర్సంటే. అంటే 400 మార్కులకు నాకు 292, వాడికి 324. నా కంటే 32 మార్కులు మా ప్రిన్సిపాలు కొడుక్కి ఎక్కువొచ్చినాయి.

ఎంపీసీ గ్రూపు కాబట్టి దీంట్లో ఒక చిన్న తమాషా వుంది. ఫిజిక్సులో 20 మార్కులకూ, కెమిస్ట్రీలో 20 మార్కులకూ ప్రాక్టికల్స్ వుంటాయి. ఫిజిక్సులో వాడికి 20 కి 20 వచ్చినాయి. కెమిస్ట్రీలో 20 కి 18 వచ్చినాయి. నాకు కెమిస్ట్రీలో అయితే 20 కి 18 వచ్చినాయి గానీ ఫిజిక్సులో మాత్రం 9 వచ్చినాయి. ఇక్కడ వాడికీ నాకూ తేడా 11 మార్కులు. ప్రాక్టికల్స్‌లో మార్కులెట్టొస్తాయంటే – ముందు నాకు కెమిస్ట్రీలో 20 కి 18 ఎట్టొచ్చినాయో చెప్పితే తెలిసి పోతింది. కెమిస్ట్రీలో ఒక నాయుడు లెక్చరరుగా వుండేవోడు. నేను సుబ్రమణ్యం నాయుణ్ణి అని ఆయనకి తెలుసు. నేను టెస్ట్ ట్యూబ్ నొక దాన్నెత్తుకొని దాంట్లో నుంచి ఒక బేబీని పుట్టించబొయ్యే వోడి మాదిరిగా ఆయనకల్లా సీరియస్‌గా చూసినా. ఆయన నా దగ్గిరికొచ్చి మూడు నిమిషాల్లో అంతా చేసి ఆన్సర్ ఇంత అని చెప్పేసి పొయ్‌నాడు. అంతే, నాకు 20 కి 18 పడిపోయినాయి.

ఇంక ఫిజిక్సులో కూడా నేను వెర్నియర్ కాలిపర్స్‌ను చేతబట్టి, దాంట్లో నుంచి చెనిక్కాయల్ని వొలిచే వోడి మాదిరిగా మొకం పెట్టి, 'సా' అని మా ఫిజిక్సు అయ్యోరి కల్లా పొడుగ్గా చూసినా. 'తెలిస్తే చెయ్ వాయ్, తెలీక పోతే పోవాయ్' అని ఆ నాయుడు కాని మా అయ్యవారు నన్ను కసువు పోచను తీసి పారేసినట్టు పారేసినాడు. ప్రిన్సిపాలు కొడుకు గూడా వెర్నియర్ కాలిపర్స్‌ను చేత బట్టుకుని బూట్స్ పాలిష్ చెయ్యబోయినట్టు వాడేదో చెయ్యబోతే ఫిజిక్సు అయ్యవారే చేసి ఇదీ 'ఆన్సరు' అని చెప్పినాడు. కాబట్టి వాడికి అన్యాయంగా వచ్చిన మార్కుల్నీ తీసేస్తే వాడికొచ్చిన మార్కులు 324–11 = 313. నాకంటే వాడికి 21 మార్కులు ఎక్కువ.

ఇక పోతే మా పల్లెరెడ్డి కూడా నా మాదిరే తూకివాకం అనే వూరికి పోతా వొస్తా చదువుకునే వోడు.

మాకు ఒకటిన్నర ఎకరా బూమి వుంటే వాడికి మూడెకరాలుండేది. సుమారుగా నా అట్టా బతుకే వాడిది గూడా. పాపం వాడు గూడా ఇస్త్రీ బట్టలూ, బూట్లూ ఏ పొద్దూ యేస్కోని రాలా. వాడికి 67% వచ్చాయి మార్కులు. మా ప్రిన్సిపాలు కొడుకు పెద్ద మొగలాయిగా తిరప్తిలోనే ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజీలో ఫస్టుగా సివిల్‌లో చేరిపొయ్‌నాడు. నేను కాళ్ళీడ్చుకుంటా గోవిందరాజుల డిగ్రీ కాలేజీలో బిఎస్సీ చేరిపొయ్‌నాను.

మా పల్లెరెడ్డి ఒకనాడు కనిపిస్తే, 'ఏం రే, రెడ్డీ! ఆర్టు కాలేజీలోగానీ చేరినావా?' అనడిగినా.

వాడు నన్ను కొట్టేవోడి మాదిర్తో, 'ఆర్ట్సు కాలేజీలోనా? బిఎస్సీలోనా? నాకేం కర్మరా? నేను బి.టెక్ సివిల్‌లో చేర్నాన్రా!' అన్నాడు వాడు పొడుగ్గా.

'రేయ్, నియ్యా! నాకు జుట్టు గాదురా వుండేది క్రాపు. ఇది 1947 గాదురా 77! 73 పర్సెంట్ వచ్చిన నాకే సీటు రాకుంటే 67% కే అదీ సివిల్‌లో సీటొచ్చిందా? ఐకోరటకు పోతాన్రేయ్' అనేసి అన్నా నిరామయంగానే.

'ఒరే చిన్నా! నిజ్జం రా! మేము పల్లిరెడ్లం గదా. పేరుకు రెడ్డేగాని మేం ఎస్టీల మాదిరిగా అనుకో. అదీ కత. అస్సలు ఇంకా తక్కువ పర్సెంటేజొచ్చుండినా నాకు సీటొచ్చుండేది. నా మింద పడి ఏడవకుండా వొచ్చే సారి నుంచి ఎంట్రన్సుంట రాయి' అనేసి వాడు అదే పోతా....

నిజ్జమే. వోడికి న్యాయమే జరిగింది. లెక్కల్లో ఎంత తమాస జరిగిందో చూడండి. 67% = 81%. యెంగటేస్పర స్వామి గర్బగుళ్ళో అయినా ఇది న్యాయమే. ప్రిన్సిపాలు కొడుకు తెచ్చుకున్న 81% మార్కుల కంటే వీడి 67% మార్కులే ఎక్కువ. పల్లెరెడ్డి నిజ్జంగా ఆ పనీ ఈ పనీ చేస్తానే ఇంటర్ చదువుకున్నాడు.

ఒక రోజు వోడు మద్యానం నుంచి కాలోజీకొచ్చినాడు. 'ఏంరా' అంటే వాడు చెప్పిందిదీ: "మా నాయినకు ఆ మట్టి పెళ్ళల్లో దున్నీ దున్నీ అరికాళ్ళు పగిలిపొయ్ అడుగుదీసి అడుగెయ్ లేక కన్నగచాట్లు పడుతున్నాడ్రా. మద్యానం దాకా ఎకరం దున్ని శెనగకి సిద్దం జేసి వొచ్చినా" అన్నాడు.

వాడికి 67% కే సివిల్‌లో సీటు రావడం అంటే దేముడున్నట్టే లెక్క. కానీ నాకు సీటు రాకపోవడం మాయమ్మా నాయినా – నా కొడుకు ఇంజనీరు కాలోజీలో చేర్నాడు అని కులక్క పోవడం మాత్రం దేముడు లేకపోబట్టే.

నేను పేరుకు కమ్మవాణ్ణి అయినా 'ఆరాతీరా పొండ్లు తోముకునే దానికే తీరక లేదు తల్లా!' అనే అమ్మకు పుట్టినోణ్ణి. ఎకరాలెకరాలుగా బూములేవ్వు. ఇంట్లో అంతకు ముందు ఎవరికీ వుజ్జోగాలు కూడా లేవు. వొట్టిగా నా కులాన్ని బట్టి నా 73% ప్రిన్సిపాలు కొడుకు 81% కంటే 8% తక్కువై పొయ్యింది.

కులాన్ని బట్టేగాక వాళ్ళ స్తితుల్ని బట్టి కూడా ఈ రిజర్వేషన్లు వుంటే ఎంత బాగుండును!

పోనీ, ఆ మాత్రం రిజర్వేషన్లు వుండబట్టయినా పల్లెరెడ్డి 67% ప్రిన్సిపాలు కొడుకు 81% సమానమైనందుకన్నా సంతోషిద్దాం.

నా వరకు నాకు ఈ రిజర్వేషన్ల పిచ్చి ఎంత ఇదంటే – ఇవి డబ్బులో గూడా వుంటే ఎంత బాగుండుననిపిస్తుంది. అది ఎట్లనో ఇలావరిగా చెప్తా. న్యాయమో, అన్యాయమో, అసలిట్లా ఎందుకుండగూడదో మీరే చెబ్దురు గానీ –

మా వూరి మాదిగపల్లిలో చిగురువాడామె అని ఒకామె వుండాది. ఆమె అసలు పేరేందో తెల్దు. ఆమె మా వూరికి నాలుగు మైళ్ళ కాపక్కనుండే చిగురువాడ నుంచి ఆడ బతక లేక – ఈడ బతకదామని మా వూరి మాదిగ పల్లెలో చేరింది. అందుకని ఆమెకు చిగురువాడామె అని పేరొచ్చింది.

ఆమె కిప్పుడు డెబ్బైయ్యేండ్లుంటాయి. మొగుడెప్పుడో చచ్చి పొయ్‌నాడు.

కొడుకులూ కూతుండ్లూ వుండారు గానీ వాళ్ళూ వాళ్ళ పిలకాయలూ – వాళ్ళు పొట్టబోసుకునేదే గగనం. ఈమె నోట్లోకి ఎవరూ అంత తెచ్చి పెట్టరు. ముసిలోళ్ళకు వచ్చే పింఛినీ నెలకు 90 రూపాయలొస్తాదేమో అని ఆశపడి ఎమ్మారావు ఆఫీసు చుట్టూతా తిరిగి చాలుకునింది. ఇంక ఏ దోవా లేక కూలికి పొయ్యే పని బెట్టుకునింది.

చిగురువాడామెకి వొణుకుడు రోగం కూడా. చెయ్యి వూరికే వుండినా వొణకతా వుంటింది. పల్లెటూళ్ళల్లో రకరకాల సీజన్లలో ఆడోళ్ళు చేసే పనులు ఏముంటాయంటే–

మడక పోతా వుంటే చాలులో బిత్తెదు కొక గింజ లెక్కన వేరుశెనగ పొప్పు వెయ్యడం; వేరుశెనగ పైరులో తొలిక చేతబట్టి కసువును తొవ్వడం; వరి పైరు నాటడం. వరిమళ్ళో కలుపు తియ్యడం; లేదంటే చెరుకు నాటడం, చెరుకుతోట తొవ్వడం, వరిమడి కొయ్యడం.... ఇట్టా పనులు తెల్లారి ఎనిమిది నుంచి సందేళ ఆరు దాకా చేస్తే ఇప్పటి రేట్ల ప్రకారం దినానికి 15 రూపాయలిస్తారు.

చిగురువాడామె కూలికి వస్తానంటిందే గాని దాన్ని కూలికి పెట్టుకునే పుణ్యాత్మ డెవురు? తోస్తే తొంబైయ్యామడలు పడేటట్టుంటాది. కయ్య గెనిమిల మింద కూడా కుదురుగా నడవ లేందు. అరిచేతిలో సంగటి ముద్దేస్తే తుంచుకొని తుంచుకోని తినడమే కష్టం. అట్టాంటి మనిషి తొలిక చేతబట్టి వేరుశెనగ తొవ్వటానికి దిగితే తొలికి చెట్టు మిందికి పోయ్ దాని వేరు తెగిపోతిందే గానీ పచ్చిక మీదికి పోలేందు.

వూళ్ళో రైతులంతా తిట్టి తిట్టి చాలుకునేసి, 'అట్టా చావనీ!' అనుకునేసినారు. పది మందిలో ఒకదానిగా వొస్తాది. ఇంకేం అన్లేక 'నువ్వు తొవ్వా వొద్దు, ఏం వొద్దు. వూరికే అట్ట కూచ్చో తల్లీ!' అనేసినారు కడకు. కూడా వొచ్చిన కూలోళ్ళు తమాస మాటలు మాట్లాడుకునే దానికి మాత్రం పనికొస్తింది.

'ఏమే చిగురోడా! నీ మొగుడు ఎప్పుడన్నా నిన్ను ఎట్ట చేసేవోడా?' అని ఒకామె అనిందనుకో, దానికి చిగురువాడది నవ్వూ గివ్వూ లేకుండా, 'ఇప్పుడు మీ మొగుళ్ళు మిమ్మల్ని చేసినట్టే లెండే నా సవుతులాలా!' అంటింది వొణకతా.

అందరికీ నవ్వు. అట్టా కష్టం దెలవకుండా పక్క వాయిద్యమై పొయ్యింది చిగురువాడామె. ఏదో... ఒక మనిషి గెంటలో చేసే పనిని... పొగులంతా ఆ ఎండలో పడి అంగలార్చతా వుంటింది. లేదూ అరవైయ్యేండ్ల వొయసులో బాగానే కూడా పని చేసిందనుకుందాం. సందేళకు ఆమె చేతిలో పది రూపాయలు పడతాది.

ఇప్పుడామె చేతిలో ఎంతుందీ – పది గదా! ఆ పదీ ఎత్తుకుని చిగురువాడామె నేరుగా అంగిడికొచ్చింది. అక్కడికి మా వూళ్ళోనే వున్న ఒక వీడీఓ గూడా.. లేదా వాడి పెళ్ళాం గూడా అంగిడికొచ్చిందనుకుందాం. ఆ వీడీఓ జీతం నెలకి అయిదు వేలనుకుందాం. అతనికి వుజ్జోగమే గాకుండా యెనకాన నాలుగెకరాల బూమి గూడా వుండాదనుకుందాం. ఆ వీడీఓను కొంచేపు 'తిన మరిగి' అనుకుందాం. మాలోళ్ళకీ, మాదిగోళ్ళకీ, ఇల్లోళ్ళకీ, ఇంకా కుంటోళ్ళకీ, గుడ్డోళ్ళకీ, ఏ లోనొచ్చినా నూరో ఇన్నూరో

తీసుకోందే వాడు ఆ లోన్ వాళ్ళకివ్వడనుకుందాం. సుమారుగా వాడి పై ఆదాయం నెలకు అయిదు వేలనుకుందాం. ఇందాకా వాడూ, ఆ చిగురువాడామె అంగిడికి చేరుకున్నారు గదా.

ఇద్దరూ చెరొక కేజీ బియ్యం తీసుకున్నారనుకుందాం. కేజీ బియ్యం పది రూపాయలనుకుంటే – ఆ ఇద్దరికీ చెరొక కేజీ బియ్యం వస్తాయి.

అంటే, ఇక్కడ మాదిగ చిగురువాడామె చేతిలో పదీ ఈజ్ ఈక్వల్ టు తిన మరిగి చేతిలో పది!

చిగురువాడామె రూ.10 = 10 రూ. తిన మరిగిదీ.

ఆ డబ్బూ ఈ డబ్బూ ఇక్కడ సమానమై పొయ్యింది. ఎంత దరిద్రంగా వుందో లెక్క!


చిగురువాడామెకి సొంతాస్తి అంటూ ఏమీ లేదు. దున్ని బతకడానికి బూమి గానీ, దూకి చావడానికి బావి గానీ లేదు. పైగా 70 ఏండ్ల వొయిసులో కూడా కష్టం చేసుకునే మనిషి. ఆమె అంత కష్టపడి సంపాయించిందీ, తిన మరిగికి వుక్కళంగా వొచ్చిందీ – రెంటికీ ఒకటే విలువై పొయ్యింది.

అంగడివాడి దగ్గిరికి తిన మరిగి రాంగానే ‘ నీ గుర్తింపు కార్డు ఇట్ట చూపించు’ అన్నాడనుకుందాం. అంగడి వాడు– తినమరిగి గుర్తింపు కార్డునూ, అందులో వున్న వాడి ఆదాయన్నీ చూసి, ‘అయ్యా! నీకు కేజీ బియ్యం – ఏడు వేలా ఆరు వందలా ఎనభై మూడు రూపాయిలా యాభై ఎనిమిది పైసాలు. అంత రేటుకు అమ్మమని మాకు గవర్నమెంటు ఆర్డరు’ అని అన్నాడునుకోండి. అప్పుడు ఆ వీడీఓ ఎంత దుడ్డూ దుగ్గాణి సంపాయించినా వుప్పూ మిరపకాయకే చాల్దు.

మన చిగురువాడామె గుర్తింపు కార్డును చూపించినప్పుడు ‘అమ్మా! నీ పదికి మూడు మూటల బియ్యం, రెండు చాటల వుప్పూ, ఒక మూట మిరక్కాయలూ వొస్తాయి. నీ కొడుకును ఎద్దల బండి తీసుకోని రమ్మను, సరుకును తీసకపోదువు గానీ–’ అని అంగడివాడు అంటే...

ముఖ్యమంత్రి పెళ్ళామూ, నా పెళ్ళామూ ఇద్దరూ బజారుకు పోయినారు. నా పెళ్ళాం మా ఆదాయానికి తగినట్టుగా గుర్తింపు కార్డు చూపించి పావలాకు ఎక్కాల

పుస్తకం కొనుక్కోని బిడ్డకు తెచ్చిస్తింది. అదే ముఖ్యమంత్రి భార్యకు ఎక్కాల పుస్తకాన్ని కొనాలంటే పన్నెండు లక్షలా 87 వేలా 964 రూపాయలు పెట్టాల్సొస్తుంది.



ఈ రేట్లు చూసి చూసీ ముఖ్యమంత్రి అమ్మ, 'ఎందుకురా! ఈ ముఖ్యమంత్రిగా వుండి కోట్లు పెట్టి బియ్యం కొని చట్టిలో వేసుకుని నువ్వు – నీ పెళ్ళాం బిడ్డల్ని సాక్కోలేవు. పైగా అందరి నోళ్ళల్లో నానేదేమిటికి? సుకంగా మన వూరు వొచ్చీ – ముఖ్యమంత్రిగా వున్నా అదే తిండి, అదే బతుకు! వూళ్ళో పచ్చని చెట్ల మధ్య ఎంత బాగుంటాది! ఎందుకీ పెట్రోలు పొగల్లో...' అనేసి కొడుకుని హాయిగా సేద్యం చేసుకోమంటుంది.

అంటే ఎనుములు మేపే వోడూ, సేద్యం చేసుకునే వోడూ, బాగా గడ్డివామి వేసే వోడూ, ఇంజనీరు ప్లాను వేసి ఏడంతస్తుల బిల్డింగు కట్టే వోడూ – అందురూ ఒకే రకంగా బతక గలిగేటట్టుంటే...

అట్ట లేదే! నా వరకు నాకు ఎనుముల్ని మేపడమంటే బలే ఇష్టం. ఏడో తరగతి పాసై ఇస్కూలు మళ్ళీ ఓపను కాంగానే నేనూ మా నాయినా ఒకటై పోయినాం. 'పెద్దోడు కార్వేటి నగరంలో టీచరు ట్రయినింగు చేసినాడు. మళ్ళ సినబ్బ గూడా చదవాల్నా? సేద్యానికి పనికొస్తాళ్ళే' అని చూసినాడు మా నాయిన. అంతే, నేను ఇస్కూలుకు పోకుండా, ఆ టయానికి ఎనుముల్ని విడిచి పెట్టేసినాను.

మాయమ్మ, 'వొద్దు కొడకా. మా యమ్మా నాయినా మమ్మల చదివించక ఎండలో ఈ మాల కష్టం చేస్తుండాము. నువ్వంత కష్టం చెయ్యలేవు. పియ్యి దినో

పిడకలేరో నువ్వుచదివితే చదివిస్తాం. యెయ్యి రూపాయల సంబళంలో కుదురుకున్నా వంటే నువ్వు సుకంగా బతికి పోతావు' అని బుద్ధి మాటలు చెప్పి మాయమ్మ ఎనిమిదో తరగతికి పంపించింది.

అట్ట గాకుండా శెనిగి తోట పెరికే వోడూ, నీడన కూర్చొని జిల్లాను ఏలే కలెక్ట్రూ.... ఇద్దరూ ఒకే స్తోమతతో బతకతా వున్నారనుకో. అప్పుడు మాయమ్మ ఒక వేళ నేను 'చదవాల కావాల' అని పట్టుబట్టినా, 'ఎందుకురా తంఢ్రీ. ఆ ఇంగిలీసు నువ్వు కంతతా పెట్టలేవు. ఆ కన్న కసమాలమంతా చదివితే నీకు సందేళయితే తలకాయి నెప్పి వొచ్చేస్తింది. ఏమా గాచ్చారం? హాయిగా గొడ్లు మేపుకో. ఒకేళ చదివి కలెక్ట్రయి ఆ వూరుగాని వూర్లో కార్లో తిరగతా అంత అగచాట్లు పడినా – ఇక్కడ ఎండలో హాయిగా కన్నవాళ్ళ కంటి ముందర ఎనుములు మేపుకున్నా అంతా ఆ యమ్మే గదా. అందరివీ మట్టి పొయ్యిలే గదా' అని మాయమ్మ నన్ను ఇస్కూలుకు నిలిపేసి వుండేది.

నేను శెనగ చెట్టు పెరికితే నాకొచ్చే పది రూపాయలూ – కలెక్ట్ర చేతిలో వుండే పది రూపాయలూ, ముక్యమంత్రి చేతిలో వుండే పది రూపాయలూ అందరివీ ఒకే విలువ గాబట్టి మాయమ్మ నన్ను చదవెయ్యాలనుకునింది.

ప్రపంచంలో ఇప్పుడు – ఎట్టయితే చదువుల్లో ప్రిన్సిపాలు కొడుకు మార్కులు 81% = పల్లెరెడ్డి 67% మార్కులు సమానమైనాయో – అట్ట, చిగురువాడామె చేతి పది రూపాయలు = ముఖ్యమంత్రి చేతి కోటీ పజ్జెనిమిది లక్షలు కాలేదు గాబట్టే, పిలకాయల్ని అందరూ చదవేస్తున్నారు.

ఎస్.సీలూ, ఎస్.టీలూ కూడా చదువుకుంటేనే ఈ సౌకర్యమైనా. డబ్బులో మాత్రం వాళ్ళగ్గూడా రిజర్వేషను లేదు.

నా కొడుకూ నేనూ ఒకసారి రైల్వే టేసను నుంచి తిరిప్తి రేడియో టేసిని దాకా రిక్సా ఎక్కినాం. దిగినాక రిక్సా ఆయనకు ఎనిమిది రూపాయలిచ్చినాను.

అప్పట్నుంచి నా కొడుకుతో నేను, 'రేయ్ పెద్దయినాక ఏం చేస్తావురా?' అనంటే వాడు, 'హాయిగా టింగ్ టింగ్ అంటా రిక్సా తొక్కతా. రైలు టేసిన్నించి రేడీ టేసినికి తొక్కినానంటే ఎయిట్ రుపీస్ ఇస్తారు.దాంతో అన్నీ కొనుక్కునేస్తా...' అన్నాడు.

వాడు రిక్సా తొక్కి దినానికి ఎనపై రూపాయలు సంపాయించినా వాడు – వాడి పెళ్ళాం బిడ్డల్ను సాక్కోలేడనీ, హాయిగా బతక లేడనీ మనం తెలుసుకున్నాం గదా.

కాబట్టి వాణ్ణి తిన మరిగిన వీడీఓ గానో, బిడ్డని నెప్పి తగలనివ్వకుండా ట్యూషన్లు పెట్టించి చదివించుకున్న ప్రిన్సిపాలు గానో, కలెక్టరుగానో, లేదా ముఖ్య మంత్రిగానో చేసేద్దామని, అట్ట చేస్తే గానీ సుకంగా బతకడనే దీంతో వాణ్ణి ఎట్టయినా చదివించాలని చూస్తాన్నేను.

ఇట్లనే, అందురు తల్లిదండ్రులు కూడా.

మన బిడ్డలు విజ్ఞాన ఖనులై పోవాలని కాదు మనం చదివించేది! ఏ ఆటో ఒక ఆట ఆడి బాగా సంపాయించి అన్ని రకాలుగా బాగా బతకాలని. రెక్కల కష్టం చెయ్యకూడదని.


ఇందు కోసరమనే అందురూ చదువుకోవాలి. వాడెవుడో ఒకడు 'చదువు రాని వాడు వింత పశువు' అని అన్నాడని గాదు.

...... బతికినంత కాలం నేను మా వూళ్ళోనే వుండి పోవాలనుకున్నా. నేను తిరప్తి– రేణిగుంట రోడ్డులో వుండే ఆంధ్రజ్యోతిలో పని చేసేవోణ్ణి. మా వూరికీ ఆపీసుకీ రెండు బస్సులు మారి వచ్చి పోతా వున్నాను.

1991లో మాయమ్మ చచ్చిపొయ్యింది. అయినా 1994 దాకా వూళ్ళోనే వుండినా. 94 కంతా నా కూతురును రెండో తరగతిలో చేర్చాల్సొచ్చింది. నా కొడుకు ఎల్‌కేజీలో చేరాల.

నా భార్య కూడా, 'తిరప్తిలో కాపరం పెడదాం. పిలకాయల్ని బాగా చదివించు కుందాం' అని శత పోరే దానికి పెట్టుకునింది.

ఇంతలో మా అక్క కూతురు కూడా ఏడు పాసై ఎనిమిదిలోకి వచ్చేటట్టయ్యింది. మా వూరి అయిస్కూలిని నమ్మితే – ఇంక ఆ అమ్మి కతా, మాదిగ చిగురువాడామె కతా ఒకటే అవతాదని బయపడి – నేను పిలకాయల్ని బాగా చదివించుకుందామని చెప్పి కాపరాన్ని తిరప్తి బైరాగి పట్టెడకి మార్చినా.




**తి**రప్తి బైరాగి పట్టెడకి మేం కాపరాన్ని మార్చినాక – ఒక ప్రైవేటు స్కూల్లో మా ముగ్గురు పిలకాయల్నీ చేర్పించినా.

మా అక్క కూతురు తులసిని ఎనిమిది తెలుగు మీడియంలో, నా కూతురు దీపూని సెకండ్ క్లాస్‌లో, కొడుకు టామ్‌సాయర్‌ని ఎల్‌కేజీలో చేర్పించినా. ఆ స్కూల్లో ఇంగ్లీషు మీడియమూ, తెలుగు మీడియమూ రెండూ వుండాయి గాబట్టి మా ముగ్గురు పిలకాయలూ ఒకే ఇస్కూలికి పోవడం ఇబ్బంది లేకుండా వుండింది.

నాకీ ముగ్గుర్లోకీ తులసీ మింద శ్రద్ధ ఎక్కువ. ఎందుకంటే అది తల్లి లేని బిడ్డ. తులసి ఒకటిన్నర రెండేండ్ల బిడ్డగా వున్నప్పుడు వాళ్ళమ్మ తేలు కుట్టి చచ్చిపొయ్యింది.

'ఈ బిడ్డను బాగా చదివించి.... వాళ్ళమ్మ ఎంత కష్టపడిందో, ఈ అమ్మి అంతగా సుక పడాల' – ఇదీ నాలో వుండేది.

ఆఫీసులో నా డ్యూటీలు వేళాపాళా లేకుండా వుండేవి. ఒక వారం పొగులు డ్యూటీ. ఇంకో వారం రెయ్యి డ్యూటీ. పొగులు డ్యూటీ మద్యానం రెండు నుంచి

రాత్రి ఎనిమిదిన్నర వరకూ. రెయ్యి డ్యూటీ రాత్రి ఎనిమిది నుంచి తెల్లవారు జాము రెండు వరకూ. వాళ్ళు ఇస్కూలుకు పోవడం, నేను ఆఫీసుకు పోవడం... గంటలు గంటలు వాళ్ళతో కుచ్చునే వీలు దొరకదు. అట్లా దొరికినప్పుడల్లా నేను తులసి మింద ఎక్కువ శ్రద్ధ పెట్టినాను.

ముందు ఇంగ్లీషును ఎత్తుకోవాలనుకున్నా. ఎందుకంటే ఇంగ్లీషంటే నాకు అంత వుచ్చ. ఈ రోజుటిగ్గూడా ఎవురన్నా ఇంగ్లీషులో మాట్లాడతా వుంటే నా నోట్లో నీళ్ళూరతాయి. నా జల్మలో నేను ఎవర్తో గూడా రెండు లైన్లు కూడా ఇంగ్లీషులో మాట్లాళ్ళా – తెలవక.

మా పల్లెరెడ్డి సలహా మేరకు – నేను గుంటూరు సి.వి.ఎన్.ధన్ కాలేజీలో ఇంజనీరింగ్ ఎంట్రన్స్ కోసరం నెలనాళ్ళు కోచింగు తీసుకున్నాను. నాతో పాటు గంగిరెడ్డి పల్లి రెడ్లిద్దరు – ఒకడు సుబ్బడు, ఇంగొకడు బ్రమ్మడు. మా వాళ్ళు ఏ పాము నోట్లో వేలు పెట్టి తెచ్చిచ్చినారో గానీ వెయ్యి రూపాయిలు చేతిలో బెట్టి గుంటూరుకు పంపించినారు. నేనూ సుబ్బడూ బ్రమ్మడూ ముగ్గురం గుంటూరు టేసినీలో దిగినాం. 'ఎక్కడ చేరదాం?' అనుకున్నాం. 'రెడ్డీ హాస్టల్లో!' అన్నారు రెడ్లిద్దరూ.

'నేనెట్టరా!' అని నాకు దిగులు పట్టుకునింది. ముగ్గురం ఒకటిగా వుంటేనే గానీ లేకుంటే నేనొక్కణ్ణే అయితే దోవ తప్పిపోతే–

'నువ్వు కమ్మా హాస్టల్లో చేర్రా నా కొడకా!' అనేసి అన్నాడు సుబ్బడు. ఈ మాటతో వాళ్ళొక చోటా, నేనొక చోటా అనిపించే సరికి నాకు చింతకాయ కొరికినట్టయి పొయ్యింది. ఇంతలో బ్రమ్మడు అయిడీ చెప్పినాడు. 'నువ్వు గూడా రెడ్డీ ఆస్టల్లోనే చేరి పూడువ్. నీ పేరు ఈ నెలనాళ్ళూ నామిని సుబ్రమణ్యం రెడ్డి. సరేనా?' సడే. బయం బయంగా 'సుబ్రమణ్యం రెడ్డి' అని చెప్పేసి రెడ్డీ హాస్టల్లో చేరి పూడ్సినా.

బ్రమ్మడు నిద్దర లేవంగానే, 'రేయ్ గుడ్డోడా! బ్రష్షు మింద పేస్టేసి టవలియ్యి–' అనే వోడు. తొలి రోజున నేను, 'పోరా నియ్యా, నీకేమన్నా నేను బిళ్ళ జవానునా? నీ పని నువ్వు చేసుకోవాయ్' అనేసి అన్నాను. 'వుండు నా కొడకా' అని వాడు రూం బైటకి పొయ్, 'వార్డన్ దగ్గిరికి పొయ్యేసొస్తా. చిన్న పనుండాది' అనేసి పోబొయ్యే వోడు.

నేనింక చేసేది లేక బ్రష్షు మింద పేస్టేసి ఆ నా కొడుక్కి పువ్వుల్లో బెట్టి టవలిచ్చేసే వోణ్ణి. ఇంకా చెప్పాలంటే గుంటూరులో ఆడపిలకాయలకు జడలు

బలే పొడుగు, నాకు జడపిచ్చి జాస్తి, జడలు గల ఆడపిలకాయలను చూస్తా... ఈ రకం తమాసలతోనే నెలా గడిచి పొయ్యింది.

మేం ముగ్గురం కూడా లెక్కలు, ఫిజిక్సు, కెమిస్ట్రీ గుంటూరులో ఎగస్ట్రాగా నేర్చుకునిందేం లేదు. మా ముగ్గురికీ– పల్లెటూరి వాళ్ళం గాబట్టి ఇంగ్లీషంటేనే బిత్తర. మేం ముగ్గురం ఎంట్రన్సు రాసినాం. ఒక్కరం గూడా పాసు కాలేదు. ముగ్గురం టపాసులే అయ్యాం. కారణం – మా ముగ్గుర్నీ ఇంగ్లీషు ఒక్కటే మెట్టుతో కొట్టింది. అప్పట్లో ఇంజనీరింగు ఎంట్రన్సులో ఇంగ్లీషు కూడా ఒక పేపరుండి గ్రామరు అడిగే వోడు. గ్రామరు ఏ నాకొడుక్కి తెలస్తాది?

a, e, i, o, u అనేవి వొస్తే దాని ముందర an పెట్టినాం. He is – European అని ఇచ్చినాడు.మేం ముగ్గురం an పెట్టినాం.

He left – Delhi ఏదో ఒక preposition తో fill up చెయ్యాల. మేం ముగ్గురం కూడా to పెట్నాం.

అంతే, ఇంగ్లీషులో గెటాన్ కాలేదు గాబట్టి మా మాథ్స్, ఫిజిక్సు, కెమిస్ట్రీ పేపర్లు రుద్ది కూడా వుండరు. ఈ గ్రూపులు మూడూ మేం ముగ్గరం బ్రమ్మాండంగా ఆన్సర్ చేసినా – ఈ ఇంగ్లీషు దరిద్రం వొల్లా మేం ఇంజనీర్లు కాలేక పొయ్యాం. అందుకని చెప్పి మన బిడ్డలైనా ఇంగ్లీషు నేర్చుకోవాల – అనేది నాకు బలే కోరిక. ఈ దీంతోనే తులసీకి ముందు ఇంగ్లీషు అంటే వుండే బిత్తరను పోగొట్టాలనేది నా ఆశ. తులసీకి ఎనిమిదో తరగతి ఇంగ్లీషు పుస్తకాన్నిచ్చి చదవమంటే – దానికి చేతగాలా. అసలు ఇంగ్లీషులో ఆ పిల్ల పరిస్తితి ఎట్టుండాదో తెలుసుకుందామని (అందాకా మా వూళ్ళో ఆ పిల్ల చదువు గురించి నేనే పొద్దూ అడగలా) He అంటే ఏందని అడిగినా. చెప్పింది. She అంటే ఏందో కూడా చెప్పేసింది. అయితే, her, his అంటే ఏందో చెప్పలా.

ఇంక లాబం లేదని నేనొక ప్లాను వేసుకున్నాను. నా కొడుకు చదివే ఎల్‌కేజీ పుస్తకం ఇచ్చి 10, 15 రోజులు చదవడం నేర్చుకోమన్నా.

ఆ తర్వాత ఫస్ట్ క్లాస్ ఇంగ్లీషు పుస్తకం తెచ్చిచ్చినా. అది బలే వుండింది. అందులో Six Friends అనేది ఒక పాఠం. దాంట్లో What, When, Why, Where, Which, How ల గురించి వుండింది. వీటిల్లో తులసీకి ఒకటి రెండు పదాలు తప్ప మిగతా వాటికి అర్థాలు తెలవలా.

ఏమి, ఎప్పుడు, ఎందుకు, ఎక్కడ, ఏది, ఎట్లా – అనే ప్రశ్నలు వెయ్యకుండా మనం దేన్నీ తెలుసుకోలేం గదా. దీన్ని మనసులో బెట్టుకుని ఆ యమ్మితో నేను, 'నువ్వేదన్నా నన్ను ఒక ప్రశ్న వెయ్' అన్నా. అది ఎంత సేపుటికీ వెయ్యలేదు. సిగ్గు.

'వెయ్ నాయినా' అని కుయ్యో మొర్రో అంటే అది నోరు తెరిచి, 'టామ్‌సాయర్ ఎక్కడికి పొయ్‌నాడు బావా?' అని ఒక ప్రశ్న వేసింది.

'ఇప్పుడు నువ్వేసిన ప్రశ్నలో ఎక్కడికి అనేది పాయింటు. దీన్నే ఇంగ్లీషులో వేర్ అని అంటారు.' ఇట్లా కుదురుగా ఆ ఆరింటిని గురించీ చెప్పినా.

అయినా నాలుగైదు రోజులు దానికి గందరగోళంగానే వుండింది. Which అంటే ఎందుకు? అనేది అప్పుడప్పుడూ. దీనికొక్కటే మార్గం. కంఠస్తం పెడితే వచ్చి చావవు. సందర్భాలను బట్టి చదవంగా చదవంగా అదే అర్థం చేసుకుంటుందని చిన్న 200 Pages Note Book ఒకటి పెట్టి His, Her, Before, Inside లాంటి పదాలకు కూడా తెలుగులో అర్థాలు చెప్పి అప్పుడప్పుడూ చదువుకోమనే వాణ్ణి.

దీంతో – అది ఎనిమిదో తరగతి చేరి మూడు నెల్లయ్యింది, చూద్దాం గదాని నా కూతురు దీపూ చదివే సెకండ్ క్లాస్ ఇంగ్లీషు పుస్తకం తీసిచ్చినా. బలే బాగుండిందా పుస్తకం. కండ్లకద్దు కోవాల్సిన పుస్తకం అనుకోండి.

దాంట్లో బొమ్మలు వేసి Ravi is coming from his School.

How many books are there on the table... ఇట్లాంటివి బొమ్మ చూడంగానే ఆ పిల్ల టకటకా From అంటే ఏందీ, On అంటే ఏందీ – చెప్పేసేది.

అదే పుస్తకంలో ఇట్లాంటి పదాలకు చదవంగానే అర్థాలు తెలిసి పొయ్యే పాఠాలు ఎన్నో వుండాయి. మరీ ముక్కెంగా The clever Fox, The Ant and The Grasshopper, The proud Mouse, The Foolish Queen అని నాలుగు కతలుండాయి. అవి చదవమనే ముందు డిక్షనరీ ఎట్ల చూడాల్నో చెప్పించినా.

నేనే మొదట రెండు కతలు దగ్గిరుండి చదివి అర్థాలు చెప్పినా, ఆ కతలన్నీ గూడా వేటికవే గొప్ప కతలు.

మూడో కత Proud Mouse ఆ పిల్ల చదివేసింది. నాలుగో కత కూడా. Proud Mouse లో ఆ పిల్లకు తెలీని పదాలు 18 తగిలితే, The Foolish

Queen లో 12 మాత్రమే తగిల్నాయి. తులసీ తెలుగు బలే బాగా రాస్తింది. తప్పులు పోకుండా కూడా. రెండో తరగతి ఇంగ్లీషు కథలను పుస్తకం చూడకుండా ఒకసారీ, పుస్తకం చూస్తా ఒకసారీ తెలుగులో రాయమంటే ఎంత బాగా రాసిందో! దీంతో నాకు ఏడావుల నెయ్యి తాగినంత కుశాల అయిపొయ్యింది.

ఇక్కడ చెప్పేదేమంటే తులసి ఎనిమిదో తరగతిలో వుండినా – రెండో తరగతి ఇంగ్లీషు పుస్తకాన్ని సుమారు మూడు నెలలు చదివింది. దీంతో ఆ పిల్లకు మూడు నాలుగు వందల ఇంగ్లీషు పదాలకు అర్థాలు సందర్భాలతో సహా తెలిసిపొయ్యాయి.

'తులసీ! ఒకప్పుడు Which అంటే ఎందుకు అని చెప్పే దానివి గదా, ఇప్పుడు చూడమ్మా – అట్లా చెప్పినందుకు నీకే ఎంత నవ్వొస్తుందో! కుచ్చోని గదా పడుకుంటాం. ఏదైనా సరే నిదానంగా నేర్చుకుంటే వొచ్చేస్తింది' అని చెప్తే ఆయమ్మికి కూడా మొహం కనకాంబరాల తోట మాదిరిగా కళకళలాడి పొయ్యింది.



ఇంక ఆ పిల్లకు ఎనిమిదో తరగతిలో మిగిలింది ఆరు నెల్లు. ఈ కుశాలను నేను భరించలేక మూడు నుంచి ఏడు దాకా వున్న తరగతుల ఇంగ్లీషు పుస్తకాలన్నీ కొనుక్కొచ్చేసి చదవమన్నాను. ఈ ఆరు నెలల్లో ఆ పిల్ల అన్నీ చదివేసి – మూడు నాలుగు తప్పుల్తో తెలుగు చేసి నాకు చూపించేది. ఏదో ఒక కథలో He is disappointed అన్న వాక్యానికి, ఆ పిల్ల 'అతడు ఆశాభంగుడయ్యాడు' అని రాసింది.

మొత్తానికి ఆ యమ్మి ఎనిమిదో తరగతిలో వుండంగానే – ఎనిమిదో తరగతి ఇంగ్లీషు పుస్తకం చదివి అర్తం చేసుకునే స్తితికొచ్చేసింది. అయితే, ఆ పిల్ల ఇదంతా ఆడతా పాడతా బలే తమాసగా నేర్చుకునేసిందంటే – అది బలే తప్పుడు మాట. ఈ మాత్రం నేర్పించే దానికి ఆ పిల్లతో నేను యుద్ధం చెయ్యాల్సొంచ్చింది. సిగ్గు విడిచి చెప్తావుండా గదా – పదీ పదైదు సార్లు చితగ్గొట్టిన రోజులు గూడా వుండాయి.

ఆ పిల్లకు మొదటి శత్రువు – ఆ పిల్ల చదువుకునే ఇస్కూలు.

వాళ్ళు ఇచ్చే నోట్సులు మళ్ళా ఇంటికొచ్చి రాయలేకా, హోం వర్కులు చెయ్యలేకా ఆ పిల్ల చచ్చి సున్నమైంది. వొక్క సబ్జెక్టు ఇంగ్లీషే కాదు గదా వుండేది. మిగతా వాటికి రోజూ హోం వర్కులూ, నెలలో రెండు సార్లు యూనిట్ టెస్టులూ. ఆ టెస్టుల్లో పాసు మార్కులు కూడా రావడం లేదన్న అవమానం. టెస్టుల్లో మార్కుల్ని చూసి ఎనిమిదిలో – ఆ ఇస్కూల్లో ఆ పిల్లను మొద్దు కింద లెక్క గట్టేసినారు.

నేను ఆఫీసుకు పోతాపోతా, 'ఇంగ్లీషులో ఏదన్నా రెండు కతలు చదివి తెలుగులో రాసిపెట్టు తులసీ. నైట్ డ్యూటీ చేసి ఇంటికొచ్చినాక అవి చూసి గానీ నేను నిద్రపోను' అనేవాణ్ణి.

ఆ పిల్ల కండ్ల నిండికీ నీళ్ళు పెట్టుకుని, 'రేపు లెక్కల పరీక్ష బావా' అనో... ఇట్లా ఏదో ఒగటి చెప్పి టపటపామని కార్చేసింది.

నేనా అమ్మికి మంచిగా, 'చూడు తులసీ, ఇంగ్లీషన్నా, లెక్కలన్నా బయం లేకుండా చేసుకుంటే చదువు దానంత అది పరిగెత్తుకుంటా వొస్తింది. ఇప్పుడు నీకు ఇంగ్లీషంటే బయం పొయ్యింది గదా. ఏ ఎస్సేని గూడా నువ్వు ఇంక కంఠస్తం పెట్టవు గదా. అదే నువ్వు మామూలుగా స్కూల్లో అయివుంటే ఆ మాత్రం నేర్చుకునుండే దానివా? నా మాట విను. యూనిట్ టెస్టుల్లో మార్కులు రాకపోతే మన తలగుడ్డ ఏం నేల పడిపోదు. ఆ మార్కుల్ని తెచ్చి మనం ఆమ్లెట్లు వేసుకునేదేం వుండదు. నేను స్కూలుకు పోయి మీ కరస్పాండెంటుతో మాట్లాడతా' అన్నా.

దీంతో ఆమె వెక్కిళ్ళు పెట్టే దానికి మళ్ళుకునింది. 'కరస్పాండెంటుతో మాట్లాడతా' అన్నా గదా. అక్కడికి పొయ్ వీడేం మాట్లాడతాడో, దానికి వాళ్ళేం అంటారో అని బయం.

కడకు నేను ఆ కరస్పాండెంటు దగ్గిరికి పొయ్, 'సార్. ఆ అమ్మి మొన్నటి దాకా పల్లెటూరి హైస్కూల్లో చదివింది. అక్కడ స్కూల్లో సార్ల చీటీ పాటలు జరగతాయే

గాని పిలకాయల పాఠాలు జరగవు. అందువల్లా ఏదో నిదానంగా దవలప్పవుతుంది. తొందరేం లేదు. ఆ పిల్ల వూరికే స్కూలుకు వచ్చి పోతా వుంటుంది. ఇంటి దగ్గిరే నేనేదో నేర్పించినా – మనం స్కూలుకు నిలిచి పొయ్‌నాం, నిలిపేసినారు అనే బాద దానికి వుండగూడదు గాబట్టి స్కూలికి పంపిస్తున్నాను. హోం వర్కులు చెయ్యక పోయినా, నోట్సులు రాయక పోయినా తాట వొలవకండి. తల్లిలేని బిడ్డ. కొంచిం దయగా వుండండి. పది మంది పిలకాయల్లో మాట్లాడితే దానికి కులుకుగా వుంటాది గాబట్టి నేనీ ఇస్కూలుకు పంపిస్తుండాను. దానికి థర్డ్ క్లాస్ స్టాండర్డ్ కూడా లేదు. ఎయిత్ క్లాస్ ఏం చదువుతుంది చెప్పండీ!' అని చెప్పుకున్నాను.

ఆయన నన్నొక తిక్కల వెధవలాగా చూసి... ఆయనకు కావాల్సింది ఫీజే గదా 'అట్లనే' అని చెప్పి పంపించేసినాడు.

ఈ మాదిరిగా ఇస్కూల్లో చెప్పేసొచ్చిందానికి గూడా తులసి మూతి నల్లంగా పెట్టుకుని ఏడ్చే పనే. దీంతో అప్పుడప్పుడూ కొట్టేవాణ్ణి కూడా.

ఈ బాదంతా పళ్ళేక తొమ్మిదో తరగతిలో ఆ పిల్లను ఇస్కూలికే నిలిపేసినా.

'తులసీ! నా మాట విను. నీకు చెడ్డ చెయ్యాలని కాదు గదా. నీ బావ నీకు చెడ్డ చేస్తాడా అమ్మా? ఇంగ్లీషు కొంత నేర్చుకున్నట్టే లెక్కలు గూడా నేర్చుకుందువు. నువ్వు తొమ్మిదో తరగతి లెక్కల పుస్తకం నుంచి లెక్కల్ని మొదులు బెడితే నీకొక ముక్క రాదు. నిదానంగా నీకు నేర్పిస్తా గదా. పదిలో మాత్రం నువ్వు స్కూలికి పోదువులే. నీకే మీ స్కూల్లో ఫస్టు ర్యాంకు రాకపోతే అప్పుడడుగుదువు లే' అని ఏవేవో చెప్పి – ఆ పిల్ల మనసుకు కష్టం కలిగినా స్కూలుకి నిలిపేసినా.

ఇంట్లోనే ఆ పిల్లకు పొద్దు పోదు కదా. కాబట్టి టైం పాస్‌కని చెప్పీ, పుస్తకాలంటే బయం పోగొట్టాలని చెప్పీ టామ్‌సాయర్, హకల్ బెరిఫిన్, విచిత్ర వ్యక్తి, రాజు–పేద, కాంచన ద్వీపం తెచ్చి పెట్నాను. మూడు వందల పేజీల పుస్తకాన్నయినా రెండు రోజుల్లో చదివి అక్కడ పెట్టేసేది. మూడు నెల్లు ఇట్టాంటి పుస్తకాలు చదివింది. చదివి ఆ పిల్లే ఒక్కో పుస్తకాన్ని 30, 40 పేజీల్లో కత తిరగ రాసి కూడా పెట్టేసేది. ఈ మధ్య కాలంలో ఇంగ్లీషు ఏమన్నా వెనక్కి పొయ్యిందేమోనని బాధపడి మధ్య మధ్యలో కొన్ని పదాలకు అర్థాలు అడగతా వుండే వాణ్ణి. హిందూ పత్రికను కూడా తెప్పించి Head Lines కు అర్థాలన్నీ చెప్పి రాసుకోమనే వాణ్ణి.

ఆ పిల్లకు రాను రానూ గందరగోళం ఎక్కువైపొయ్యింది.

Protest అంటే ఏందమ్మా అంటే 'రక్షణ' అనేది. మళ్ళా Protect అంటే ఏందమ్మా అంటే 'నిరసన' అని చెప్పేది. ఇట్లా ఒకదానికొకటి.

'చూడు తులసీ. ఫ్రాన్సు దేశంలో ఒకడు వాడి కూతురికి తెలుగు నేర్పిస్తున్నాడనుకుందాం. వాడు ఆ పాపకి మూడు నెలల్లో అక్క, నక్క, వక్క, పక్క అనే పదాలు చెప్పాడనుకుందాం. ఆ పాప ఆ పదాల అర్థాలు ఒకదానికొకటి గందరగోళ పడిపోయి 'మా నక్క నన్ను ముద్దు పెట్టుకుంది', 'మా అక్క వూళలు వేసింది', 'నక్కలో నేను పడుకుని వుచ్చ పోశాను.' ఇట్లా చెబితే మనకెంత నవ్వొస్తుందీ? కాబట్టి నక్కను అక్క అని ఆ పిల్ల అనుకున్నట్టే మనం ఇక్కడ Protect నూ Protest నూ Confuse అయిపోతున్నాం. అందుకని సందర్భాలను గుర్తు పెట్టుకుంటే అర్థాలు గుర్తుండిపోతాయి. Police Protection తో మంత్రి మా వూరొచ్చినాడు. ఇప్పుడు Protection ను Protest గా నువ్వనుకో లేవు. అలాగే స్కూలు ఫీజులు పెంచినందుకు Protest గా పిల్లలు తరగతులను విడిచి పెట్టి బైటికొచ్చేశారు. 'ఇట్లా నేర్చుకుని గుర్తు పెట్టుకోవాలి. మనం పొరబడుతున్నామా అని వక్క కొరికినంత సేపు ఆలోచించి కరెక్ట్ సమాధానం చెప్పాలి' అని నేనా పిల్ల ముందు పెద్ద మేధావి ఐపోయి చెప్పేసినాను.

ఈ మంత్రం ఆ అమ్మికి బాగా పని చేసింది. దీంతో ఇంగ్లీషు అంటే ఆ పిల్లకి ఒక ఆట అయిపొయ్యింది. ప్రతీ పదాన్ని ఉపయోగించి తెలుగులో రాయడం మొదలుబెట్టింది. స్త్రీల మీద ఈ మధ్య Atrocities పెరిగి పొయ్యాయి. అంతే, నిద్రలో లేపి అడిగినా Atrocities కు Correct అర్థం చెప్పేసేది. ఇట్లా సుమారు వెయ్యి ఇంగ్లీషు పదాలకు అర్థాలు నేర్చుకునేసింది.

తొమ్మిదో తరగతిలో ఆరు నెలలు గడిచే సరికల్లా తులసి పదో తరగతి ఇంగ్లీషు టెక్స్టు బుక్‌నీ, నాన్ డీటెయిల్‌నీ రెండు సార్లు చదివేసింది.

పదో తరగతిలో పిలకాయలకి ఇంగ్లీషు క్వశ్చన్ పేపర్ నిండా గ్రామరుతోనే ఉంటాది. అయినా తులసీ పదిలో ఇంగ్లీషులో 71 మార్కులు సంపాయించింది. నిజంగా ఇంగ్లీషు మింద పదిలో శ్రద్ధే పెట్టలేదు. స్కూలుకే ఫస్టు. ఇంగ్లీషు బెడద ఆ మాత్రం తప్పించగలిగినా. లెక్కలెత్తుకోవడంతోనే అసలు కత మొదలైంది.



**తు**లసీకి – తొమ్మిదో తరగతి నడిమధ్యలో లెక్కలెత్తుకోని చెప్పను మొదులు బెట్టినాను అని గదా ఇందాకా నేను అనింది. ఆ అమ్మికి ఆరునెల్లు లెక్కలు చెప్పే కొందికి నాకొక కోరిక కలిగింది. అది ఏమంటే – 'ఆంధ్రజ్యోతి'లో వుజ్జోగం చేస్తానే ఒక ప్రైవేటు ఇస్కూల్లో చేరి లెక్కలు చెప్పాలనేది. అంటే పార్ట్ టైం వుజ్జోగమన్న మాట. ఆంధ్రజ్యోతిలో నాది పొగులు డ్యూటీ అయినా, రెయ్యి డ్యూటీ అయినా మద్యానం ఒంటిగంట దాకా ఖాళీనే.

తిరప్తిలో మా పక్కింటాయన చంద్రశేఖర రెడ్డి అని ఒక టీచరుండాడు. ఆయన బామ్మర్ది రవీంద్రనాథ రెడ్డి అని ఒకాయన బైరాగి పట్టెడలో సోక్రటీస్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్ అని ఒకటి పెట్టుకుని పది పన్నెండేండ్లుగా నడపతుండాడు. ఈయన బామ్మర్ది చెప్తే తెలిసింది. ఆయన్ని పట్టుకోని సోక్రటీస్ రవీంద్రనాథరెడ్డిని కలిసినా. నాకు బిఈడీ లేకపోయినా ఆయన దయతో వొప్పుకొని నాకు పార్ట్ టైం వుజ్జోగం ఇచ్చినాడు. జీతం నెలకు 15 వందలు. నా పెళ్ళానికి ఎక్కడలేని కుశాల.

'ఒకరికిద్దరు బిడ్డలైనాక నీకిప్పుడు తెలిసింది బాధా బదనాయం' అని నన్ను మెచ్చుకునింది.

అట్లా నేను సోక్రటీస్ స్కూల్లో లెక్కలయ్యోరుగా చేరి పొయ్‌నాను. స్కూలు 9.30 నుంచి మద్యానం 12.45 దాకా. మళ్ళ మద్యానం స్కూలుకు నేను రాలేను గదా. నా పొగులు డ్యూటీలో నేను ఆంధ్రజ్యోతికి పోవాల గదా. 9.30 నుంచి 12.45 అంటే మూడుంకాలు గెంట. దీంట్లో కాలు గెంట 11 నుంచి 11.15 మద్య రీసెస్ వుంటుంది. దాన్ని తీసేస్తే నాకు మిగిలింది మూడు గెంటలు. ఈ మూడు గెంటల్లో ఆరూ, ఏడూ, ఎనిమిదీ, తొమ్మిదీ, పదీ – ఇట్లా అయిదు తరగతులు. అయిదు – ముక్కాలు గెంటలు మూడూ ముక్కాలు గెంట.

టెన్త్ క్లాస్‌కు పబ్లిక్ పరీక్షలుంటాయి గాబట్టి వాళ్ళకు ముక్కాలు గెంట చెప్తే చాలదు. వాళ్ళకు కనీసం రెండు పీరియడ్లు చెప్పాలి. ఇట్లా ఏవేవో లెక్కలేసి, 'సార్, ఏడు నుంచి పది వరకు నేను చెప్తా లెక్కలు. ఆరో తరగతి లెక్కలు కూడా అయిదో తరగతికి చెప్పే ఆయన్నే చెప్పనివ్వండి. కాబట్టి నాకు నాలుగు క్లాసులే. టెన్త్ క్లాస్ వాళ్ళు ఎనిమిది గెంటల కంతా ఇస్కూలికి వచ్చేటట్టు చూడండి. వాళ్ళకు ప్రేయరు కూడా వొద్దు. ఎనిమిది నుంచి 9.30 వరకూ టెన్త్ క్లాసు తీసుకుంటా. ఆ తర్వాత ఏడుకు పోతా. మళ్ళ ఎనిమిదికీ తొమ్మిదికీ పోతా. ఈ మాటకు మీరు వొప్పుకోవాలి' అని కరస్పాండెంటు రవీంద్రనాధరెడ్డికి చెప్పినాను. ఆయన 'అట్లనే' అనేసి అన్నాడు.

దీంతో 'విఘ్నేశ్వరా' అని బోర్డు మింద రాసి పాఠం చెప్పే దానికి పూనుకున్నాను. అట్లా ఇస్కూలు పిలకాయలకి 'నామినీ సార్' అయిపొయ్‌నాను.

ఈ ఇస్కూల్లో చేరినప్పట్నుంచీ ఐటమ్‌ల వారీ నేను పూస గుచ్చినట్టు చెప్పక రావాల.

ముందు నాకు ఎదురైన పెద్ద సమస్య గురించి ఇలావరిగా చెప్పుకొస్తా.

ఏ అయ్యవారైనా కుచ్చోని పాఠం చెప్పవచ్చునేమో గాని ముఖ్యంగా లెక్కలయ్య వారు నిమిషం కూచ్చునే దానికి లేదు.

ఒక పక్క నోరూ, ఇంగొక పక్క చెయ్యీ ఆడాల. ఏక్ దమ్మున సుమారు నాలుగ్గంటలు నిలుకు లేకుండా చెప్పాలంటే ఆయాసం ముంచకొచ్చేది. నేను సిగిరేట్లు దుమ్మురేగ తాగతా. దానికి తోడు రోజుకు ముప్పై సార్లన్నా బోర్డు తుడుస్తాం. ఆ

చాక్‌పీసు పొడరంతా కడుపులోకి పొయ్ గుక్క తిరిగేది కాదు. అయినా నేను బాదపళ్ళా, బయపళ్ళా. రెయ్యి డ్యూటీ చేస్కోని కూడా ఆరూ ఆరున్నరకు నిద్ర లేచేసి ఏడూ ముక్కాలు కంతా టిఫను కూడా తినకుండా అందరి కంటే ముందర ఇస్కూలు ముందర వుండేవాణ్ణి. దీనికంతా నేను ఓ అని సెమ పడింది లా. పిలకాయలు దేముళ్ళతో సమానం. వాళ్ళ మధ్యన భక్తుడిలా మనం. ఇంతకంటే ఏం కావాలి రా భగవంతుడా – అంత ఆనందంగా పని చేసుకుని పొయ్యేవోణ్ణి.

కానీ, పది రోజుల్లోనే 'ఎందుకీ ఇస్కూల్లో చేరి ఉప్పుదిన్న ప్రాణానికి ఉపద్ర పెట్టుకున్నామా' అని దిగులేసింది.

ఎందుకంటే క్లాసు రూముల్లో –

ఒక క్లాసని కాదు అన్ని క్లాసుల్లో – పిలకాయలు వేసే హైడ్రోజన్ బాంబుల వాసనను భరాయించలేక పొయ్నాను.

ఉదాహరణకు నేను ఏడో తరగతి పాఠం చెప్పడానికి 9.30 కు క్లాసు రూము లోకి పొయ్నాననుకుందాం. Square roots చెప్తా వుంటే ఎవుడో ఒకడు హైడ్రోజన్ బాంబేస్తాడు. ఆ క్లాసు రూము కూడా ముప్పై మంది తగుల్తూ తగుల్తూ కూర్చునే విధంగానే వుండేది. అయ్యవారి కుర్చీకీ పిలకాయలు కూర్చునే వరసకీ కరక్టుగా మూరడు ఖాళీ జాగా వుండేది.

క్లాసు రూము నడి మద్యలో ఒకడు వున్నట్టుండి సెంటు సీసా పగల గొడతాడు గదా. క్షణాల్లో పిలకాయలు నవ్వతా ముక్కులు మూసుకునే వోళ్ళు – ఒకర్నొకరు చూసుకుంటా. 'నువ్వే గదా బాంబేసిన సద్దాం హుస్సేన్, నువ్వే గదా బాంబేసిన సద్దాం హుస్సేన్' అని కళ్ళతోనే మాట్లాడుకునేటోళ్ళు. ఆ వాసన నా ముక్కులకు సోకే దానికి నిమిషం గూడా పట్టదు. పిడిగుద్దుతో నా మూతిని గుద్దినట్టుగా ఆ వాసనొచ్చి నన్ను తాకేది. దాన్ని పట్టించుకోనట్టు, అసలా వాసనే లేనట్టు నటించాలంటే నా తాతలు దిగొచ్చే వోళ్ళు. చివరకు నేను గూడా ఏదన్నా ఒక కొత్త పుస్తకాన్ని తీసి పిలకాయల మాదిర – ఆ వాసన మరిచి పోవడానికి – కొత్త పుస్తకం వాసనను రా రమ్మని కావిలించుకునే వోణ్ణి. ఎంత వాసనంటే – మురిగిన కోడిగుడ్డు వాసన్ని భరాయించొచ్చు, చచ్చిన ఎలిక వాసన్ని భరాయించొచ్చు – చివరకు అసలు సిసలు హైడ్రోజన్ బాంబు వాసన్నైనా భరాయించవచ్చు గానీ ఈ హైడ్రోజన్ బాంబు వాసన్ని భరాయించలేక పిలకాయల్ని తొక్కుకుంటా తోసుకుంటా బిత్తర బిత్తరగా క్లాసు బైటికి–

మంచి గాలి కోసం వొచ్చేసే వోణ్ణి. ఏడో క్లాసులో నుంచి బైటికొస్తే ఆరో క్లాసు. ఆ పిలకాయలకి నేనెందుకు బైటకొచ్చినానో తెలిసిపొయ్ వాళ్ళు నవ్వే వాళ్ళు.

పాపం, నేనంటే క్లాసు బైటికి వొచ్చేసినాను గానీ ఏడో తరగతి పిలకాయ లందరూ బైటికి రాలేరు గదా. వాళ్లు ఆ వాసన పొయ్యేదాకా ఆ వాసనే పీలుస్తూ నవ్వతా నరకం అనుభవించే వాళ్ళు.

ఇట్లా ఏ క్లాసులో అయితే బాంబు పడిందో ఆ క్లాసులోనే ఆ వాసనంతా పొయ్యేదాకా నిలబడి వుండడం బ్రహ్మదేవుడి వల్లా గూడా గాదు. ఒకసారి పంతానికని పొయ్ – ఎవరు బాంబు వేసినా సరే బైటికి రాకూడదు అని బోర్డు మింద లెక్క చెప్తానే వుండినా. చెప్పేటప్పుడు ఏ నిమిషాన ఎవడు బాంబు వేస్తాడోనని ఒక పక్క కడుపులో జెరం కాస్తానే వుండింది. అనుకున్నంతలోనే ఎవడో సెంటు సీసా పగల గొట్టాడని తెలియజెప్పడానికన్నట్టు పిలకాయలు పుస్తకాల్నెత్తి మూతుల కడ్డంగా పెట్టుకున్నారు.

'ఏయ్ అంతా వొట్టిదే. మీకిదొక తమాసయి పొయ్యింది.' ఈ మాట అంటా వుండానో లేదో వాసనొచ్చేసింది. నేను బిత్తరపోయి వూపిరాడనట్లు నోటితో గాలి పీల్చేసరికి ఆ చెడ్డ వాసన నేరుగా పొయ్ గుండెకి తగిలింది. ఆ రోజు నా యాతన చెప్పలేను. కడుపులో గుంఁడ్రించుకుని వొచ్చేసి బైటికొచ్చి తాగిన టీ అంతా వాంతి చేసుకునేసినా. నేను జరిగిందాంట్లో రవ్వంత కూడా ఎక్కువ జేసి చెప్పడం లా. బర్‌మని శబద్దం వచ్చేటట్టు పడే బాంబు వాసన రాదనుకుంటా. అసలు శబద్దమే రాదు చూడండి ఆ బాంబు వాసన ముక్కుల్ని పిడిగుద్దులు గుద్దేస్తాది. శబద్దం చెయ్యని బాంబే ప్రమాదం. ఒక్క ఏడో తరగతిలోనే పీరిడ్డుకు కనీసం రెండుసార్లు ఇట్లా జరగతాది.

ఏడులోనే గాదు, ఎనిమిదిలోనూ, తొమ్మిదిలోనూ, పదిలోనూ ఇంతే.

'సార్ బలే ఇబ్బందిగా వుండాది సా. పిలకాయల పిత్తుల్ని భరాయించ లేకుండాను' అని కరస్పాండెంటుతో అని చూసినాను.

దానికాయన, 'నేను మాత్రం ఏం చేద్దును సార్?' అనేసి అన్నాడు. నిజ్జమే గదా.

'ఆంధ్రజ్యోతి'లో పని చేస్తా ఆ వాసన తలుచుకున్నా వాంతికొచ్చేది. నేను ఇస్కూల్లో చదివేటప్పుడు కూడా – మా పిలకాయలం క్లాసులో బాంబులు వేసే

వాళ్ళమే గాని ఇంత మిడిమేలంగా మాత్రం కాదు. ఆలోచించగా ఆలోచించగా అయిడియా తట్టింది. ఇస్కూలు పిలకాయలు చానా మంది తెల్లారి దొడ్డికి కుచ్చోరు. ఇది నిజ్జమో కాదో తేల్చుకోవాల. అంతే, లెక్కల పుస్తకాలను ఎడమ చేత్తో కూడా తాకలా. ఈ అయిడీ తట్టిన మరసటి రోజే ఏడో తరగతికి పొయ్ కుర్చీలో కుర్చోని నవ్వు మొకంతో, 'ఏందోరా. తెల్లవారి నిద్ర లేస్తానే ఈ స్కూలికి రావాల్నా. దొడ్డికి కూర్చోలా. ఇంటిదాకా పొయ్ కుచ్చోనొస్తా. అరవకుండా ఏదన్నా లెక్కా పక్కా వేసుకుంటా వుండండి' అనేసి ఒక టీ తాగేసి, మళ్ళా క్లాసు రూములోకి వొచ్చినా.

'నేనొకటి అందర్నీ అడగతా. భగవంతుడి మింద ప్రమాణం చేసి అందురూ నిజమే చెప్తారా?' అనడిగినా.

'చెప్తాం సా' అందురూ ఒకేగా అన్నారు.

ఒక్కొక్కర్నే నిలబెట్టి, 'సిగ్గుపడే దానికేం లేదురా దీంట్లో. మీ అందరి ముందరా నేనే ఇప్పుడింటికి పొయ్ దొడ్డికి కూర్చోనొచ్చినాను గదా. నువ్వు నిజ్జం చెప్పు. తెల్లారి నువ్వు దొడ్డికి పొయ్‌నావా?' అనడిగినా.



ఒక్కొక్కర్రే నవ్వతా 'పోలేద్ సా', 'తెల్లారి తెల్లారి నాకు రాద్ సా,' 'సందేళ మాత్రమే నేను కుచ్చుంటా సా' ఇట్లా చెప్పినారు.

పాలూకూడూ తినే ప్రజలారా! నేను నిజ్జంగా చెప్తుండాను – ఏడో తరగతిలో 28 మందికి గాను 23 మంది తెల్లారి దొడ్డికి కూర్చోలేదు. మిగిలి పోయిన అయిదు మందీ కుర్చున్నారంట.

నాకు నిజ్జంగా ఇచిత్రమేసింది. ఆరోజు ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు వరసగా పేర్లు రాసుకుని క్లాసు క్లాసుకూ పోయి అడిగినా. దైవసాక్షిగా 80% పైగా పిల్లలు తెల్లారి దొడ్డికి కూచ్చోలేదు.

ఈ సోక్రటీస్ స్కూలు ఒక్క స్కూల్లోనే గాదు. తిరప్తిలో, కాళాస్త్రిలో, పుత్తూరులో నాకు ఎదురు పడిన ప్రతీ ఇస్కూలు పిలగాణ్ణీ అడిగినా. 90 శాతం పైగానే, మరీ ముఖ్యంగా కాన్వెంటు పిలకాయలు తెల్లారి పూట దొడ్డికి కూచ్చోవడం లేదంట.

ఒక రోజు నేనీ ఎంక్వైరీ పిచ్చిలో వుండగా ఒక పిలగాడు తగిల్నాడు. వాడితో ఆ మాటా ఈ మాటా మాట్లాడినాక, 'దొడ్డికి నువ్వు ఎప్పుడు కూచ్చుంటావురా?' అనడిగినా. వాడు నన్ను పిచ్చోణ్ణి చూసినట్టు చూసి, 'ఎప్పుడా? ఎప్పుడొస్తే అప్పుడే...' అని వాడు చేతులు తిప్పతా చెప్పిందాన్ని వంద పేజీలు వర్ణించాలనుంది నాకు. చేతగాక విడిచి పెట్టేస్తుండా.

సోక్రటీస్‌లో ఎనిమిదో తరగతిలో విష్ణువర్ధన్ అని ఒక పిలగాడు వుండాడు. వాడు తిరప్తిలో ఎస్.టి.వి.నగర్ నుంచి వొచ్చేవోడు. వాడు చెప్పింది బలే విచిత్రం.

'నాకు రోజూ దొడ్డికి రాదు సా. ఎంత కుచ్చున్నా రాదు సా. రెండు రోజులకొక సారి ఎప్పుడు పడితే అప్పుడు కుచ్చుంటా వుంటా సా. ఇది నాకు చిన్నప్పట్నుంచి అలవాటే సా' అనేసి అన్నాడు వాడు.

నాకు ఇదంతా తెలుసుకున్నాక మా ఇంట్లో ముగ్గురు పిలకాయలు – అస్సలు తెల్లారి దొడ్డికి కుచ్చుంటుండారో లేదోనని పెద్ద బిత్తర పట్టుకునింది. నేరుగా ఇంటికి పొయ్ అడిగితే ముగ్గురూ చెప్పింది ఒకటే–

'దొడ్డికి ఎప్పుడొస్తే అప్పుడు కుచ్చుంటారు. నువ్వు కొంచిం నోర్మూసుకో' అని నా కూతురు దీపూ కుక్క మాదిరిగా నా మిందికి ఎగబడింది. 'తులసీ! నిజ్జం చెప్పు నాయినా! నువ్వు దినామూ దొడ్డికి – అదీ తెల్లారి పూట కుచ్చుంటావా?' అనడిగినా.

దానికా అమ్మి మొకం చిటకరింపుగా పెట్టి గమ్మనుండింది. వీడి అసభ్య ప్రవర్తనతో ఎట్లా వేగుదుం? అన్నట్టు. నువ్వు వేసిన ప్రశ్నకు మళ్ళ సమాధానం కూడానా? అన్నట్టు గమ్మనుండి పొయ్యింది. నేను గొంతులోకి కోపాన్ని తెచ్చుకుని, 'తులసీ! నిన్నే అడగతా వుండేది! నువ్వు నిద్ర పడక లెయ్యంగానే దొడ్డికి కుచ్చుంటుం డావా లేదా?' అన్నాను.

ఆ పిల్ల – వీడింక వొదలడనుకుని, 'అది నీకు సంబంధించిన విషయం కాదు' అనబోయి, అనే దైర్నం లేక మూతి మూరడు పొడుగు బెట్టి, 'ఏడున్నర కంతా మా స్కూల్లో మ్యాథ్స్ క్లాస్ గద బావా. అందుకుని ఒకొక రోజు కూచ్చోను. రాత్రి కొచ్చి కుచ్చుంటా' అని చెప్పింది. బగవంతుడా! – నా గుండెల్లో గుండ్రాళ్ళు పడి నట్టయ్యింది. ఆ మరుసట్రోజు తెల్లారిందే తడవు, నేను తులసీని పట్ల బలవంతాన ఎదురుగుండా కుచ్చోబెట్టుకుని, 'చూడు తులసీ! నీ మొకాన తెల్లతెల్లగా మచ్చలు ఎందుకుండాయో, నీ మొహం ఎందుకంత కళగా వుండదో నాకిప్పుడర్తమైంది. తెల్లారి దొడ్డికి పోకపోతే వొళ్ళు తేటగా వుండదమ్మా. రాత్రి తిన్న అన్నమంతా కడుపులో చెత్త అయిపోయి వుంటింది గదా. దాన్ని తెల్లారి పూటే బైటకు పంపించేస్తే తేటగా వుంటాది. దాన్ని అట్లనే పెట్టి దాని మీద తెల్లారి నాలుగిడ్లీలేస్తే ఎంత అసింకంగా వుంటాదో చూడు. దీనివల్ల వొళ్ళు తేటగా వుండక పోగా బారంగా వుంటాది. కడుపులోని గుండ్రాయి గుండెల్లోకి చేరినట్టు వుంటాది. అస్సలు మనం బతికినంత గాలం ప్రతి రోజూ తెల్లారే దొడ్డికి కూచ్చోవాలి. అట్లా కూచ్చుంటేనే వొళ్ళు తేటగా, తేజస్సుగా, నిగనిగలాడుతూ వుంటాది. ఇంక మీదట దినామూ నువ్వు నిద్ర లేవంగానే దొడ్డికి కూచ్చోవాలి. కూచ్చో లేదనుకో. క్లాసు రూముల్లో హైడ్రోజన్ బాంబు వేస్తావు. ఆ వాసన నువ్వు గానీ, ఇతరులు గానీ పీల్చలేక చావాల్సొస్తుంది. నువ్వే గాదు మీ స్కూల్లో నీ ఫ్రెండ్స్ కందరికీ కూడా తెల్లారే దొడ్డికి కూచ్చోవాలి అని చెప్పు. ఈ పద్నాలుగేండ్లూ అయ్యిందేదో అయ్యింది. ఇంక నువ్వు తెల్లవారి తెల్లవారి దొడ్డికి కూర్చో. అప్పుడు నీ వొళ్ళు ఎంత తేలిగ్గా, ఎంత తేజస్సుగా, ఎంత తేటగా..'

తులసీ చూపులకే గాని శక్తి వుండి వుంటే అక్కడికక్కడనే నేను బూడిదై పోయి వుండే వాడిని. 'నువ్వు క్లాసు రూముల్లో బాంబులేస్తావు' అని అన్నప్పుడా పిల్ల నన్ను నమిలి మింగేసినట్టు చూసింది. దీన్ని గ్రహించి నేను, 'పిత్తడం, ఏరగడం అనేవి మహరాజులూ, మహరాణులూ కూడా చేస్తారు తులసీ. ఆ మహరాజూ, మహరాణీ

బాంబు లేసినా కూడా మల్లెపువ్వు వాసనేం రాదు. గబ్బు గబ్బే. అవేమంత వికారం మాటలనుకోవద్దు. సోక్రటీస్ స్కూల్లో నేను అట్లా అట్లా అడిగితే 80% పిల్లలు తెల్లవారి దొడ్డికి కుచ్చోవడం లేదని తెలిసింది. దీనివల్లా ఎంత చెడ్డో, వొంటికి ఎంత అవస్థో కావాలంటే పెద్ద డాక్టరు దగ్గరికి పోయి అడిగి చూద్దాం రా' అన్నా.

'నేనింక కూచ్చుంటాన్లే బావా!'–

ఇంక నన్నొదులు అన్నట్టు చూసింది.


నాలుగైదు రోజులు ఆ అమ్మి లేవెట్రీలోకి పోయి వచ్చినాక, నేను ఆత్రంగా, 'ఏంమ్మా, కూచ్చున్నావా!' అనడిగే వోణ్ణి. ఆయమ్మి మొకం ఆసింకంగా పెట్టి 'ఆ' అని మాత్రం అనేది.

నాకు నమ్మకం కలగలా. ఒక వేళ రాక ఇబ్బంది పడతా వుండాదేమో అని నాకు నేను అనుమానం పెట్టుకుని నిద్ర లెయ్యంగానే పెద్ద చెంబుకు వేణ్ణీళ్ళు కాగబెట్టి అందులో రుచి కోసరం ఒక నిమ్మకాయ పిండి తులసీకీ, దీపూకీ, టాంసాయర్‌కీ ముగ్గురికీ ఇచ్చి కాసేపు ఎగరమనే వాణ్ణి.

ఒక్కొక్కరు అట్లా రెండేసి గ్లాసులు వేణ్ణీళ్ళు తాగిన కాలు గెంటకు, 'ఏం తులసీ ఇప్పుడొస్తా వుండాదా?' అని అడగతా. 'నిజ్జంగా వొస్తా వుంది బావా. పొయ్ కుచ్చుంటా బావా!' అని లెట్రిన్‌లోకి పొయ్యేది. అట్లా అట్లా మూడు నాలుగు నెలలకు మా పిలకాయలు నిజ్జంగానే రోజూ దొడ్డికి – తెల్లారి పూటే కూర్చునే వోళ్ళు. దాంతో నాకు మనశ్శాంతి అయ్యింది.

సోక్రటీస్ స్కూల్లో కూడా రెండు రోజులు నేను పుస్తకాన్ని తాక్కుండా ఈ దొడ్డికి గురించే చెప్పినాను. పిలకాయలకు చెప్పేటప్పుడల్లా నవ్వే నవ్వు.

ఏదైనా లెక్క బోర్డు మింద రాసేసి కాసేపైనాక, 'ఏంరా అయ్యిందా నాగార్జునా!' అనేవాణ్ణి. 'అయ్యింది సా' అనేవాడు వాడు. 'ఏందిరా అయ్యిందీ?' మళ్ళీ నేను. 'రాసుకునేది సా' – నాగార్జున. 'రాసుకునే కత గాదురా. తెల్లారి పూట అస్సలు కార్యక్రమం అయ్యిందా అని అడగతుండా' అని నేను. 'నిజ్జంగా అయ్యింది సా' – నాగార్జున. ఈ రకంగా 20, 30 మందికి నా మంత్రం పట్టి వుండొచ్చు. అయినా కూడా పిత్తుల బాధ తప్పలా.



నేనొక రోజు కరస్పాండెంటుతో, 'సార్, నేను నవ్వులాటకు అంటాలేను సా. ఇస్కూలు పిలకాయల తప్పు లేదు. తప్పంతా స్కూలు వాళ్ళదీ, తల్లిదండ్రులదీ. స్కూల్లో ట్యూషను ఏడూ ఏడున్నరకే బిగినై పోతాది. పిలకాయలు చలికాలం అనుకోండి – నిద్రలేచే సరికి, ఆరున్నర అవతాది. అదే ఎండాకాలం ఆరనుకోండి. ట్యూషను వుండినా లేకున్నా గబుక్కున బ్రష్షు మింద పేస్టు వేసుకుని కాసేపు నోట్లో పెట్టుకుంటారు. తర్వాత అంత టిఫను తింటారు. తినకపోతే తల్లి కూడా ఒప్పుకోదు. తల్లి ఇంకొక పని కూడా చేస్తింది. మగ పిల్లాడైతే పాపిటెత్తి అట్లా తల దువ్వడం, యూనిఫాం తోమించిన గుడ్డలు వెయ్యడం, టై కట్టడం, స్కూలికి తరిమెయ్యడం. ఆడబిడ్డలయితే తలను రకరకాల ఫ్యాషన్లుగా దువ్వి గుడ్డలేసి పంపిస్తారు. ఒకటికి రెండుసార్లు దొడ్డికి కూర్చున్నారా లేదా అని అడగరు. ఆమె – బిడ్డ కడుపులోకి మూడు పూటలా అంత వెళుతుందా లేదా అని చూస్తిందే గానీ ఆ వెళ్ళింది సక్రమంగా తెల్లారే బైటికి పంపిస్తున్నారా? అనేది చూడదు. అంతెందుకు, నా ఎంక్వైరీలో మీ కూతుళ్ళే తెల్లారి పూట దొడ్డికి కూచ్చోవడం లేదు. నా బిడ్డలూ అంతే. మా వారిని వారంలో దోవకు పెట్టినా. వేణ్ణీళ్ళిచ్చీ.... మొత్తానికి అలవాటు చేసినా. నేను చెప్పేదేమంటే దీన్ని

సీరియస్‌గా తీసుకోండి. పేరెంట్స్ మీటింగ్ పెట్టి ఈ విషయం వాళ్ళ దృష్టికి తీసుకు రాండి' – ఇంత వుపన్యాసం!

ఈయన, సోక్రటీస్ రవీంద్రనాథరెడ్డి చానా మంచోడు.

ఇది పెద్ద సమస్యే అని ఆయనా ఒప్పుకున్నాడు. అందుకే కొంతమంది పిలకాయలు ఎప్పుడూ ఏదో ఒక జబ్బు అని ఆబ్సెంట్ అవతానే వుంటారని అన్నాడు. అయితే ఈ మాత్రం దానికి పేరెంట్స్ మీటింగు పెట్టి ఉపన్యాసం ఇవ్వాల్సిన పన్లేదేమో– అన్నట్టు మాట్లాడినాడు.

'పోనీ, నేను వివరంగా నాలుగైదు పేజీలు రాసిస్తా. అందరికీ సర్క్యులర్ లాగా పేరెంట్సుందరికీ పంపండి సా' అన్నాను. దీనికీ ఆయన నవ్వేసి గమ్మనుండినాడు. ఒక్క పని మాత్రం చేసినాడు. ప్రేయరుకు ముందరనో, తర్వాతనో కరస్పాండెంటు స్పీచ్ వుంటింది గదా. అందులో దాదాపు వారానికి రెండు రోజులు పిల్లలందురూ వుదయాన్నే దొడ్డికి కూచ్చోవాలి – అని నొక్కి నొక్కి చెప్పినాడు. కానీ, పిలకాయలకు దాన్ని అలవాటు చెయ్యాలంటే నిజ్జంగా తల్లీదండ్రీ – నేను చేసినట్టు చెయ్యాల్సిందే.

మా పక్కింటామె ఒకామెతో 'మీ ఇద్దరు పిలకాయలూ తెల్లారి దొడ్డికి కూచ్చోవడం లేదు. పిలకాయల్ని జడ వేసీ, మొకానికి పౌగ్రడ పూసీ పంపించడం గాకుండా తెల్లారి దొడ్డికి కుచ్చునేటట్టు చెయ్యండి. దానికేం లేదు– నిద్ర లేవంగానే గ్లాసుడు వేణ్ణీళ్ళూ, దాంట్లో నిమ్మకాయా పిండి–'

ఆమె నన్ను పురుగును చూసినట్టు చూసి, 'కన్న వాళ్ళం మాకు తెలవదా! ఎప్పుడో ఒకప్పుడు కుచ్చుంటానే వుంటారు గదా!' అని నన్ను మొకాన కొట్టినట్టు మాట్లాడింది. ఇట్టుంటాయి కతలు. తల్లిదండ్రుల దయ, పిలకాయల ప్రాప్తం!

# వేప్పుల్ల శాస్త్రం



**సో**క్రటీస్ పిలకాయలు పిత్తులేం మానలేదు. పాఠం చెప్తా వుంటే నడిమధ్యలో– పిత్తేస్తే వీడు బైటికి పోతాడు గదా కొంచేపు – అనే ఎత్తుగడతో కొందరు ముండ నాయాండ్లు బలవంతంగా గూడా పిత్తేవోళ్ళు. రెండో తరగతీ, మూడో తరగతి పిలకాయలైతే ఇంకా అన్నాయం. ఎప్పుడు పడితే అప్పుడు రెండేళ్ళు చూపించి క్లాసు బైటికి వచ్చి కంపచెట్ల మద్య ముక్కి ముక్కి దొడ్డికి కుచ్చుంటా కైలాసం చూస్తా వుండేవోళ్ళు. (నరకమంతా వాళ్ళ ముడ్లు కడగలేక ఆపసోపాలు పడే ఆయమ్మదే పాపం). ఈ మాదిరిగా వేళగాని వేళ దొడ్డికి కూచ్చునే కొందరు పిలకాయల తల్లులకు చెప్పి చూద్దామని నాకు బలే ఆశగా వుండేది. కాని చెప్తే వాళ్ళు నన్ను 'అసభ్య ప్రవర్తన' కింద కరస్పాండెంటుకూ, ఇంకా దూరంగా పొయ్ పోలీసులకూ చెప్పి కేసు బుక్కు చేస్తారేమోనని బయపడి 'మనకు కండ్లు కనపడవు అంతే' అనుకునీ, 'లోకమంతా ఎక్కడబోతే మనకేం? మన ముగ్గురు పిలకాయలూ అలవాటు చేసు కున్నారు గదా అదే పదివేలు' అనుకునీ నేను ఇస్కూలు పిలకాయల పిత్తులకు బాగా

అలవాటై పొయ్‌నాను, అందరి అయ్యవార్ల లాగే. ఒక దశలో 'పిలకాయలేదో పిత్తతారని చెప్పి ఎప్పుడూ క్లాసు బైట వుంటే ఎట్టసార్' అని కరస్పాండెంటు తిడతాడేమోనని కూడా బయపడి... ఈ పిత్తుల సమస్య అంతటితో సమాప్తం చేసేసినాను.

నేను సోక్రటీస్ ఇస్కూల్లో చేరింది, జూలై నెల్లో అనుకోండి. సెప్టెంబరు నెలకొచ్చే సరికి మాకు, దగ్గిరిగా వుండే మద్రాసు బంగాళా ఖాతంలో ఏందో జరగడం, తిరప్తిలో వానలు పట్టుకోవడం జరిగింది. దీంతో అక్టోబరు నెలకంతా బావుల్లోకీ, చెరువుల్లోకీ కొత్త నీళ్ళు రావడం మొదులైనాయి.

నవంబరులో తులసీ కత చెప్పి మళ్ళ సోక్రటీసు పిలకాయల దగ్గిరికొస్తా.

తొమ్మిదో తరగతి నడి మద్య నుంచే – ఆ పిల్ల పదిలో చేరేదాకా లెక్కలు చెప్పించి దాన్ని లెక్కల్లో గూడా ఒక దోవలో పెట్టాను. తులసీ పదిలో చేరినాక మళ్ళ ఆ పిల్ల చదువులో నేను వేలు పెట్టలా. జనవరిలో వేలు పెట్నాను గానీ దేనికి పెట్టాల్సొచ్చిందో అదీ మళ్ళే జెప్తా.

తులసి పదో తరగతి చదవతా వుండంగా నవంబరు నెల్లో ఆ పిల్లకు కాసిందండీ జెరం అది చిన్న జెరం గాదు. తులసీకి ఎప్పుడూ జరం సమస్యే. ఆ పిల్ల చిన్నప్పట్నుంచి కూడా సమ్మచ్చరంలో మూడు యావతులా జెరం కాయాల్సిందే. 'పిలకాయలకు జెరాలు వొస్తాయి పోతాయి, దానికే అంత ఇచ్చిత్రం చెయ్యాల్నా?' అని నా భార్య నిమ్మళంగా వుంటాది గానీ నాకా నిమ్మళం దొరికేది గాదు. ఆ పిల్లకు ఎప్పుడు జెరమొచ్చినా, 'ఏమ్మా అట్టుండావు? జెరమా?' అని పట్టి చూస్తే వొళ్ళు వెచ్చంగా తగిలే సరికి నాకు గుండెల్లో దడ పట్టుకునేది. మా కతలు ఆ మాదిరిగా జరిగినాయి మరి. మా అక్క తేలుకుట్టి చచ్చిపోవడం ఏంది? రెక్కల కష్టంతో కొండల్ని పిండి చేసిన మాయమ్మ మూడు నెలల్లో గుండె జబ్బు అని చచ్చి పోవడం ఏంది?

జెరం అనంగానే నాకు ఎంత దిగులై పొయ్యేదీ చెప్పలేను. దీపుకీ, టామ్‌సాయర్‌కీ జెరమైతే ' ఏమబ్బా డాక్టరు దగ్గిరికి తొడక పో ' అనే వాణ్ణి గానీ తులసీకి జెరమొస్తే కిందా మిందా పడిపోయి తిరుమల కొండకీ, సుబ్రమణ్యం స్వామి కొండకీ మాటిమాటికీ దండాలు బెట్టి, 'తల్లి లేని బిడ్డ. కంటికి రెప్ప మాదిరిగా చూసుకోండి తండ్రీ' అని మొక్కుకునే వోణ్ణి.

నేను పేపరాఫీసులో పనిచేస్తా గదా. ప్రతీ సమ్మచ్చరం ఖమ్మంలో విష జ్వరాలనీ, అక్కడ ఆంతమంది చచ్చి పొయ్‌నారనీ వార్తలు చూస్తాం గదా. ఇంకా బిత్తరెత్తుకునేది.

నవంబరులో ఆ పిల్లకు కాసిన జెరం మాత్రం బలే అన్యాయం. ఆ వారం నేను నైట్ డ్యూటీలో వుండాను. ఇస్కూలికి రానని చెప్పి పళనీ టాకీసు కాడ వుండే బాలక్రిష్ణ అనే ఎంబీబీఎస్ డాక్టరు దగ్గిరికి తులసీని తొడుకోని పొయ్‌నాను. ఆ పోవటం పోవటం పది దినాలు వొరసగా రమ్మన్నాడు. పోతానే వుండాం. 700 రూపాయలు మాత్రలకు అవతానే వుండాది. జెరం మాత్రం తగ్గేదిలా. నేను నైట్ డ్యూటీ నుంచి రాత్రి ఇంటికి రాంగానే దుప్పటి తీసి ఆ యమ్మి మెడ కంఠం కింద అరిచెయ్యి పెట్టి చూస్తే కాలిపోతానే వుండేది.

ఆ మరుసట్రోజు కరస్పాండెంటు దగ్గిర వెయ్యి రూపాయలు అప్పుజేసి నేరుగా బాలకృష్ణా డాక్టరు దగ్గిరికి పొయ్ వొణకతా వొణకతా, 'సా, మా బిడ్డకు అస్సలు జెరమే తగ్గలేదు సా. కాస్తానే వుండాది సా. పది రోజులుగా ఆ పిల్ల తిండీ తీర్థం లేక కంప కంప అయిపొయ్యింది సా. అది చెడ్డ జెరమో ఏమో చూడండి సా. రక్త పరీచ్చల్లో ఏమీ మిస్టీకు లేదు గద సా... మీరెంత ఫీజన్నా తీస్కోండి. నాతో కొంచెం వివరంగా చెప్పండి సా. నేను ఆంధ్రజ్యోతిలో పని చేస్తాను సా. సాసాసా....' ఇట్లా పిచ్చోడి మాదిరిగా మాట్లాడినాను.

ఆయన నా బిత్తరకు నవ్వతా, 'తగ్గి పోతాదమ్మా. ఆఫ్టరాల్ జ్వరానికే కిందా మీదా అయిపోతే ఎట్లా? ఇంకొక్క కోర్సు వాడేద్దాం. ఇంజక్షన్లు ఇంక వొద్దులే' అన్నాడు. నిజానికాయన చానా మంచి డాక్టరే.

తులసీ నేనూ నేరుగా కాళ్ళీడ్చుకుంటా ఇంటి కొచ్చేసినాం. నాకేం కాలూ చెయ్యా ఆడలా. ఏం కాదులే – అని దైర్నం ఒక పక్క.

ఆఫీసుకి నాలుగు రోజులు లీవు పెట్టి పారేసినా. ఒకే దిగులు. ఇంకా ఎందుకు బతికి వుండాం. అక్కతో, అమ్మతో చచ్చిపోయి వుంటే ఈ దరిద్రం అంతా లేదు గదా – నాకు దు:క్కం వొచ్చేసింది.

ఆలోచన... ఆలోచన... ఒకే దిగులుగా ఆలోచన...

మా యమ్మ, 'మూడు మూడు నాళ్ళకూ జెరం తెచ్చుకోని నా కండ్ల నీళ్ళు దప్పిక తాగతుంటాడు. పొండ్లు సరిగ్గా తోమి మొకం కడుక్కుంటే గదా... మొగ పిలగోడికి చెప్పాల్నా?' అనేది నా చిన్నప్పుడు.

హమ్మ... అదే... అదే!

అవును, తులసీ సరిగ్గా పొళ్ళు తోమదు. వాళ్ళ అత్త – తులసీకే గాదు, మా పిలకాయలక్కూడా కనీసం ఆర్నెల్లకొకసారి బ్రష్షులు మార్చదు. అట్లా మార్చడం దాని దృష్టిలో అదొక లేనిపోని ఇచ్చిత్రం. నాకు అర్తమై పొయ్యింది.

అంతే, నేను నిమిషం ఆలస్యం చెయ్యలా. ఇంట్లో వుండిన అయిదు బ్రష్షులూ, సగం మిగిలి వుండిన టూత్ పేస్టూ, 'ఒరే ఒరే వాటినెందుకురా పారేస్తావు?' అని నా భార్య నన్ను అరస్తా వుండినా, 'నువ్వు కొంచెం మూస్కో' అనేసి వాటిని సైడు కాలవలో పారేసినా.

ముందు నా పెళ్ళాంతో చెప్పినా:

'ఏమబ్బా నేను నీతో తగరారు పెట్టుకుందామని లేను. చెప్పేది జాగర్తగా విను – ఈ రోజు నుంచి ఇంట్లో ఎవరూ బ్రష్షూ, పేస్టూ వేసుకుని నోరు కడుక్కోవడానికి లేదు. మనింటికి దినామూ 5 వేప పుల్లలు కావాల. నాకేం బొచ్చు పెరికే పని లేదు– ఇంతకంటే. దేశంలో వేప చెట్లకు కొదవ లేదు. అవి బైరాగి పట్టెడలో వుండాయి, ఇంకొంచిం పోతే అవిలాల, ఇంకా ముందుకు పోతే అగ్రహారం. ఇక్కణ్ణించి రెండు మైళ్ళు పోతే యూనివర్సిటీ నిండా వేప చెట్లే. నేను తెచ్చిస్తా పుల్లలు. వాటితో తోమండి. నా బుద్దికి ఇంతకాలం ఈ అయిడీ రానందుకు నాకే సిగ్గుగా వుండాది. నీకంత చిన్నతనంగా వుంటే నువ్వు తోముకో బ్రష్షుతో, చెప్తే వినవు గాబట్టి. నా బిడ్డలు మాత్రం బ్రష్షుతో తోమడానికి లేదు. ఇది నా ఆర్డరు'.

అంతే, నేరుగా వేపచెట్టు కాడికి పోయి కొమ్మెక్కి 50 పుల్లలు ఇంచుకున్నా. చెట్టు దగ్గిరికి పొయ్‌నాక అయిడీ వొచ్చింది. దండిగా పుల్లలించుకోని పక్కింటోళ్ళ ఫ్రిజ్జులో పాలీథీన్ కవర్లో పెట్టేస్తే – ఆ పనే చేసినా.

ముందు తులసీని ముందర పెట్టుకోని, 'తులసీ! నువ్వంటే నాకెంత ప్రాణమో నీకు తెలుసు గదమ్మా. నిన్నటి దాకా నీ జ్వరంతో బయపడి చచ్చినాను. చదువూ వొద్దు ఏం వొద్దు. స్ట్రెయినై నీకు జ్వరం వస్తుండాదేమో. కాబట్టి నువ్వు పుస్తకాలు కూడా తాకద్దు. ఆరోగ్యంగా వుంటే అదే పది వేలు అని చెప్పేద్దామనుకున్నా. కానీ నువ్వు పొండ్లు సరిగ్గా తోముకోకనే నీకీ జ్వరాలని నా గట్టి నమ్మకం. సూది వెయ్యించు కోవాలంటే పసిబిడ్డలాగా ఏడస్తావు గదా. ఇంక నీకా సూది బాదే వొద్దు. చేదు

వొంటికి మంచిది. నువ్వింక ప్రతీ రోజూ పుల్లతో తోమాల' అని వేపపుల్ల దాని నోటికి అందించినా.

'అట్లనే తోముతాన్ లే' అని అది వీధిలోకి పొయ్యింది. నేనొప్పుకోలా. నా దగ్గిరే వుండు. ఎట్ల తోమాలో చెప్తా.

పాయింట్లు పాయింట్లుగా చేసి చూపిస్తా చూడు:

1. ముందు పుల్లను నోట్లో పెట్టుకుని మనం అన్నం నమల్తామే ఆ పొండ్లతో పుల్ల మొదులును బాగా నమలాల. నమిలినాను గదా, రెండు నిమిషాల్లో పట్టు మాదిరిగా కుచ్చుగా వొచ్చింది గదా.

2. ఇప్పుడు మన ముప్పై రెండు పొండ్లనూ ముందు పై భాగంలో బాగా తోమాలి. తోమినాను గదా, అయిపొయ్యింది అనేసి పుల్ల పారెయ్య కూడదు.

3. 32 పళ్ళ లోపలి భాగాన్ని కూడా రెండు మూడు సార్లు బాగా తోమాల. తోమినాను గదా. అంతే, ఇంక స్కూలుకు టైం అయిపోయింది గదాని పుల్ల పారెయ్యకూడదు.

4. మనం తినే తిండి నోరంతా కదుల్తుంది గదా. కాబట్టి పుల్ల కుచ్చుగా వొచ్చింది గదా, ఆ కుచ్చుతో కింది పొళ్ళ వరస చిగుళ్ళనీ, పై పొళ్ళ వరస చిగుళ్ళనీ మెత్తగా తోమాలి. తోమినాను గదా, అంతే ఇంక అయిపొయ్యిందని పుల్లని పారెయ్య కూడదు.

5. పై పెదిమి కిందా, కింద పెదిమి కిందా, దవడల కిందా పుల్లని కోడిగుడ్డు ఆకారంలో ఒకటికి నాలుగు సార్లు తిప్పాలి. తిప్పినాను గదా, అయిపొయ్యిందని పుల్లని పారెయ్యకూడదు.

6. ఇక నోటి దూలంలో నీసు వుంటుంది గదా. కాబట్టి కుచ్చుతో నోటి దూలాన్ని తోమాలి. పుల్ల పారెయ్యను.

7. నోటి దూలం లోపల చిన్న నాలిక వుంటింది గదా. దాన్ని కుచ్చుతో అలా రెండు సార్లు తాకించక పోతే దానికి కోపం రాదా? కాబట్టి చిన్న నాలికని కుచ్చుతో తాకించినాను. ఇంక పుల్లతో పనేం లేదా? అసలు వుండేదంతా ఇంకనే.

8. వేప్పుల్లను నిలువుగా చీల్చాలి. ఇగో, ఇట్లా. బద్ద వచ్చింది గదా, నాలికను బైటికి చాపి రెండు సార్లు నాలిక గియ్యాలి. చూడూ పచ్చగా ఎంత వొచ్చిందో! దగ్గితే ఎంత తెమడ పడిందో. వాంతికొచ్చి కళ్ళు నీళ్ళు కమ్మాయి చూడు. ఇంక పుల్లకొక దండం పెట్టి పారేసెయ్.

పొండ్లు తోమడమంటే ఇన్ని సూత్రాలు వుండాయి.

– అని చెప్పి పదినాళ్ళు ఆ మాదిరిగా చేయించినాను. దీపూకీ, టామ్‌కు కూడా. తొలుత వాళ్ళు 'అబ్బా చేదు' అన్నారు. నిదానంగా వాళ్ళకు చిల్లరిచ్చీ, వాళ్ళను పొగిడీ వేప పుల్లకు అలవాటు చేసేసినాను.

మీరు నిజ్జం చెప్పినా వింటారు, అపద్దం చెప్పినా వింటారు. ఈ పని మేము మొదులు పెట్టింది – ఈ రోజుటికి 13 నెలలు కావస్తా వుంది.

తులసీకి జ్వెరం అనేది ఏమైందో, బిత్తరెత్తుకుని పారిపొయ్యింది. జ్వరం లేదు, గిరం లేదు. ఒకప్పుట్లో ఆ పిల్లకు చదువు చెప్పడం ఎందుకు? పరీక్షలు రాసేటప్పుడూ జ్వెరం రాదని గ్యారంటీ ఏంది? అని కూడా బాద పడిన వాణ్ణి నేను.

మేము 1998 ఆగస్టు 4న తిరప్తి నుంచి ట్రాన్స్‌ఫర్ అయి హైద్రాబాదుకు వొచ్చేసినాము. ఇక్కడ కూడా వేపపుల్లను వొదిలిన పాపాన పోలా. హైద్రాబాదులో కూడా జె.ఎన్.టి.యు నిండా వేప చెట్లే. పక్కింటి వాళ్ళ ఇళ్ళల్లో ఫ్రిజ్జులే! ఇంక మా కుటుంబానికి ఎంత ఆరోగ్యం!

నా భార్య 'ఏం బ్బా! ఇంట్లో బియ్యం అయిపొయ్‌నాయి నాయినా!' అని అంటే 'ఏం ఫర్వాలేదు. ఒక పూట పొస్తులుండినా మంచిదే!' అని నేను నిమ్మళంగా వుంటాను గానీ 'పుల్లలై పొయ్‌నాయి' అనంగానే ఆ నిమిషంలోనే 50 పుల్లలు తెచ్చి పక్కింటోళ్ళ ఫ్రిజ్జులో పెట్టందే నేను నిద్రపోను.

మా ముగ్గురు పిలకాయలకూ, మా మొగుడూ పెళ్ళానికీ దగ్గు గానీ, జలుబుగానీ ఈ సంవత్సరంగా మాకు తెలవ్వు.

ఆగష్టు 4న హైదరాబాదొచ్చినాం గదా. పిలకాయలైతే నెత్తిన కూడా మంచినీళ్ళు పోసుకున్నారు. నీళ్ళు మారినాయి గదా కాగ బెట్టుకుని కూడా తాగం గదా. మా పిలకాయల ముక్కుల్లో చీమ తలకాయంత చీమిడి కనిపిస్తే...

జలుబైనా సరే బాంచత్, కడుపులో నులి పురుగులు మాత్రం... పరార్.

తెల్లారి లేచి దొడ్డికి పోతారు, వేప్పుల్లతో పాండ్లు తోముతారు. ఇంకేముందీ...

మా పిలకాయలకు నిద్రలేచి పాలు ఇచ్చేది లేదు. పొండ్లు ఎప్పుడో తప్ప కొనే ప్రసక్తే లేదు. మామూలు అన్నమే.

బంజారా హిల్స్ పిలకాయలు కూడా నా బిడ్డలంత కళగా వుండరు. తులసీకైతే మొకాన తెల్ల మచ్చలేమైనాయో ఆరోగ్యంగా కళకళ లాడతా వుండాది. మా దీపూ, మా టామ్ సాయర్ అయితే చందమామలే. అంత తేటగా ఉంటారు. ఆకలి కాని సమస్యా, బేదుల సమస్యా, పడిశాల సమస్యా, లేనేలేవు.

నోరు మంచిదైతే వూరు మంచిదే అనేది సామెత. నోరు బాగుంటే ఒళ్ళంతా బాగుంటాది.



మేం అనుభవించిన ఈ వైబోగాన్ని నాతో నాలుగు మాటలు మాట్లాడిన ప్రతీ ఒక్కర్తో చెప్తా నేను. విన్న వాళ్ళు రూంతసేపు కూడా ఆలోచించకుండా, వీడికి అన్ని పిచ్చిలూ పోయి వేప్పుల్ల పిచ్చి పట్టుకునింది కొత్తగా, అని వేళాకోళం ఆడతుండారే గానీ ఒక్కరూ పాటించింది లా.

తిరప్తిలో కొందరు తల్లిదండ్రుల దగ్గిర ఈ వేపపుల్ల ప్రస్తావన తెస్తే 'బలే వోడివి లే. పుల్ల గుచ్చుకోదా? చిగుళ్లు దెబ్బ తినిపోవా?' అని ఒకరూ, 'పది రూపాయలు అక్కడ పారేస్తే పేస్టు వొస్తుంది. ఆ పుల్లల కోసరం ఎక్కడికి పోం' అని ఒకరూ, 'మేమేం అంత గతి లేకుండా లేం. వేప్పుల్లల్తో తోమే కర్మ మా బిడ్డల కేమిటికి పట్టిందీ?' అని ఒకరూ ఇట్లా ...

హైద్రాబాదులో అవితే బాగా చదూకున్నోళ్ళ దగ్గిర కూడా ఈ ప్రస్తావన తెస్తే, 'వేప్పుల్ల మంచిదే కాదనం గానీ అవి ఈ సిటీలో ఎక్కడ దొరకతాయండీ!' అన్నారు.

'సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ దగ్గర వాటిని కొనేవోళ్ళు లేరండీ' అనంటే, 'ఆ, అవన్నీ జరగవు లెండి' అని వేపపుల్ల ప్రస్తావన విడిచి పెట్టి సాహిత్య ప్రస్తావనకు దిగేవోళ్ళు.

చిన్న పిలకాయలకు బ్రష్షు మింద పేస్టేసి తోముకోమంటే ఏం తోము కుంటారు? తియ్యగా వున్న భాగాన్ని ఒకంత మింగి అట్లా పుక్కిలించి వూసేసి, టైమైపొయ్యిందని ఆదరాబాదరా అంత తినేసి, దొడ్డికి కూడా కుచ్చోకుండా ఇంటి ముందర ఆగిన ఆటోనో, రిక్షానో ఎక్కేసి ఇస్కూలికి పూడస్తారు.

ఇంకా, కొంత మంది తల్లులకు ఇదొక బడాయి. 'ఏమిటోనండి! కొంత మంది పిల్లలు ఏది పడితే అది ఆవురావురుమని తింటా వుంటారు. మా వాడు సరిగ్గా అన్నమే తినడు' అని అదో రకం స్టేటస్ సింబల్‌గా చెప్పుకుంటారు.

ఇక్కడ మా ఇంట్లో ఏమో, 'నువ్వీ వేపపుల్లలు ఎప్పుడు పట్టినావో గానీ అప్పట్నుంచీ ఈ పిలకాయలు గిన్నిలు గిన్నిలూ లాగిస్తుండార్రా' అంటింది నా పెళ్ళాం. నేను వేపచెట్టు కనిపించినప్పుడల్లా వేప చిగుళ్ళు గిల్లుకోని పిలకాయల నోటికి అందిస్తా వుంటా. ఎవురి పిల్లలైతే అన్నాలు సరిగ్గా తినరో ఆ పిలకాయల్ని నా దగ్గిర పది రోజులు విడిచి పెట్టండి. వాళ్ళను నేను భీమ సేనుల్ని చెయ్యకపోతే నన్ను పట్టుకుని అమ్మా అక్కా అని తిట్టండి. నోరు సరిగ్గా కడుక్కోకుండా, తెల్లారి దొడ్డికి పోకుండా వుంటే ఇంక పిలకాయలు తినేదేంది, చదివేంది?

వానలు పడంగానే రోడ్ల పక్కన ఎక్కడ పడితే అక్కడ నేల వుసిరి మొక్కలు పెరిగి తల్లిదండ్రుల కల్లా ఎగ జూపెట్టుకొని వుంటాయి : 'మమ్మల్ని పెరక్క పోయి

మీ బిడ్డల నోళ్లకి అందించండి' అంటా. కానీ ఎవరు వాటికల్లా చూసేది? ఆ ఆకు పసికిర్లకు ఎంత మంచిదో! అది తింటే బిడ్డలకు రక్తహీనత అనేది వుండదు.

ఇట్లా నా బిడ్డ తిండే తినడు – అన్న ఒక తల్లికి నేనే ఆ ఆకు పెరక్క పోయి దోసిడిచ్చినాను హైద్రాబాద్‌లో.

'ఫ్రిజ్‌లో పెట్టి పిల్లవాడికి రోజూ ఇవ్వండి. అట్లాగే మీరు పిల్లవాడి చేత వేపపుల్లతో పొండ్లు తోమించక పోయినా కనీసం వుప్పుతోనైనా తోమించండి' అని చెప్పినాను. తీరా నాలుగో రోజు నేనామె దగ్గిరికి పొయ్, 'ఆ ఆకు తిన్నాక బిడ్డ అన్నం బాగా తింటా వున్నాడా అమ్మా?' అనడిగితే, ఆమె నవ్వేసింది. 'మా వాడు ఆ చేదు ఆకులన్నీ తినే రకమా?' అంటూ.

నా ముందరే ఆమె అలమారా తెరిచి రెండు రకాల టానిక్కులూ, నాలుగు రకాల మాత్రలూ తీసి వాణ్ణి తిట్టీ కొట్టీ ఏడిపించి వాడి చేత మింగించి ఆమె బాధ్యత తీర్చుకుంది. వేపపుల్లతో పొళ్ళు తోమి ఆ చేదు భరించలేని వాడికి... టానిక్కులూ, మాత్రలూ, ఇంజక్షన్లూ!

– సోక్రటీసు స్కూలుకు పోదాం మళ్ళీ.

నవంబరు నెల పెట్టేసరికి పిలకాయల్లో – ఈ రోజు ఇస్కూలికి వచ్చిన వాడు రేపు వొచ్చేదిలా. పాఠం చెప్తా, 'వినయ్ లేడేమి రా?' అనంటే ఎవురో ఒకరు. 'వాడికి జొరం సా. డాక్టరు దగ్గిరికి పొయ్‌నాడు' అనేవాళ్లు. 'మరి ఎట్లరా? ఈ రోజు కొత్త చాప్టర్ సర్కిల్స్ బిగిన్ చేస్తుండాను. వాడు అసలే క్లవరు. వాడే ఫాలో కాకపోతే ఎట్లా?' అనేవాణ్ణి. 'వాడు మా నోట్స్ చూసి రాసుకుంటాడులే సా' అది సమస్యే కాదన్నట్టు చెప్పే వాళ్ళు పిలకాయలు.

ఇట్లా ఆ జ్వరాల సీజనులో ప్రతీ క్లాసులో అయిదారు మంది అబ్సెంటై పొయ్యేవాళ్ళు. నేనీ కత నెత్తుకోని కరస్పాండెంటు దగ్గిరికి పొయ్, 'ఏందో సా. పిలకాయలందరికీ జరాలు. కొత్త చాప్టరు బిగిన్ చెయ్యాలంటేనే బయంగా వుంది. క్లాసులో అందురూ వుండాల గదా' అన్నాననుకోండి.

అందుకాయన, 'జ్వరాల సీజను గద సార్. ఇద్దరో ముగ్గురో ఆబ్సెంట్ అనేసి మనం పాఠాలే చెప్పకుండా నిలిపేస్తామా?' అనంటాడు.

అయినా సరే నా పాపం వుండకూడదని, 'పిల్లకాయలకు వేప పుల్లల్తో పొండ్లు తోమితే, ఎట్లా తోమాలో చెప్తే అస్సలు జ్వరాలే రావు సా. మొన్న మా తులసీకి ఏడు వందలు ఖర్చు పెడితే పోని జ్వరం రెండు రోజులు పుల్లతో నోరు కడిగిస్తే పత్తా లేకుండా పొయ్యింది. దోమల వల్ల వచ్చే మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు పిలకాయ లకు ఎప్పుడో గాని రావు, మామూలు ఇన్‌ఫెక్షన్ జ్వరాలే అన్నీ కూడా. పొళ్ళు బాగా తోమి, పుల్లతో నాలిక గీస్తే పిలకాయలకు మామూలు జ్వరాలు రానే రావు' అన్నాను.

మొత్తానికి ఆయన చెవిలో జోరీగనై వేప్పుల్ల గొప్పతనం స్కూలు బైట చెప్పీ చెప్పీ ఆయన్నైతే నమ్మబలికి నాను గానీ...

'సార్, స్కూల్లో పిలకాయల కత వొదిలీయండి. హాస్టల్‌లో పన్నెండు మంది పిలకాయలు వుండారు గదా. వాళ్ళనందరినీ చీటికీ మాటికీ జ్వరమనీ, దగ్గనీ డాక్టర్ల దగ్గరకి తోడకపోయి ఖర్చు పెడతానే వుంటారు గదా.  కనీసం వాళ్ళకైనా పుల్లతో తోమమని చెప్పండి సా' అన్నాను.

దానికి కరస్పాండెంటు రవీంద్రనాథరెడ్డి, 'సార్ మీ పద్ధతులన్నీ బాగానే వుండాయి.  కానీ అవన్నీ కుదిరేవి కాదు సార్.  చూడు, వీడు పేస్టుకి డబ్బు తీస్కొని మా పిల్లల చేత వేప్పుల్లల్తో తోమిస్తున్నాడని పేరెంట్స్ రచ్చకు దిగతారు సార్.  అస్సలు రైతులే ఇప్పుడెవురూ పుల్లల్తో పొండ్లు తోమడం లేదు. బ్రష్షుతో తోమతుండారు. అవన్నీ వొదిలిపెట్టి మీరు సిలబస్సు పూర్తి చెయ్యండి సార్' అని ఆయన నన్ను కుయ్యో మర్రో మంటానే నా నోటి నిండికీ గడ్డి పెట్టినాడు.



**1**996 నవంబరు నెల్లో తులసీకి లెక్కలు చెప్పడం మొదలు బెట్టాను. ఆయమ్మి తొమ్మిదో తరగతిలో వుంది గదా (ఇస్కూలికి నిలిపేసినా సరే), ఎనిమిదో తరగతి అంతా ఇస్కూలికి పొయ్యింది గదా, ఏడు పబ్లిక్ పాసయ్యింది గదా అని చెప్పి ఆ పిల్లను Algebra కు సంబంధించి మూడు సూత్రాలడిగినా.

$(a+b)^2$, $(a-b)^2$, $(a+b)(a-b)$ లకు సూత్రాలడిగినా.

$(a+b)^2$ అంటే $a^2$, $b^2$, 2ab అనీ, (మధ్యలో ప్లస్‌లు ఎగరగొట్టేసింది) $(a-b)^2$ అంటే $a^2b^2–2ab$ అనీ, $(a+b)(a-b)$ అంటే ఇట్లనే ఏదో నోటికొచ్చింది చెప్పింది. నాకు బయం గానీ... కోపం గానీ కలగలా.

లేడికి లేచిందే పరుగన్నట్టు నేనింత దూరం ఆ పిల్లను అడిగినందుకు నాకే సిగ్గేసింది – ఇవన్నీ ఏడో తరగతిలోనే వున్నప్పటికీ.

ఇంక లాభం లేదని మూడు భాగహారాలు వేసిచ్చినా, అవి ఇవీ :

(1) 3) 312 (  (2) 7) 749 (  (3) 3) 331 (

ఆ పిల్లకు ఆ భాగహారాలు ఇచ్చి వెయ్యమనే సరికి వుక్రోషంతో ముక్కుల్లో నుంచి గాలి తన్నుకొచ్చి కాగితం పెరుక్కుని, 'వచ్చే సంవత్సరం టెన్త్ పబ్లిక్ రాయ

బోతుంటే నాకీ భాగహారాల్నిచ్చి వెయ్యమంటావా?' అన్నట్టు చిటికేసినంత సేపుట్లో వేసి నా మొహాన కొట్టింది.

ఆ పిల్ల చేసింది ఇట్లా :

(1) Ans :


```
3) 312 (14
   3
  ----
   12
   12
  ----
    0
  ----
```

(2) Ans :

```
7) 749 (17
   7
  ----
   49
   49
  ----
    0
  ----
```

(3) Ans :

```
3) 331 (11.33
   3
  ----
   3
   3
  ----
  10
   9
  ----
  10
   9
  ----
   1
  ----
```



ఆయమ్మి ఆన్సర్లు చూసేసరికి నాకు పిచ్చి కోపమొచ్చింది. కాల్తో చేత్తో కాల్తో చేత్తో తన్నేద్దామనిపించింది, ఆ పిల్లకు అన్ని సంవత్సరాలూ లెక్కలు చెప్పిన అయ్యవార్లను తన్నలేక. ఆన్సరు షీటు ఆ పిల్ల మొకాన కొట్టి వీధిలోకొచ్చి ఒకదాని మిందొకటి రెండు సిగరెట్లు తాగి, 'ఆ బిడ్డకు చదువు చెప్పే మార్గమెట్టరా తండ్రీ' అని దిగులు పడి, ఇంగ్లీషు మాత్రం ఆ పిల్లకు ఎనిమిదో తరగతిలో ఎబిసీడీలు తప్ప

ఏం వొచ్చి వుండింది, మనం ధైర్నం వొదలకూడదని నిమ్మళపడినాను. తులసీ ఆ ఆన్సర్లను చెక్ చేసుకొని, నా దగ్గరకొచ్చి, 'నీకన్నీ తప్పులుగానే వుంటాయిలే. ఏ సార్ కన్నా పోయి చూపిద్దాం పా వీటిని తప్పులంటారో ఏమో...' అని ఆ పిల్ల హద్దు మాలిన అజ్ఞానంతో నామింద తిరగబడింది.

నాకు నవ్వొచ్చి దాని గుండ్రటి మొకాన్ని రెండు చేతుల్లోకి తీస్కొని ముచ్చటగా ఆయమ్మి కండ్ల మిందా, నుదుటి మిందా, పాపిట్లో ముద్దులు బెట్టి 'ఈ తెలివి మీరిన లోకంలో నువ్వెట్ట బతకబోతావే అమాయకురాలా!' అన్నా.

ఇంతలోనే నాకొక ఆలోచన వొచ్చింది. ఏదన్నా ఒక ఇస్కూలికి పోయి ఇంక నలుగురు పిలకాయల్ని అడిగి చూద్దాం – అనిపించింది. మా పిలకాయలు చదివే ఇస్కూలికే పోదామనుకున్నాను గానీ, ఆ కరస్పాండెంట్‌కి నేనంటే బలే కోపం. తులసీని తొమ్మిదిలో ఇస్కూలికి నిలిపెయ్యడం, ఇంకా దీపుకీ, టామ్ సాయర్‌కి ఫీజుల్ని పదీ పదైదు రోజులు లేటు చెయ్యడం, ఆయన దృష్టిలో నేనొక 'వరస్ట్ పేరెంట్'ని.

అందుకని చెప్పి ఆ ఇస్కూలికి పది బారల దూరంలో వున్న సోక్రటీస్ స్కూలికి పోయి ఆ కరస్పాండెంటు దగ్గిర కూచున్నా, చెప్పినాను గదా – మా పక్కింట్లో వాళ్ళ చెల్లి వుంటింది. అప్పడప్పుడూ ఆయన రావడం, అట్లా ఆయనతో నాకు ముఖ పరిచయం వుండాది. ఇదంతా ఆయన స్కూల్లో నేను చేరక ముందటి కత.

నేను సోక్రటీస్ కరెస్పాండెంటు రవీంద్రనాథరెడ్డితో, 'సార్, మీ స్కూల్లో మీరు క్లవర్లు అనుకునే పిలకాయల్ని – ఏడులో ఒకర్నీ, ఎనిమిదిలో ఒకర్నీ, తొమ్మిదిలో ఒకర్నీ, పదిలో ఒకర్నీ పిలవండి. వాళ్ళకి లెక్కల్లో చిన్న టెస్ట్ పెడతా. నేను పెట్టే టెస్ట్‌కి ముందే ప్రిపేర్ అయ్యుండాల్సిన పన్లేదు' అన్నా.

ఆయన వెంటనే నలుగురు పిలకాయల్ని రప్పించినాడు. తులసీకి ఏ భాగహారాలైతే ఇచ్చినానో అందరికీ అవే ఇచ్చినా, ఏం మార్చకుండా, తులసీకి ఎట్టయితే కోపమొచ్చిందో వాళ్ళగ్గూడా అట్టనే కోపాలొచ్చినాయి. చిటికేసినంత సేపుట్లో అందురూ ఆన్సర్ షీట్లు ఇచ్చేసినారు – 'ఇది పోయి ఒక టెస్టా? ఎంత టైం వేస్టూ' అన్నట్టు. ఆన్సర్ షీట్లు చూసినాక నాకు బలే కుశాల కలిగింది. ఎందుకంటే, అందురూ తప్పులే యేసినారు. తులసీ ఎట్టయితే తప్పులేసిందో అట్లనే, అదే రూట్‌లో ఆ నలుగురూ తప్పులేసినారు. హమ్మ, నా బిడ్డ మాదిరే వీళ్ళూ మొద్దులే. అందురు పిలకాయలూ ఇట్లనే వుండారు.

నేరుగా తులసీ దగ్గరకొచ్చి, 'తులసీ! లెక్కల విషయంలో ఢిల్లీతో పోట్లాడదాం. నువ్వు నా మింద వొదిలేసి రెండు రోజులు టామ్ సాయర్ పుస్తకం మళ్ళా ఒకసారి చదూకోని నవ్వుకో. దిగులేం లేదు' అన్నా.

ఆ తర్వాత ఆ పిల్ల పదో తరగతి చేరేదాకా ఆ పిల్లని లెక్కల్లో ఒక దోవలో పెట్టి నేను ఇస్కూల్లో పార్ట్‌టైం అయ్యవారిగా చేరినా.

చేరిన మొదుటి రోజున అన్ని క్లాసుల్లో కూడా నేను లెక్కల పుస్తకాలను చేత్తో తాకలా, కనీసం చాక్‌పీసును కూడా ఎడం చేత్తోనైనా తాకలా.

ప్రతి క్లాసులో 'లెక్కల్లో బాగా పూర్‌గా ఉన్నవాళ్ళూ, లెక్కలంటే భయంగా వుండే వాళ్ళూ చేతులెత్తండీ' అంటే ఒకరిద్దరు తప్ప మిగతా అందురూ 'నువ్వు ముందా నేను ముందా' అని చేతులెత్తేసినారు.

తొలి పాఠంగా వాళ్ళకు నేను చెప్పిందిదీ :

'ఒక రైతు వుంటాడు. ఆయనకు రెండు ఎద్దులుంటాయి. వాటికి బారెడేసి కొమ్ములు బలే కూసుగా వుంటాయి. అవి పొడుస్తాయి గదాని రైతు వాటి జోలికి పోకుండా వుంటాడా? ఒక వేళ పొడిచే ఎద్దులైనా... పొడిచినా... వాటికి నీళ్ళు తాపీ, తవుడు పెట్టీ... మచ్చిక చేసుకుంటాడు గదా. ఎద్దుల అఱ్రుల మీద కాడిమాను పెట్టి మడక దున్ని భూమిని పండించి పెళ్ళాం బిడ్డలను పోషించుకుంటాడు గదా. మరి, లెక్కలకు కొమ్ములున్నాయా?'

'లేవు సా' క్లాసులో వుండే ప్రతి పిల్లా, పిలగాడూ అరిచి అరిచి చెప్పినారు.

'మ్మరి, కొమ్ములున్న ఎద్దులకే రైతు బయపడనప్పుడు కొమ్ముల్లేని లెక్కలకు మనం ఎందుకు బయపడాలి? వాటి మెడలు వొంచుదాం. ఇప్పుడు చెప్పండి... లెక్కలంటే బయపడతారా?' అనడిగినా.

'భయపడం సా భయపడం సా' అని అందురూ ధైర్యంగా అన్నారు.

'అయితే లెక్కలు చెప్పేటప్పుడు కథలు చెప్పినట్లు శ్రద్ధగా, ఆసక్తిగా వినాలి. శ్రద్ధ, ఆసక్తి వుంటే లెక్కలు ఎగురుకుంటూ వొస్తాయి' అన్నాను మళ్ళీ.

'నేను తీసుకు రమ్మనే దాకా లెక్కల పుస్తకాలు తీసుకోని రాకండీ!' అనేసి ఆ రోజు పాఠం ముగించినాను.

వీడెవుడ్రా, క్లాసుకు టెక్ట్సు బుక్కే తీసుకు రావద్దంటాడూ – అన్నట్టు ఇచ్చిత్రంగా చూసినారు పిలకాయలంతా.

రెండో రోజు కూడా అన్ని క్లాసులకూ ఒకే పాఠం.

'లెక్కలంటే మామూలుగా Arithmetic అనీ, Algebra అనీ Geometry అనీ ఓయమ్మో ఏదేదో అనుకుంటారు. లెక్కలంటే నాలుగే నాలుగు. అవి కూడికలూ, తీసివేతలూ, గుణకారాలూ, భాగహారాలూ! అంతే. ఆ నాలుగూ తెలిస్తే లెక్కలు మనకొచ్చేసినట్టే. ఇవి తెలవని వాళ్ళు ఎవురన్నా వుండార్రా!' అనడిగి చూసినా.

'అందరికీ వొచ్చేసు సా. చిన్నప్పుడెప్పుడో నేర్చుకునేసినాం సా' అన్నారు.

'అయితే పది లెక్కలిస్తా వెయ్యండి' అని పది లెక్కలిచ్చినా. నేనిచ్చినవి ఇవీ:

(1) 3 – 4 (2) $^3/_4$ – $^1/_2$ (3) 3) 312 (

(4) 11) 1111 ( (5) 1 ÷ $^1/_2$ (6) $^1/_2$ ÷ 2

(7) 3 + 2 × 5 (8) 5 + 5 ÷ 5 + 5 (9) 3) 331 (

(10) 101 × 101

ఒక్క ఏడో తరగతి పిలకాయలే గాదు ఎనిమిదీ, తొమ్మిదీ, పదో తరగతి పిలకాయలు కూడా తప్పులే యేసినారు. అందర్నీ దూర దూరంగా కూచ్చోపెట్టలేదు కూడా. ఆ నాలుగు క్లాసుల వాళ్ళు కూడా ఒకటో లెక్కా, మూడో లెక్కా, నాలుగో లెక్కా, పదో లెక్కా కరెక్ట్‌గా వేసినోళ్ళను లెక్క పెట్టాలంటే చేతివేళ్ళు చాలా ఎక్కువ.

ఆ తర్వాత ఈ పది లెక్కలూ మా జిల్లాలోనూ, హైదరాబాద్ వొచ్చినాక పెద్ద పెద్ద స్కూళ్ళలో చదివే మహరాజుల పిలకాయలక్కూడా ఇచ్చినాను. కనీసం నేను 1500 మంది పిలకాయలకు ఈ Test పెట్టుంటాను. వీళ్ళలో వొక్కరంటే వొక్కరు కూడా ఏడో లెక్కనూ, ఎనిమిదో లెక్కనూ, తొమ్మిదో లెక్కనూ వెయ్యలేదు.

3 – 4 లెక్కకు నూటికి 90 మంది సమాధానం ఒకటనే.

ముందు బోర్డు మింద 3 – 4 = అని రాసినాను.

'మూడులో నాలుగు పోతుందా రా?' అని అడిగితే 'పోదు' అన్నారు.

ఇద్దరు ముగ్గురు తెలివైన పిలకాయలు, 'పక్క స్థానంలో నుంచి ఒకట్ని తీసుకోవాలంటే లేదు గద సా. అందుకనీ...' అన్నారు. అందుకని జవాబు ఒకటైందన్న మాట ఆ అమాయక చక్రవర్తులకి.

వాళ్ళకు కొరకరాని కొయ్యగా వున్న ఈ తీసివేత గురించి నేనిట్టా చెప్పినా. సెవెన్త్‌లో శ్రీలేఖ అనే అమ్మాయినీ, అరుణ అనే అమ్మాయినీ లేపి పిలకాయల కెదురుగా నిల్చోబెట్టినా.

'శ్రీలేఖ ఏం చేసిందంటే నాలుగు రూపాయలు అరుణ దగ్గిర అప్పు చేసి మహారాజా చాక్లెట్లు కొనుక్కోని తినేసింది – ఆ మరసట్రోజు శ్రీ లేఖ మూడు రూపాయలు తెచ్చి అరుణకిచ్చింది. అరుణకి శ్రీ లేఖ ఇంకా ఎంత బాకీ వుంది?' అనడిగినా.

'రూపాయి సార్' అని ఉత్సాహంగా నోరు తెరిచి అరిచినారు.

'మూడులో నుంచి నాలుగు పోవడం అంటే ఇదే. మన దగ్గర వున్న దాన్ని మనం ప్లస్ అంటాం. వేరొకరికి ఇవ్వాల్సిందాన్ని మైనస్ అంటాం. రెండు రూపాయలు చేతిలో వుందీ, ఫ్రెండ్‌కి మూడివ్వాలి. మిగతా రూపాయీ తర్వాత ఇస్తాం రా అని చెప్పేసి వున్న రెండూ ఇస్తాం కదా. ఇదన్నమాట. ఇంతకంటే బ్రహ్మ పదార్థం ఏం లేదు దీంట్లో. ఇంకెప్పుడూ కూడా చిన్న సంఖ్యలో నుంచి పెద్ద సంఖ్యను తియ్యాల్సొస్తే పెద్ద సంఖ్యలో నుంచి చిన్న సంఖ్యను తీసేసి ఆన్సర్ చెప్పెయ్య కూడదు. పెద్ద సంఖ్యలో నుంచి చిన్న సంఖ్యను తీసి ఆ వొచ్చిందానికి మైనస్ చేరిస్తేనే అది కరెక్ట్ ఆన్సరవుతుంది. అర్థమైందా నాన్నా!' అర్థమైంది. ప్రాక్టీసు కోసం అలాంటి లెక్కల్ని పది ఇచ్చాను. ఆట మాదిరిగా ప్రతీ దానికీ మైనస్ చేర్చి చూపించేశారు. రెండోరోజు పీరియడ్లూ ఇట్లానే గడిచాయి. మూడో రోజు కూడా పాఠం తీసివేతల మీదనే జరిగింది.

ఇవన్నీ నేను ఇంతకు ముందే తులసీకి చెప్పి చెప్పీ నేర్చుకుని వుండడం వల్ల సోక్రటీస్ స్కూల్లో నేనొక ప్లాన్ ప్రకారం చెప్పే వీలు కలిగింది. సహజంగా కూడినంత ఈజీగా తీసివేయలేం. కొంత మంది పిలకాయలైతే 16 లో ఏడు పోతే అనేది చెయ్యడానికి వేళ్ళ మధ్య పెన్సిలు పెట్టుకునీ, తర్వాత ఏడు వేళ్ళు తీసేసి మిగిలిన వేళ్ళను లెక్కబెట్టీ 9 అంటారు. ఇట్లా నానా అవస్థా పడతారు.

'చూడండి రా. చెప్తే తమాషాగా వుంటాది గానీ తీసివేతలు కూడా కూడికలే. నామాట అబద్ధమైతే చూడండి' అని బోర్డు మీద,


16

– 7

—

— అని వేసినా.

‘ఇప్పుడు మీరు 16 లో నుంచి 7 తీసెయ్యకూడదు. ఏడుకు ఎంత కలిపితే 16 అవుతుందో చూడాలి. మీ దగ్గర ఏడు చాక్లెట్లు వున్నాయనుకోండి. అవి పదహారు కావాలంటే మనం ఇంకా ఎన్ని కొనాలి? మూడు చాక్లెట్లు కొంటే పదవుతాయి. ఇంకో ఆరు కొంటే పదహారవుతాయి. మూడూ ఆరూ ఎంతా? తొమ్మిది కదా! ఇట్లా 9 చాకెట్లు కొంటే మన దగ్గర వున్న ఏడు చాక్లెట్లతో కలిసి 16 అయిపోతాయి. కాబట్టి 16 లో నుంచి ఏడు తీసేస్తే 9 అన్నమాట’ అని చెప్పినా.



పిలకాయలక్కూడా ‘నిజమే గదా పాపం’ అనిపించింది.

ఆ తర్వాత బోర్డు మీద

76

–38

—

— అని రాసినా.

'38 కి 40 వేశామనుకోండి. 78 అయి పోతుంది. మనకిక్కడ 76 కావాలి. కాబట్టి 30 వెయ్యండి. 68 అవుతుంది. మళ్ళ ఎనిమిది వెయ్యండి. డెబ్బైయ్యారు అయిపోతుంది. అంటే 38 కి ముప్పై ఎనిమిది వేస్తే 76 అయిపోతుంది. కాబట్టి 76 లో నుంచి 38 తీసేస్తే 38 అవుతుంది' అని చెప్పినా.

మళ్ళీ నేను బోర్డు మీద

776

-354


_____

_____ అని వేసినా.

'ఇక్కడ చూడండి. 354 కు నాలుగు వందలేస్తే 754 అవుతుంది గదా. మరో 22 వేస్తే 776 అయిపోతుంది. ఈ పద్ధతిని మీరు ప్రాక్టీసు చేస్తే చిన్న చిన్న తప్పులు చచ్చినా జరగవు. కాబట్టి ప్రతీ లెక్కనీ నోటి లెక్కగా వేసి చూడాలి. మీ అవ్వా తాతా కూడా ఈ పద్ధతినే పాటిస్తారు. తెలిసిందా? ఇది అర్థమై వుంటే రేపు ఇంటి దగ్గర ఇలాంటి తీసివేతలు పది పన్నెండు చేసుకుని రండి' అన్నాను. అందురూ చేసుకుని వచ్చినారు. నేను నోట్సులను చెక్ చెయ్యలేదు. ఈ పద్ధతి వల్ల పక్క స్థానాల సమస్యా, వేళ్ళ మధ్య పెన్సిళ్ళు పెట్టి ఒక్కొక్కటీ లెక్క బెట్టే సమస్యా వుండదు.

ఆ తర్వాత ఒక క్లాస్ పీరియడ్ అంతా గుణకారాలు చెప్పినాను. గుణకారాలంటే ఎక్కాలు బాగా రావాలి. 'ఎక్కాలెన్ని వొచ్చురా' అంటే ఇద్దరు ముగ్గురు కూడా 20 ల వరకూ ఎక్కాలు రావన్నారు. కొంత మంది పిలకాయలకు ఎక్కాలు కంఠతా పెట్టాలంటే పెద్ద సమస్య. అనవసరం కూడా.

'ఎక్కాలు రాని పిలకాయలకు నేనొక ఈజీ మార్గం చెబ్తా వినండి. 18×12 తో మనకు పని పడిందనుకోండి. 12 ని పదిగా, రెండుగా విడగొట్టండి. పద్దెనిమిది పదుల 180 గదా. పద్దెనిమిది రెండ్లు ముప్పైయ్యారు గదా. 180 కి 36 కలపండి. నోటితోనే కలపండి. చేతులు పెట్టకండి. 180 కి 30 వేస్తే 210. తర్వాత ఆరేస్తే 216 అవుతుంది. కాబట్టి పద్దెనిమిది పన్నెండ్ల 216 అన్నమాట. ఇక్కడ నేను పన్నెండుని పదిగా రెండుగా విడగొట్టానే గానీ ఏడుగా అయిదుగా ఎందుకు విడగొట్టలేదో చెప్పండీ' అనడిగినా.



వాళ్ళకేదో తెలిసినట్టే వుంది గానీ చెప్పలేక ఇబ్బంది పడుతున్నట్లు అనిపించింది.

'ఒకవేళ మనం తమాషాగా 12 ను ఏడుగా అయిదుగా విడగొట్టామనుకోండి మనక్కావలసింది పద్దెనిమిది పన్నెండ్ల కదా. అంటే 18 ఏళ్ళ ఎంతో లెక్కపెట్టి, ఆ తర్వాత పద్దెనిమిది ఐదుల లెక్కపెట్టి రెంటినీ కలపాలి. దేన్నైనా పదితో గుణించడం ఈజీ గదా. అంటే సున్న గల అంకెతో గుణించడం నీళ్ళు తాగినంత సుళువు. పద్దెనిమిది ఏళ్ళ అంటే కొంత కష్టం. పద్దెనిమిది పదులా అంటే రెప్ప మూసినంతలో 180 అనవచ్చు. అందుకన్న మాట.'

వాళ్ళకిప్పుడు వివరంగా అర్థమైంది. ఆ తర్వాత ప్రతీ క్లాసుకూ భిన్నాల తీసివేత చెప్పించడం మొదలుపెట్టాను.

ఒక పిలగాణ్ని లేపి,

$^3/_4 - ^1/2$ అని బోర్డు మీద రాసి తీసివెయ్యమన్నాను. వాడు ఇట్లా చేసినాడు, నా దగ్గిర్నుంచి చాక్ పీసు పెరుక్కుని.

$$\frac{3}{4} - \frac{1}{2} = \frac{3-1}{4-2} = \frac{2}{2} = 1$$

అనేసి బోర్డు మీద నిమిషంలో వేసి నాకల్లా గర్వంగా చూసినాడు. ఇద్దురు ముగ్గురు పిలకాయలు నవ్వినారు. చానా మంది పిలకాయలకు ఆ ఇద్దరు ముగ్గురు ఎందుకు నవ్వినారో తెలవక వాళ్ళూ నవ్వినారు.

ముందు నవ్విన పిలకాయల్లో ఒకడు 'ఒరే ఎల్‌సిఎం తియ్యరా వెధవా!' అన్నాడు. అప్పుడు బోర్డు దగ్గర నిలబడ్డ పిల్లవాడు నాలిక కొరుక్కొని 'ఎల్‌సిఎం తియ్యాల సా' అన్నాడు. 'తియ్' అన్నాను నేను.

వాడు ఇట్లా ఎల్‌సిఎం తీసినాడు.

$$\begin{array}{r|l} 2 & 4,\ 2 \\ \hline 2 & 2,\ 1 \\ \hline & 1,\ 1 \end{array}$$

తర్వాత మళ్ళీ $2 \times 2 \times 1 \times 1 = 4$ అని వేసినాడు.

వాడికి తర్వాత ఏం చెయ్యాలో అర్థంగాక దిక్కులు చూస్తా వుంటే ఒకడు పైకి లేచి 'నేను చేస్తా సా' అంటా బోర్డు దగ్గరికొచ్చి కరక్టుగానే చేసినాడు.

ఆ కరెక్టుగా చేసిన వాడికి నేను మళ్ళీ ఒక లెక్క ఇచ్చినా. అది ఇదీ :

$$\frac{7}{6} - \frac{5}{18}$$

వాడుగూడా దూకుడుగా చాక్ పీసు తీసుకోని, తీసుకున్నోడు తీసుకున్నట్టే 6 కీ, 18 కీ ఎల్‌సిఎం కట్టే దానికి పూనుకున్నాడు. మొత్తానికి చెమటలు పట్టించుకుని వాడు ఆ లెక్కను చెయ్యగలిగినాడు. వాడే ఆ క్లాసుకు ఫస్ట్ అంట. ఈ భిన్నాల లెక్కలో ముందు లెక్క చూద్దాం.

$$\frac{3}{4} - \frac{1}{2}$$

చిత్తూరు జిల్లాలో పావలాను కాలు రూపాయి అనీ, ముప్పావలాను ముక్కాలనీ అంటారు. అది బిడ్డలకు కూడా తెలుసు. పై లెక్కకు సంబంధించి నేను శివ అనే వాణ్ణి పైకి లేపి, 'శివాకి వాళ్ళ తాత ముక్కాలు రూపాయి ఇచ్చినాడు. వాడు దాంట్లో అర్ధ రూపాయికి చాక్లెట్టు కొనుక్కున్నాడు. ఇంకెంతుంటుంది వాడి చేతిలో...?' అనడిగినా.

ప్రతి ఒక్కరూ అన్నారు. 'కాలు రూపాయి సా.'

నేనన్నా 'మరెందుకు సా, ఈ బొచ్చులో లెక్కనిస్తే ఎల్‌సిఎం కట్టడం?'

అందురూ నవ్వినారు.

'తల్లి కడుపులో బిడ్డ వున్నప్పుడు ఆ బిడ్డకు ఆహారం ఎట్లరా?' అనడిగినా.

పిలకాయలందురూ ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు.

'అంటే మన అమ్మ గర్భంగా వున్నప్పుడు అమ్మ తింటే కడుపులో వున్న మన చెల్లో, తమ్ముడో తిన్నట్టే గదా' అన్నాను.

'మ్మరి, నేనిచ్చిన లెక్క

$\frac{3}{4} - \frac{1}{2}$ కదా.

నాలుగులోనే రెండున్నప్పుడు నాలుక్కీ, రెండుకీ ఎల్‌సిఎం అన్ని గీతలు గీసి కట్టాల్సిన ఖర్మ మనకేమి? అస్సలిది నోటి లెక్క. నా చెయ్యి బోర్డు మింద వుండంగానే ఆన్సర్ చెప్పెయ్యొద్దా?' అన్నా.

అదే రకంగా,

$^{7}/_{6}$ – $^{5}/_{18}$ లో కూడా 18 లోనే 6 ఉన్నప్పుడు ఆరుకీ, 18 కీ ఎల్‌సిఎం 18 కదా! ఆ మాత్రం దానికి ఎల్‌సిఎం కట్టడం ఎందుకూ?' – అని చెప్పుకొచ్చినా.

నిజ్జమేననిపించింది వాళ్ళకీ.

తర్వాత మూడు భిన్నాల్ని కూడడం కానీ, తీసెయ్యడం కానీ చేసి చూపించినా.

$^{3}/_{4}$ + $^{1}/_{2}$ + $^{7}/_{8}$ లెక్క ఇచ్చారనుకోండి. ఇక్కడ ఎల్‌సిఎం ఎంతరా? అనడిగితే క్లవరన్న వినయ్ కుమార్‌రెడ్డి టకీమని 'ఎనిమిది సా' అని చెప్పినాడు.

'ఎందుకు ఎనిమిదో, ఎల్‌సిఎం ఎందుకు కట్టాల్సిన పనిలేదో పిలకాయ లందరికీ చెప్పు చూద్దాం ...' అనే సరికి వాడు ఇట్లా చెప్పినాడు.

'ఈ లెక్కలో పెద్ద అంకె వొచ్చి 8. ఈ ఎనిమిదిలోనే రెండూ, నాలుగూ వుండాయి కాబట్టి దీనికి ఎల్‌సిఎం లెక్క గట్టకుండా వెయ్యాలి' అన్నాడు.

'ఏదీ వెయ్' అన్నా.

వాడు చాక్ పీస్ అందుకొని కరెక్టుగా చేసి చూపించినాడు.

నేను వాణ్ణి కూర్చోమనకుండా మళ్ళీ ఒక లెక్క ఇచ్చి చెయ్యమన్నా. ఆ లెక్క ఇదీ.

$^3/_4$ + $^7/_8$ + $^6/_7$

వాడు స్పీడుగా 4, 8, 7 లకు ఎల్‌సిఎం తియ్యడానికి గీత గీసినాడు.

'ఆగరా నాయినా! ఈ లెక్కలో ఎల్‌సిఎం కట్టాల్సిందేనంటావా?' అనడిగినా.

'Denominators మూడు అంకెలు ఉన్నాయి గద సార్' అన్నాడు.

'నిజమే. మూడంకెలు వున్నా వాటిలో రెండంకెలొచ్చి నాలుగూ, ఎనిమిదీ. 8 లోనే 4 వుంది గదా. కాబట్టి ఈ లెక్కలో 8 కీ 7 కీ ఎల్‌సిఎం కట్టేస్తే సరిపోతుంది. ఒక సరి సంఖ్యకీ, ఒక బేసి సంఖ్యకీ ఎల్‌సిఎం ఎలా కడతాం? ఆ రెంటినీ Multiply చెయ్యాల్సిందే. చేస్తే ఎంతా? 56. ఎల్‌సిఎం యాభైయ్యారే. ఇంక మామూలే' అని చెప్తే పిలకాయలకు బాగా అర్థమైంది. ఇట్లా రెండు మూడు రోజులు – వాళ్ళంతట వాళ్ళే భిన్నాల్ని కూడమనీ, తీసెయ్యమనీ చెప్పినాను.

ఇంతలో ఒకడు పైకి లేచి 'సార్ సుధహో వాళ్ళ స్కూల్లో అప్పుడే త్రీ చాప్టర్స్ అయిపొయ్‌నాయి సా. మీరేమో ఇంకా పుస్తకమే తెరవలేదు సా' అని వాడు నామింద నవ్వతా ఒక బాంబు వేసినాడు.




**నే**ను 'సిలబస్' జోలికే పోవడం లేదని ఒక పక్క చిన్న విమర్శ బైలుదేరినా నేను పట్టించుకోలా. పిలకాయలకు కూడికల మిందా, తీసివేతల మిందా, గుణకారాల మిందా, భాగహారాల మిందా సరైన అవగాహన లేందే వాళ్ళకు లెక్కలు నిజ్జంగా రావు – అనే దీంతో ఆయా తరగతుల సిలబస్‌లోకి నేను పోలా. (పదో తరగతి వాళ్ళకు పబ్లిక్ పరీక్షలు గాబట్టి వాళ్ళకు మాత్రం పాఠాలు చెప్తానే మధ్యన వీటి గురించి గొంతు చించుకోని చెప్పేవోణ్ణి).

నేను పిలకాయలకిచ్చిన పేపర్‌లోని లెక్కలన్నింటినీ ఎట్లా చెయ్యాలి అనేది చెప్తావుండా గదా. ఇప్పటికి రెండు కొొచ్చిన్ల గురించి చెప్పినా. ఇప్పుడు మూడో కొశిన్‌లోకి వద్దాం.

(3) 3) 312 (

ఇది చేసేటప్పుడు దీన్నే బోర్డు మింద వేసి ఒకణ్ణి పైకి లేపినా. వాడు మామూలుగానే మొదటి స్టెప్‌లో

3) 312 (1<br>
    3<br>
  ——

అని వేసి రెండో స్టెప్‌లో 12 ను ఒకేసారి కిందికి దించి ఇట్లా –

```
3) 312 (14
   3
  ----
    12
    12
   ----
     0
   ----
```

వేసినాడు.

ఈ లెక్కను ఈ రకంగా తప్పుగా వేసిన వాడితో, 'చూడు నాయినా! నీకు ఒక చెల్లీ, ఒక తమ్ముడూ వున్నారనుకుందాం. నీతో సహా మీరు ముగ్గురయ్యారు గదా. మీ నాన్న నీకు 312 రూపాయలిచ్చి – నిన్నూ, చెల్లినీ, మీ తమ్ముణ్ణీ సమానంగా పంచుకోమన్నాడనుకో. నువ్వొక్కొక్కరికీ ఎంతేసి పంచుతావు' అనడిగినా.

లెక్కను డబ్బుతో ఇచ్చి, నోటితో వెయ్యమనే సరికి వాడిలో వాడే కొంచెం సేపు మల్లగుల్లాలు పడి కడకు, 'ఒక్కొక్కరికీ 104 రూపాయలు వొస్తింది సా' అనేసి అన్నాడు.

'మ్మరి, నోటితో కరెక్టుగా చెప్పిన లెక్కను చేత్తో వెయ్యలేక పోతివి గదరా. ఇప్పుడీ లెక్కను చేత్తో ఎట్లా చెయ్యాలో చెప్తా చూడండి.' అని వాణ్ణి కూచ్చోబెట్టి చెప్పినా.

3) 312 (

**ఒకటో స్టెప్ :**

```
3) 312 (1
   3
  ----
```

**రెండో స్టెప్ :**

కొంతమంది 1 ని దించేటప్పుడు గీత కొట్టాక 3 కింద వేస్తున్నారు. అది తప్పు.

3 లో 3 పోతే సున్నా కదా. దాన్ని మనం వెయ్యం. మీరు చేసే తప్పు ఎట్లా ఉంటుందంటే ——

```
3) 312 (1
   3
  ___
   1
  ___
```

అని 3 పక్కన వున్న 1 ని ఇట్లా దించుతున్నారు. అట్లా దించకూడదు. ఇట్టా దించాలి.

```
3) 312 (1
   3
  ___
    1
  ___
```

**మూడో స్టెప్ :**

```
3) 312 (1
   3
  ___
    1
```

1 లో 3 పోదు. కాబట్టి రెండుకూడా దించుకోవాల. అట్టా దించుకోవాలంటే పైన కుడిచెవిలో వున్న 1 పక్కన సున్నా పెట్టాల. ఇప్పుడు ఎట్టా వుంటాదో చూడండి.

```
3) 312 (10
   3
  ___
    12
```

మూడు నాలుగుల పన్నెండు కాబట్టీ పది పక్కన 4 వేస్తాం.

```
3) 312 (104
   3
  ___
    12
    12
   ___
     0
   ___
```

'నోటి లెక్కను చేత్తో చేస్తే ఇంత తతంగం వుండాది. నోటితో మనం ఏది పడితే అది మాట్లాడేస్తాం గదా. ఆ మాట్లాడిందంతా చేతల్తో రాసేటప్పుడు నిదానించి

రాయాల గదా. ఇదీ అంతే. అర్థమైందా కొండలూ!' అని ఒకటికి పది మాట్లు వివరంగా చెప్పినాను.

ఇట్లా సున్నా పెట్టి వెయ్యాల్సిన లెక్కల్ని పది వెయ్యమన్నాను. రెండు మూడు రోజుల్లో అందరూ నేర్చుకునేసినారు.

నా క్వశ్చన్ పేపర్‌లో నాలుగో లెక్క.

11 ) 1111 ( ను అందురూ నేను చెప్పకనే కరెక్టుగా వేసినారు.

నేనిచ్చిన క్వశ్చన్ పేపర్‌లో అసలు సిసలు భాగహారం లెక్క ఇంకొకటి మిగిలి పొయ్యింది.

అది తొమ్మిదోది.

3) 331 (

ఈ లెక్కను మీరు పదో తరగతిలోగా వున్న మీ బిడ్డలకిచ్చి చూడండి. వాళ్ళు తులసి వేసినట్టే వేస్తారు.

ఒక వేళ ఎవడైనా ఇట్లా వెయ్యొచ్చు.

```
3) 331 (110
   3
  ---
   31
   30
  ---
    1
  ---
```

రెండో స్టెప్‌లో తప్పుడు అలవాటులో భాగంగా 31 నీ ఒకేసారి దించేసి మూడు పదుల 30 అని వెయ్యొచ్చు.

అది లెక్క తెలిసి వెయ్యడం గాక, తప్పుడు తనంగా చెయ్యబోయి 'కరెక్టు'గా పొరబడడం అన్నమాట.

ఇలా వేసిన పిలగాడికి మళ్ళీ మనం

11) 1111 (

వేసి ఇస్తే వాడు దీన్ని తప్పు చేసి గమ్మునుండి పోతాడు. ప్రతి క్లాసుకూ ఈ 331 ని 3 తో భాగించే లెక్కను వాళ్ళకు ఖచ్చితంగా అర్థమయ్యేటట్టు చెప్పడానికి నాకు నాలుగు పీరియడ్లు అవసరమయినాయి.

దీన్ని నేను చానా నిదానంగా ఇట్లా చెప్పుకొచ్చినాను.

**ఒకటో స్టెప్ :**

```
3) 331 (1
   3
  ----
```

**రెండో స్టెప్ :**

```
3) 331 (11.
   3
   ----
     3
     3
    ----
      10
    ----
```

ఇక్కడి కొచ్చే సరికి ప్రతి పిలగాడూ ఏమనుకుంటున్నారంటే – ఒకటిని దించుకుని ఆ ఒకటి మూడు కంటే చిన్నది గాబట్టి ఇంక పాయింట్ పెట్టేసి, ఆ దిగిన ఒకటి పక్కన ఇట్లా సున్నా పెట్టేస్తున్నారు. ఇది తప్పని వాళ్ళకు చెప్పాల. అర్థమయ్యేటట్లు చెప్పాల.

ముందు ఈ పద్ధతి తప్పు అని చెప్పడానికి నేనింకో లెక్క ఇచ్చినా.

అది ఇదీ :

2) 21 (   దీన్ని వెయ్యమన్నాను. ఒకడొచ్చి ఇట్లా చేసినాడు.

2) 21 (1.5
2
———
10
10
———
0
———

అప్పుడు నేను చెప్పినాను.

'వీడు భలే జూటాలాగా వున్నాడు. వొరి దొంగ వెధవ అన్నమాట. వీడి నాన్న వీడికి 21 రూపాయలిచ్చి – వీడి చెల్లినీ, వీణ్ణీ పంచుకొమ్మంటే వీడేమో ఈ రకం భాగహారం చేసి చెల్లికి వన్ అండ్ హాఫ్ ఇచ్చేసి మిగిలింది వీడు గప్‌చుప్‌గా కొట్టేశాడు' అంటే పిలకాయలంతా ఓ అని నవ్వడం.

'21ని 2తో భాగించేటప్పుడు నోటితో భాగిస్తే పదిన్నర వస్తుంది. అదే చేత్తో భాగిస్తే వన్ అండ్ హాఫ్ వొస్తోంది. ఎందుకిట్లా వస్తుందో చూద్దాం' అని చెప్పు కొచ్చినా.

కొందరు పిలకాయలు ఏదో గుడ్డివాటంగా 21 నీ ఒకేసారి దించి, రెండో ఎక్కం చెప్పుకుని, రెండు పదుల దగ్గిర ఆగి,

2) 21 (10
20
———
1
———

ఇట్లా కరెక్ట్‌గా వేస్తారు.

కానీ నూటికి 90 మంది పిలకాయలు మాత్రం తప్పే వేస్తారు!

ఇప్పుడీ లెక్క చేద్దాం.

2) 21 (

**ఫస్ట్ స్టెప్ :** 2 ) 21 (1

```
2
---
 1
```

ఈ ఒకటి మనకు ఎక్కణ్ణుంచి వొచ్చింది? ఇక్కడ భాగించబడేది అంటే విభాజ్యము (dividend) 21లో నుంచి తీసుకున్నాం – ఈ ఒక్కటిని.

ఇప్పుడు మీకు గందరగోళంగా వుండొొచ్చు. శేషానికి, విభాజ్యంలో నుంచి దించుకున్న దానికీ మనకు తేడా తెలియక పోతే తప్పులు చేస్తాం. శేషం అంటే ఏందో చూద్దాం.

2) 23 (

ఈ లెక్కను ఎట్లా చేస్తాం?

```
2) 23 (11
   2
  ---
    3
    2
   ---
     1
   ---
```

ఇక్కడ చివర మిగిలింది ఒక్కటి. ఇదీ శేషం. ఇది విభాజ్యంలో నుంచి దిగింది కాదు. ఇంక ఈ లెక్కలో దించుకోవడానికేం లేదు. చివర శేషం మాత్రం మిగిలింది. ఇప్పుడు మనం భాగ ఫలం 11 పక్కన పాయింట్ పెట్టినాక శేషం ఒకటి పక్కన సున్నా పెడతాం.

కాబట్టి విభాజ్యంలో నుంచి దిగిన దాన్ని శేషం అని పొరబడకూడదు. ఇప్పుడు మళ్ళీ

2) 21 (     లెక్క కొద్దాం

```
2) 21 ( 1
   2
  ---
    1
```

కింద గీత గీసి వేసిన ఒకటి ఏంది? శేషం కాదు. విభాజ్యంలో నుంచి దిగింది.

ఈ ఒక్కటిని ఇప్పుడు మనం శేషం చెయ్యాలి. భాగఫలం పక్కన సున్నా పెడితే ఈ విభాజ్యము నుంచి దిగిన ఒకటి కాస్తా శేషమై పోతుంది. ఇట్లా –


```
2 ) 21 (10
    2
   ___
     1
```

ఈ ఒక్కటి ఇప్పుడు శేషం. మనం భాగఫలంలో సున్నా చేర్చినాం కాబట్టి అదిప్పుడు శేషమైంది.

శేషం వొచ్చిందీ, ఇక దించుకోవడానికి విభాజ్యంలో ఏ అంకే లేదు, కాబట్టి ఇప్పుడు పాయింట్ పెడతాం.

ఇప్పుడు మీరేం తెలుసుకున్నారు? విభాజ్యంలో నుంచి దిగిన చివరి అంకెని శేషం అనుకుంటే కొంప కొల్లేరే.

ఇప్పుడు మళ్ళా మనం 331 ని 3 తో భాగించడం ఎట్లాగో తెలుసుకుందాం.



**ఒకటో స్టెప్ :**

3) 331 (1

3

---

**రెండో స్టెప్ :**

3) 331 (11

3

---

3

3

---

1

**మూడో స్టెప్ :**

ఇక్కడ దిగిన 1 ని మనం శేషం అనుకుంటే ఏమవుతుందీ? పక్కన పాయింట్ పెట్టేసి తప్పు చేస్తాం. కాబట్టి ఈ ఒకటిని శేషం అనుకోం. దాన్ని శేషం చేస్తాం. ఎట్లా – భాగ ఫలం పక్కన సున్నా పెట్టి, అగ్గో ఇట్లా –

3) 331 ( 110

3

---

3

3

---

1

**నాలుగో స్టెప్ :**

అగో, ఇప్పుడీ 1 శేషమైంది. ఇక దించుకోవడానికి విభాజ్యంలో ఏం లేవు. కాబట్టి నూటపది పక్కన పాయింట్ పెట్టి చేస్తాం.

మీరు ఇంతకు ముందు 331 ని 3 తో ఇట్లా భాగించే వాళ్ళు :

```
3) 331 ( 11.33
   3
   ───
    3
    3
    ───
     10
      9
     ───
      10
       9
      ───
       1
```

దీనికిప్పుడు భాగహారం సూత్రాన్ని అప్లై చేయ్యండి.

భాగహార సూత్రం అంటే విభాజ్యము = విభాజకము × భాగఫలము + శేషము

331 = 11.33 × 3 + 1

= 33.99 + 1 = 34.99

చూసినారా? ఎంత తప్పుడు లెక్కో! 331 ఎక్కడా?

34 ఎక్కడా?

ఇప్పుడు మనం మళ్ళీ 331 ని 3 తో భాగిద్దాం.

```
3) 331 (110
    3
   ───
     3
     3
    ───
      1
```

| | | |
|---|---|---|
| విభాజ్యము | = | 331 |
| విభాజకము | = | 3 |
| భాగఫలము | = | 110 |
| శేషము | = | 1 |

ఇక్కడ భాగహార సూత్రం అప్లై చెయ్యండి.

విభాజకము × భాగఫలము = 3 × 110 = 330

శేషము = 1. రెంటినీ కూడితే 330 + 1 = 331. ఇప్పుడు మన లెక్క కరెక్ట్ అన్నమాట.

ఇంక క్వశ్చన్ పేపర్‌లో అయిదో లెక్క చూద్దాం. $1 \div {}^1/_2$

ఒక పిలగాణ్ణి ఈ లెక్కను వెయ్యమంటే

$$\frac{1}{\frac{1}{2}}$$

అని వేసి కింద రెండు పైకి పోయి ఆన్సర్ 2 అవుతుంది సార్ – అన్నాడు.

'కింద రెండు పైకి ఎందుకు పోతుందిరా' అంటే, 'అదంతే సా. రెండు బైలొచ్చి మూడంకెలు ఒక దానికింద ఒకటుంటే అప్పుడు అన్నింటి కంటే కింద నుండేది పైకి పోతుంది' అన్నాడు. చూడండి గుడ్డి వాటాలు ఎట్టుంటాయో!

అయితే ఆరో లెక్క ${}^1/_2 \div 2$ వెయ్ అంటే

దీన్ని కూడా వాడు

$$\frac{\frac{1}{2}}{2}$$

అని వేసి, కింద రెండు పైకి పోతుంది గదా అనుకొని ${}^1/_2 \times 2 = 1$ అని వేసినాడు.

'ఏమిరా సగం చాక్లెట్టును ఇద్దరికి పంచితే చెరొక చాక్లెట్టు వస్తుందా?' అనడిగితే ఒకరి మొకాలొకరు చూసుకున్నారు.

నేను అయిదో లెక్కనూ, ఆరో లెక్కనూ వివరించే దానికి పెట్టుకున్నా.

(5) $1 \div {}^1/_2$

మనం మామూలుగా చెవులేసి దీన్ని భాగిద్దాం. ${}^1/_2$ ) 1 (

**ఫస్ట్ స్టెప్ నోటితో :** అర్ధ ఒకట్ల అర్ధ.

**రెండో స్టెప్ నోటితో :** అర్ధ రెండ్ల ఒకటి. రెండు అర్ధ రూపాయలు ఒక రూపాయి కదా. అదన్న మాట. పిలకాయలు వేసినట్టు డివైడెడ్ బైలు వేస్తే

$$\begin{array}{c}1\\ \hline 1\\ \hline 2\end{array}$$

ఇట్లా రెండు గీతలూ సమానంగా గీస్తే ఏమి జరుగుతుందో తెలవదు.

ఇక్కడ ఒకటిని $1/_2$ భాగిస్తా వుంది.

కాబట్టి ఒకటి కింద పెద్ద గీత గీయాలి. ఇట్లా : $$\dfrac{1}{\frac{1}{2}}$$

ఇట్లాంటప్పుడు మాత్రమే కింది రెండు పైకి పోతుంది. ఇది గుర్తు పెట్టుకోండి.

ఇట్లా మనం గీతల్లో తేడా లేకుండా చేసినామంటే ఆరో లెక్కను కూడా తప్పు చేస్తాం. అయిదో లెక్క మీరు పొరపాటుగానే ఆన్సర్ రైటు చెప్పినారు.

అదే మంత్రం ఆరో లెక్క కాడికి వచ్చేసరికి తప్పయిపొయ్యింది.

ఇప్పుడు ఆరో లెక్కకు వద్దాం.

ఇక్కడ $1/_2$ ను 2 భాగిస్తా వుంది. అంటే $1/_2$ కింద పెద్ద గీత రావాలి.

ఇట్లా : $$\dfrac{\frac{1}{2}}{2}$$

పై లెక్కలో మాదిరిగా ఇక్కడ కింద వుండే రెండు పైకి అంటే లవంలోకి వెళ్ళదు. అది హారంలోనే వుంటుంది.

కాబట్టి మూడంకెలు ఒకదాని కింద ఒకటొచ్చినప్పుడు దేన్ని ఏది భాగిస్తోందో తెలుసుకోవాలి.

$$\frac{\frac{1}{2}}{2} = {}^{1}/_{2} \times {}^{1}/_{2} = {}^{1}/_{4}$$

డివైడెడ్ బై ని తిరగేసి ఇంటూ చేసినప్పుడు హారంలో వున్న 2 ని కూడా తిరగేసి $^{1}/_{2}$ చెయ్యాలన్న మాట.

ఇంక ఏడో లెక్కకు వద్దాం :

3 + 2 × 5

ప్రతీ ఒక్కరూ ఈ లెక్కను ముందు మూటినీ రెంటినీ కూడేసి వొచ్చిన అయిదును అయిదుతో గుణించి 25 అనే చెప్పినారు. అది తప్పు. పిలకాయలకు ఆర్ధమయ్యే విధంగా ఇట్లా చెప్పుకొచ్చినాను. ముందు వాళ్ళకు లెక్కల్లో బ్రాకెట్లకు వుండే ప్రాధాన్యత దీని గుండా బలే చెప్పొచ్చు.

(3+2) × 5 వేరూ,

3 + 2 × 5 వేరూ, అని చెప్పినాను. ఎందుకంటే పై దాంట్లో బ్రాకెట్ వుంది. కింది దాంట్లో లేదు. పై దాంట్లో ముందు మనం బ్రాకెట్లో ఏమి వుందో చూస్తాం. మూడునీ, రెండునీ కూడమని వుంది. అయిదు అయింది. దీన్ని అయిదుతో గుణించమన్నాడు. ఆన్సర్ 25.

బ్రాకెట్ లేని కింది లెక్కలో మూడునీ, రెండునీ కూడా 5 తో గుణించమన లేదు. మొదట రెండును మాత్రమే అయిదుతో గుణించండి అన్నాడు. అంతేగానీ 3 ని కూడా గుణించ మనలేదు. కాబట్టి ముందు మనం రెండుని అయిదుతో గుణిస్తాం. పది వస్తుంది. ఆ తర్వాత 3 ని కూడతాం. 13 వస్తుంది. అదీ మర్మం. ఇదే రకంగా ఎనిమిదో లెక్కకు రండి.

5 + 5 ÷ 5 + 5. ఈ లెక్కను చెప్పే ముందు చిన్న కత.

కెమిస్ట్రీ ప్రొఫెసరుగా రిటైరైన ఒకాయన, హైద్రాబాద్ వచ్చి వుండి నాకు కనిపించినాడు. నేనాయన్ను నిజ్జంగా మేధావి అనుకుని 'మీ రిటైర్డు ప్రొఫెసర్లంతా చిన్న పిల్లకాయలకు ఏదన్నా చెయ్యాల సా. బిడ్డలు చదువుకో లేకా, అయ్యవార్లు సరిగ్గా చెప్పలేకా నరకం అనుభవిస్తా వుండారు. పదో తరగతికి వొచ్చిన పిలకాయలకు 1,500 మందికి ఈ లెక్క ఇచ్చి వుంటాను. చెయ్యలేకపోయినారు. మన పిలకాయలకు Basics అస్సలు రావడం లేదు' అనేసి ఈ లెక్క వేసి ఇచ్చినా.

ఆయన ఈ లెక్కను ఎడమ కంటితో చూసి పది బై పది = ఒకటి. అంతే గదా – అనే సరికి నాకు నోట్లో తేమ లేకుండా పొయ్యింది.

'ఇంకొక్క సారి చూడండి సా' అన్నాను వినయంగా. ఆయన, 'ఎన్ని సార్లు చూసినా ఇంతే' అన్నాడు. నాకు కొంచిం ధైర్యమొచ్చి, 'దాని ఆన్సరు 11' అని చెప్పినా

ఆయన 30, 35 ఏండ్ల సర్వీసులో కెమిస్ట్రీలో వొచ్చే దొబ్బుమాలిన లెక్కలు ఏమి చెప్పినాడో గానీ నేనాయన్ని పిలగాడి కింద లెక్కగట్టి ఇట్లా చెప్పినా.

'5 + 5 ÷ 5 + 5 కదా లెక్క. దీన్ని ఫస్ట్ స్టెప్‌లో 5 + 5/5 + 5 అని వేసుకోవాలి. నెక్ట్స్ స్టెప్‌లో 5 + 1 + 5 అవుతుది! మొత్తం 11.

(5 +5) ÷ (5 + 5)

ఇట్లా బ్రాకెట్లు వేసి వుంటేనే ఆన్సరు ఒకటి అవుతుంది అని చెప్పినా.

పిలకాయలకు ఎట్లయితే అర్ధమైందో ఆ ప్రొఫెసరుకు కూడా అట్లాగే అర్ధమైంది.


# రుద్దడం కంటే నోటకర్పే మేలు



పక్కపేజీలో వున్న ఈ లెక్కల్ని చేసింది ఎవరు? హైద్రాబాద్‌లో టీచరుగా పని చేస్తున్న ఒకామె అంటే నమ్మతారా? ఏదైనా ఒక సమీకరణంలో బ్రాకెట్లు వచ్చినప్పుడు ముందు బ్రాకెట్లనూ, ఆ తర్వాత భాగహారాలనూ, గుణకారాలనూ, కూడికలనూ, తీసివేతలనూ చెయ్యాలి. దీన్ని లెక్కల్లో Bodmas Theorem అంటారు. దీన్ని పిలకాయలకు చెప్పించమని అయిదో తరగతి లెక్కల సిలబస్‌లోనే వుండాది. పోనీ పాపం, ఈ సిద్ధాంతం గురించి ఆమెకు తెలవదనుకుందాం. నెలకు 20, 25 వేల రూపాయల జీతం తీసుకున్న యూనివర్సిటీ ప్రొఫెసరే పొరబాటు పడినాడు గదా. ఈమె దేముందిలే– అనే అనుకుందాం. రెండో లెక్కా, అయిదో లెక్కా చెయ్యలేక పోయిందనే బాధే మనకు వొద్దులెండి.


ఒకటో లెక్క ఎంత అన్యాయంగా చేసిందో చూడండి. మూడునీ, ఒకట్నీ యారో మార్కుల్ని పెట్టి మరీ దించింది. ఈమె కొచ్చిన భాగఫలం 11. శేషం ఒకటి.

ఇందులో మూడో లెక్క. ఆమె కసలు అర్థమే కాక నన్నడిగింది, 'ఇదేమిటి సార్!' అని.



నేనిచ్చింది పాయింట్ వన్‌ని రెండుతో భాగించమని. ఆమె అట్లా అడిగేసరికి 'ఒకట్ని రెండుతో భాగించండి' – అన్నాను. 'ఏమో సార్, నేను లెక్కల్లో పూర్' అనేసి దానికి తప్పుడు ఆన్సర్ కూడా వెయ్యలేక విడిచి పెట్టేసింది.


ఈమెకి 30, 35 ఏండ్లుంటాయి. ఎమ్మే బి.ఇడి. చదివిందంట.




(పాపం ఈమె నేను ఆంధ్రజ్యోతి వీక్లీ ఎడిటర్‌గా వుంటే రెండు కథలు నా చేతికిచ్చి పోదామని వచ్చింది. గవర్నమెంటులో టీచరుగా చేస్తున్నట్టు చెప్పేసరికి ఇంక నా పిచ్చి ఆమె మీద రుద్దితే జరిగిందిదీ!)



ఈ బి.ఇడి, చదువులు ఎంత అన్యాయంగా అయిపొయ్‌నాయంటే – ఏదో ఒక రకంగా డిగ్రీ పాసై ఏం చెయ్యాలో తెలీకుండా వాడు వీధులు తిరగతా వుంటే వాడితో అందురూ, 'ఎందుకు రా ఖాళీగా వుండేది– బిఈడీ చేసెయ్యక పోయినావా?' అంటారు. వాడు బిఈడీ చేసేస్తాడు. బీఈడీ అనేది అత్త కూతురి మాదిరిగా తయారైంది. వొకడికి 25 ఏండ్లు మించతా వుంటాయి. కట్నం కోసరం లోకమంతా తిరగతా వుంటాడు. ఎవురూ పిల్ల నివ్వరనుకోండి. అప్పుడు వీడు ముదిరిపోయిన బెండకాయ అయిపొయ్ వుంటాడు. అప్పుడు వీడి తల్లి దండ్రులు, 'ఎందుకురా పిల్ల కోసం చెప్పులరిగేటట్లు తిరిగేది? అత్త కూతురు వుండాది గదా చేసుకో' అంటారు.





ఏ వుజ్జోగం రాకపోతే, ఈ బిఈడీని అడ్డం పెట్టుకోని టీచరై పోవడం!

మూడో తరగతిలో, నాలుగో తరగతిలో వొచ్చే చిన్న చిన్న భాగహారాలకు సంబంధించి టీచర్లే ఇన్ని తప్పులు చేస్తుంటే ఇంక పిలకాయల కత ఎట్టుంటాది?

అంకెలకు సంబంధించి అయ్యవార్లకే ఇట్లుంటే ఇంక పిలకాయలకు ఆల్జీబ్రాకు సంబంధించి ఎన్ని డౌట్లుంటాయి? వాటిని ఎంతగా విప్పరించి చెప్తే పిలకాయలు అర్థం చేసుకుంటారో చూడండి.

$x + x$ ఎంత అంటే తొమ్మిదీ, పదీ చదివే పిలకాయలు కూడా $x^2$ అన్న వాళ్ళు వుండారు. $x$ అనంగానే పిలకాయలకు అదేందోగా వుంటాది.

'ఎక్స్ అంటే ఏం లేదురా, ఒక వంకాయి అనుకోండి. అంతే, అంతకంటే ఏం లేదు. ఒక వంకాయకు ఇంకో వంకాయ చేరిస్తే ఎంతవుతుంది? రెండు వంకాయలు గదా. కాబట్టి $x + x$ వొచ్చి $2x$ అవుతుంది' అని చెప్తే పిలకాయలకు 'ఓస్ ఇంతేనా' అనిపించేస్తుంది.

ఆల్జీబ్రా అనేది పిలకాయలకు ఆరో తరగతిలో వొస్తింది.

$$3x + \left\{(x - y - \overline{2x - y})\right\}$$

ఇట్లాంటి లెక్కలు కూడా వాళ్ళ పుస్తకంలో వుండాయి.

కాబట్టి ఆల్జీబ్రాలో బ్రాకెట్లు ఎట్లా వెయ్యాలి. వాటిని ఎట్లా తొలగించాలి. మైనస్ వొచ్చినప్పుడు ఎట్లా గుణించాలి అని అంటి పొండు వొలిచి నోట్లో పెట్టినట్టు చెప్పాలి. పిలకాయలకు ఏ పరిస్థితుల్లో కూడా వీటిని Home work ఇచ్చెయ్య కూడదు. అందులోని Concepts మొత్తం చెప్పి వొదిలేసినా వాళ్ళకు బాగా అర్థమై పోతుంది.

పిలకాయలకు ఎంత న్యాయమైన డౌట్లు వుంటాయంటే–దీనికొక చిన్న కత.

సాయంకాలం మూడూ ముక్కాలుకొక రోజు ఇస్కూలు గంట కొట్టేసినారు. నాలుగున్నరకు మళ్ళీ ట్యూషను మొదలైంది. ప్రేయరు హాల్లో వరసలుగా కూర్చు న్నారు పిలకాయలు పుస్తకాలు చేత బట్టుకొని, ఆ మరసట్రోజు జి.కె. టెస్టు. ట్యూషను సార్ పిలకాయల చేత జి.కె. చదివిస్తుండాడు.

ఒక పాప – ఆరో తరగతిది – అవర్ గవర్నరీజ్ ఎస్సారై కె. కృష్ణకాంత్ – అనే దాన్ని అరిచి అరిచి కంఠస్తం పెడతా వుంది. ఎస్సారై కె కృష్ణకాంత్ ఎస్సారై కె కృష్ణకాంత్ – అనేది నోటబెట్టి రుబ్బుతా వుంది.

కొంచేపు తర్వాత ఆ పిల్ల దగ్గర వొప్ప చెప్పించుకునే దానికి ట్యూషను సార్ బెత్తంతో దగ్గిరికొచ్చి, 'అవర్ గవర్నరీజ్ చెప్పూ' అన్నాడు.

ట్యూషన్ సార్‌నీ, బెత్తాన్నీ చూసే సరికి ఆ పిల్ల కొంచిం వొణకతా, 'అవర్ గవర్నర్ ఈజ్ ఎస్సై ఆర్ కె కృష్ణకాంత్' అని చెప్పింది.

ఆ పిల్ల పాపిట్లో తిరుగులాడే పేను దెబ్బకు చచ్చేట్టుగా బెత్తం టపీ మనింది.

ఇంతకీ గవర్నర్ గారి గౌరవార్థం ఆయన పేరు ముందు పెట్టిన శ్రీ అనేది ఆ పిల్లకు తలకాడ గుండయ్యింది. శ్రీ అనేది ఆయన పేరులో లేదనీ, గౌరవ వాచక మనీ, అది వున్నా లేక పొయ్‌నా ఫర్వాలేదనీ, కె అనేది గవర్నర్ ఇంటి పేరనీ ఆ పిల్లకు తెల్దు. చెప్పేటోడు లేడు.

మనం చీమిడి చీదుకుని గుడ్డకు పూసుకునే వయసును మరచిపోతే బలే కష్టం. మనక్కూడా అప్పుడు ప్రతీదీ డౌటనీ – ఇప్పుడు తెలుసుకోక పోవడం బలే పాపం. కంఠతా పెట్టలేక ఆ పిల్లకు ఎంత గసో! ఇంక ఇస్కూలంటే సొంతంగా, కుశాలగా ఎట్లా వొచ్చి కూచ్చోగలుగుతుందీ?

ఈ కంఠస్తాలకు సంబంధించి ఇంకొక కత.

వాణి అని అయిదో తరగతి చదివేది. ఆ పిల్ల వాళ్ళ నాయనకు కరకంబాడి దగ్గిర అమర్ రాజా బ్యాటరీస్‌లో ఏదో వుజ్జోగం. ఒక రోజు నేను గబ గబా ఇస్కూలికి ప్రయాణమై వొస్తా వుంటే ఆ పిల్ల సిగ్గుతో , 'సాసా' అని పిలిచి, నా చేతి కొక కాగితం ఇచ్చి, 'పెద్ద సార్‌కిచ్చేయండి సా' అనింది.

నేను వొస్తా వొస్తా ఆ కాగితం చూస్తే అందులో వుండేదిదీ.

To
The Correspondent,
Socrates High School,
Bairagi Patteda, Tirupati.

Dear Sir,

I am suffering from Tirumala Hills. So, Please grant me one day leave.

Yours Sincerely,
K. Vani,
5th Class.

నేను రోడ్డు మింద పడి దొర్లి దొర్లీ నవ్వినాను.

లీవు లెటర్లను రాయడానికి అయ్యవార్లు, Suffering from fever, from head ache, from stomach ache అని application మాదిరిగా చెప్తా వుంటారు. ఆ పిల్ల Suffering దగ్గిరకొచ్చే సరికి Tirumala hills అని fill up చేసింది. ఆ రోజు ఆ పిల్ల – అమ్మా నాయినతో కొండకు పోతా వుంది. అదీ కత.

పేరుకు ఇంగ్లీషు మీడియం అని చదవతా వుంటారే గాని Vocabulary సున్నానే. Empire అంటే అర్తం తెల్దు, Emperor అంటే తెల్దు, Invasion అంటే తెల్దు. History పాఠాలు కంఠతా పెట్టేస్తుంటారు.

నేను లెక్కలయ్యవారిని గదా, నా దగ్గిరకొచ్చే సరికి నేను సోక్రటీసు స్కూల్లో బలే నిదానంగా చెప్పేది అలవాటు చేసుకున్నాను. దీంతో సిలబస్సు వెనకబడి పొయ్యింది. జనవరి నెల వొచ్చేసింది. ఒక పేరెంటు కోపంగా కరస్పాండెంటు దగ్గిర కొచ్చి, 'ఈ స్కూల్లో లెక్కలు చెప్పే వోడెవుడండీ' అనేసి అన్నాడొక రోజు.

కరస్పాండెంటు, 'ఈయన' అని నన్ను చూపించినాడు. ఆ వొచ్చినాయన నన్ను కొట్టలేదంతే. మిగతా అంతా చేసినాడు.

'నా కొడుకు తొమ్మిదో తరగతి చదవతా వుండాడు. ఈ రోజుటికి ఈ పెద్ద మనిషి – Text Book చూసిన పాపాన పోలేదంట. వీణ్ణి ఏం చేస్తే ఖర్మ తీరుతుంది?' అనేసి నా మొకాన ఎంగిలూంచ లేక కిటికీలో నుంచి అవతలికి వూంచినాడు.

ఆ తొమ్మిదో తరగతి చదివే పిలగాణ్ణి రమ్మన్నాను. ఆ పేరెంట్‌కూ, కరస్పాం డెంటుకూ ఇద్దరికీ లెక్కలు రావు. పేరెంటుకు మించిన అమాయక చక్రవర్తి సోక్రటీసు కరెస్పాంటెండ్ రవీంద్రనాథరెడ్డి. నేనేమని చెప్పేది?

'సార్ పిలకాయలకు త్రిభుజం, చతురస్రం, దీర్ఘ చతురస్రం అనేConcepts చెప్పాక వాటి మీద లెక్కలు చెప్తే కొంతయినా అర్తమవుతుంది. అసలు Concepts చెప్పకుండా నేరుగా ఏ క్లాసులోకి పోయి ఆ క్లాసు పుస్తకం చెప్తే వాళ్ళు అస్సలు ఫాలో కారు. వీణ్ణి చూడండి. కనీసం ఆరో తరగతి లెక్కల పుస్తకంలో వున్నవికూడా వీడికి తెలీవు. వీడికి తొమ్మిదో తరగతివి చెప్తే – నేను ఫ్రెంచి భాష మాట్లాడినట్లవు తుంది. క్లాసులో ఒకరిద్దరు కూడా సరిగా ఫాలో కాలేరు. ఆ ఒక్కరిద్దరి కోసం

మిగతా పిల్లలందర్నీ అన్యాయం చెయ్యలేను. తులసీకి ఈ మాదిరి Concepts అన్నీ చెప్పి చూశాను. ఇప్పుడు పదిలో ఫెయిలయ్యే ప్రసక్తే లేదు.'

ఆ పేరెంటు నా మాటలకు అడ్డం వొచ్చి, 'తులసీ ఎవురయ్యా మధ్యలో.. నీకు లెక్కలు తెలీక పోతే వెళ్ళిపో. అసలు నీకు కూడికలూ, తీసివేతలూ తప్ప సిలబస్ వొచ్చా?' అని బండబూతులు తిట్టినాడు.

కరెస్పాండెంటు ముండాకొడుకు రవీంద్రనాథరెడ్డి అభిప్రాయం కూడా దాదాపు అదే.

'సరే, సిలబస్ చెప్తా'

అంతే, ఆ రోజు నుంచి ఆ మూడు నెల్లూ నేరుగా క్లాసుల్లోకి పోవడం, బోర్డు మీద లెక్క చెప్పడం, వేసుకోమనడం, ఆ చాప్టరు హోం వర్కు ఇచ్చెయ్యడం.

ఇప్పుడు తులసీ దగ్గిర కొద్దాం.

జనవరి 15 వ తేదీ వొచ్చేసింది. తులసీ పదిలో చేరినాక నేనా పిల్లను పట్టించుకోలా, ఎంతసేపూ సోక్రటీసు పిలకాయలతోనే...

'త్రికోణమితి అయ్యిందా తులసీ!' అనడిగినా.

'ఎప్పుడో టపాసుల పండక్కే అయిపొయ్యింది' అనింది.

త్రికోణమితి బాగా రావాలంటే 8 సూత్రాలు టపా టపా రావాలి. ఆ ఎనిమిదింటినీ అడిగినా.

ఆ పిల్ల $1+\tan^2$ తీటా అనడిగితే $\mathrm{Cot}^2$ తీటా అని అనింది.

అది ఎంత తప్పంటే – మా నక్క నన్ను ముద్దు పెట్టుకుంది అని చెప్పినంత తప్పు.

ఇంకో సూత్రం అడిగినా, అదీ అంతే. అన్నీ ఒకదాని కొకటి. అమ్మను చూపించమంటే బొమ్మను చూపించడం. అత్తను చూపించమంటే దుత్తను చూపించడం... నాకు దుఃఖం వొచ్చేసింది.

'ఎంత వెధవ పని చేసినాను! అనవసరంగా సోక్రటీసు స్కూల్లో చేరి సొంత బిడ్డ చదువుని పట్టించుకోలేక పోయినాను. పదో తరగతి ఫెయిలై పోతుందేమోన'ని బయం పట్టుకునేసింది.

టెన్త్ క్లాసులో 12 చాప్టర్లు వుండాయి లెక్కల్లో. అన్ని సూత్రాలూ అడిగినాను. 30 శాతం చెప్పింది కానీ 70 శాతం ఒకదానికొకటి చెప్పింది. సూత్రాలు అట్లా ఎందుకొచ్చినాయో చెప్పకపోతే - బిడ్డలింత అమాయకంగానే వుంటారని చెప్పేసి నేరుగా ఆ పిల్ల చదివే ఇస్కూలికి పోయి కరస్పాండెంటుతో, 'సార్, మా పాప రేపట్నుంచి మీ స్కూలుకు రాదు. నేను అగచాట్లు పడి చెప్పించుకుంటా. మీకు ఫీజు మాత్రం కట్టేస్తా. దయ చేసి హాల్ టికెట్టు ఇవ్వకుండా చెయ్యకండి' అనేసి అన్నా.

'నువ్వు పోరా ముండ నా కొడకా' అన్నట్టు చూసి 'సరే లెండి' అన్నాడాయన.

ఆ రోజు నుంచి ఆంధ్రజ్యోతి, సోక్రటీసు స్కూలు, ఇంకా మిగిలిన టయంలో తులసీ.

టెన్త్ లెక్కల్లో కనీసం 300 సూత్రాలు ఉంటాయి. అవి అన్నిట్నీ పది రోజుల్లో– ఏ సూత్రం ఎందుకు ఎట్లా వొచ్చిందో చెప్పినా - పలకా బలపం ఎత్తుకుని, నిదానంగా. నేను సోక్రటీసు ఇస్కూల్లో పిలకాయలకు టెన్త్ చెప్తా గదా. ఏ లెక్కలో పిలకాయలు ఎట్లా పొరబాటు చేస్తారు, దాన్ని Correct గా ఎట్లా చెయ్యాలీ... ఇట్లా మొత్తం సూత్రాల వరకు చెప్పించి 'ఇంక చూస్కో లెక్కలు' అనేసి అన్నా.

దీంతో ఫిబ్రవరి పదో తేదీ వచ్చింది. ఫిజిక్సూ, కెమిస్ట్రీ పరిస్తితి కూడా ఇంతే. మొత్తం చెప్పించినా. ఇక్కడ మొత్తం చెప్పించినా - అంటే సిలబస్ ఏ టూ జెడ్ చెప్పించినానని గాదు. ఫిజిక్సు, కెమిస్ట్రీకి సంబంధించి వున్న అన్ని చాప్టర్ల లోని Key Concepts నీ, గుడ్డివాటం అనేది లేకుండా ప్రతీ సూత్రం అట్లాగే ఎందుకొచ్చిందీ అని చెప్పినా. దీంతో ఆ పిల్లకు గుడ్డి గుర్తులు లేకుండా తెలిసి పొయ్యింది. బాటనీ, జువాలజీ జోలికే పోలా. ఏదైనా కొంత వరకు చదువుకోమని అంతటితో సైన్స్ వొదిలేసినా.

Maps దగ్గిర పెట్టుకుని సాంఘిక శాస్త్రంలో ముఖ్యాంశాలన్నీ చెప్పించినా. 5 రోజులు సరిపోయింది. మార్చి 20 వచ్చేసింది. 27 నుంచి పరీక్షలు, టైము చాలక లెక్కల్లో సిద్ధాంతాల సెక్షన్ ఒకటుంది - జామెట్రీకి సంబంధించి. దాన్ని చాలా వివరంగా కనీసం పది రోజులు చెప్పాలి. టైం లేక వొదిలేసినా. ఆ సెక్షన్‌కు పది మార్కులు.

'పోతే పోనీ పది మార్కులు. 90 కి రాసి పాసవ్వు చాలు' అనేసి పుస్తకాలు మూసేసినా.

తులసి పరీక్షలు రాసింది. దాని కొచ్చిన మార్కులు ఇవీ :

తెలుగు – 81, ఇంగ్లీషు – 71, హిందీ – 60, లెక్కలు – 85, సైన్స్ – 78, సోషల్ – 78. మొత్తానికి 75 శాతం దాకా.

ఇంక సోక్రటీసు పిలకాయలు కూడా అందరూ టెన్త్ పాసే. వాళ్ళు ఏడు మంది. వాళ్ళకు 71, 67, 66, 52, 50, 48, 48.

మా ఇంటి దగ్గిర భార్గవ్ అని ఇంగొక పిలగాడు వుండేవోడు. వాళ్ళ నాయిన లిబియాలో డాక్టరు. ఆ పిలగాడు కొంచిం క్లవరు గూడా. వాడూ నా దగ్గరే చదువు కున్నాడు. వాడికైతే 97 మార్కులొచ్చినాయి లెక్కల్లో.

1998 లో లెక్కలు పేపరులో ఎక్కువ మంది ఫెయిలై పోతే గవర్నమెంటు లెక్కల్లో – ఫెయిలైన వాళ్ళకు 5 మార్కుల్ని కలిపింది కూడా ఆ ఏడాది. మరి, తులసీ చిన్నప్పట్నుంచి ఎట్ట చదివిందో మీరే చూసినారు గదా. ఆ పిల్లకు టెన్త్‌లో 75 శాతం ఎట్లా వొచ్చినట్టు?

అక్షర జ్ఞానం వున్న ఏ పిలగాణ్ణీ మొద్దు అని వొదిలీ కూడదు. ఏడో తరగతి పిలగాడికి రెండో తరగతి నుంచి మొదలు బెట్టి తమాసగా అన్నీ చెప్పుకొస్తే.... భాగహారాలు కూడా రాని పిలగాడికి అవేమీ చెప్పకుండా సిలబస్ చెప్తే వాడి నెత్తిన గుండేసినట్టే.

ఆరో తరగతిలో ఒక పిలగాడు వారం రోజులు జ్వరంతో స్కూలుకి రాలేదను కుందాం. ఆ వారంలో లెక్కల టీచరు ఆల్జీబ్రా చెప్పేసినాడనుకుందాం. ఆ తర్వాత వాడు ఏడు కొస్తాడు. ఏడులోని ఆల్జీబ్రా వాడికి మైండ్ గాభరానే గదా, మరి! ఇంక వాడు అప్పట్నుంచి లెక్కల్లో మొద్దు.

సిలబస్ అంతా పిలకాయల నెత్తిన రుద్దేసి చేతులు కడుక్కోవడం అంటే – బిడ్డల గొంతు మింద కాలేసి తొక్కడమే.

పిలకాయలకు హద్దు మాలిన సిలబస్ వుండాది. దాన్ని రూపొందించిన వాడికి బుద్ధి లేకపోయినా మనకు లేదా – అనుకోవాలి చెప్పే అయ్యవారు. పిల

కాయల స్తితిని బట్టి మాత్రమే వాళ్ళకు చెప్పాలి. ఏమీ తెలియని పిలకాయలకు ఏదేదో చెప్పి చదువంటే పీడ, బిత్తర ఎత్తించే బదులు – అవే పాఠాలకు సంబంధించిన వాటి పుట్టు పూర్వోత్తరాలు చెప్పడం మేలు.

బ్రహ్మానందరెడ్డి పాసు అనేది కూడా చాలా మంచిదనుకోవాలి. నిజంగా ఆయన జి. కె. నాయుడి తెలివితో ఈ పద్ధతిని పెట్టినట్టుండాడు. నా వుద్దేశం ఏమంటే – ఆరూ, ఎనిమిదీ, తొమ్మిది పాఠాలు చదవక పోయినా గట్టెక్కవచ్చు. కాబట్టి ఈ ఫెయిలు బాధ అనేది లేదు. ఆరో తరగతి వచ్చేసినా – ఆ పంతులమ్మ మాదిరిగా, ప్రొఫెసరు మాదిరిగా చిన్న లెక్క కూడా ఒక పిలగాడు చెయ్యలేక పోతా వుండాడనుకో, వాణ్ణి నిదానంగా డవలప్ చేసెయ్యవచ్చు. చూడ్రా నాయినా భాగహారాలు ఇట్లా చెయ్యాలి. సరాసరి లేక్కలంటే ఇవీ, పర్సెంటు అంటే అర్థం ఇదీ, ఇట్లా మనం పుస్తకాల్ని చూసి ఆ Concepts అన్నీ అర్థం చేసుకుని చెప్పేవొచ్చు. దీంతో వోడు లెక్కలే గాదు అన్నిట్లో చాతుర్యం చూపిస్తాడు.

అట్ట గాదనుకోండి. ఆరో తరగతి వాడికి – బొచ్చులో మూడో తరగతి నుంచి మొదులు పెట్టేదేంది? ఆరు నుంచే చెప్తాం అని మొండికి దిగి ఆరో తరగతి పుస్తకాలను ముందరేసుకున్నామనుకోండి.




ఆరో తరగతి సిలబస్‌లో ఏమేమి వుండాది అనే ముందు, సిలబస్ ఎన్నేసి పేజీలు వుండాదనేది చూద్దాం.

English-150 pages, English Non-detailed-170 Pages, Telugu -140 Pages, Telugu Non-detailed - 60 Pages, Hindi-70 Pages, Maths-416 Pages, Science-296 Pages, Social-316 Pages. Total : 1,618 Pages.

ఆరో తరగతి సిలబస్ తీస్కోని తమాషాగా లెక్కేస్తే 1618 పేజీలు అయినా యండీ. ఈ పదహారు వందలా పద్దెనిమిది పేజీల్ని పిలకాయలు చదవాల. అర్తం చేసుకోవాల. ఆరో తరగతి పిలకాయలు అంటే పదేండ్లు పూర్తయి పదకొండో సమ్మచ్చురం నడస్తా వుండే బుజ్జి కొండలు. ఈ తిరమల కొండలు 1618 పేజీలను చదివి నేర్చుకోవాల. అయ్యే పనేనా?

ఆంధ్రదేశంలో వుండే మేధావులు అనే నా కొడుకులు సమ్మచ్చరంలో కనీసం (నేర్చుకునే కత పక్కన పెడితే) 1618 పేజీలు తిరగేస్తారా? న్యూస్ పేపరొదిలేస్తే, మనమందరం సంవత్సరానికి 1618 పేజీలు తమాషాగానైనా చదివి అవతల పారేస్తున్నామా? కనీసం కథలూ, నవలలూ అయినా 150 పేజీల పుస్తకాలు సంవత్సరానికి పది చదువుతుండామా?

సడే. సిలబస్ ఎంత అనేదాన్ని ఇంక పక్కన పెట్టేసి – సిలబస్‌లో ఏం వుంది అనేది చూద్దాం.

పర్సెంట్ అంటే 1/100 అని కూడా తెలవని ఆరో తరగతి పిలకాయలకు లెక్కల్లో Percentages అనే Chapter కింద వున్న వొకానొక Exercise లో వాళ్ళకున్న లెక్క చూడండి.

A trader Purchased 1000 books at the rate of Rs. 5-40 per book and spent Rs.200 towards transportation. If he wants to earn a Profit 12½ Percent what Price should he sell each book.

ఇట్టాంటి లెక్కలు Exercise లో 21 వుండాయి.

పర్సెంట్ అంటే అదేందో అనుకొనే పిలకాయలకు ఈ లెక్కనెత్తి నేరుగా రుద్దితే – లెక్క అనేది వాడికి పీడ అవుతుందా, క్రీడ అవుతుందా?

Meter కీ, Square Meter కీ తేడా తెలియని అమాయక చక్రవర్తులకి నేరుగా సిలబస్ కంప్లీట్ చేసేసి రాష్ట్రపతి పతకం పొందదామని చెప్పి, వాళ్ళ కల్లా చూడకుండా, నేరుగా బోర్డు మీద వేసేస్తే ఈ లెక్కని?

The dimensions of a rectangular Plot of land are 65 m, and 25m. If the Cost of 1 Sq.m. of land is Rs. 50, what is the total cost of the land? What is the cost of fencing the land, if fencing 1 meter Costs Rs.22.

అది సా పరిస్తితి?

ఇంక ఆరో తరగతి సోషల్ సిలబస్ దగ్గిరి కొద్దాం.

ఆస్ట్రేలియా ఖండం, అక్కడి వాతావరణం, అక్కడి పంటలు, అక్కడ దొరికే Minerals, జనాభా... ఇట్లా మొత్తం వుండాది. ఈ ఖండం చాలక ఆఫ్రికా ఖండం కూడా. మళ్ళ యూరప్ ఖండం. ఇంక చరిత్ర, ఆర్థిక శాస్త్రంతో సహా అన్నీ వుండాయి.

ఈ పుస్తకాన్ని సిలబస్ ప్రకారం చదివి, యూనిట్ టెస్టుల్లో 25 కి 23 తెచ్చుకుని ఇప్పుడు తొమ్మిదో పదో చదివే పిలకాయల దగ్గిరికి పొయ్ – వాటి గురించి కాదు గదా ఆంధ్రా సరిహద్దులేవి అనడగండి, ఎంత మంది చెప్తారో చూడండీ!

మన చేతిలో అధికారం లేదు గానీ వుంటే ఒక చిన్న తమాషా చేద్దుం.

అదేమంటే – గుడ్డి వాటంగానూ, ఓ అని శ్రమ పడీ చదివేదే చదువు అని మనం నిరూపించాలి. ఈ ప్రయోగాన్ని నిరూపించడానికి మన ఆంధ్రాలో వున్న కనీసం వంద మంది ఐ.ఎ.ఎస్‌లనూ, ఐ.పి.ఎస్‌లనూ తీసుకుందాం. అంటే వాళ్ళు కనీసం డిగ్రీ చదివేసుంటారు గదా. పైగా వాళ్ళు అష్ట తెలివులూ కలిగి వుంటారు గదా. తెలివిలో వాళ్ళు కింగులు గదా.

టెన్త్ క్లాసు పరీక్షలు మార్చి 27 న అనుకుందాం. ఒక పెద్ద హాస్టల్ తీసుకుని మనం వంద మంది ఐ.ఎ.ఎస్, ఐ.పి.ఎస్‌లనూ మార్చి 20 వ తేదీ కంతా దాంట్లో పెట్టి టెన్త్ క్లాస్ సిలబస్ ఇచ్చేస్తాం.

'నాయినలారా! మీరెప్పుడో డిగ్రీ చదివేసిన వారు. ఐ.ఏ.ఎస్, కూడా పాసై పోయిన వారు. కాబట్టి ఇది మీకు నీళ్ళు తాగినంత సుళువే. మీరంతా ఈ వారం రోజులూ టెన్త్ క్లాస్ పుస్తకాలను ముందేసుకుని సిలబస్‌ను చూసుకోండి. పిలకాయల్తో పాటు మీకూ పరీక్ష వుంటుంది. శ్రద్ధగా చదువుకోండమ్మా! ఇందు కోసమే మిమ్మల్నంతా ఈ హాస్టల్లో పెట్నాం' అని అంటాం. మార్చి 27 న పరీక్షలు బిగినౌతాయి. మే నెల్లో రిజల్ట్స్ వస్తాయి.

ఈ వంద మంది ఐ.ఏ.ఎస్‌లూ, ఐ.పి.ఎస్‌లూ ఎంత మంది పాసవుతారో చూద్దామా? (కాపీ కొట్టకూడదు)

ఈ పిచ్చి నా కొడుకు ఆలోచనలన్నీ జరగవు గానీ జరిపి చూస్తే తెలుస్తుంది.

పదో తరగతి సిలబస్సు అంటే పెద్ద గగనం ఏమీ కాదు గదా. కనీసం లెక్కలకు సంబంధించి కూడా బేసిక్స్ గదా టచ్ అయి వుంటాయి.

మరి, అందరూ పాసవ లేదే! ఈ వంద మందిలో కనీసం ముప్పై మందికి లెక్కల్లో పాసు కావడానికి, నిక్కర్లు వేసి కనీసం మూడేండ్ల పాటు ఇస్కూలికి పంపాల్సి రావచ్చు. గుడ్డి వాటంగానే ఈ ఐ.ఏ.ఎస్, ఐ.పి.ఎస్ ల చదువు కూడా సాగిందన్న మాట. ఎప్పుడో పాసై పోయిన పదిని ఐ.ఏ.ఎస్ పాసయ్యాక కూడా, వారం రోజుల టైం ఇచ్చి మళ్ళీ పది పాస్ కమ్మంటే కాలేక పోతారు.


చదువుల్ని పిలకాయల నెత్తినేసి రుద్దితే – అది ఎంత కష్టంగా వుంటుందో మా టామ్ సాయర్‌ని చూడండి.

టామ్ సాయర్ ఫైన్‌తో ఫీజు కట్టడానికి నిన్ననే లాస్టు డేటు. నిన్ననే క్లాసు టీచరు చెప్పేసింది : 'రేపు కానీ ఫీజు కట్టక పోతే గోడ కుర్చీనే!'

మా వాడు ఆ రోజు స్కూలికి పొయ్‌నాడు. క్లాస్ టీచరు ఏవో పదాలు పలకలో రాసిచ్చి టామ్‌ని రుద్దమనింది. వీడు రుద్దతా వుండాడు. అక్షరాల మింద రుద్దడం ఎంత నస పని? టామ్‌కి రుద్దడం ఇష్టం లేదు. వీడు కొంచేపు చూసి, పైకి లేచి నిలబడి, 'మేడమ్ నేనీ రోజు గూడా ఫీజు తేలా. నాకు గోడ కుర్చీ యెయ్యండి' అనేసి అన్నాడు. అంతే. మేడమ్ నా బిడ్డకి గోడ కుర్చీ యేసింది.

మా టామ్ పలకా బలపం అక్కడ పారేసి దర్జాగా గోడ కుర్చీలో కూర్చుని...

# పిల్లల భాషలో Algebra



ప్రస్తుతం కుమార్ వయసు $x$ సంవత్సరాలు. మూడేళ్ళ తర్వాత కుమార్ వయసు ఎంత, అని అడగ్గానే ఏ పిల్లవాడైనా 3 నీ $x$ నీ గుణించుకుని $3x$ అంటాడు. అప్పుడు టీచరు, ప్రస్తుతం నీ వయసు 12 సంవత్సరాలు కదా. మూడేళ్ళ తర్వాత ఎంత అని అడిగాడనుకోండి. 12 నీ 3 నీ కూడుకుని 15 అంటాడు. నిమిషంలో పొరబాటును గ్రహించిన పిల్లవాడు కుమార్ వయసు మూడేళ్ళ తర్వాత $x + 3$ సంవత్సరాలు సార్ అని ఎగిరి గంతేసి చెప్తాడు.

# పెద్దలు చెయ్యాల్సింది ...

**మ**నం ఎంత అదృష్టవంతులమంటే – రేపు మార్చిలో మనమెవరం పదో తరగతి పరీక్షలు... అందునా లెక్కల పరీక్ష రాయబోవడం లేదు.

చదువు అంటే నీడన కూర్చుని చదివేది. కానీ, దానికి పిల్లలు ఎర్రని ఎండలో రైతు పడే కష్టం కంటే మించి పడుతున్నారు.

మన పెద్ద వాళ్లకు చూసి వాతలు పెట్టుకోవడమంటే ఇష్టం. ఎవరి పిల్లలో ఫస్ట్ ర్యాంకు తెచ్చుకుంటున్నారంటే ఆ పగ మన పిల్లల మీద తీర్చుకుంటాం.

అమెరికా అధ్యక్షుడికి ఒక అయిడియా వచ్చిందనుకోండి. అమెరికాలో వున్న బిల్డింగులన్నిట్నీ కూలగొట్టి – బోద గడ్డితో పూరి పాకలు వేయిస్తున్నారనే సమాచారం మనకి అందిందనుకోండి. ఇక అంతే, పిల్లల చేతి పుస్తకాల్ని పీకి అవతల పడేసి బోదగడ్డి చేతికిస్తాం, గురువులకు అప్పగిస్తాం. ఎలాగైనా సరే పిల్లల చేత పూరిపాక వేయిస్తాం.

కంప్యూటర్ ఇంజనీర్లకి మంచి గిరాకీ. ఇక అంతే. మన పిల్లందరికీ ఎమ్‌సెట్‌లో ర్యాంకులు వచ్చేయాలి.

పిల్లవాడికి ఏం వొచ్చో, ఏం రాదో మనకనవసరం. వాడు పది పాసైతే చాలు, వాణ్ణి ఎంపీసిలో చేర్పించి చీటీ పాట పాడేసి ఫీజు కట్టేస్తాం. ర్యాంకు వేపు మెడ నిక్కించి చూస్తుంటాం.

వరి పైరు ఎన్నుకొచ్చాక యూరియా చల్లితే ప్రయోజనం ఏమిటి? పిల్లల్ని ఇంటర్‌లో చేర్చాక ఒక్క సారిగా వాణ్ణించి ఇంజనీర్‌నో, డాక్టర్‌నో పిండాలని ప్రయత్నిస్తాం.

డిగ్రీ చదివిన తల్లిదండ్రులు ఎవరైనా పదో తరగతి వరకూ వున్న లెక్కల పుస్తకాల్ని ఎడమ చేతితో కూడా తాకరు. వాడి ముందు కూర్చుని – బిడ్డ లెక్కల దగ్గిర, ఎందుకంత భయపడుతున్నాడో చూడరు. 'మా పిల్లాడు లెక్కల్లోనే *poor* అండీ' అని చాడీలు చెప్పడం మాత్రం చేస్తారు. డిగ్రీ చదివినా ఆరో తరగతి లెక్క కూడా చెయ్యలేరు.

డిగ్రీలు చదివిన తల్లిదండ్రులు స్కూటర్లూ, కార్లూ నడుపుతున్నారు గదా. ఆ మాత్రం శ్రద్ధ చిన్న పిల్లల లెక్కల పుస్తకాల మీద చూపిస్తే మనమూ లెక్కల్ని, అందునా

పిల్లలకు కొరకరాని కొయ్యగా వున్న *Algebra* నీ నేర్చుకోగలం. ఆరో తరగతీ, ఏడో తరగతీ చదివే పిల్లల్ని మనం గాడిలో పెట్టగలం. అప్పుడు 8 నుంచీ పిల్లలకు లెక్కలంటే మంచినీళ్ళ ప్రాయమై మొహాలు కళకళలాడుతాయి.

పదో తరగతిలో 90 శాతం మార్కులు తెచ్చుకోవాలన్నా, ఎమ్‌సెట్‌లో వెయ్యి కంటే తక్కువ ర్యాంకు తెచ్చుకోవాలన్నా రేయింబవళ్ళూ చదివి ఆపసోపాలు పడక్కర లేదు.

రంగనాయకమ్మ కొడుకొకడు కథలూ అవీ ఒక పక్కా, చదువొక పక్కా చదువుకుంటూ, ఆ ఉదయం పూట వాళ్ళమ్మకి పులిహోర చేసి పెట్టి పరీక్ష రాసొస్తే వాడికి వెయ్యి లోపు ర్యాంకు వచ్చిందట. ఎందుకంటే – వాళ్ళమ్మ వాడికి టెన్త్ క్లాసు లోపు *mathematics* కు సంబంధించిన *basics* అన్నీ చెప్పించింది. ఆమె డిగ్రీలేం చదవ లేదు.

ముందు ముందు ఎమ్‌సెట్ కోచింగ్ సెంటర్లకు లక్షలాది రూపాయలు పొయ్యకుండా మీ పిల్లలు అయిదో తరగతి చదివేటప్పుడే కొద్ది జాగ్రత్త తీసుకోండి. పిల్లల్ని లెక్కల టీచరు దగ్గరికి ట్యూషన్ పంపేసి ఫీజులు కట్టేస్తే సరిపోదు. ట్యూషన్ కూడా మళ్ళీ ఒక క్లాస్ రూం అవుతుంది.

ఆరో తరగతి నుంచీ పదో తరగతి దాకా చదివే మీ పిల్లలకి ఈ ప్రశ్న పత్రం ఇవ్వండి.

1) $5+2 \times 3 = ?$ (Ans : 11)
2) $3+3 \div 3+3 = ?$ (Ans : 7)
3) $(a+b)(a-b) = ?$ (Ans : $a^2 - b^2$)
4) $a^3 - b^3$ కి factors ఏవి?
   (Ans : $(a-b)$, $(a^2+ab+b^2)$)
5) $(a+b)\ a + b = ?$
   (Ans : $a^2 + ab+b$)

ఈ అయిదు ప్రశ్నలకూ 10 నిమిషాల్లో మీ పిల్లవాడు సమాధానాలు రాయలేక పోతే దయతో ఈ పుస్తకాన్ని చదివి చూడండి. మీరు ఎన్నో విషయాలు నేర్చుకుంటారు, మీ పిల్లలకి అన్నీ నేర్పించుకుంటారు.

# కూడికలూ – తీసివేతలూ

**పి**ల్లలకు *Algebra* ఆరో తరగతిలో వస్తుంది.

అప్పటి దాకా వాళ్ళకు లెక్కలంటే అంకెలతోనే. అంకెలతో లెక్కలు చెయ్యడం వాళ్ళకి అంతో యింతో వచ్చు కూడా.

కూడికలూ, తీసివేతలూ, గుణకారాలూ, భాగహారాలూ అన్నీ వచ్చే వుంటాయి. కొట్లో చిల్లరిచ్చి బలపాలూ, పెన్సిళ్ళూ కొనుక్కోని పిల్లలు వుండరు గదా. నిజానికి సైన్స్ విషయాలూ, సోషల్ విషయాల కంటే నిత్య జీవితంలో పిల్లలకి బాగా అనుభవంలోకి వచ్చేవి లెక్కలే.

పది రూపాయిలిచ్చి మూడు పెన్సిళ్ళూ, రెండు రబ్బర్లూ కొనుక్కు రమ్మంటే సరిగ్గా లెక్క కట్టుకొని కొట్టువాడి నుంచి చిల్లర రాబట్టుకుని ఆ మిగిలిన దాంతో చాక్లెట్లు తీసుకుని చప్పరించుకుంటూ వచ్చేస్తారు ఆ వయసు పిల్లలు.

కొట్టు వాడి దగ్గర మోసపోని ప్రతి పిల్లవాడూ క్లాసులో *Algebra* దగ్గరకు వచ్చేటప్పటికి భయపడి మోస పోతాడు.

ఆరో తరగతిలో టీచరు బోర్డు మీద *Algebra* అని రాసి పాఠం చెప్పబోతే ఊపిరి బిగబట్టేస్తారు.

టీచర్లు 3, 4 అంటూ అంకెలతో లెక్కలు చెప్పేటప్పుడు పిల్లవాడికి కొట్టులో వున్నంత సరదాగా వుంటుంది. అట్లాంటిది $x, y$ అంటూ చెప్పబోతే క్లాసులోకి పొడవ డానికి టీకాల వాడొచ్చినట్టు పిల్లలు బిగుసుకు పోతారు.

*Algebra* మీద ఒక దరిద్రపు సామెత లాంటిదుంది.*Algebra* గుండె గాభరా అని. ఆ మాట ప్రతీ పిల్లాడికి తెలిసిపోయి వుంటుంది. దెయ్యం అనేది లేక పోయినా అదంటే ఎంత భయమో ఇదీ అంతే.

*Algebra* మొదలవగానే లెక్కల టీచరుకీ, పిల్లలకీ క్రమంగా సంబంధం తెగి పోతుంది. లెక్కల టీచరు స్కూలుకు *Absent* అయితే ఒక పెద్ద జాతీయ నాయకుడు ఉన్నట్టుండి చచ్చిపోయినంత ఆనందం కలుగుతుంది పిల్లలకి.

ప్రతీ లెక్కల టీచరు కూడా ఈ *Algebra* పిల్లలకు చెప్పబోయే ముందు – నేను టీచర్‌ని – అన్న విషయం మరిచి పోవాలి. ఆరో తరగతిలో తొలిసారి ఈ *Algebra* పరిచయమయినప్పుడు ఆయనకెంత గాభరా కలిగిందో గుర్తుకు తెచ్చుకోవాలి.

ముందు *Algebra* అంటే ఏమిటో చెప్పాలి.

*Algebra* అంటే కూడా అంకెలతో మాదిరి లెక్కలే. ఇక్కడ అంకెలకు బదులు $a, b, c, d$ లూ, $x, y, z$ లూ వుంటాయి అంతే. ఉదాహరణకి కూడికలు తీసుకుందాం.

మూడు బలపాలూ 4 బలపాలూ కలిపితే ఏడు బలపాలవుతాయని పిల్లలందరికీ తెలిసిందే. అంటే $3 + 4 = 7$ బలపాలయ్యాయి.

తెలియని అంకెలని ఏదో ఒకటి అనుకోవాలి కాబట్టి $x, y$ లనుకుంటాం.

**ప్రసాద్ దగ్గర కొన్ని బలపాలున్నాయి. వాటికి మూడు బలపాలు కలిపితే ప్రసాద్ దగ్గర మొత్తం ఎన్ని బలపాలుంటాయి?**

**సమాధానం :** ప్రసాద్ దగ్గర ఎన్ని బలపాలున్నాయో మనకి తెలియవు. తెలియని వాటిని ఏదో ఒకటి అనుకోవాలి గదా. కాబట్టి $'x'$ బలపాలనుకుంటాం.

ప్రసాద్ దగ్గరున్న బలపాలు = $x$

కలిపిన బలపాలు = 3

మొత్తం బలపాలు = $x + 3$ అంతే.

అట్లాగే **ప్రసాద్ దగ్గరున్న బలపాల్లో నుంచి 3 తీసి పక్కన పెట్టేశామనుకోండి.**

**అప్పుడు ప్రసాద్ దగ్గరున్న బలపాలెన్ని?**

ప్రసాద్ దగ్గరున్న బలపాలు = $x$

పక్కన పెట్టేసిన బలపాలు = 3

మిగిలిన బలపాలు = $x - 3$

తీసి పక్కన పెట్టేశాం కాబట్టి – వచ్చింది.

కూడికలూ తీసివేతలూ అంటే ఈ మాత్రమేనా? ఇంకా ఎన్నో వున్నాయి.

మూడు గుర్రాలూ ఏడు గుర్రాలూ పది గుర్రాలు అవుతాయి కానీ... మూడు గుర్రాలూ ఏడు గాడిదలూ, పది గుర్రాలూ కావు, అట్లాగే పది గాడిదలూ కావు. ఎందుకంటే గుర్రాల్నీ, గాడిదల్నీ ఎట్లా ఒకటిగా లెక్కేస్తాం? కాబట్టి కూడికల్లో ఒకే జాతి వాటిని కలుపుతాం.

*Algebra* లో $3a$ నీ $4a$ నీ కూడాలనుకోండి. $a$ అంటే నిత్య జీవితంలో వుండే ఏదో ఒక వస్తువనుకుందాం. ఉదాహరణకి కుర్చీ అనుకుందాం. అప్పుడు $3a + 4a$ అనే లెక్క 3 కుర్చీల్నీ, 4 కుర్చీల్నీ కలిపితే ఎన్ని కుర్చీలవుతాయనే లెక్క అవుతుంది. ఏడు కుర్చీలవుతాయి. కాబట్టి $3a$ నీ, $4a$ నీ కలిపితే $7a$ అవుతుంది.

***3a* నీ *4a*² నీ లేదా *3a* నీ *4b* నీ కలిపితే ఎంత?**

ముందు $3a$ నీ $4a^2$ నీ కలిపే పని చూద్దాం. $a$, $a^2$ లు రెండూ ఒకటిగా కనబడ్డం లేదు. $a$ గొర్రె అయితే $a^2$ గొర్రె మాత్రం కాదు. మేక కావచ్చు. కాబట్టి 3 గొర్రెలూ, నాలుగు మేకలూ ఎన్ని? మూడు గొర్రెలూ నాలుగు మేకలే. అట్లాగే $3a$ నీ $4a^2$ నీ కలిపితే $3a + 4a^2$ అవుతుంది.

$3a$ నీ $4b$ నీ కలిపినా కూడా $3a + 4b$ నే అవుతుంది. ఇక్కడ మనం నేర్చుకునేది ఏమంటే ఒక జాతి వాటినే కూడవచ్చు. రెండు మూడు జాతులుగా వున్న వాటిని కూడేసి ఒక జాతిగా చెప్పలేం.

ఇంత విచిత్రంగా చెప్పక పోతే *Algebra* కష్టమే మరి.

ఆరో తరగతిలో ప్రభుత్వం అచ్చు వేసిన *Text Book* లో ఉదాహరణ లెక్కల్లో కూడికల కింద ఇచ్చిన ఒక లెక్కను చూద్దాం.

**సూక్ష్మీకరించండి : $6a + 5a - 3a$**

*Text Book* లో జవాబు అని ఇలా ఇచ్చారు :

**జవాబు :** $6a + 5a - 3a$

$= [6 + 5 + (-3)]\, a$

$= 8a$

ఇదే పద్ధతిని టీచరు ఫాలో అయితే వినే పిల్లలకి గందరగోళమే అవుతుంది. ఈ 2 *steps* లెక్కలో రెండు గందరగోళాలు వున్నాయి. ఆరో తరగతి చదివే విద్యార్థికి ఈ లెక్కల్లో *Square bracket, small bracket* రెండూ వచ్చాయి. మరి, ఈ వయసు పిల్లలకి *brackets* ప్రాధాన్యత అంతకు ముందే చెప్పి వున్నామా?

**ఈ లెక్కను పిల్లలకు చెప్పాల్సిన పద్ధతి :** $6a + 5a - 3a$

1*st step :* ఈ లెక్కలో అన్నీ *'a'* లే వున్నాయి. అంటే అన్నీ *like terms* అన్నమాట. *like terms* ను మనం కూడేసుకోవచ్చు.

2*nd step:* *a* అంటే ఒక పెన్సిలు అనుకున్నప్పుడు లెక్క– ఆరు పెన్సిళ్ళకు అయిదు పెన్సిళ్ళను కలిపి మూడిట్నీ తీసేయండి, అవుతుంది.

3*rd step:* ఆరు పెన్సిళ్ళూ, 5 పెన్సిళ్ళూ కలిపితే 11 పెన్సిళ్ళు. అందులో 3 తీసేస్తే 8 *pencils* మిగుల్తాయి.

4*th step:* $6a + 5a - 3a = 8a$

ఈ మార్గంలో చెప్తే చివరకు ఒకే స్టెప్పు మిగుల్తుంది. అది చివర్ది. మిగతా రెండు స్టెప్పులూ మనసులోనే వేసుకుంటారు.

ఇకపోతే ఆరో తరగతిలోనే వున్న ఇంకో లెక్క.

## $6c + 5d + 3c - 2d$

***Text Book* లో వున్న పద్ధతి.**

**జవాబు :** $6c + 5d + 3c - 2d$ *writing like terms together,*

$$= [6c + 3c] + [5d + (-2)d]$$

$$= [6 + 3]c + [5 + (-2)]d$$

$$= 9c + 3d$$

ఈ లెక్కను బోర్డు మీద నుంచి నోట్ పుస్తకంలో రాసుకోవడానికే పిల్లలు పాపం ఎన్ని అగచాట్లు పడతారో?

**చెప్పాల్సిన పద్ధతి :** $6c + 5d + 3c - 2d$

*1st Step:* $c$ ని పెన్సిలనీ, $d$ ని రబ్బరనీ అనుకుందాం. అప్పుడు లెక్క ఆరు పెన్సిళ్ళూ, అయిదు రబ్బర్లూ, మూడు పెన్సిళ్ళను కూడండి. తర్వాత 2 రబ్బర్లను తీసేయండి అవుతుంది.

*2nd Step:* ఒకే జాతి వాటిని వరసగా రాసుకుందాం. ఇందులో *like terms* ను పక్క పక్కన రాస్తే....

$6c + 3c + 5d – 2d$

*3rd Step:* ఆరు పెన్సిళ్ళూ మూడు పెన్సిళ్ళూ 9 పెన్సిళ్ళు. 5 రబ్బర్లలో 2 పోతే 3 రబ్బర్లూ. 9 పెన్సిళ్ళూ 3 రబ్బర్లూ వుంటాయి.

*3rd Step:* $6c + 3c + 5d – 2d$

$= 9c + 3d.$

ఎంత అమాయక చక్రవర్తి అయినా నోటితో చెప్పే లెక్క ఇది.

**ఇంకో లెక్క :**

$$3x + 2y – 3z – 7q.$$

దీన్ని *simplify* చేసి చెప్పడానికి ఏమీ లేదు. ఇది ఇంతే. ఎందుకంటే తలా ఒక జాతి వుంది. వాటిని కూడనూ లేం, తీసెయ్యనూ లేం.

**ఇంకో లెక్క :** *Add the expressions*

$$3a^2 + 2b,\ 7a – 4b,\ a^2 – 6a.$$

***Text Book* లో ఉన్న పద్ధతి :**

*Answer : by Summing the expressions, we have*

$(3a^2 + 2b) + (7a – 4b) + (a^2 – 6a)$ *Writing the terms to-gether using Associative law;*

$= (3a^2 + a^2) + (2b – 4b) + (7a – 6a)$

$= (3a^2 + a^2) + [2b + (–4)b] + [7a + (–6)a]$

$= (3 + 1)\, a^2 + [(2 + (–4)]b + [7 + (–6)]\, a$

$= \quad 4a^2 + (-2)b + \ a$ (Adding like terms)

$= \quad 4a^2 - 2b + a$

**చెప్పాల్సిన పద్ధతి :** ఒక దాన్ని గాడిద అనుకునేదీ, ఇంకొక దాన్ని గుర్రం అనుకునేదీ మనకొద్దు. ఎందుకంటే ఇంతకుముందు అట్లా అనుకొని కొన్ని లెక్కలు చేసి నేర్చుకున్నాం కాబట్టి.

1*st Step : add* చెయ్యమన్నారు కాబట్టి అన్నిటికీ '+' లు చేరుస్తూ పోదాం.

$3a^2 + 2b + 7a - 4b + a^2 - 6a$, *brackets* ను గురించి మనం ఇప్పటికి ఏమీ చెప్పుకో లేదు గాబట్టి *brackets* గొడవ మనకొద్దు.

2*nd Step : Like terms* ఎక్కడున్నా కూడుకుంటాం గదా. కాబట్టి వాటిని పక్క పక్క రాసుకుందాం.

పై లెక్కలో 1*st* న వచ్చిన *term* $3a^2$ అంటే $a^2$ వున్న పదాలను ఒకచోట రాసుకోవాలి. అట్లాగే మిగతావీ.

కాబట్టి లెక్కను ఇలా రాసుకుంటాం.

$3a^2 + a^2 + 2b - 4b + 7a - 6a$

3*rd Step :* $4a^2 - 2b + a$ అంతే. అయిపోయింది. ఇప్పుడింక మనమైనా పిల్లలమైనా పట్టాల మీద పరుగు లెత్తేస్తాం.

**$3a - 2b$, $10a + 4b$, $-2a + 5b$ దీన్ని కూడేద్దాం పట్టండి.**

కూడాల్సిన $a$ లన్నీ ఒక చోట పెడితే $13a$, తీసెయ్యాల్సింది $2a$ ని కాబట్టి మిగిలింది $11a$.

$b$ లన్నీ ఒక చోట కూడితే $9b$. తీసెయ్యాల్సింది $2b$ ని. మిగిలింది $7b$.

ఇక మిగిలింది $11a$ *and* $7b$ అంటే $11a + 7b$. మొత్తం నోటికి వచ్చేస్తుంది.

ఇంతేనా? *Algebra* లో కూడికలూ తీసివేతలూ ఇంతటితో అయి పొయ్యాయా? అయిపోయినట్టే. కాకపోతే కొన్ని ముందు జాగ్రత్తలు తీసుకోవాలి.

**ముందు జాగ్రత్తలు :** పిల్లలకు గానీ మనకు గానీ అసలు *Arithmetic*లో కూడికలూ తీసివేతలూ వచ్చునా?

వచ్చు.

$5 + 10 = 15$

$10 - 5 = 5$

$5 - 10 = 5$

అదిగో, రావు. కాబట్టే ముందు జాగ్రత్త. తీసివేతల దగ్గర మరింత జాగ్రత్త.

$10 - 5 = 5$

$5 - 10 \neq 5$

10 లో అయిదు పోతే 5. 5 లో పది పోతుందా?

+ అంటే మన దగ్గర వున్నది, – అంటే మనం ఇతరులకు ఇవ్వాల్సింది.

5 లో నుంచి 10 పోతే అన్న దాన్ని ఇలా అర్థం చేసుకోవాలి.

మన దగ్గర 5 పెన్సిళ్ళున్నాయి. కానీ వేరొకరికి మనం 10 ఇవ్వాలి. వున్న అయిదూ ఇచ్చేసినా మనం ఇంకా 5 బాకీ వుంటాం. బాకీ కాబట్టి –5.

5 లో పది పోతే –5

$5 - 10 = -5$

ఇవే రాకపోతే మనక్కానీ, పిల్లలక్కానీ కూడా *Algebra* కష్టమై పోతుంది.

చిన్న సంఖ్యలో నుంచి పెద్ద సంఖ్యను తీసెయ్యాల్సి వచ్చినప్పుడు మనం గుడ్డెద్దు చేలో పడ్డట్టు పెద్ద సంఖ్యలో నుంచి చిన్న సంఖ్యను తీసివేయగా మిగిలిందాని ముందు మైనస్‌ను చేర్చాలి. పిల్లలకి ఈ తమాషా చెప్పకపోతే మర్యాదగా వుండదు.

**ఇప్పుడు 7–10**

పదిలో ఏడు పోతే 3. మూడుకి ముందు మైనస్ చేరిస్తే –3.

అంతే.

తీసివేతలు కూడా ఒక రకంగా కూడికలే.

మనం ఒకరికి 4 రూపాయలూ, ఇంకొకరికి మూడు రూపాయలూ ఇవ్వాలను కోండి. మొత్తం ఏడు ఇవ్వాలి. అంటే −4 నీ −3 నీ కూడి −7 అంటాం.

ఇప్పుడు $7a - 10a = -3a$

అట్లాగే భిన్నాల కూడికలు కూడా. ఇవే *Algebra* లో రూపం మార్చుకుని వచ్చే సరికి భయంగా వుంటుంది.

$$\frac{1}{2}a + \frac{1}{4}a - \frac{3}{4}a$$

అన్నీ *'a'* లే. ఒకే జాతి. అయితే భిన్నాలు వేరే.

సగం చాక్లెట్‌కి పాతిక చాక్లెట్‌ని కలిపితే ముప్పాతిక చాక్లెటు వస్తుంది. ఆ ముప్పాతిక చాక్లెట్‌నూ ఇతరులకు ఇచ్చేస్తే ఇంకేం మిగలదు. కాబట్టి

$$\frac{1}{2}a + \frac{1}{4}a - \frac{3}{4}a$$

అంటే సున్నా.

ఇప్పుడు $3abc - 5abc$ ఎంత అంటే మనం మంచినీళ్ళు తాగినంత సుళువుగా $-2abc$ అని చెప్పేస్తాం.

*Algebra* కు సంబంధించిన కూడికలూ, తీసివేతల గురించి ఇంత కంటే చెప్పుకోవడానికి ఏం మిగల్లేదబ్బా!

# బ్రాకెట్ల ప్రాధాన్యత

***A****lgebra* లో కూడికలూ, తీసివేతల తర్వాత దూకు దూకు అని గుణకారాల్లోకి దూకేయ వచ్చునా?

దూక కూడదు. బ్రాకెట్ల ప్రాధాన్యత గురించి రామాయణం మాదిరి చెప్పుకోవాలి.

*Arithmetic* లో బ్రాకెట్లను గురించి చెప్పుకుని తర్వాత *Algebra* కి వద్దాం.

**3 + 2 x 5** ఎంత?

పిల్లలే కాదు మనం కూడా అయిదైదుల 25 అని చెప్పేస్తాం. లెక్క చూసిన వెంటనే 3 నీ 2 నీ కూడతాం. అయిదు రాగానే ఇంకో అయిదుతో గుణించి 25 అని చెప్పేస్తాం.

మనకే ఇలా వుంటే ఇట్లాంటి మర్మాలని బిడ్డలను ఒళ్ళో కూర్చోబెట్టుకుని మనం నిదానంగా చెప్పుకోవాలి.

కోట్లాది మంది జనం తరతరాలుగా భూమి – కంటికి కనిపించినట్టుగానే నలు చదరంగా ఉంటుందని అనుకుంటూ రాలేదా? ఆయనెవరో గుండ్రంగా వుందనే దాకా ఎవరికీ తెలియలేదే మరి! పిల్లలు మాత్రం అష్ట తెలువులతో వుండాలనుకుంటే ఎట్లా? *Maths* లో పిల్లలకు 40 మార్కులు రాగానే మొద్దులని చెప్పి మనమందరం వాళ్ళని మొట్టికాయలు వేసేసి సాధించేస్తున్నామే, తప్పు గదా!

కౌన్ బనేగా క్రోర్‌పతిలో ఆ మధ్య భూమి ఏ వైపు నుంచి ఏ వైపుకి తిరుగుతుందో చెప్పమని ఒక ప్రశ్న ఇచ్చాడు అమితాబ్ బచ్చన్. సమాధానం చెప్పినాయన కనీసం డిగ్రీ దాకా చదువుకునే వుంటాడు. మంచి బట్టలేసుకుని కాళ్లకు బూట్లేసుకుని సూపర్‌గా వున్నాడు. ఏదో ఉద్యోగం కూడా చేస్తూనే వుండొచ్చు. ఇంగ్లీషు దబాయించి మాట్లాడు తున్నాడు. తీరా తూర్పు నుంచి పడమరకి అని జవాబు చెప్పినాడు. అమితాబ్ నవ్వి *life line* వాడుకోరాదూ? అనగానే అతను *Public opinion* కి వెళ్ళాడు, *Public opinion* లో కూడా 70% దాకా తూర్పు నుంచి పడమరకే భూమి తిరుగుతోందని చెప్పారు.

తీరా అది 'గలత్ జవాబ్' అయ్యింది.

మరి, మన పబ్లిక్‌నందర్నీ పిల్లలు 'మా నాలుగో తరగతి భూగోళంలో వున్న దాన్ని కూడా మీరు చెప్పలేక పోయారు. వెవ్వెవ్వే, మీరే గంగలోనైనా దూకండి' అని వేధిస్తే....

అదే మన తల్లిదండ్రులమందరం ఎమ్‌సెట్‌లో ఏ 70 వేలో ర్యాంకొస్తే ఎంత వెక్కిరిస్తున్నాం పిల్లల్ని?

కాబట్టే మనకేమీ రానట్టే పిల్లలక్కూడా ఏమీ రాదనుకునే లెక్కలు కానీ ఏది కానీ నిదానంగా విడమరిచి చెప్పుకోవాలి. బ్రాకెట్లయినా, తీసివేతలయినా బిడ్డలకు నిదానంగా భూదేవికి వున్నంత సహనంతో మన *'Public'* చెప్పుకోవాలి.

**3 + 2 x 5** కదా లెక్క.

(3 + 2) × 5 – పై లెక్కకీ దీనికీ ఎంతో తేడా వుంది.

(3 + 2) × 5 తీసుకుందాం ముందు. ఈ లెక్కను చూడగానే ముందు బ్రాకెట్‌లో వున్న దాన్ని *settle* చెయ్యాలన్న *sense* వచ్చేస్తుంది. సెటిల్ చేస్తే 5. ఆ తర్వాత 5 × 5 = 25.

ఇప్పుడు 3 + 2 × 5 లెక్కను తీసుకోండి. ఇందులో మూడునీ, రెంటినీ కూడండి అంటూ అక్కడో బ్రాకెట్ ఏదీ లేకపోయినా మనం కూడేసుకుంటాం. అదే తప్పు. ఈ లెక్కలో 5 అనేది కేవలం 2నే గుణిస్తోంది. 3 తో దానికి సంబంధం లేదు మరి. ఒకవేళ 5 తో 3 ని కూడా పనిలో పనిగా గుణించండి అంటే అప్పుడు బ్రాకెట్ వుంటుంది. ఇట్లా –

(3 + 2) × 5 అని.

3 + 2 × 5 లో రెండుని 5 తో గుణిస్తే 10 వస్తుంది. ఆ తర్వాత 3 ని ఈ 10 తో *add* చేస్తే 13 వస్తుంది.

బ్రాకెట్‌కు ఎంత విలువ వుందో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు.

అట్లాగే 5 + 5 ÷ 5 + 5 లెక్కను తీసుకుందాం.

దీన్ని 100 కి 90 మంది 10 ÷ 10 = 1 అనుకుంటారు. అది తప్పు.

5 + 5 ÷ 5 + 5 ను మొదట ఇలా రాసుకోవాలి.

$$5 + \frac{5}{5} + 5$$

అంతేగాని 10 ÷ 10 కాదు. ఇదే అయితే లెక్క ఇట్లా వుండేది.

(5 + 5) ÷ (5 + 5)

అంటే వరసగా కూడికలూ, తీసివేతలూ, గుణకారాలూ, భాగహారాలూ, ఒకేచోట వచ్చినప్పుడు మొదట భాగహారాన్ని పూర్తి చేయాలి. తర్వాత గుణకారాన్నీ, కూడికనీ, తీసివేతనీ చెయ్యాలి.

*Bracket* కూడా వచ్చినప్పుడేం చెయ్యాలో చూడండి.

$$96 \div \frac{1}{2} \; of \; 12\left(3\frac{1}{2} - 2\frac{1}{2}\right) \times 4 + 3 - 6$$

ఇందులో *Bracket, of,* $\div$, ×, +, – లు అన్నీ వున్నాయి.

ఇలాంటివి వచ్చినప్పుడు మొదట ( ) నీ, ఆ తర్వాత*of* నీ, *division* నీ, *multiplication* నీ, *Addition* నీ, *Subtraction* నీ వరసగా సెటిల్ చేసుకోవాలి. దీన్ని గుర్తుగా *BODMAS* అనుకోవాలి. దీన్నే పెద్ద సిద్ధాంతంగా లెక్కల్లో*BODMAS Theorem* అంటారు.

$$96 \div \frac{1}{2} \; of \; 12\left(3\frac{1}{2} - 2\frac{1}{2}\right) \times 4 + 3 - 6$$

తొలుత *bracket* ను *settle* చేస్తే 1 వస్తుంది.

ఇప్పుడు లెక్క

$96 \div \frac{1}{2} \; of \; 12 \times 1 \times 4 + 3 - 6$ అయ్యింది.

తర్వాత *of* ను *settle* చేస్తే హాఫ్ ఆఫ్ 12 = 6 అవుతుంది. ఇక్కడ *of* అంటే × అన్నమాట.

ఇప్పుడు లెక్క

96 $\div$ 6 × 4 + 3 – 6

ఇప్పుడు *Division* ను *Settle* చెయ్యాలి.

$\frac{96}{6} \times 4 + 3 - 6$ అవుతుంది లెక్క.

16 × 4 + 3 – 6 గా వస్తుంది చివరకి.

అంటే ఇంక వరసగా *multiplication, addition, subtraction* చేస్తే

64 + 3 – 6 = 67 – 6 = 61

బ్రాకెట్లు నాలుగు రకాలు.

అవి :

1) *Vinculum* ——
2) *Small bracket* ( )
3) *Flower bracket* { }
4) *Square bracket* [ ]

ఏదైనా ఒక చోట నాలుగు బ్రాకెట్లూ వెయ్యాల్సి వచ్చినప్పుడు పైన వున్న వరసలోనే వేస్తాం.

తీసివెయ్యాల్సి వచ్చినప్పుడు కూడా అదే వరసలో *brackets* ని తీసేస్తాం.

ఉదాహరణకు అన్ని *brackets* తోనూ లెక్క వున్నప్పుడు వాటిని ఎలా తీయాలో ఈ లెక్కలో చూద్దాం.

*Simplify :*

$$\mathbf{[5p - \{3q - 2(20 + \overline{p - q - 3})\}] - 9}$$

1*st Step* **:** *Brackets* వరస గుర్తుకు తెచ్చుకుందాం. ముందు *vinculum* గదా. అందులో మనం *settle* చేసుకోవాల్సిందేం లేదు, $p - q - 3$ వొచ్చి $p - q - 3$ నే.

2*nd Step***:** లెక్క

$$[5p - \{3q - 2\ (20 + p - q - 3)\}] - 9$$

3*rd Step* **:** ఇప్పుడు మనం *small bracket* ని తీసెయ్యాలి. *Small bracket* లో వున్న మొత్తాన్నీ $-2$ తో గుణిస్తే ఈ *small bracket* కాస్తా *eliminate* అయిపోతుంది.

ఇప్పుడు లెక్క

$[5p - \{3q - 40 - 2p + 2q + 6\}] - 9$ అవుతుంది.

4*th Step* **:** ఈ *step* లో { } ముందు – వుంది. అంటే { } లో వున్న మొత్తాన్నీ – తో గుణించాలి. అంటే $-1$ తో గుణించాలి.

– తో గుణించేటప్పుడు పాటించాల్సిన ముఖ్య సూత్రాలు. ఈ సూత్రాన్ని పాటించే ఇంతకు ముందు స్టెప్‌లో *small bracket* ని –2 తో గుణించాం.

$- \times - = +$

$- \times + = -$

ఈ సూత్రాల ప్రకారం –1తో { }లో వున్న వాటిని గుణిస్తే లెక్క కాస్తా ఇలా అవుతుంది.

$[5P - 3q + 40 + 2p - 2q - 6] - 9$

5*th Step* **:** [ ] లో వున్న terms లో like termsని అన్నిట్నీ పక్కపక్కన రాసుకుందాం.

అప్పుడు $[5P + 2p - 3q - 2q + 40 - 6] - 9$ అవుతుంది.

6*th Step* **:** [ ] లో వున్న వాటిని *settle* చేసుకుంటే

$7p - 5q + 34 - 9$

$7p - 5q + 25.$

ఇదే మన లెక్కకి సమాధానం.

**ఇంకో లెక్కని చూద్దాం.**

$$a - \{a + (a - \overline{a - 1})\}$$

1*st Step* **:** ఇందులో తొలుత తియ్యాల్సిన *bracket vinculum* – దీనికి ముందు '–' వుంది. అంటే *vinculum*లో వున్న దాన్ని –1తో గుణించాలి.

*Vinculum*లో వున్న దాన్ని విడిగా రాద్దాం. అది $a - 1$.

–1 తో గుణించాలి కాబట్టి

$-1 \times (a - 1)$ అవుతుంది.

చూశారా? ఇక్కడ *small bracket* వాడాం. ఇది ఒక వేళ వాడలేదనుకోండి.

$-1 \times a - 1$ అవుతుంది. అంటే *small bracket* వాడక పోవడం వల్ల $-1$ ని కేవలం '$a$' తో గుణిస్తేనే సరిపోతుంది. కానీ లెక్కలో $(a-1)$ మొత్తాన్నీ గుణించమని వుంది. కాబట్టి –తో ఏదైనా రెండు పదాలని గుణించేటప్పుడు ( ) తప్పనిసరి.

అసలు లెక్కలో *already* ఒకసారి ( ) ని వాడేశారు కాబట్టి లోపల మళ్ళీ దాన్ని వాడలేక *vinculum* వాడారన్న మాట.

ఇప్పుడు *Vinculum* లో వున్న దాన్ని $-1$తో గుణిద్దాం.

$-1\,(a-1) = -a + 1$

**ఎలాగంటే :** $-1\,(a-1)$

$= -1 \times a - 1 \times -1$

$= -a + 1$ (*because* $- \times - = +$)

అంటే *vinculum*లో వున్నది కాస్తా $-a + 1$ అయ్యింది.

*2nd Step* **:** $a - \{a + (a - a + 1)\}$

ఇప్పుడు *small bracket*ని తొలగిద్దాం. *Small bracket* లో వున్నది $a - a + 1$ అంటే 1 మిగుల్తుంది. $a$ లో నుంచి $a$ తీసేస్తే ఏం వుండదు గదా, అందుకని. *small bracket* ను *settle* చేస్తే 1 మిగిలింది.

3r*d Step* **:** $a - \{a + 1\}$

ఇప్పుడు { }ను తొలగిద్దాం. ముందు – వుంది. అంటే { }లో వున్న మొత్తాన్ని $-1$తో గుణించాలి.

$-1\,(a + 1) = -1 \times a + -1 \times 1$

$= -a - 1$

ఇప్పుడు లెక్క $a - a - 1 = -1$

గుడ్డి గుర్తుగా చెప్పాలంటే –ను ఏదైనా *bracket* లోకి పంపించేటప్పుడు *bracket*లో వున్న గుర్తులు మారతాయి. ఆ తర్వాత అక్కడ *bracket* వుండదు.

ఇట్లా

$-(5 + 3a - 4b)$

**–** ను లోపలకు పంపిస్తే బ్రాకెట్ విడిపోయి గుర్తులు మార్చుకుని ఇలా అవుతుంది.

$-5 - 3a + 4b.$

ఇవన్నీ చెప్పక పోతే పదో తరగతికి వచ్చినా పిల్లలకి బ్రాకెట్ ఎలా వెయ్యాలో, తియ్యాలో తెలియక తికమక ఎత్తుకుని లెక్కలంటేనే ఏవగింపు వచ్చేస్తుంది.

బ్రాకెట్ల ప్రాధాన్యతను ఇంకా లోతుల్లోకి వెళ్ళి చూద్దాం.

**(1)** $\boldsymbol{a + b \times a + b}$ వేరూ,

**(2)** $\mathbf{(a + b)}\ \boldsymbol{a + b}$ వేరూ,

**(3)** $\boldsymbol{(a + b) \times (a + b)}$ వేరూ!

ఇవన్నీ మనకి గుణకారాల్లో బాగా పనికొస్తాయి.

(1) $a + b \times a + b$

అంటే $a + b \,.\, a + b$

$= a + ab + b$

(2) $(a + b)\, a + b$ అంటే :

ఇక్కడ ఒక ( ), ఒక × (*multiplication*), ఒక కూడికా వున్నాయి.

$a + b$ మొత్తాన్నీ అంటే $(a + b)$ ని $a$ తో గుణించండి అని వుంది.

గుణిద్దాం.

$(a + b)\, a = a.a + b.a$

కాబట్టి లెక్క

$(a + b)\, a + b = a.a + b.a + b = a^2 + ab + b$ అవుతుంది.

3) $(a + b)\,(a + b)$ అంటే $a + b$ మొత్తాన్నీ $a + b$ తో గుణించడం.

గుణకారాల *chapter* లో ఇవన్నీ వివరంగా వస్తాయి.

# *Algebra* లో గుణకారాలు

**ము**ందు, *Arithmetic*లో గుణకారాలను చూద్దాం.

$3 \times 4 = 12$

ఇక్కడ $3 \times 4$ ను అనే రాస్తాం.

$3 \times 4$ వేరూ

$3 . 4$ వేరూ

$34$ వేరూ!

Algebra లో *'a'* అనేది ఒక అంకెనీ *'b'* అనేది ఇంకో అంకెనీ సూచిస్తాయను కుందాం.

అప్పుడు $a \times b$ అయినా ఒకటే,

$a.b$ అయినా ఒకటే.

$ab$ అయినా ఒకటే.

$4 \times 5 = 20$

$5 \times 4 = 20$

$4 \times 5 = 5 \times 4$ అయినట్లే

$a \times b = b \times a$ అవుతుంది.

అంటే $ab = ba$ అన్నమాట.

రెండూ ఒకటే.

$a \times 4$ అంటే $4a$ అని అర్థం. అంతేగాని $a4$ అని రాయకూడదు. నాలుగు పెన్సిళ్ళు 4 వంకాయలు అన్నట్టు $4a$ అని అనాలి.

$a \times b \times 7 = 7ab$

అంటే *Algebra* లో గుణించేటప్పుడు ముందు అంకెను వేసి ఆ తర్వాత అక్షరాన్ని వెయ్యాలి.

మనం ఒక పెన్ను, ఒక వంకాయ, ఒక చాక్లెట్ అని అనకుండా పెన్ను, వంకాయ, చాక్లెట్టు అని అన్నట్టే 1$a$, 1$b$, 1$x$ అని అనాల్సిన పన్లేదు. $a$, $b$, $x$ అంటే చాలు.

Arithmetic లో ఏడును ఏడుతోనే గుణించినప్పుడు

$7 \times 7 = 7^2$ (Seven Square) అవుతుంది.

Algebra లో కూడా $x$ ను $x$ తోనే గుణించినప్పుడు

$x \times x = x^2$ అవుతుంది.

$a \times a = a^2$

$x$ *square*, $a$ *square* ఇట్లా.

$\frac{a}{b}.\frac{a}{b}$ అనుకుందాం.

ఇక్కడ $a/b$ అనేది $a/b$ అనే దాంతో గుణించుకుంటోంది. దాన్ని దాంతోనే గుణించినపుడు దానికి *square* వేస్తాం గదా.

$\frac{a}{b}$ కి *square* వేద్దాం.

$\frac{a^2}{b}$ అని వేస్తే తప్పు.

ఇక్కడ $a$ కే *square* పడింది. $b$ కి పడలేదు. అదుగో ఇలాంటప్పుడే ( ) అవసరం వస్తుంది.

$\left(\frac{a}{b}\right)^2$ ; $\frac{a}{b}$ మొత్తానికి *square* వేయాలి.

లేదా $\frac{a^2}{b^2}$ అని వేయాలి.

$(a+b)^2$ ని $a + b$ హోల్ *square* అని చదువుతాం.

$(a+b)^2$ వేరూ.

$a + b^2$ వేరూ.

కింది దాన్ని $a$ ప్లస్ $b$ స్క్వేర్ అని అంటాం గానీ $a + b$ హోల్‌స్క్వేర్ అనం.

$(a + b)^2$ అంటే $(a + b)$ ని $(a + b)$ తో గుణించడం.

ఇప్పుడు *Algebra* లో చిన్న చిన్న గుణకారాలు నేర్చుకుందాం.

**$2x \times 4$**

జవాబు : $2x \times 4$

గుణకారాల్లో ముందు అంకెలను గుణించి ఆ తర్వాత అక్షరాల *(literal numbers)* ను గుణిస్తాం.

ఇందులో గుణించుకుంటున్న అంకెలు : 2, 4

$2 \times 4 = 8$

$2x \times 4 = 2 \times 4 \times x$

$= 8x$ అంతే.

ఇంకో లెక్క

***Find the value of* (-3x) × (4y)**

**లెక్కల పుస్తకంలో వున్న పద్ధతి**

$(-3x) \times (4y)$

$= (-3x \times 4) \times y$ *(Associative law)*

$= [(-3 \times x) \times 4] \times y$

$= [(-3 \times (4 \times x] \times y$ *(Commutative law)*

$= [(-3 \times 4) \times x] \times y$ *(Associative law)*

$= [(-12 \times x] \times y$

$= -12 \times (x \times y)$ *(Associative law)*

$= -12\,xy$

ఆరో తరగతి పిల్లలకే గాదు ఎవరికీ ఈ లెక్క చెప్పడానికి ఇన్ని *law* లతో పన్లేదు.

ఈ లెక్కని చెప్పాల్సిన పద్ధతి :

$(-3x) \times (4y)$

1*st Step* **:** *Brackets* లోపల రెండేసి పదాలు లేవు గనుక ( ) అవసరం లేదు. కాబట్టి తీసేద్దాం.
లెక్క $-3x \times 4y$ అవుతుంది.

2*nd Step* **:** ముందు అంకెల్ని వాటి గుర్తులతో సహా గుణిద్దాం.

$-3 \times 4 = -12.$

కాబట్టి $-3x \times 4y = -12 \times x \times y.$

$= -12\,xy.$

అంతే.

ఇంక *bracket* వున్నప్పుడు ఎట్లా గుణించాలో తెలుసుకుందాం.

***a* ( b + c )**

ఇక్కడ

$b + c$ మొత్తాన్నీ $a$ తో గుణించమన్నాడు. అందుకే ( ) వేశాడు.

$a\,(b+c) = a \times b + a \times c$

$= ab + ac$

**ఇంకో లెక్క**

$2x\,(x + y)$

ఇక్కడ $2x$ తో $x + y$ మొత్తాన్నీ గుణించాలి. గుణిద్దాం.

$2x\,(x + y) = 2x \times x + 2x \times y$

$= 2 \times x \times x + 2xy$

$= 2x^2 + 2xy$

$x$ ను $x$ తోనే గుణించినప్పుడు $x^2$ అవుతుంది గదా మరి.

**ఇంకోలెక్క :** $(a + 3)(a + 4)$

ఈ గుణకారంలో గుణించాల్సిన రెంటికీ *brackets* వున్నాయి. వాటిని ఎలా విడగొట్టాలో చూద్దాం.

*Arithmetic* లో గుణకారాన్ని కుడి వైపు వున్న దాన్ని తీసుకుని ఎడమ వైపు వున్న దాంతో గుణిస్తాం. ఇక్కడా అంతే.

$(a + 3)(a + 4)$

కుడివైపున (a + 4) వుంది. ఇప్పుడు కుడి వైపున ఉన్న దాని *bracket* విడగొడదాం.

$(a + 3)(a + 4)$

$= (a + 3)\, a + (a + 3)4$

$= a.a + 3.a + a.4 + 3 \times 4$

$= a^2 + 7a + 12$ అంతే

తరువాత **$(a + 3)(a - 4)$** ని చూద్దాం.

$(a + 3)$ మొత్తాన్నీ $a - 4$ తో గుణించాలి. అంటే $a + 3$ ని $a$ తోనూ, ఆ తర్వాత $-4$ తోనూ గుణించి చూడాలి.

$(a + 3)\ (a - 4)$

$= (a + 3)\ a - 4\,(a + 3)$

$= a\,.\,a + 3a - 4.a - 4 \times 3$

$= a^2 + 3a - 4a - 12$

$= a^2 - a - 12$

భాగహారాలకు వెళ్ళే ముందు *Algebra* కు సంబంధించి ఇంకా కొన్ని విషయాలు చూద్దాం.

# *Algebric Expressions*

**వా**క్యాలు వాక్యాలుగా వున్న విషయాలని *Algebra* నుపయోగించి *simple* గా *express* చెయ్యడాన్నే *Algebric Expressions* అంటాం.

ఉదాహరణకి **రామూ దగ్గర ఎన్నో కొన్ని బలపాలున్నాయి. వాడికి 3 బలపాలు ఇస్తే వాడి దగ్గర మొత్తం ఎన్ని బలపాలుంటాయి?**

**జవాబు :** రామూ దగ్గర వున్న బలపాలు ఎన్నో మనకి తెలియవు. కాబట్టి '$x$' అనుకుందాం.

రాము దగ్గరున్న బలపాలు = $x$

వాడికి మనం ఇచ్చిన బలపాలు = 3

వాడి దగ్గరున్న బలపాలు $x + 3$ బలపాలు. కొన్ని కలిపాం కాబట్టి + వచ్చింది.

ఇంకో లెక్క : **సీత దగ్గర ఎన్నో కొన్ని చాక్లెట్లున్నాయి. ఆ పిల్ల చెల్లికి 4 ఇచ్చింది. ఇప్పుడు సీత దగ్గర ఎన్ని చాక్లెట్లుంటాయి?**

**జవాబు :** సీత దగ్గర వున్న చాక్లెట్లు = $x$

సీత చెల్లికి ఇచ్చినవి = 4

మిగిలిన చాక్లెట్లు = $x - 4$ అంతే.

+ లూ, – లూ, × లూ, ÷ లూ చేర్చి *Algebric Expressions* రాయడమంటే ఇలాగే మరి.

***The Sum of p and q***

$p + q$

***The subtraction of 3 from 2x.***

$2x - 3$

***The Product of 2y and 5***

$2y \times 5 = 10y$

***The quotient of l and 3***

***l*** ను 3 తో భాగిస్తేనే గదా *quotient* (భాగ ఫలం) వచ్చేది.

కాబట్టి $\frac{l}{3}$

***3 increased by x***

$3 + x$

***9 less than q***

$q - 9$

***Sum of squares of x and 4***

*square of* $x = x^2$

*square of* $4 = 4^2$

*Sum* $= x^2 + 4^2$

$= x^2 + 16$

*Sum of squares of x and 4* అంటే $(x + 4)^2$ కాదు. తేడా గమనించండి. *The whole square of x and* 4 అంటేనే $(x + 4)^2$.

# *Substitute* చెయ్యడం (ప్రతిక్షేపించడం)

$x + y$ అనేది ఒక *Algebric expression* కదా. $x$ కి ఒక అంకెనీ, $y$ కి ఇంకో అంకెనీ ఇచ్చామనుకోండి. అలాంటపుడు $x$ వున్నచోట $x$ కిచ్చిన అంకెనీ, $y$ వున్నచోట $y$ కిచ్చిన అంకెనీ పెడితే అంటే *substitute* చేస్తే, దీన్నే తెలుగులో ప్రతిక్షేపించడం అనీ, ఇంగ్లీషులో *substitution* అనీ అంటాం.

***Find the value of 3n + 1***

***When n = 3***

$3n + 1$ కదా

$n$ వున్న చోట $n$ ను తీసేసి 3 ను పెట్టండి.

అప్పుడు $3n + 1 = 3 \times 3 + 1 = 9 + 1$

$= 10$

అలాగే; **$20 - 8n$ *When n = – 2***

$20 - 8n = 20 - 8 \times -2$

$= 20 + 16$

$= 36$

**ఇంకో లెక్క**

***Find the value of each expression when a = 0; b = 1 and c=2***

***(1) abc***

***(2) $a^2 + b^2 + c^2$***

*abc* అంటే *a, b, c* లు మూడూ ఒక దానితో ఒకటి గుణించుకుంటున్నాయి. లెక్కలో వీటి విలువల్ని ఇలా ఇచ్చాడు.

$a = 0$

$b = 1$

$c = 2$

$abc = a \times b \times c$

$= 0 \times 1 \times 2 = 0$

$a^2 + b^2 + c^2$

$a^2$ అంటే $a \times a$ కదా ఆ ప్రకారంగా

$a^2 + b^2 + c^2 = 0^2 + 1^2 + 2^2$

$= 0 \times 0 + 1 \times 1 + 2 \times 2$

$= 0 + 1 + 4$

$= 5$

***Find the value of $a^2 + b^2$ when a = 1 and b = -1***

$a^2 + b^2 = 1^2 + -1^2$ కాదు

ఇట్లాంటి చోట్లనే మనం జాగ్రత్తగా వుండి పసి పిల్లలకు జాగ్రత్తలు చెప్పాలి.

మనం ఇక్కడ $a^2 + b^2$ ను కనుక్కోవాలి.

ముందు $a^2$ ను కనుగొందాం.

$a^2 = 1^2$ (*because* $a = 1$)

$b^2 = -1^2$ అని పిల్లలిట్లాగే వేస్తారు. కానీ ఇది తప్పు.

$b^2$ అంటే $b \times b$

ఇక్కడ $b$ అంటే $-1$.

$b^2 = b \times b$ కదా

$-1 \times -1$

$= +1 = 1$ అంతే గానీ

$b^2 = -1^2$ కాదు.

$-1^2$ అంటే $-1$ ని $-1$ తో గుణించడం కాదు. ఎందుకంటే ఇక్కడ $-$ కు *square* లేదు. 1కి మాత్రమే వుంది. ఇట్లా $-1^2$.

$-1$ ని $-1$తో గుణించడం అంటే $(-1)^2$.

కాబట్టి $b^2 = b \times b$

$= -1 \times -1$

$= 1$

ఇప్పుడు $a^2 + b^2 = 1^2 + (-1)^2$

$= 1^2 + 1^2$

$= 1 + 1 = 2$

ఇదే విలువలిచ్చినప్పుడు $a^2 - b^2$ ఏమవుతుందో చూద్దాం.

$a = 1$, $b = -1$ కదా

$a^2 - b^2 = 1^2 - (-1)^2 = 1^2 - 1^2 = 1 - 1$

$= 0$

– వచ్చినప్పుడూ, ( ) వొచ్చినప్పుడూ ఇన్ని జాగ్రత్తలు పాటించక పోతే చిన్నా, పెద్దా అంతా గందరగోళంలో పడిపోతాం.

**ముఖ్య గమనిక :** $(-1)^{10}$ అంటే –1ని –1తో పదిసార్లు గుణించడం. గుణించి చూస్తే + 1 అంటే 1 వస్తుంది.

$(-1)^{71}$ అంటే –1ని –1తో 71 సార్లు గుణిస్తే –1 అని వస్తుంది.

ఇక్కడ –1 ని –1తో 71 సార్లు గుణించడం అంటే – గుర్తును – గుర్తుతో అన్నిసార్లు గుణించడమన్న మాట. 1ని 1తో ఎన్నిసార్లు గుణించినా ఒకటే కదా.

(–1) కి పైన అంటే *power* లో సరి సంఖ్య వస్తే + 1 అనీ, బేసి సంఖ్య వస్తే –1 అనీ వస్తుంది.

$(-1)^{1000} =$ *Power* లో సరిసంఖ్య వుంది గాబట్టి +1

$(-1)^{10001} =$ *Power* లో బేసి సంఖ్య వస్తుంది గాబట్టి –1

$-1^{100}$ = పవర్‌లో సరి సంఖ్య వున్నా –కు *power* లేదు కేవలం 1 కే *Power* వుంది. కాబట్టి *Answer* –1.

$(-1)^{100}$ వేరూ

$-1^{100}$ వేరూ అని గమనించాలి.

$(-1)^{100} = 1$

$-1^{100} = -1$

– లు వచ్చినప్పుడు ( ) వుంటే ఏమవుతుందో, లేకపోతే ఏమవుతుందో దీన్ని బట్టి బాగా గ్రహించవచ్చు.

*Power* తో వచ్చే లెక్కల గురించి ముందు ముందు చూడొచ్చు లెండి.

# *Algebric Equations*

***I****s equal to* వున్న ఏదైనా ఒక *Algebric expression* ను *Algebric equation* అంటాం.

ఉదాహరణకి $x + 5 = 8$

ఇక్కడ '$x$' అంటే తెలియనిది కదా. ఇక్కడ '$x$' కు ఏ అంకెనిస్తే ఈ *equation* సంతృప్తి చెందుతుంది?

**రామూ దగ్గర కొన్ని బలపాలు వున్నాయి. వాటికి అయిదు కలిపితే 8 బలపాలవుతాయి. రామూ దగ్గర ఎన్ని బలపాలు వున్నట్టు?**

**జవాబు:** ముందు పై లెక్కకు ***equation*** రాసుకుందాం.

రామూ దగ్గర వున్న కొన్ని బలపాలు = $x$ అనుకుందాం.

కలిపిన బలపాలు = 5

ఇప్పుడు రామూ వద్ద వున్న బలపాలు $x + 5$

అవి 8 అని లెక్కలో ఇచ్చారు.

కాబట్టి $x + 5 = 8$ *equation* వచ్చింది. దీన్ని *solve* చెయ్యాలి.

$x + 5 = 8$

$x = 8 - 5$

$= 3$

*Answer :* 3

**ఇక్కడ గమనించవలసిన విషయాలు :**

= కు ఎడమ వైపున కూడుతూ వున్న 5 ను కుడివైపుకి పంపిస్తే తీసి వెయ్యడం జరిగింది. ఎందుకు? మనం వాడికి *extra* గా ఇచ్చిన బలపాలను మొత్తం బలపాల్లో నుంచి తీసి వేస్తేనే గదా మొదట్లో వాడి దగ్గరున్న బలపాలెన్నో తెలిసేది.

కాబట్టి = కు ఎడమ వైపున వున్న +5 కుడి వైపుకి వచ్చే సరకి -5 అయ్యింది.

ఇంకో లెక్క

**రామూ దగ్గర ఎన్నో కొన్ని బలపాలూ ఉన్నాయి. అందులో నుంచి రెండింటిని తీసేస్తే వాడి దగ్గర ఎనిమిది వుంటాయి. రామూ దగ్గర మొదట్లో ఎన్ని బలపాలు ఉండి వుంటాయి?**

జవాబు: ఈ లెక్కను చదివి *equation* రాద్దాం.

రామూ దగ్గర మొదట్లో వ్నున బలపాలు = $x$

తీసేసిన బలపాలు = 2

రామూ దగ్గిర మిగిలిన బలపాలు = $x - 2$

లెక్కలో వాడి దగ్గిర మిగిలిన బలపాలు 8 అని ఇచ్చారు.

అంటే $x - 2 = 8$

$x = 8 + 2$

$= 10$

Ans : 10

$x - 2 = 8$ అన్న *equation* లో = కు ఎడమ ప్రక్కన వున్న −2 = కు కుడివైపుకి వచ్చే సరికి +2 అయ్యింది.

ఎందుకంటే వాడి దగ్గిర వున్న బలపాల్లో రెండింటిని మనం తీసేసుకున్నప్పుడు వాటిని మనం తిరిగి ఇచ్చేస్తేనే గదా అంటే + చేస్తేనే గదా వాడి దగ్గిర మొదట్లో వున్న బలపాలు తెలిసేది.

అందుకన్న మాట = కు అవతలికి ఇవతలికి ఏవైనా అంకెలు మార్చేటపుడు వాటి గుర్తులు మారేది.

**ముఖ్య సూత్రాలు :** = కు ఎడమ వైపున − వుంటే అది కుడి వైపుకి వచ్చినప్పుడు + అవుతుంది. అలాగే = కు ఎడమ వైపున + వుంటే అది కుడి వైపుకి వచ్చినప్పుడు − అవుతుంది.

ఇంకా = కు ఎడమ వైపు × వుంటే కుడి వైపుకి వస్తే ÷ అవుతుంది.

ఎడమ వైపు ÷ వుంటే కుడి వైపుకి వస్తే × అవుతుంది.

చివరివి రెండూ ఎట్లా?

ఉదాహరణకు **3 చాక్లెట్ల వెల 75 పైసలు. ఒక చాక్లెట్ వెల పావలా గదా.**

దీన్ని *equation* లాగా రాద్దాం.

3 చాక్లెట్ల వెల = 75 పైసలు

ఒక చాక్లెట్ వెల = 75/3 పైసలు.

= 25 పైసలు.

చూశారా? ఎడమ వైపున వున్న × 3 = కు ఇవతలికి వచ్చే సరికి ÷ 3 అయ్యింది. అలాగే **అర్థ కేజీ బియ్యం 6 రూపాయలు. కేజీ బియ్యం ఎంత?**

దీన్ని *equation* గా రాసుకుందాం.

1/2 కేజీ బియ్యం = 6 రూపాయలు

కేజీ బియ్యం $6 \times 2$ రూపాయలు.

= 12 రూపాయలు.

చూశారా? ఎడమ వైపు వున్న ÷ 2 కుడి వైపుకి వచ్చే సరికి ×2 అయ్యింది.

ఇవేవీ చెప్పకుండా పిల్లలకి ÷ = కు ఇవతలికి వస్తే × అవుతుంది, అంటే అది మనసుకు హత్తుకోదు.

ఇప్పుడు కొన్ని *simple equations* ను సాధిద్దాం.

$$\mathbf{2x + 5 = 25}$$

జవాబు: $2x = 25 - 5$

$= 20$

$$x = \frac{20}{2}$$

$= 10$

$$\mathbf{\frac{4t + 3}{3} = 5}$$

జవాబు : $4t + 3 = 5 \times 3$

$= 15$

$4t + 3 = 15$

$4t = 15 - 3$

$= 12$

$$t = \frac{12}{4} = 3$$

ఇంకో లెక్క :

**2p + 4 = 5 (p+1)**

జవాబు: $2p + 4 = 5\ (p + 1)$

$2p + 4 = 5p + 5$

*p* లన్నీ ఒక చోటకి, అంకెలన్నీ ఒక చోటికి తీసికెళదాం.

$2p - 5p = 5 - 4$

$-3p = 1$

$$p = -\frac{1}{3}$$

ఇంకో లెక్క

**2(*y* + 5) = 16**

$$y + 5 = \frac{16}{2} = 8$$

$y = 8 - 5$

$= 3$

ఇంకా వివరంగా...

ఇంకో లెక్క : **9 – 7*x* = 5 – 3*x***

1*st Step* **:** కుడివైపున వున్న $-3x$ ని ఎడమ వైపుకి తెచ్చుకుందాం.

$9 - 7x = 5 - 3x$

$9 - 7x + 3x = 5$

2*nd Step* **:** ఎడమ వైపున వున్న అంకె 9 ని కుడివైపున వున్న 5 దగ్గరికి చేరుద్దాం.

$9 - 7x + 3x = 5$

$-7x + 3x = 5 - 9$

$-4x = -4$

$$x = \frac{-4}{-4} = 1$$

**చెకింగ్:** మన లెక్క తప్పో రైటో చూద్దాం.

*Equation* $9 - 7x = 5 - 3x$ కదా

ఎడమ వైపున వున్నది *L.H.S.* = $9 - 7x$ *(L.H.S. = Left Hand side)*

x = 1 ని Substitute చేద్దాం.

*L.H.S.* = $9 - 7x$

$= 9 - 7 \times 1 = 9 - 7 = 2$

*R.H.S.* (కుడి వైపున వున్నది) *(R.H.S. = Right Hand side)*

$= 5 - 3x$

$= 5 - 3 \times 1 = 5 - 3 = 2$

*L.H.S.* = 2

*R.H.S.* = 2

కాబట్టి *L.H.S.* = *R.H.S.*

మన లెక్కకు $x = 1$ అన్న సమాధానం రైటు.

ఇక ఎంతటి లెక్కనైనా చదివి అందులో వున్న సమాచారాన్ని *Equation* ఎలా రాయొచ్చో చూద్దాం.

1. లెక్క అంతా చదివి ఏమి ఇచ్చాడో, ఏమి అడిగాడో గమనించాలి.
2. మనం దేన్నైతే కనుక్కోవాలో దాన్ని $x$ అని గానీ $a$ అని గానీ అనుకోవాలి.
3. లెక్కలో ఇచ్చిందాన్ని బట్టి *equation* రూపొందించుకోవాలి.
4. తర్వాత *equation* ని solve చేసుకోవాలి.
5. వచ్చిన సమాధానాన్ని సరి చూసుకోవాలి.

కొన్ని లెక్కలు చూద్దాం

**ఒక సంఖ్యను మూడింతలు చేసి దానికి 16 కలిపితే ఆ మొత్తం 40 అవుతుంది.**

**ఆ సంఖ్య ఏది?**

జవాబు : ఒక సంఖ్యను $x$ అనుకుందాం. దాన్ని మూడింతలు చేయడం అంటే $\times 3$ చెయ్యడం.

చేస్తే $3 \times x = 3x$ అవుతుంది. లెక్కలో ఏమి ఇచ్చాడు?

మూడింతలు చేసిన సంఖ్యకు 16 కలిపితే 40 వస్తుందని అన్నాడు.

*equation* రాసుకుందాం మరి.

$3x + 16 = 40$

*Solve* చేద్దామిక.

$3x + 16 = 40$

$3x = 40 - 16$

$= 24$

$$x = \frac{24}{3} = 8$$

ఆ నంబరు 8 అన్నమాట

**సరి చూద్దాం :** నంబరు 8

దీన్ని లెక్కలో చెప్పినట్లు మూడింతలు చేద్దాం. $8 \times 3 = 24$

ఈ 24 కు 16 కలుపుదాం

40 వచ్చింది.

లెక్క సరిపోయింది.

**ఇంకో లెక్క**

***One number is 3 less than two times the other. If their sum is increased by 7, the result is 37. Find the number :***

**జవాబు :** ఒక నంబరును $x$ అనుకుందాం. ఇంకొక నంబరును $y$ అనుకుందాం. లెక్కలో ఇచ్చిన తొలి వాక్యం ఏమి?

ఒక సంఖ్య = ఇంకో సంఖ్య $\times 2 - 3$

ఇదే *equation* రూపంలో

$x = 2y - 3$ .............. (1)

ఒక సంఖ్య $x$, ఇంకో సంఖ్య $y$ అనుకున్నాం గదా. వాటి సంబంధం ఇలా వుంది.

$x = 2y - 3$

రెండో వాక్యానికి రండిక, ఆ సంఖ్యల మొత్తానికి 7 కూడితే 37 అవుతుంది.

$x + y + 7 = 37$ ............ (2)

(2)వ *equation* లో (1)వ *equation*

$x = 2y - 3$ ని *substitute* చేస్తే

$2y - 3 + y + 7 = 37$

$3y + 4 = 37$

$3y = 37 - 4$

$= 33$

$y = 11$

ఇప్పుడు మనకు ఇంకో సంఖ్య అంటే $y$ తెలిసింది 11 అని.

దీన్ని (1)వ *equation* లో *substitute* చేద్దాం.

$x = 2y - 3$

$x = 2 \times 11 - 3$

తెలుసుకోమన్న సంఖ్య 19 అన్నమాట.

సరి చూద్దాం

ఒక సంఖ్య = ఇంకో సంఖ్య $\times 2 - 3$

$19 = 11 \times 2 - 3$

$19 = 22 - 3$

$= 19$

19 = 19

ఆ రెండు సంఖ్యలనూ కూడి ఏడు కలిపితే 37 రావాలి.

మొదటి సంఖ్య + 2వ సంఖ్య + 7

= 37

అంటే 11 + 19 + 7 = 37

లెక్క సరిపోయింది.

# వయసు లెక్కలు

ఏ చిన్న ఉద్యోగానికి పెట్టే పరీక్షల్లో అయినా ఈ లెక్కలొస్తుంటాయి. వీటిని వెయ్యలేక డిగ్రీలు చదివిన వాళ్లు కూడా ఇబ్బంది పడిపోయి డిఎస్‌సి పరీక్షల్లో, బ్యాంకు పరీక్షల్లో, ఎల్‌ఐసీ పరీక్షల్లో విఫలమవుతూ వుంటారు.

మరి, ఇలాంటి లెక్కలు ఏడో తరగతిలోనే పిల్లలకి వస్తాయి. వీటిని చాలా నిదానంగా జాగ్రత్తగా పిల్లలకి చెప్పాల్సి వుంటుంది.

అయిదారు లెక్కల్ని వేద్దాం. ఈ లెక్కలన్నీ కూడా చిన్న చిన్న మాటలే గాబట్టి ఇంగ్లీషులోనే ఇస్తాను. విధానం మటుకు తెలుగులో చెప్పుకుందాం.

**1.** ***Sobha's age 13 years ago is half her age 13 years later. Find her present age.***

**జవాబు :** దీనికి జవాబు చెప్పుకునే ముందు ఈ లెక్కలు చెప్పేటప్పుడు పిల్లల మనసులో వచ్చే డౌట్లను చూద్దాం.

కుమార్ వయసు ప్రస్తుతం $x$ సంవత్సరాలనుకుంటే 3 ఏళ్ళ తర్వాత వాడి వయసు ఎంతరా అని క్లాసులో ఏ పిల్లవాడ్ని అడిగినా $3x$ సార్' అనేస్తాడు గబీమని పొరబాటున.

అప్పుడు టీచర్ చాలా ఓపిగ్గా వుండాలి.

ఉదాహరణకి ప్రస్తుతం ఒక పిల్లవాడి వయసు 12 ఏళ్ళు అనుకుందాం. మూడేళ్ళ తర్వాత వాడి వయసు ఎంతరా అని క్లాసులో ఏ పిల్లవాణ్ణి అడిగినా వాడు నోటితోనే 12 నీ 3 నీ కూడుకుని 15 అని చెప్తాడు. అంతేగానీ 12 × 3 = 36 ఏళ్ళు అని చెప్పడు.

అదే ప్రస్తుతం కుమార్ వయసు $x$ సంవత్సరాలు. మూడేళ్ళ తర్వాత ఎంతరా అంటే 3నీ $x$ నీ గుణించుకుని $3x$ అని చెప్తాడు. క్లాసులో మనం ఈ ఉదాహరణను చెప్తే అట్లా గుణించడం ఎంత పొరబాటో తెలుసుకుంటాడు.

అప్పుడు పిల్లవాడు వాడి నోటితోనే కుమార్ వయసు $x + 3$ సంవత్సరాలని నవ్వుతూ చెప్తాడు.

**ఇప్పుడు లెక్కలోకి వద్దాం.**

శోభ ప్రస్తుత వయసు $x$ సంవత్సరాలు.

13 ఏళ్ళ క్రితం శోభ వయసు, 13 ఏళ్ళ తర్వాత శోభ వయసు ఎంత వుంటుందో అందులో సగం.

దీన్ని మనం *equation* గా వెయ్యాలి. కాబట్టి వాక్యాన్ని రెండుగా విభజించుకుని ఇక్కడ నిదానం పాటించాలి.

శోభ వయసు ప్రస్తుతం $x$ సంవత్సరాలు గదా. 13 సంవత్సరాల క్రితం ఆ అమ్మాయి వయసు $x - 13$ సంవత్సరాలు.

(అంతే కదా. 16 ఏళ్ళ అమ్మాయి వయసు నాలుగేళ్ళ క్రితం $16 - 4 = 12$ ఏళ్ళు కదా మరి)

13 సంవత్సరాల తర్వాత శోభ వయసు $x + 13$ సంవత్సరాలు. ఇప్పుడు వాక్యాన్ని రెండుగా విభజించుకుని *Algebric expressions* ను రాసుకున్నాం.

ఇక లెక్కలో ఇచ్చిన సంబంధాన్ని *equate* చేద్దాం.

13 సంవత్సరాల క్రితం శోభ వయసు, 13 సంవత్సరాల తర్వాత శోభ వయస్సులో సగం.

కాబట్టి *equation*

$$x - 13 = \frac{x + 13}{2}$$

$$2\,(x - 13) = x + 13$$

(చూశారా? ఎడమ పక్కకి 2 వచ్చి గుణిస్తోంది. ఆ రెండు $x - 13$ మొత్తాన్నీ గుణించాలి. కాబట్టి అందాకా లేని *bracket* వచ్చి పడింది)

$2x - 26 = x + 13$

$2x - x = 13 + 26 = 39$

$x = 39$ సంవత్సరాలు.

శోభ ప్రస్తుత వయసు 39 సంవత్సరాలు.

**సరి చూసుకుందాం :**

39 సంవత్సరాలున్న శోభ వయస్సు 13 సంవత్సరాల క్రితం 26 సంవత్సరాలు. 13 సంవత్సరాల తర్వాత 39 + 13 = 52 సంవత్సరాలు.

$$26 = \frac{52}{2} = 26$$

అంటే 13 సంవత్సరాల క్రితం ఆమె వయస్సు 13 సంవత్సరాల తర్వాత ఆమె వయస్సులో సగం.

లెక్క సరిపోయింది.

**2.** ***The present age of a boy is one sixth the age of his father, 5 years later the sum of their ages will be 45 years. Find their present ages.***

**జవాబు:** ప్రస్తుతం తండ్రి వయసు $x$ సంవత్సరాలనుకుందాం. అప్పుడు కొడుకు వయసు $x/6$ సంవత్సరాలు. ఎందుకంటే కొడుకు వయసు తండ్రి వయసులో ఆరో వంతు కాబట్టి.

అంతేకాని మళ్ళా కొడుకు వయసు $y$ సంవత్సరాలు అని అనుకోవాల్సిన పన్లేదు.

ఒక వేళ మనం కొడుకు వయసు $x$ సంవత్సరాలను కున్నామనుకోండి. అప్పుడు తండ్రి వయసు $6 \times x = 6x$ సంవత్సరాలు. ఎందుకంటే తండ్రి వయసు కొడుకు వయస్సుకు 6 రెట్లు కనుక. ఇట్లా అర్థం చేసుకోవాలన్న మాట.

ఇప్పుడు మనం మొదట తండ్రి వయసు $x$ సంవత్సరాలనుకున్నాం. కొడుకు వయసు $x/6$ సంవత్సరాలయింది.

ఇక లెక్కలో రెండో వాక్యం. అయిదేళ్ళ తర్వాత వాళ్ళ వయసుల మొత్తం 45 సంవత్సరాలు.

ఇక్కడ తొందర పడిపోయి అప్పుడే *equation* వేసుకోవడం మొదలు పెట్టకూడదు.

ఈ వాక్యాన్ని రెండుగా విభజించుకుని చూడాలి.

అయిదేళ్ళ తర్వాత వాళ్ళ వయసులు ఎంతవుతాయో చూసి ఆ తర్వాత *equation* జోలికి వెళ్ళాలి.

అయిదేళ్ళ తర్వాత తండ్రి వయసు $x + 5$ సంవత్సరాలు.

అయిదేళ్ళ తర్వాత కొడుకు వయసు $x/6 + 5$ సంవత్సరాలు.

ఇప్పుడు వాళ్ళ మొత్తం వయసు 45 సంవత్సరాలని లెక్కలో ఇచ్చారు కాబట్టి *equation* జోలికి వెళ్ళాలి.

5 ఏళ్ళ తర్వాత . . . . తండ్రి వయసు + కొడుకు వయసు = 45 సంవత్సరాలు.

$$x + 5 + \frac{x}{6} + 5 = 45$$

$$x + \frac{x}{6} + 10 = 45$$

$$x + \frac{x}{6} = 45 - 10 = 35$$

$$\frac{6x + x}{6} = 35$$

$$\frac{7x}{6} = 35$$

$$7x = 35 \times 6 = 210$$

$x = 30$ సంవత్సరాలు.

అంటే తండ్రి వయసు 30 సంవత్సరాలు. కొడుకు వయసు తండ్రి వయసులో ఆరో వంతు గదా అంటే $30 \times 1/6 = 5$ సంవత్సరాలు.

కాబట్టి *Answer*

ప్రస్తుతం తండ్రి వయస్సు 30 సంవత్సరాలు

కొడుకు వయసు 5 సంవత్సరాలు.

**సరిచూద్దాం :** కొడుకు వయసు 5 సంవత్సరాలు. తండ్రి వయసు కొడుకు వయసుకు ఆరు రెట్లు.

తండ్రి వయసు = 5 × 6 = 30 సంవత్సరాలు.

సరి పోయింది.

**3.** ***The present age of a man is three times that of his son. Six years ago, the age of the man was four times that of his son. Find the ratio of their ages 6 years later.***

**జవాబు:** ప్రస్తుతం కొడుకు వయసు $x$ సంవత్సరాలు. కాబట్టి లెక్క ప్రకారం తండ్రి వయసు $3x$ సంవత్సరాలు. ఆరేళ్ళ క్రితం వారి వయసులు.

కొడుకు వయసు $x - 6$ సంవత్సరాలు.

తండ్రి వయసు $3x - 6$ సంవత్సరాలు.

ఆరేళ్ళ క్రితం వయసులప్పుడు – ఆ తండ్రీ కొడుకుల వయసుల్లో సంబంధం ఇచ్చాడు. *Equation* రాసుకుంటే లెక్క ప్రకారం అది :

ఆరేళ్ళ క్రితం తండ్రి వయసు = 4 × కొడుకు వయసు.

$3x - 6 = 4 \times (x - 6)$

$3x - 6 = 4x - 24$

$3x - 4x = -24 + 6$

$= -18$

$-x = -18$

కాబట్టి $x = 18$

ప్రస్తుతం కొడుకు వయసు 18 సంవత్సరాలు.

తండ్రి వయసు = 3 × కొడుకు వయసు

= 3 × 18 సంవత్సరాలు.

= 54 సంవత్సరాలు.

లెక్క ఇంతటితో అయిపోలేదు. ఆరేళ్ళ తర్వాత వారి వయసుల నిష్పత్తి మనకి కావాలి.

నిష్పత్తిని లెక్క గట్టే ముందు ఆరేళ్ళ తర్వాత వారి వయసులు ఎంత వుంటాయో చూడాలి.

ఆరేళ్ళ తర్వాత కొడుకు వయసు :

18 + 6 = 24 సంవత్సరాలు

తండ్రి వయసు 54 + 6 = 60 సంవత్సరాలు.

తండ్రి వయసు : కొడుకు వయసు = 60 సంవత్సరాలు : 24 సంవత్సరాలు.

= 5 : 2

ఇదీ *Answer.* నోటితోనే సరి చూసుకోండి.

**4.** ***The present age of Sowmya is one fourth that of her mother Sobhana devi. 20 years later, the age of Sowmya will be half the age of her mother. Find their present ages.***

**జవాబు:** తల్లి శోభనా దేవి వయసు : $x$ సంవత్సరాలు అనుకుందాం. అప్పుడు లెక్క ప్రకారం కూతురు సౌమ్య వయసు $x/4$ సంవత్సరాలు. 20 ఏళ్ళ తర్వాత తల్లి వయసు $x + 20$ సంవత్సరాలు.

ఇక ఇరవై ఏళ్ళ తర్వాత తల్లీ కూతుళ్ళ వయసుల మధ్య సంబంధాన్ని లెక్కలో ఎట్లా ఇచ్చారో చూద్దాం.

20 ఏళ్ళ తర్వాత కూతురి వయసు తల్లి వయసులో సగమట.

*Euation* రాసుకుందాం.

$$\frac{x}{4} + 20 = \frac{1}{2}\,(x+20)$$

$$\frac{x+80}{4} = \frac{1}{2}\,(x+20)$$

$$x+80 = 4\times \frac{1}{2}\,(x+20)$$

$x + 80 = 2\,(x + 20)$

$x + 80 = 2x + 40$

$x - 2x = 40 - 80$

$-x = -40$

$x = 40$ సంవత్సరాలు.

అంటే తల్లి శోభనాదేవి వయసు ప్రస్తుతం 40 సంవత్సరాలు.

కాబట్టి కూతురి వయసు లెక్క ప్రకారం తల్లి వయసులో నాలుగో వంతు కదా.

అంటే కూతురు సౌమ్య వయసు 10 ఏళ్ళు.

నోటితోనే వచ్చిన సమాధానాలను సరి చూసుకోవచ్చు.

ఇంత వయసు వచ్చాక ఈ లెక్క మనకే ఇలా వుంటే 12 వ ఏడు నడుస్తోన్న ఏడవ తరగతి పిల్లలకి ఎలా వుంటుంది? అందుకే నిదానంగా ఈ subject కు సంబంధించిన *Concept* ని విడమరచి చెప్పాలి.

# రెండంకెల సంఖ్యలతో లెక్కలు

**ఇ**వి కూడా ఉద్యోగార్థులకు ప్రతీ పరీక్షలో వచ్చే లెక్కలే. అయినా పిల్లలకు మాత్రం ఏడో తరగతిలోనే వస్తాయి.

జాగ్రత్తగా ఈ లెక్కల్ని చూసే ముందు కొన్ని విషయాలు గమనంలోకి తెచ్చుకుందాం.

రెండంకెల సంఖ్యను ఒకదాన్ని తీసుకుందాం.

23.

దీన్ని రెండూ మూడూ అని అనం.

ఇందులో 3 అనేది ఒకట్ల స్థానంలో వుంది. 2 అనేది పదుల స్థానంలో వుంది.

ఇక్కడ ఒకట్ల స్థానంలో వున్న మూడు మూడే అయినా పదుల స్థానంలో వున్న రెండు, రెండు కాదు. ఇరవై.

23ను ఇట్లా రాయవచ్చు.

ఒకట్ల స్థానంలో వున్న 3

పదుల స్థానంలో వున్న 2

ఇప్పుడు సంఖ్య 23 ఈ రూపంలో వుంది.

$2 \times 10 + 3 \times 1$

$20 + 3 = 23$

ఇప్పుడు *Algebra* లోకి వద్దాం.

**ఏదైనా ఒక సంఖ్యలో ఒకట్ల స్థానంలో $y$ పదుల స్థానంలో $x$ వుందనుకుందాం. అప్పుడు ఆ సంఖ్య ఏది?**

ఈ ప్రశ్న పిల్లలకి వేసిన వెంటనే వాళ్ళు పైకప్పు కేసి చూసి ఒకట్ల స్థానంలో $y$, పదుల స్థానంలో $x$ కదా అని ఆలోచించి ఇలా అంటారు.

$xy$ సార్ అని.

ఇది తప్పా?

నిజానికి ఇది రైటే. కానీ ఇది భయంకరమైన తప్పు. $xy$ అంటే $x$, $y$ గుణించుకుంటున్నాయని అర్థం.

ఇదే లెక్కను వాస్తవ జీవితంలో వున్న అంకెలు తీసుకుని ఇలా చెప్తాం.

ఒకట్ల స్థానంలో 3 వుంది. పదుల స్థానంలో రెండు వుంది. ఆ సంఖ్యను చెప్పు అంటే పిల్లవాడు పదుల స్థానంలో వున్న అంకెను మొదటా, దాని పక్కన ఒకట్ల స్థానంలో వున్న అంకెనూ పెట్టి 23 సార్ అని అంటాడు. ఇది అక్షరాలా కరెక్టు. అంటే 23 లో 2, 3 పక్కపక్కనే వున్నా అవి రెండూ గుణించుకుంటూ లేవు. స్థానాల వారీగా వాటి ధర్మాలని అవి నిర్వర్తిస్తున్నాయి.

$2 \times 10 + 3$ గా అవి వున్నాయి.

*Algebra* లో అయితే పెద్ద తేడా వచ్చేస్తుంది. *Algebra* లో $xy$ అంటే $x$ ఇంటూ $y$ అని.

ఇప్పుడు 23 ను తీసుకోండి. ఒకట్ల స్థానంలో వున్న అంకె : 3. దీన్ని $y$ అనుకుందాం.

పదుల స్థానంలో వున్న అంకె : 2. దీన్ని $x$ అనుకుందాం.

$$\begin{array}{cc} 2 & 3 \\ \downarrow & \downarrow \\ x & y \end{array}$$

ఏదైనా ఒక రెండంకెల సంఖ్య

= పదుల స్థానంలో వున్న అంకె × 10 + ఒకట్ల స్థానంలో వున్న అంకె.

కాబట్టే $23 = 2 \times 10 + 3$.

ఇప్పుడు $x, y$ లలోకి రండి. పదుల స్థానంలో ఏమి వుంది? $x$ వుంది. ఒకట్ల స్థానంలో ఏమి వుంది? $y$ వుంది.

ఇప్పుడా సంఖ్య $xy$ కాదు.

రెండంకెల సంఖ్య = 10 × పదుల స్థానంలో వున్న అంకె + 1 × ఒకట్ల స్థానంలో వున్న అంకె.

$= 10x + y$

అదే ఒకట్ల స్థానానికి$x$ నూ, పదుల స్థానానికి$y$ నీ ఇచ్చామనుకోండి. $x, y$ లతో వున్న సంఖ్య $10y + x$ అవుతుంది.

ఈ గొడవ పిల్లవాళ్ళకు మామూలు అంకెలను తీసుకుని చెప్పకుండా ఒకటి మాట్లాడితే తక్కువ, రెండు మాట్లాడితే ఎక్కువ అన్నట్టు దౌర్జన్యంగా చెప్పామనుకోండి. పిల్లలు సంఖ్యలను $xy$ అనే అంటారు కానీ $10y + x$ అనీ, $10x + y$ అనీ అననే అనరు.

**ఇందాకా మనం నేర్చుకున్నది :**

పదుల స్థానంలో వున్న *literal number* ని పదితో గుణించి దానికి ఒకట్ల స్థానంలో వున్న *literal number* ని *add* చేస్తేనే మనకు $x, y$ లలో అసలు సంఖ్య వస్తుంది.

ఇప్పుడు ఒకట్ల స్థానం : $a$

పదుల స్థానం : $b$

సంఖ్య $= 10 \times b + a$

$= 10\text{ b} + \text{a}$

ఒకట్ల స్థానం : $f$

పదుల స్థానం : $g$

సంఖ్య $= 10 \times g + f$

$= 10g + f$

అలాగే ఒకట్ల స్థానం : $\boldsymbol{x}$

పదుల స్థానం : $\boldsymbol{y}$

వందల స్థానం : $\boldsymbol{z}$

ఆ మూడంకెల సంఖ్య $\boldsymbol{zyx}$ కాదు.

$100 \times z + 10 \times y + x$

$100z + 10y + x$

ఇప్పుడు నేర్చుకున్న విషయాలతో సంఖ్యలతో వుండే లెక్కల్ని చూద్దాం.

***1. In a two digit number, the unit's digit is 7 more than the ten's digit. Sum of the digits is ½ of the whole number. Find the digits and number.***

**జవాబు:** రెండంకెల సంఖ్య కదా ఒకట్ల స్థానంలో వున్న అంకెను $x$ అనీ, పదుల స్థానంలో వున్న అంకెని $y$ అనీ అనుకుందాం.

అప్పుడు సంఖ్య $10 \times y + x$

(పదుల స్థానంలో $y$ వుంది గాబట్టి $y$ ని 10 తో గుణించాం.)

కనుక సంఖ్య $10y + x$.

లెక్కలో ఇచ్చిన దాన్ని బట్టి ఒకట్ల స్థానంలో వున్న అంకె పదుల స్థానంలో వున్న అంకె కంటె 7 ఎక్కువ అట.

*equation* రాసుకుందాం.

$x = y + 7$ .......... (1)

తర్వాత లెక్కలో వున్న సమాచారం ఏమంటే ఒకట్ల, పదుల స్థానంలో వున్న అంకెల మొత్తం సంఖ్యలో సగమట.

అంకెల మొత్తం $= x + y$

సంఖ్య $= 10y + x$

అంకెల మొత్తం = సంఖ్యలో సగం.

$$x + y = \frac{10y + x}{2} \quad \text{................ (2)}$$

ఇప్పుడు మనకు 2 *equations* వచ్చాయి. వాటిని సాధిద్దాం.

$x = y + 7$

అంటే $x - y = 7$

$$x + y = \frac{10y + x}{2}$$

$2(x + y) = 10y + x$

$2x + 2y = 10y + x$

$2x + 2y - (10y + x) = 0$

$2x + 2y - 10y - x = 0$

$x - 8y = 0$

$x = 8y$

దీన్ని *equation* (1) లో *substitute* చేద్దాం.

*equation* (1)

$x = y + 7$

$8y = y + 7$

$8y - y = 7$

$7y = 7$

$$y = \frac{7}{7} = 1$$

పదుల స్థానంలో వున్న అంకె 1 అని మనకు తెలిసింది.

ఒకట్ల స్థానంలో వున్న అంకె = పదుల స్థానంలో వున్న అంకె కంటే ఏడు ఎక్కువ.

కాబట్టి ఒకట్ల స్థానంలో వున్న అంకె 1 + 7 = 8

ఒకట్ల స్థానంలో వున్న అంకె = 8

పదుల స్థానంలో వున్న అంకె = 1

కాబట్టి సంఖ్య

= 10 × పదుల స్థానంలో వున్న అంకె + ఒకట్ల స్థానంలో వున్న అంకె.

= 10 × 1 + 8

= 18

*Answer* 18.

**సరి చూద్దాం.**

ఒకట్ల స్థానంలో వున్నది 8, పదుల స్థానంలో వున్నది 1.

ఒకట్ల స్థానంలో వున్న 8, పదుల స్థానంలో వున్న ఒకటి కంటే 7 ఎక్కువ. సరిపోయింది.

**2.** ***In a two - digit number, the unit's digit is 5 less than the ten's digit. The whole number is 8 times the sum of the digits. Find the number.***

**జవాబు:** ఒకట్ల స్థానంలో వున్న అంకె : $x$

పదుల స్థానంలో వున్న అంకె : $y$

అప్పుడు సంఖ్య = $10y + x$

లెక్క ప్రకారం ఒకట్ల స్థానంలో వున్న అంకె పదుల స్థానంలో వున్న అంకె కంటే 5 తక్కువట. *Equation* రాసుకుందాం.

$x = y - 5$ ........ (1)

తర్వాత ఇచ్చిన సమాచారం

ఆ సంఖ్య = ఒకట్ల, పదుల స్థానంలో వున్న అంకెల మొత్తానికి 8 రెట్లు.

$10y + x = 8(x + y)$

$10y + x = 8x + 8y$

$10y + x - 8x - 8y = 0$

$-7x + 2y = 0$ ............ (2)

(1) ని (2)లో ప్రతిక్షేపిద్దాం.

$-7(y - 5) + 2y = 0$

$-7y + 35 + 2y = 0$

$-5y + 35 = 0$

$-5y = -35$

$$y = \frac{-35}{-5}$$

$y = 7$

ఈ $y = 7$ ను $x = y - 5$

*equation* లో *substitute* చేస్తే మనకు $x$ విలువ తెలుస్తుంది.

$x = y - 5$

$x = 7 - 5$

$= 2$

ఒకట్ల స్థానంలో వున్న అంకె : 2

పదుల స్థానంలో వున్న అంకె : 7

కాబట్టి సంఖ్య $= 10y + x$

$= 10 \times 7 + 2$

$= 70 + 2$

$= 72$

**సరి చూద్దాం :**

ఒకట్ల స్థానంలోని అంకె పదుల స్థానంలోని అంకె కంటే 5 తక్కువ.

సరిపోయింది గదా.

ఒకట్ల స్థానంలోని అంకె = పదుల స్థానంలోని అంకె −5

$2 = 7 - 5$

$2 = 2$

# ముఖ్య సూత్రాలూ వాటి ఉపయోగాలూ

**ప**దో తరగతిలో ఫెయిల్ అయ్యే పిల్లల్ని *Maths* కు సంబంధించి 5 నిమిషాలు మాట్లాడి చెప్పేయొచ్చు. $(a + b)^2$ సూత్రాన్నడిగితే చెప్తారు. $(a - b)^2$ ను కూడా కష్టం మీద చెప్తారు. $(a + b)(a - b)$ నీ, $(a + b)^3$ నీ, ఆ తర్వాత $(a - b)^3$ నూ అడిగామంటే సముద్రంలో పడిపోయిన భావనతో ఉక్కిరి బిక్కిరై పోతారు.

ఏ సూత్రం ఎందుకట్లా వచ్చిందో చెప్తే ఇంత *Confusion* వుండదు. ముందు $(a + b)^2$ ను చూద్దాం.

$(a + b)^2$ ను చాలా మంది $a^2 + b^2$ అనేసి ఊరకుండి పోతారు. $+ 2ab$ అనేది కూడా వస్తుందని ఆ సూత్రాన్ని వివరంగా అట్లా ఎందుకొస్తుందో చేసి చూపించాలి.

**$(a + b)^2$**

ముందు ***Whole square*** అంటే దాన్ని దాంతోనే గుణించడం.

$(a + b)^2 = (a + b)\ (a + b)$

$= (a + b)\ a + b\ (a + b)$

$= a.a + b.a + b.a + b.b$

$= a^2 + 2ba + b^2$

$= a^2 + 2ab + b^2$ (ఎందుకంటే $ba$ అన్నా $ab$ అన్నా ఒకటే).

ఇట్లా వెయ్యటం వల్ల $2ab$ ఎందుకొచ్చిందో తెలిసిపోతుంది.

**దీనివల్ల ఉపయోగాలు :** *Bank exams*లో 1001 × 1001 ఎంత అని అడిగారనుకోండి. దాన్ని మామూలు *arithmetic* పద్ధతిలో ఎవరన్నా గుణిస్తే 2 నిమిషాలు పట్టొచ్చు.

ఎనిమిదో తరగతి పిల్లవాడైనా, *Algebra Concept* బాగా వంట పట్టిందంటే వాడెప్పుడూ మామూలు పద్ధతిలో గుణించడు. సూత్ర ప్రకారం పోతాడు.

1001 x 1001

1001 ని 1000 + 1 గా రాసుకుంటే

$1001 \times 1001 = (1000 + 1)^2$

బ్రాకెట్‌లో రెండు అంకెలున్నాయి. అవి $a = 1000$ అనీ $b = 1$ అనీ అనుకుందాం. అంటే $(a + b)^2$ *form* లో వుందన్న మాట. సూత్రాన్ని ఉపయోగిద్దాం.

$(1000 + 1)^2 = 1000^2 + 2 \times 1000 \times 1 + 1^2$

$[(a + b)^2 = a^2 + 2ab + b^2]$

$= 10,00,000 + 2,000 + 1$

$= 10,02,001$

ఈ సూత్రాన్ని మనసులో పెట్టుకుని ఈ లెక్కను నోటితోనే చెప్పొచ్చు. ఇక $(a - b)^2$ అమాయక చక్రవర్తులైన పిల్లలకి ఇది $a^2 - b^2$. కానీ కాదు.

చేసి చూపించాలి.

$(a - b)^2 = (a - b)(a - b) = (a - b)a - b(a - b)$

$= aa - ba - b.a + b.b$

$= a^2 - 2ab + b^2$

$(a - b)^2$ అయినా ఇప్పుడు $+b^2$ ఎందుకొచ్చిందో పిల్లలకి తెలుస్తుంది.

**దీని వల్ల ఉపయోగాలు :** 999 × 999 ని చేయాల్సి వచ్చిందనుకోండి. మామూలు పద్ధతుల్లో గుణించి అగచాట్లు పడాల్సిన పన్లేదు.

999 ని 1000 – 1 గా రాసుకోవచ్చు.

ఇప్పుడు $999 \times 999 = (1000 - 1)(1000 - 1)$

$(1000 - 1)(1000 - 1) = 1000^2 - 2 \times 1000 \times 1 + 1^2$

$[(a - b)^2 = a^2 - 2ab + b^2]$

$= 10,00,000 - 2,000 + 1$

$= 9,98,001$

ఇక $\boldsymbol{(a + b)(a - b)}$

$(a + b)(a - b) = (a + b)a - b(a + b)$

$= a.a + b.a - b.a - b.b$

$= a^2 - b^2$

అంటే ( మొదటి పదము + రెండవ పదము) (మొదటి పదము – రెండవ పదము)

= మొదటి పదము$^2$ – 2 వ పదము$^2$ అన్నమాట.

ఇప్పుడు లెక్క తిరగేసి మరగేసి ఎట్ల ఇచ్చినా చేయొచ్చు.

**ఉపయోగాలు :** $102 \times 98$

102 ని 100 + 2 గా

98 ని 100–2 గా రాయచ్చు.

$102 \times 98 = (100 + 2)(100 - 2)$

$= 100^2 - 2^2$

$= 10,000 - 4 = 9,996.$

ఇంకా క్లిష్టమైన సమస్యల్ని చూద్దాం.

మీరు డిఎస్సీ పరీక్షకు హాజరయ్యారు. మీరు చదివింది బియ్యే హిస్టరీ, ఎకనామిక్స్, పాలిటిక్స్ అయినా మీరు $10^{th}$ చదివే వుంటారు గదా.

మీకీ లెక్కనిస్తారు.

$0.57 \times 0.57 - 0.43 \times 0.43$

ఈ లెక్కను పరీక్ష హడావుడిలో చెయ్యడానికి ఎంతసేపు గస పోయాలోచూడండి.

$(a + b)(a - b) = a^2 - b^2$ అన్న సూత్రంలోని *Concept* వొంట బట్టి వుండిందనుకోండి. అప్పుడు సూత్రం వెనక వైపు నుంచి ముందుకొస్తారు.

$a^2 - b^2 = (a + b)(a - b)$ కదా అని తడుతుంది.

$0.57 \times 0.57 - 0.43 \times 0.43$ అంటే $(0.57)^2 - (0.43)^2$

సూత్రం *apply* చేస్తారు.

$(0.57)^2 - (0.43)^2 = (0.57 + 0.43)(0.57 - 0.43)$

$[a^2 - b^2 = (a + b)(a - b)]$

$= 1 \times 0.14$

$= 0.14$

రెండు సెకండ్లలో ఆన్సర్‌ని మార్క్ చేసి వేరే క్వశ్చన్‌కి వెళ్ళిపోతారు.

**ఇంకో లెక్క :**

$157^2 - 43^2$

$= (157 + 43)\,(157 - 43)$

$= 200 \times 114$

$= 22,800$

**ఇంకో లెక్క :**

$$\mathbf{\frac{75^2 - 25^2}{100^2 - 50^2}}$$

*numerator* (లవము) $= 75^2 - 25^2$

$= (75 + 25)\,(75 - 25)$

$= 100 \times 50$

*Denominator* (హారము)

$= 100^2 - 50^2$

$= (100 + 50)\,(100 - 50)$

$= 150 \times 50$

$$\frac{\text{లవము}}{\text{హారము}} = \frac{75^2 - 25^2}{100^2 - 50^2} = \frac{100 \times 50}{150 \times 50}$$

$$= \frac{2}{3}$$

ఈ సూత్రం *Concept* తెలిసి వుంటే పేపరు మీద పెన్ను పెట్టకుండా రెండు సెకండ్లలో *Answer* ని *tick* చేస్తారు.

మరో సూత్రం

$\boldsymbol{(a + b)^3}$

*Whole Cube* అంటే ఏమిటి? దాన్ని దాంతోనే 3 సార్లు గుణించడం. అంతేగాని దాన్ని 3 తో గుణించడం కాదు.

$a^3 = a \times a \times a$ అన్నమాట.

$a^3 = a \times 3$ కాదు.

ఇప్పుడు $(a + b)^3$ దగ్గరకు పోదాం.

$(a + b)^3 = (a + b)\,(a + b)\,(a + b)$

$= (a + b)^2\,(a + b)$

[ఎందుకంటే $(a + b)\,(a + b)$ అంటే $(a + b)^2$ కాబట్టి]

$(a + b)^2$ సూత్రం $a^2 + 2ab + b^2$ అని మనకు తెలుసు గనుక.

$(a + b)^3 = (a + b)^2 . (a + b)$

$= (a^2 + 2ab + b^2)\,(a + b)$

$= (a^2 + 2ab + b^2)\;a + b\;(a^2 + 2ab + b^2)$

$= a^2.a + 2ab.a + b^2.a + b.a^2 + 2ab.b + b.b^2$

$= a^3 + 2a\,.\,a\,.\,b + b^2.a + b.a^2 + 2ab.b + b^3$

$= a^3 + 2a^2b + ab^2 + a^2b + 2ab^2 + b^3$

$= a^3 + 2a^2b + a^2b + ab^2 + 2ab^2 + b^3$

$= a^3 + 3a^2b + 3ab^2 + b^3$

కాబట్టి $(a + b)^3 = a^3 + 3a^2b + 3ab^2 + b^3$

దీన్నే ఇలా గూడా చెప్పుకోవచ్చు.

$(a + b)^3 = a^3 + 3ab\,(a + b) + b^3$

పై *equation* లో $3ab$ ని కామన్ తీయడం వల్లా ఇలా అయ్యింది.

ఇక $\mathbf{(a - b)^3}$ ని చూద్దాం.

$(a - b)^3$ అంటే $(a - b)$ ని $(a - b)$ తో 3 *times multiply* చెయ్యడం.

$(a-b)^3 = (a-b)\,(a-b)\,(a-b)$

$= (a-b)^2 \,.\, (a-b)$

$(a-b)^2 = a^2 - 2ab + b^2$ సూత్రాన్ని $(a-b)^2$ బదులు *Substitute* చేస్తే

$(a-b)^3 = (a^2 - 2ab + b^2)\,(a-b)$

$= (a^2 - 2ab + b^2)\; a - b\; (a^2 - 2ab + b^2)$

$= a^2.a - 2ab.a + b^2.a - b.a^2 + 2ab.b - b.b^2$

$= a^3 - 2a^2b + ab^2 - a^2b + 2ab^2 - b^3$

$= a^3 - 3a^2b + 3ab^2 - b^3$

దీన్నే $-3ab$ ని *Common* తీస్తే ఇలా వస్తుంది.

$(a-b)^3 = a^3 - 3ab\,(a-b) - b^3$

**మరికొన్ని సూత్రాలు :**

$(\boldsymbol{a}^3 + \boldsymbol{b}^3) \div (\boldsymbol{a} + \boldsymbol{b})$

దీన్ని సాధించడంతో మనకు భాగహారాలు కూడా తెలిసిపోతాయి. కాబట్టి భాగహారాలకు విడిగా ఒక *Chapter* ఇవ్వడం లేదు.

$a + b\;)\;\mathrm{a}^3 + \mathrm{b}^3\;($

*Arithmetic*లో లాగానే *dividend* లో వున్న దాన్ని చూస్తూ ఒక్కొక్కటీ *Cancel* కొట్టుకుంటూ పోవాలి.

$a^3$ పోవాలంటే మనం కుడివైపు చెవిలో $a^2$ వేశామనుకోండి. అప్పుడు $a^2$ ను $(a+\mathrm{b})$తో *multiply* చేస్తాం. $a^3$ వస్తుంది. *Dividend* లోని $a^3$ ఇలా *Cancel* పోతుంది. చేసి చూద్దాం.

$a+b\;)\;a^3 + b^3\;\;(a^2$

$\quad a^2.\mathrm{a} + a^2.b$

---

ఇప్పుడు తీసివేస్తే

$$a+b\ )\ a^3 + b^3\ (a^2$$

$$a^3 + a^2.b$$

$$-\ -$$

$$b^3 - a^2.b$$

ఇప్పుడు *Dividend* లో $a^3$ పోయి కొత్తగా $-a^2b$ వచ్చి చేరింది. దీన్ని పోగొట్టుకోవాలంటే కుడివైపు చెవిలో $-ab$ ని వేసి దీన్ని $(a+b)$ తో *multiply* చెయ్యాలి.

$$a+b\ )\ a^3 + b^3\ (a^2 - \mathrm{ab}$$

$$a^3 + a^2 b$$

$$-\ -$$

$$b^3 - a^2 b$$

$$-a^2b - ab^2$$

$$+\ +$$

$$b^3 + ab^2$$

ఇప్పుడు *Dividend* లోకి కొత్తగా $ab^2$ వచ్చి చేరింది. దీన్ని పోగొట్టుకోవాలి. కుడివైపు చెవిలో $+ b^2$ వేసుకోవాలి.

$$a+b\ )\ a^3 + b^3\ (a^2 - ab + b^2$$

$$a^3 + a^2 b$$

$$-\ -$$

$$b^3 - a^2 b$$

$$-a^2b - ab^2$$

$$+\ +$$

$$b^3 + ab^2$$

$$b^2a + b^3$$

$$-\ -$$

$$0$$

$(a^3 + b^3) \div (a + b)$ *formula* ను పదో తరగతిలోపు పిల్లవాడెవడైనా చెబితే వాడు బ్రహ్మాండమైన తెలివి తేటలతో వున్నట్టు లెక్క. మీరు మీ జిల్లాలో వెయ్యి మంది పిల్లల్ని ఈ ప్రశ్న అడిగి చూడండి. కనీసం 950 మంది పిల్లలు చెప్పలేరు.

ఇదే ప్రశ్నను ఇంకో రకంగా కూడా అడగవచ్చు. $a^3 + b^3$ కి *factors* ఏమిటి? అని. అప్పుడు మన సమాధానం $(a + b)$ *and* $(a^2 - ab + b^2)$ అని. ఎందుకంటే ఈ *factors* ని రెంటినీ గుణిస్తే మనకు $a^3 + b^3$ వస్తుంది కాబట్టి.

ఇక $(a^3 - b^3) \div (a - b)$

ముందు భాగహారం లాగా వివరించాల్సిన పని వుండదు.

$$a-b\ )\ a^3 - b^3\ \ (a^2 + ab + b^2$$

$$a^3 - a^2 b$$

$$-\quad +$$

$$-b^3 + a^2 b$$

$$a^2 b - ab^2$$

$$-\quad +$$

$$-b^3 + ab^2$$

$$ab^2 - b^3$$

$$-\quad +$$

$$0$$

$(a^3 - b^3) \div (a - b) = a^2 + ab + b^2$ అయ్యింది.

దీన్నే $(a^3 - b^3)$ కు *factors* ఏమిటి అని అడిగినప్పుడు $(a - b)$ *and* $(a^2 + ab + b^2)$ అని చెప్పాలి.

నూటికొక్కరు చెప్పే ఫార్ములాలివి.

**వీటివల్ల ప్రయోజనాలు :**

$$\frac{77^3 + 37^3}{77^2 - 77 \times 37 + 37^2}$$

ఈ లెక్క మీకు *competitive exams* లో ఇస్తే దీన్ని చెయ్యడానికి మీరేమై పోతారు? పై లెక్కను జాగ్రత్తగా గమనిస్తే

$$\frac{a^3+b^3}{a^2-ab+b^2}$$ *form* లో వుంది.

$a^3 + b^3 = (a + b)(a^2 - ab + b^2)$ కదా!

ఇందులో $(a^2 - ab + b^2)$ కుడివైపు *multiply* చేస్తోంది. దీన్ని ఎడమ వైపుకి తెస్తే ÷ అవుతుంది ఇలా.

$$\frac{a^3+b^3}{a^2-ab+b^2}=a+b$$

మరి, ఈ *formula* ప్రకారం మన లెక్క 77 నీ 37 నీ కూడేసి 114 అని ఒక సెకనులో చెప్పేయొచ్చు.

ఇలాంటి సూత్రాలన్నీ ఏడో తరగతి, ఎనిమిదో తరగతిలోనే వచ్చినా వీటిని వివరంగా చెప్పుకోక అందరం ముక్కున పెట్టుకుని పది పాసై పోగానే వదిలేస్తాం. వీటినన్నిట్నీ ఈ దృష్టితో వొంట బట్టించుకుంటే 'ఫ్యాను కింద' కూర్చుని పని చేసే ఉద్యోగాలు లభిస్తాయి.

ఇదే అంకెలతో ఈ లెక్కని ఇలా కూడా అడగొచ్చు.

$$\frac{77^3-37^3}{77^2+77\times37+37^2}$$

ఇప్పుడు మనకు టకీమని ఇది

$$\frac{a^3-b^3}{a^2+ab+b^2}$$ *form* లో వున్న దొంగ లెక్క అని తెలిసిపోతుంది.

$$\frac{a^3-b^3}{a^2+ab+b^2}=a-b$$ కదా కాబట్టి

ఈ లెక్కను చూడగానే 77లో నుంచి 37 తీసేసి సెకనులో 40 అనేస్తాం.

ఈ సూత్రాల మీద తయారైన ఒక లెక్కను చూద్దాం. ఇది 8, 9, 10 తరగతుల పిల్లలకి 5 మార్కులకి ఇస్తారు.

***If $a + b + c = 0$ Prove that $a^3 + b^3 + c^3 = 3abc$***

**జవాబు:** లెక్కలో ఇచ్చింది.

$$a + b + c = 0$$

$$a + b = -c$$

మనం చూపాల్సింది $a^3 + b^3 + c^3 = 3abc$ అని. అంటే మనకు $a, b, c$ ల *Cubes* తో పని పడింది. మరి *Cubes* ఎలా వస్తాయి. వాటిని *Cube* చెయ్యాలి.

$a + b = -c$ అని మనకు లెక్కలో ఇచ్చారు గదా.

$$a + b = -c$$

*Cubing on both sides*

$$(a + b)^3 = (-c)^3$$

ఇప్పుడు $(a + b)^3$ సూత్రం మనకు తెలుసు, రెండు రకాలుగా తెలుసు. $a^3 + b^3 + 3ab(a + b)$ అనీ తెలుసు, $a^3 + b^3 + 3a^2b + 3ab^2$ అనీ తెలుసు. ఇందులో మొదటి రకాన్ని తీసుకోవడం మనకు ప్రయోజనకరం.

$$(a + b)^3 = (-c)^3$$

$$a^3 + b^3 + 3ab(a + b) = -c^3$$

$a + b = -c$ అనే దాన్ని ఇక్కడ *Substitute* చేస్తే

$$a^3 + b^3 + 3ab(-c) = -c^3$$

$$a^3 + b^3 - 3abc = -c^3$$

$$a^3 + b^3 + c^3 = 3abc$$

*Prove* అయ్యింది.

ఇదే *Formula* తో ఈ లెక్కను మరోలా అడగవచ్చు.

**If $a^{1/3} + b^{1/3} + c^{1/3} = 0$. Prove that $(a+b+c)^3 = 27abc$**

**జవాబు:** $a^{1/3} + b^{1/3} + c^{1/3} = 0$ (Given)

$$a^{1/3} + b^{1/3} = -c^{1/3}$$

ఇరు వైపులా *equation* ని *Cube* చేస్తే

$(a^{1/3} + b^{1/3})^3 = (-c^{1/3})^3$

ఇది కూడా $(a + b)^3$ లో వున్న సూత్రమే. కాకుంటే ఇక్కడ $a$ బదులు $a^{1/3}$ అనీ, $b$ బదులు $b^{1/3}$ అనీ, $c$ బదులు $c^{1/3}$ అనీ వుంది.

$(a^{1/3} + b^{1/3})^3 = (-c^{1/3})^3$

$(a^{1/3})^3 + (b^{1/3})^3 + 3a^{1/3}\, b^{1/3}\, (a^{1/3} + b^{1/3}) = (-c^{1/3})^3$

*next step* లో ఇలా అవుతుంది.

$a^{1/3 \times 3} + b^{1/3 \times 3} + 3a^{1/3}.b^{1/3}\, (-c^{1/3}) = -c^{1/3 \times 3}$

$a^{1/3 \times 3} + b^{1/3 \times 3} - 3a^{1/3}.b^{1/3}\, c^{1/3} = -c^{1/3 \times 3}$

$a + b - 3a^{1/3} b^{1/3} c^{1/3} = -c$

$a + b + c = 3a^{1/3} b^{1/3} c^{1/3}$

మళ్ళీ ఈ *equation* ను కూడా ఇరు వైపులా *Cube* చేస్తే

$(a + b + c)^3 = (3a^{1/3} b^{1/3} c^{1/3})^3$

$= 3^3 . a^{1/3 \times 3} b^{1/3 \times 3} . c^{1/3 \times 3}$

$= 27\, abc$

పరీక్షల్లో పై లెక్కగాక ఈ లెక్క ఇస్తే ఆ ఏడాది *Maths* లో *pass percentage* ఒక్కసారి పడిపోతుంది.

గుడ్డి వాటంగా పై లెక్కను నేర్చుకున్న పిల్లవాడు ఈ కింది లెక్కను నేర్చుకోక పోతే ఇక అంతే సంగతులు.

అదే $(a + b)^3$ సూత్రం *basics* తెలిసిన పిల్లవాడికి పై లెక్కా ఒకటే కింది లెక్కా ఒకటే.

$(a + b)^3$ సూత్రం ఆనుపానులన్నీ తెలియక పోతే పై లెక్క అయినా పది నిమిషాల్లో నేర్చుకునే లెక్క మీద విద్యార్థి సంవత్సరం పొడుగునా గంటల తరబడీ ఈ చిన్న *Problem* మీద కూర్చుని కుస్తీ పడుతుంటాడు.

# ***Bases and Powers***

**ము**ందు *Base* అంటే ఏమిటో *Power* అంటే ఏమిటో చూద్దాం.

$2^3$ను తీసుకోండి.

2 అనేది *base* (మూలము), 3 అనేది *Power* (ఘాతము)

$2^3$ అంటే 2 ను 2 తో మూడు సార్లు గుణించడం.

$2^3 = 2 \times 2 \times 2$

అంతే గాని $2 \times 3$ కాదు.

ఇప్పుడు $a^m$ ను తీసుకుంటే *a* అనేది *base* అవుతుంది. m అనేది *power* అవుతుంది.

ఏడో తరగతిలో ఈ పాఠం మొదలవుతుంది. $a^m$ అంటే పిల్లలు *am* అనుకుంటారు, వివరంగా చెప్పుకోకపోతే.

$a^m$ అంటే *a* ని *a* తో m సార్లు *multiply* చెయ్యడం.

$a^m = a \times a \times a \times ...... m$ సార్లు

$a^m \neq a \times m$ (*$a^m$ is not equal to $a \times m$*)

**$5x^2$ ను తీసుకోండి *x* కు 3 విలువ ఇవ్వండి.**

అప్పుడు $5x^2 = 5 \times x \times x$

$= 5 \times 3 \times 3$

$= 45$

ఇప్పుడు $(5x)^2$ ను తీసుకోండి. *x* కు 3 విలువ ఇవ్వండి.

$(5x)^2 = 5x \times 5x$

$= 5 \times 5 \times 3 \times 3$

$= 225$

కాబట్టి $5x^2$ వేరూ $(5x)^2$ వేరూ.

$3x^5$ వేరూ $(3x)^5$ వేరూ.

$3x^5$ లో $x$ కే *power* లో 5 వుంది. $(3x)^5$ లో 3 కీ *power* 5 వుంది. $x$ కీ *Power* గా 5 వుంది. అందుకే *bracket* వేశారు. పిల్లలక్కానీ, ఏదో ఒక డిగ్రీ చదువుకుని *Maths* లో *basics* నేర్చుకునే వాళ్ళకి గానీ ఇంత వివరంగా చెప్పక పోతే *concept* అర్థమవదు.

***Bases, Powers* లో వచ్చే ముఖ్య సూత్రాలు :**

1) $a^m \times a^n = a^{m+n}$

2) $\dfrac{a^m}{a^n} = a^{m-n}$

3) $(a^m)^n = a^{mn}$

4) $(ab)^m = a^m b^m$

5) $\left(\dfrac{a}{b}\right)^m = \dfrac{a^m}{b^m}$

6) $a^0 = 1$

7) $a^{-m} = 1/a^m$

ఈ సూత్రాలు ఎందుకు ఇలా వచ్చాయో ఒక్కొక్క దాన్నే పరిశీలిద్దాం.

**$a^m \times a^n = a^{m+n}$ కథ చూద్దాం.**

$a^m \times a^n$ ఇందులో *Power* లో *m, n* లు వేరేగా వున్నా రెంటికీ *base* *'a'* నే. ఇప్పుడు అంకెల్లోకి వద్దాం.

$2^3 \times 2^4$ తీసుకోండి. ఇక్కడ *base 'a'* అనేది 2 అయింది. 3, 4 లు *m, n* లుగా వున్నాయి.

$2^3$ అంటే 2 ను 2 తో 3 సార్లు గుణించడం అని మనకు తెలుసు.

$2^3 = 2 \times 2 \times 2$

అట్లాగే $2^4 = 2 \times 2 \times 2 \times 2$

$2^3 \times 2^4 = 2{\times}2{\times}2{\times}2{\times}2{\times}2{\times}2$ అయ్యింది. ఇక్కడ = కు కుడి పక్క 2 ను 2 ఏడుసార్లు గుణిస్తోంది. కాబట్టి $2^7$ అవుతుంది.

అంటే $2^3 \times 2^4 = 2^7$ అయ్యిందన్నమాట. 7 అంటే 3 + 4 కదా. అంటే $2^3 \times 2^4 = 2^{3+4}$ అయ్యిందన్న మాట.

ఇక్కడ *Power* లో వున్నవి యాడ్ అయ్యాయి.

దీన్ని బట్టి *Base* ఒకటే వుండి *Power* లో వేరే వేరే వున్నా, అవి *multiply* చేసుకుంటున్నప్పుడు *Power* లు *add* అవుతున్నాయి. కాబట్టే $a^m \times a^n = a^{m+n}$.

అలాగే $a^l \times a^m \times a^n \times a^p =$ ను చూద్దాం.

ఇక్కడ అన్నిటికీ *base 'a'* నే. పైగా ఇవి అన్నీ గుణించుకుంటున్నాయి.

కాబట్టి మనం *base 'a'* నే రాసి *power* లన్నిట్నీ *add* చేసి ఇలా చెప్పవచ్చు.

$a^l \times a^m \times a^n \times a^p = a^{l+m+n+p}$

**2) ఇక $\left(\frac{a^m}{a^n}\right) = a^{m-n}$ విషయం చూద్దాం.**

$\frac{3^8}{3^6}$ ను తీసుకోండి.

ఇక్కడ $3^8$, $3^6$ లు భాగించుకుంటున్నాయి.

*Bases* ఒక్కటే, *Power* లే తేడాగా వున్నాయి.

$3^8$ అంటే 3 ని 3 తో ఎనిమిది సార్లు గుణించడం కదా.

కాబట్టి $3^8 = 3\times3\times3\times3\times3\times3\times3\times3$

$3^6 = 3\times3\times3\times3\times3\times3$

$$\frac{3^8}{3^6} = \frac{3\times3\times3\times3\times3\times3\times3\times3}{3\times3\times3\times3\times3\times3}$$

$= 3\times3$

$= 3^2$

$= 3^{8-6}$

అంటే ఏమిటన్న మాట? *Base* ఒకటే వుండి, *Power* లు తేడాగా వుండినప్పుడూ, పైగా అవి భాగించుకునేటప్పుడూ పై పవర్ నుంచి కింది పవర్‌ను తీసివెయ్యడం జరుగుతోంది.

కాబట్టే $\frac{a^m}{a^n} = a^{m-n}$ అవుతోంది.

*Multiply* చేసినప్పుడు పవర్ పెరుగుతున్నట్టూ, *divide* చేసినప్పుడు పవర్ తగ్గుతున్నట్టూ అర్థం చేసుకోవాలి.

**ఇంక మూడో సూత్రం :**

**(3)** $(a^m)^n = a^{mn}$

$(2^3)^4$ ను తీసుకోండి.

*bracket* లో $2^3$ వుంది. హోల్ మొత్తానికీ *Power 4* వుంది.

$(2^3)^4$ అంటే $2^3$ ను $2^3$ తో 4 సార్లు *multiply* చెయ్యాలన్న మాట.

$(2^3)^4 = 2^3 \times 2^3 \times 2^3 \times 2^3$

$= 2^{12}$

సూత్ర ప్రకారం *base* ఒకటే వుండి అవి *multiply* అవుతున్నప్పుడు *powers* కూడ వచ్చును.

$= 2^{3\times 4}$ (12 = 3 × 4 కదా)

ఇక్కడేమి జరిగింది పవర్‌లు రెండూ*multiply* చేసుకున్నాయి.

కాబట్టే $(a^m)^n = a^{mn}$

ఈ సూత్రాన్ని గురించి ఇంకా చెప్పుకోవాలంటే

$[\{(a^m)^n\}^p]^q = a^{mnpq}$ అవుతుందన్న మాట.

**నాలుగో సూత్రం**

$(ab)^m = a^m b^m$

$(2 \times 3)^4$ ను తీసుకుందాం

*bracket* లో $2 \times 3$ వుంది. *power* లో 4 వుంది.

అంటే 2×3 ని 2×3 తో 4 సార్లు గుణించాలి.

$(2\times3)^4 = 2\times3\times2\times3\times2\times3\times2\times3$

రెళ్ళని పక్క పక్క రాస్తే

$(2\times3)^4 = 2\times2\times2\times2\times3\times3\times3\times3$

$= 2^4 3^4$

ఇప్పుడు $(ab)^m = a^m b^m$ ఎందుకైందో మనకి తెలిసిపోయింది.

**ఇంక అయిదో సూత్రం.**

$$\left(\frac{a}{b}\right)^m = \frac{a^m}{b^m}$$

$\left(\frac{2}{3}\right)^4$ ను తీసుకోండి.

*bracket* లో *base* గా $\left(\frac{2}{3}\right)$ వుంది. *power* లో 4 వుంది.

అంటే $\frac{2}{3}$ ని $\frac{2}{3}$ తో 4 సార్లు గుణించాలి.

$\left(\frac{2}{3}\right)^4 = \frac{2}{3}\times\frac{2}{3}\times\frac{2}{3}\times\frac{2}{3}\,\frac{2}{3}$

$$= \frac{2\times2\times2\times2}{3\times3\times3\times3}$$

$$= \frac{2^4}{3^4}$$

కాబట్టే $\left(\frac{a}{b}\right)^m = \frac{a^m}{b^m}$ అయ్యింది.

**$a^0 = 1$ సూత్రాన్ని చూద్దాం.**

$a^0$ నే కాదు *any power zero* కూడా ఒకటే.

$a^0, x^0, y^0$ అన్నీ ఒకటే.

ఎందుకంటే

$2^0$ను తీసుకోండి

$2^0 = 2^{3-3}$ అని రాసుకోవచ్చు కదా.

$2^0 = 2^{3-3}$

$$= \frac{2^3}{2^3}\left(a^{m-n} = \frac{a^m}{a^n}\right)$$ కనుక

$$= \frac{8}{8}$$

$= 1$

ఇలాగ

$4^0 = 4^{2-2}$

$$= \frac{4^2}{4^2}$$

$$= \frac{16}{16} = 1$$

దేన్ని అయినా తీసుకోండి. పవర్‌లో జీరో వుంటే 1 వస్తుంది. పిల్లలకు ఇంత వివరంగా చెప్పకపోతే $a^0$ ఎంత అని దబాయిస్తే *zero* అని బిక్కుబిక్కుమని బదులు చెప్తారు. ఇవన్నీ చేసి చూపిస్తే నిద్రలో లేపి అడిగినా చెప్తారు.

**ఇక చివరి సూత్రం**

$$a^{-m} = \frac{1}{a^m}$$

ఉదాహరణకి $2^{-3}$ని తీసుకోండి.

$2^{-3} = 2^{1-4}$ గా రాసుకోవచ్చు.

*Power* లో – వుంది కాబట్టి

$a^{m-n} = \frac{a^m}{a^n}$ సూత్రం మనకిది వరకే తెలుసు కాబట్టి

$2^{1-4} = \frac{2^1}{2^4}$ గా రాసుకో వచ్చు.

$$2^{1-4} = \frac{2^1}{2^4}$$

$$= \frac{2}{2\times2\times2\times2} = \frac{1}{8} = \frac{1}{2^3}$$

కాబట్టి $a^{-m} = \frac{1}{a^m}$ అన్నమాట.

*Power*లో – వుంది కాబట్టి మీరు ఒక మాదిరి *clever* ను $2^{-2}$ ఎంత అని అడిగితే –4 అని చెప్తారు పిల్లలు.

పవర్‌లో మైనస్ వున్నంత మాత్రాన అది రుణ సంఖ్య కానే కాదు అని ఓపిగ్గా ఇదంతా చేసి చూపిస్తేనే పిల్లవాడు నమ్మి వంట బట్టించుకుంటాడు.

లేకుంటే సవాలక్షతో పాటు దీన్ని కూడా గుర్తు పెట్టుకోలేక సతమతమై పోతాడు.

***Powers & Bases* మీద వచ్చే *problems* ని చూద్దాం.**

$2^8$ పెద్దదా $3^4$ పెద్దదా?

ఉద్యోగాల కోసం నిర్వహించే పరీక్షల్లో ఇలాంటివి మామూలు. ఏడు, ఎనిమిది తరగతుల సిలబస్‌లో వున్నాయి. వీటిని వివరంగా చెప్తే ఆసక్తిగా కూడా వుంటాయి.

ఇలాంటి వాటిని పెద్దవా, చిన్నవా అని చూసేటప్పుడు *base* కానీ *power* కానీ *equal* గా చేసుకుని తేలిగ్గా చెప్పేయొచ్చు.

$2^8$, $3^4$

దీన్ని మామూలు పద్ధతుల్లో అయితే 2 ను 2 తో 8 సార్లు గుణించి లెక్క బెట్టుకోవాలి. ఆ తర్వాత 3 ని 3 తో 4 సార్లు గుణించాలి.

ఈ బెడద అంతా వుండదు చూడండి.

$2^8=(2^2)^4$ అని రాసుకో వచ్చు గదా. ఇక్కడ గూడా $(a^m)^n = a^{mn}$ సూత్రం ఉపయోగాన్ని బట్టి.

$2^8=(2^2)^4$

$= 4^4$

ఇప్పుడు $4^4$, $3^4$ లను పక్కపక్కన రాసుకోండి. *base* లు 4, 3 వేరే వేరే అయినా *power* లో రెండూ ఒకటిగానే వున్నాయి కాబట్టి $4^4$ పెద్దదీ, $3^4$ చిన్నదీ అని ఈజీగా చెప్పేయొచ్చు. అంటే $2^8$ పెద్దదన్నమాట.

ఇంకా వివరంగా వెళ్ళాలి.

**$2^{12}$, $3^8$ ఏది పెద్దది?**

ముందు *powers* ని చూద్దాం 12, 8.

*bases* 2, 3

$12 = 3 \times 4$

$8 = 2 \times 4$ గదా.

$2^{12} = 2^{3x4} = (2^3)^4 = 8^4$

$3^8 = 3^{2x4} = (3^2)^4 = 9^4$

$2^{12} = 8^4$

$3^8 = 9^4$ *Powers equal* అయ్యాయి కాబట్టి $9^4$ పెద్దది అని చెప్పేయొచ్చు.

అంటే $3^8$ పెద్దది $2^{12}$ కంటే.

**$5^{10}$, $3^{15}$ ఏది పెద్దది.**

$5^{10} = 5^{2x5}$

$= (5^2)^5$

$= (25)^5 = 25^5$

$3^{15}= 3^{3x5}$

$= (3^3)^5$

$= 27^5$

కాబట్టి $3^{15}$ పెద్దది.

*Bases & Powers* లో సూత్రాలను ఉపయోగించి కొన్ని లెక్కల్ని చేద్దాం. *Algebra* కు సంబంధించి పిల్లల్లో ఇవి మంచి ఆసక్తిని కలుగజేస్తాయి.

**1) *Find the number to be multiplied by $(-7)^{-1}$ so as to get $10^{-1}$ as the product.***

జవాబు: ఈ లెక్క ఏమంటే $(-7)^{-1}$ ను దేంతో *multiply* చేస్తే మనకు $10^{-1}$ వస్తుంది.

$x$ తో చేస్తే అనుకుందాం.

అప్పుడు లెక్కను బట్టి *equation* ఇలా రాసుకోవచ్చు.

$(-7)^{-1} \times x = 10^{-1}$

మనకు తెలుసు $a^{-m} = \frac{1}{a^m}$ అని. అంటే పవర్‌లో వున్న '–' ను తొలగించు కోవాలంటే *base* ను తిరగెయ్యాలి.

కాబట్టి $(-7)^{-1}$ నూ $10^{-1}$ నూ ఇలా రాసుకుంటాం.

$\left(\frac{1}{-7}\right)$ అనీ $\left(\frac{1}{10}\right)$ అనీ

$(-7)^{-1} \times x = 10^{-1}$

$$\left(\frac{1}{-7}\right) \times x = \left(\frac{1}{10}\right)$$

$$\frac{1}{-7} \times x = \frac{1}{10}$$

$$x = -7 \times \frac{1}{10}$$

$$= -\frac{7}{10}$$

కాబట్టి $-7/10$ తో $(-7)^{-1}$ ను గుణిస్తే మనకు $10^{-1}$ *Product* గా వస్తుంది.

(2) $a^{x-y} . a^{y-z} . a^{z-x} = ?$

**జవాబు:** *Base* లన్నీ *'a'* నే. పైగా అవి గుణించుకుంటున్నాయి. కాబట్టి $a^m \times a^n = a^{m+n}$ సూత్ర ప్రకారం *powers* ను *add* చెయ్యొచ్చు.

$a^{x-y+y-z+z-x}$

$= a^0 = 1$ (ఎందుకంటే దేనికైనా *power* లో '0' వుంటే అది 1 అవుతుందని మనకు తెలుసు).

(3) ***Solve*** $8^{x-1} = 2^{x+3}$

మనం ఇంతకు ముందు కొన్ని లెక్కల్లో చూశాము. *Powers* కానీ *bases* ని కానీ *equal* చేసుకుంటే ఎన్నో లాభాలుంటాయని.

ఇక్కడ *powers* ను *equal* చేసుకునే పరిస్థితి లేదు. అయితే ఈ *Problem* లో *bases* గా వున్న 8 నీ, 2 నీ *equal* చేసుకోవచ్చు.

ఉదాహరణకు $a^m = b^m$ అనుకోండి. అప్పుడు చచ్చినట్టు $a = b$ అవ్వాలి కదా. ఒకవేళ $a^m = a^n$ అనుకోండి. అప్పుడు $m = n$ అవ్వాలి కదా. దీన్ని బట్టి చూద్దాం.

$8^{x-1} = 2^{x+3}$

$8 = 2^3$ కదా!

కాబట్టి $8^{x-1} = 2^{x+3}$ ని

$(2^3)^{x-1} = 2^{x+3}$ గా రాసుకోవచ్చు.

$(2^3)^{x-1}$ అన్నది $(2^m)^n$ *form* లో వుంది కాబట్టి $a^{mn}$ అవుతుంది. కనుక

$(2^3)^{x-1} = 2^{x+3}$

$2^{3(x-1)} = 2^{x+3}$

*When bases are equal then powers are equal.*

కాబట్టి $3(x-1) = x + 3$

$3x - 3 = x + 3$

$3x - x = 3 + 3$

$2x = 6$

$$x = \frac{6}{2} = 3$$

$x$ ను సాధించేశాం.

***(4) If $3^x = 270$, Find $3^{x-3}$***

**జవాబు:** $3^x$ ఇచ్చాడు $3^{x-3}$ ని కనుక్కోమన్నాడు.

$3^{x-3}$ అనేది $a^{m-n}$ *form*లో వుంది. $a^{m-n} = a^m/a^n$ అనే సూత్రం ప్రకారం.

$$3^{x-3} = \frac{3x}{3^3}$$

లెక్కలో $3^x = 270$ అని ఇచ్చారు.

కాబట్టి $3^{x-3} = \dfrac{3x}{3^3}$

$$= \frac{270}{3^3}$$

$$= \frac{270}{27}$$

$= 10$

**(5) $4 \times 8^m = 2^5$ అయితే $m$ విలువ?**

**జవాబు:** ఎడమ పక్క *Base* లుగా 4, 8 వున్నాయి. కుడిపక్క *base* గా 2 వుంది.

కాబట్టి ఎడమ పక్కన కూడా రెళ్ళతో రాసుకోవాలి.

$4 = 2^2$

$8^m = (2^3)^m = 2^{3m}$ [$(a^m)^n = a^{mn}$ కనుక]

ఇప్పుడు లెక్కలోకి వద్దాం.

$4 \times 8^m = 2^5$

$2^2 \times 2^{3m} = 2^5$

ఇప్పుడు ఎడమ పక్క *Base*లు, ఒకే రకంగా వుంటూ అవి గుణించు కుంటున్నాయి. కనుక $a^m \times a^n = a^{m+n}$ సూత్ర ప్రకారం $a^2 \times a^{3\mathrm{m}} = 2^{2+3m}$ అవుతుంది.

కాబట్టి $2^2 \times 2^{3m} = 2^5$

$2^{2+3m} = 2^5$ గా మారుతుంది.

ఇప్పుడు, = వుంటూ, *bases* ఇరువైపులా *equal* గా వున్నాయి.

$a^m = a^n$ అయితే $m = n$ *formula* ప్రకారం

$2^{2+3m} = 2^5$ లో

$2 + 3m = 5$ అవుతుంది.

$3m = 5 - 2$

$= 3$

$$m = \frac{3}{3} = 1$$

**6)** $\left(\frac{x^{\mathbf{a}}}{x^{\mathbf{b}}}\right)^{\mathbf{c}} \times \left(\frac{x^{\mathbf{b}}}{x^{\mathbf{c}}}\right)^{\mathbf{a}} \times \left(\frac{x^{\mathbf{c}}}{x^{\mathbf{a}}}\right)^{\mathbf{b}}$ ఎంత?

జవాబు: $\left(\frac{x^a}{x^b}\right)^c = \left(x^{a-b}\right)^c$

$\left[\left(\frac{a^m}{a^n}\right) = a^{m-n}\right]$ సూత్ర ప్రకారం

$(x^{a-b})^c = x^{(a-b)c}$

$[(a^m)^n = a^{mn}]$ సూత్ర ప్రకారం

$(x^{a-b})^c = x^{(a-b)c}$

$= x^{ac-bc}$

ఇలాగే $\left(\frac{x^b}{x^c}\right)^a = \left(x^{b-c}\right)^a$

$= x^{(b-c)a}$

$= x^{ba-ca}$

$\left(\frac{x^c}{x^a}\right)^b = \left(x^{c-a}\right)^b$

$= x^{b(c-a)}$

$= x^{bc-ba}$

$\left(\frac{x^a}{x^b}\right)^c \times \left(\frac{x^b}{x^c}\right)^a \times \left(\frac{x^c}{x^a}\right)^b$

$= x^{ac-bc} \times x^{ba-ca} \times x^{cb-ba}$

$= x^{ac-bc+ab-ac+bc-ab}$

$(a^m \times a^n \times a^l = a^{m+n+l})$ సూత్రప్రకారం

$= x^0$

$= 1.$

**7) $(4x)^3 = 4^{3^3}$. $x$ ఎంత?**

ఇది ఏడో తరగతిలో వుంది. నేను హైదరాబాద్‌లో అయిదు స్కూళ్ళలో చదివే ఏడో తరగతి పిల్లల నోట్సు చూశాను. అందరూ తప్పే చెప్పారు. టీచర్లను కూడా గందరగోళానికి గురి చేసే ఈ లెక్కని చూద్దాం.

**చాలా మంది టీచర్లు ఈ లెక్కను చెప్పే పద్ధతి**

$(4x)^3 = 4^{3^3}$

ఎడమ వైపూ *Power* లో 3 వుంది, కుడి వైపూ *Power* లో 3 వుందని భ్రమించి టీచరు ఇలా వేస్తాడు.

$(4x)^3 = 4^{3^3}$

*Powers equal* కాబట్టి *bases* కూడా *equal.*

కనుక $4x = 4^3$

$$x=\frac{4^3}{4}$$

$= 4^2$

$= 16.$

కానీ ఇది తప్పు. ఎందుకంటే $4^{3^3}$ వేరూ $(4^3)^3$ వేరూ అని తెలుసుకోకపోతే ఎవరైనా ఇలాగే తప్పు చేస్తారు. *Brackets* పరిజ్ఞానం *Perfect* గా లేక ఇట్లా జరుగుతుంది.

$4^{3^3}$ పైన వున్న 3 *Power* 3 కే వుంది కానీ 4 కి లేదు.

$4^{3^3}$ అంటే $4^{27}$ అని అర్థం.

$4^{3^3} = 4^{3x3x3} = 4^{27}$

$(4^3)^3 = 4^3 \times 4^3 \times 4^3$

రెండూ వేరు కదా మరి.

**కాబట్టి ఈ లెక్క వెయ్యాల్సిన పద్ధతి :**

$(4x)^3 = 4^{3^3}$

$= 4^{27}$

$4^{27}$ ను $4^{9x3}$ గా రాసుకోవచ్చు.

తర్వాత $4^{9x3}$ ని $(4^9)^3$ గా రాసుకోవచ్చు. ఎందుకంటే

$a^{mn} = (a^m)^n$ కనుక

$(4x)^3 = 4^{27}$

$= 4^{9x3}$

$= (4^9)^3$

ఇప్పుడు *Powers equal* అయ్యాయని భావించాలి.

ఇక *bases equal* అవుతాయి.

$4x = 4^9$

$$x = \frac{4^9}{4}$$

$= 4^{9-1}$

$= 4^8$

ఇదీ *correct Answer.*

*Basses & Powers* గురించి గానీ దేని గురించి కానీ చెప్పిందే చెప్పి ఎందుకింత తపన పడుతున్నానంటే మర్మాలు ఇంత సూక్ష్మంగా వున్నాయి. ఈ *concetps* ఎనిమిది, తొమ్మిది తరగతులకు వచ్చినా పిల్లలకి పదే పదే చెపుతూ వుండాలి.

*Algebra* కు సంబంధించి ఈ మాత్రం *Concepts* 6, 7, 8 తరగతుల్లో పిల్లలకి పదే పదే నిదానంగా చెబితే దాని మీద భయం తీరిపోయి ఆసక్తి కలుగుతుంది.

అప్పుడు $a^m \times a^n$ సూత్రాలను ఎలా అడిగినా విద్యార్థి బెదరడు. $(a-b)^3$ నీ, $a^3-b^3$ కి *Factors* నీ ఏమి అడిగినా సందేహం లేకుండా ముఖాన నవ్వుతో సమాధానాలు చెప్తాడు.

# Geometry

**ఆ**ల్జీబ్రా ఒక్కటంటేనేనా పిల్లలకి భయం? జామెట్రీ చాలా ఆసక్తిగా విని అన్ని తెలివితేటలతో వుంటారా?

కానే కాదు.

*Algebra* లో ఎలాగయితే గందరగోళాలు వుంటాయో జామెట్రీలోనూ అంతే గందర గోళాలున్నాయి.

పై తరగతుల్లో పిల్లలకి *Algebra* ఎంత ముఖ్యమో జామెట్రీ కూడా అంతే ముఖ్యం.

జామెట్రీ కొంత వరకు నేర్చుకుందాం.

**మొదట వృత్తం కథ ఏమిటో చూద్దాం.**

*Algebra* లో $(a + b)^2$ సూత్రాన్ని ఎలాగైతే అందరూ చెప్పేస్తారో వృత్తం అనగానే $\pi = 22/7$ ను కూడా అట్లాగే చెప్పేస్తారు.

వృత్తం గుట్టుమట్టులు అన్నీ తెలిస్తేనే తప్ప వృత్త పరిధినీ, వృత్త వైశాల్యాన్నీ చెప్పలేరు.

వృత్తానికి సంబంధించి *diameter* (వ్యాసం) *radius* (వ్యాసార్థం) అంటే ఏమిటో పిల్లలకు ఈజీగానే తెలిసి వుంటుంది.

*diameter* లో సగం *radius.* దీన్నే *equation* గా చెప్పాలంటే

$$r = \frac{d}{2}$$


*r* అంటే *radius, d* అంటే *diameter*

వృత్త పరిధి $= 2\pi r$

వృత్త వైశాల్యం $= \pi r^2$

వృత్తానికి సంబంధించి ఈ నాలుగు మాటలూ చెప్పేసి *exercise* లోకి వెళ్ళిపోతే విద్యార్థికి అన్యాయం చేసినట్టే.

వృత్తం గురించి చాలా చాలా చెప్పాలి.



**ముందు $\pi$ అంటే ఏమిటి?**

గ్రీకు దేశస్తుడొకాయన రకరకాల వ్యాసాలతో వృత్తాల్ని గీశాడు. గీసి వాటి *circumferences* (పరిధులు) ని కొలిచాడు.

గీసిన ప్రతి వృత్త పరిధిని, దాని వ్యాసంతో భాగించాడు.

ఆయన గీసిన ప్రతి వృత్త పరిధి, వ్యాసాల నిష్పత్తి అన్నిటికీ ఒకటే.

ఆయన కనుక్కున్నదిదీ.

$$\frac{\text{వృత్త పరధి}}{\text{వ్యాసం}} = \text{స్థిరాంకం} \ \textit{(Constant)}$$

ఆ స్థిరాంకం కూడా అన్నిటికీ $22/7$ నే.

*Circumference* ని $c$ తోనూ, వ్యాసాన్ని $d$ తోనూ సూచిస్తే,

$$\frac{\text{పరిధి } c}{\text{వ్యాసం } d} = \text{స్థిరాంకం} \quad \pi$$

ఈ స్థిరాంకానికి ఆయన $\pi$ అని పేరు పెట్టాడు.

$\pi = \frac{22}{7}$ అనేది వొచ్చింది ఇట్లా.

మీరు చిన్న వృత్తమైనా గీయండి, ఢిల్లీ పట్టేటంత వృత్తమైనా గీయండి. చిన్నదానికైనా పెద్దదానికైనా

$$\frac{\text{పరిధి}}{\text{వ్యాసం}} = \frac{22}{7} = \pi$$

**వృత్త పరిధి సూత్రం :**

వృత్త పరిధికి సూత్రం చెప్పండి అనగానే పిల్లలు $2\pi r$ అని అనేస్తారు. అయితే అది ఎలా వొచ్చిందో చెప్తేనే పిల్లలకు హత్తుకునేది.

$$\frac{\text{పరిధి } c}{\text{వ్యాసం } d} = \pi \text{ కదా}$$

$$\frac{c}{d} = \pi$$

ఎడమ వైపు భాగించే $d$ ని కుడి వైపుకి పంపిస్తే

$c=\pi\times d$

$d$ అంటే $2r$ కదా.

కాబట్టి $c=\pi\times 2r=2\pi r$

ఇలా వచ్చిందన్న మాట.

చాలా మంది పిల్లలకు *radius* ఇచ్చి *circumference* కనుక్కోమంటే $2\pi r$ సూత్రం ఉపయోగించి లెక్క చేస్తారు కానీ అదే $d$ ని ఇచ్చి కనుక్కోమంటే తికమక పడతారు.

ఈ సూత్రం ఆలా ఎందుకొచ్చిందో తెలిసిన వారికిక అంతా మంచినీళ్ల ప్రాయం.

$c=\pi\times d$ అయినా ఒకటే,

$c=2\pi r$ అయినా ఒకటే.

$\frac{c}{d}=\pi$ అయినా ఒకటే.

$\pi=\frac{22}{7}$ కథ ఇదీ.

$\pi={}^{22}\!/_{7}$ అయినా $\pi$ ఖచ్చితంగా ${}^{22}\!/_{7}$ కాదు. దరి దాపులకు సరిపోతుంది.

22 ను 7 తో భాగిస్తే 3.1416 వస్తుంది. ఇంకా ఇంకా భాగిస్తే అది ఎడ తెగదు. కాబట్టి $\pi$ *rational number* కాదు *irrational number.*

$\pi$ = 3.1416 అనేది గుర్తు పెట్టుకోవడానికొకటి వుంది.


$$\frac{'Yes,}{3}\quad\frac{I}{1}\quad\frac{have}{4}\quad\frac{a}{1}\quad\frac{number'}{6}$$

ఇప్పుడు వృత్త పరిధి గురించీ వ్యాసం గురించీ, వాటి మధ్య వున్న సంబంధం గురించీ, $\pi$ గురించీ మనకు స్పష్టంగా తెలుసు.


ఇప్పుడు మనం వృత్త వైశాల్యం గురించి తెలుసుకుందాం.

**వృత్త వైశాల్యం :**

వృత్తం గీసుకుందాం.



ఈ వృత్తాన్ని 16 సమాన భాగాలుగా చేశాం.




*half the circumference*

ఆ పదహారు భాగాలనూ అలా *arrange* చేశామనుకోండి.

ఇప్పుడీ ఏర్పాటు దీర్ఘ చతురస్రాకారంగా లేదూ దాదాపుగా, అలాగే వుంది.

ఇలా ఏర్పడిన దీర్ఘ చతురస్రాకారం పొడవు $\pi$ *r*. ఎందుకంటే వృత్తంలోని 16 భాగాలనూ అటూ ఇటూ ఎనిమిదేసి పేర్చాం గాబట్టి. అంటే వృత్త పరిధిలో సగం పొడవయ్యింది.

వృత్త పరిధి $2\pi r$ గదా.

సగం $\frac{2\pi r}{2} = \pi r$

వెడల్పు, వృత్త వ్యాసార్థమే కాబట్టి వెడల్పు = $r$

ఇప్పుడు ఈ దీర్ఘ చతురస్ర వైశాల్యం = పొడవు × వెడల్పు


$= \pi r \times r$

$= \pi r^2$

వృత్తమంతా దీర్ఘ చతురస్రాకారంలో పరిచాం గదా. కాబట్టి ఈ దీర్ఘ చతురస్ర వైశాల్యం, వృత్త వైశాల్యానికి సమానమవుతుంది.

కాబట్టే వృత్త వైశాల్యానికి $\pi r^2$ సూత్రాన్ని చెప్పుకుంటాం

ఇక వృత్తంలో సెక్టార్ (ఒక ముక్క) పొడవు ఎంతో, ఆ సెక్టార్ వైశాల్యం ఎంతో చూద్దాం.




వృత్తం ఈ భాగమే సెక్టార్

ఈ సెక్టార్ పొడవు గురించి తెలుసుకుందాం.

**సెక్టార్ పొడవు**

వృత్తంలో $360^0$ వుంటాయి.

వృత్త పరిధికి సూత్రం $\left(\frac{360^0}{360^0}\right) 2\pi r$

ఒక ముక్కను తీసుకున్నామనుకోండి. ఉదాహరణకి $36^0$ల కోణం చేసే ముక్కను తీసుకుంటే $36^0$ మొత్తం $360^0$ లలో ఎన్నో వంతు 1/10 వ వంతు.

సెక్టార్ పొడవు కూడా పరిధిలో 1/10 వ వంతు అవుతుందన్న మాట.

కాబట్టి సెక్టార్ పొడవు $\left(\frac{x^0}{360^0}\right) \times 2\pi r$

అలాగే సెక్టార్ $area\ A = \left(\frac{x^0}{360^0}\right) \times \pi r^2$

ఇంతే, ఇక వృత్తానికి సంబంధించిన *Basics* మనకు తెలిసిపోయినట్టే. ఇక వృత్తం మీద ఎలాంటి ప్రాబ్లెమ్స్ అయినా మనం వేసేయొచ్చు.

కొన్ని లెక్కల్ని చూద్దాం.

**(1) The area of a circle is 616 sq. cms. Find its diameter.**

**జవాబు:** వృత్త వైశాల్యం **(A)** ఇచ్చారు.

$A = \pi r^2 = 616\ sq.\ cm.s$

$\pi = \frac{22}{7}$

కాబట్టి $\frac{22}{7} \times r^2 = 616$

$r^2 = 616 \times 7/22$

$28 \times 7$

$= 196$

$= 14 \times 14$

$r = 14\ Cm.s.$

అంతే.

**(2) The circumference of a circle is C. Find its area?**

**జవాబు:** $c = 2\pi r$ అని మనకు తెలుసు.

$r = \frac{c}{2\pi}$

వృత్తం $Area = \pi r^2$ అనీ మనకు తెలుసు.

కాబట్టి $Area = \pi r^2$

$= \pi \cdot \left(\frac{c}{2\pi}\right)^2$

(ఎందుకంటే $r = c/_{2\pi}$ కనుక)

$$= \frac{\pi . c^2}{4\pi^2}$$

$$= \frac{c^2}{4\pi}$$


ఇవన్నీ తెలియకపోతే పరిధి ఇస్తే వైశాల్యం ఎలా కనుక్కుంటామురా భగవంతుడా అనిపిస్తుంది. Basics తెలిస్తే పరిధి $c$ లో వ్యాసార్థం $r$ వుంటుంది గదా అనిపిస్తుంది.

ఆకలిగొన్న వాడికి వడ్లు ఇస్తే పారబోసుకుంటాడా? రోకట్లో పోసి దంచి బియ్యం చేసుకుని ఎసట్లో పోసుకోడూ! అలాగే ఇదీ....

**3)** ***The area of a semi circle is 1925 Sq. cms. Find its perimeter.***

**జవాబు:**

***semi circle***



వృత్తంలో సగం

***semi circle*** అంటే అర్థ వృత్తం.

మొత్తం వృత్త వైశాల్యం $\pi r^2$ అని మనకు తెలుసు.

అర్థ వృత్త వైశాల్యం $\frac{\pi r^2}{2}$

ఇది లెక్కలో ఇచ్చారు.

$$\frac{\pi r^2}{2} = 1925\ sq.cms.$$

$$= \frac{22}{7} \times r^2 = 1925 \times 2$$

$$r^2 = 1925 \times \frac{7}{22} \times 2$$

$$= 3850 \times \frac{7}{22} = 175 \times 7 = 1225\ sq.cm.$$

$r^2$ = 1225 *sq.cm.*

$r$ = 35 *cms.*

*Perimeter* అంటే చుట్టు కొలత. అర్ధ వృత్తం చుట్టూ ఏమి వుంది.

ఒక అర్ధ వృత్తపరిధి + వ్యాసం అంటే $\pi r + 2r$

$r = 35$ కదా.

*Substitute* చెయ్యండి. $\pi r + 2r =$

$$\left(\frac{22}{7} \times 35 + 2 \times 35\right) cm$$


= (110 + 70) cm.

= 180 cm.


కాబట్టి అర్ధ వృత్తం చుట్టు కొలత 180 cms.

**4).** ***The Circumference of a swimming pool is 66 meters. A circular path of width 3.5 meters is laid out side around it. Find the area of the circular path.***

*swimming pool* $C$ ఇచ్చాడు.



Swimming pool




Swimming pool చుట్టూ బయట 3.5 మీటర్ల వెడల్పుతో ఒక దారి వేస్తే ...

$C = 2\pi r$

$2\pi r = 66$ m

$$\pi r = \frac{66}{2} m$$

$$\frac{22}{7} \times r = \frac{66}{2} m$$

$$r = \frac{66}{2} \times \frac{7}{22} = 10.5 m$$

ఈ $r = 10.5\ m$ కు *circular path width* ను కూడుకుంటే దారితో సహా వున్న పెద్ద సర్కిల్ $R$ తెలుస్తుంది.

కాబట్టి పెద్ద సర్కిల్ R = (10.5 + 3.5) m = 14 m

సర్క్యులర్ *Path area* కావాలంటే పెద్ద వృత్త వైశాల్యంలో నుంచి చిన్న వృత్త వైశాల్యం తీసేస్తే సరి.

ì,,^î=$eç%&1Ø $\pi R^2$

$$\frac{22}{7} \times 14 \times 14\, sqm$$

చిన్న వృత్త వైశాల్యం $= \pi r^2$

$$\frac{22}{7} \times 10.5 \times 10.5 \ sqm$$

*Path* వైశాల్యం $\pi R^2 - \pi r2$


$$\frac{22}{7} \times 14 \times 14 \ sqm - \frac{22}{7} \times 10.5 \times 10.5 \ sqm$$

$= 269.5 \ sqm$

వృత్తం గురించి ఈ మాత్రం Concept ని వంట బట్టించుకుంటే దీని మీద పై తరగతుల్లో వచ్చే సిద్ధాంతలైనా, లెక్కలైనా తికమక లేకుండా స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు.

# త్రిభుజాలు

**ఏ**దైనా ఒక త్రిభుజం గీసి మీ ఎరికలో వున్న పిల్లవాళ్ళను కోణాలు కొలవమనండి. నాకు తెలిసినంత వరకూ కోణమానిని పట్టుకోవడం చేతగాని పిల్లలు 30% వున్నారు.




$\angle B$, $\angle C$ ని కొలిచి $\angle A$ ని కొలవాలంటే పిల్లలు ఎంత తికమక పడతారో గమనించండి.

$\angle ABC$ అంటే $\angle B$ అని తెలియని పిల్లలు ఎంత మందో! పిల్లలకు ఇది గండంగా వుంటుంది.

త్రిభుజాల గురించి చెప్పేటప్పుడు కోణాలని గురించి బాగా వివరించి చెప్పాలి. ఉదాహరణకి $\angle A$ ని కొలవడం.

BA మీద కోణమానిని పెట్టి AC రేఖ వైపు చూసి A కోణాన్ని కొలవాలని చెప్పాలి. పిల్లవాడి చేతికి కోణమానిని ఇచ్చి కొలవమన్నప్పుడు కానీ వాళ్ళ ఇబ్బంది ఏమిటో మనకు అర్థం కాదు.

రక రకాల త్రిభుజాలను గీసి కోణాలను కొలిపించాలి. ఏ త్రిభుజానికైనా మూడు కోణాల మొత్తం $180^0$ లు అవుతుందని చేసి చూపించాలి.

**త్రిభుజ నిర్మాణం :** అసలు త్రిభుజాన్ని నిర్మించాలంటే 3 *independent measurements* అవసరమవుతాయి.

ఉదాహరణకు $60^0$, $30^0$, $90^0$ లు ఇచ్చి పిల్లవాణ్ణి త్రిభుజం నిర్మించమనాలి. వాడికి అది సాధ్యంకాదు. కాబట్టి త్రిభుజ నిర్మాణానికి 3 కోణాలు ఇచ్చినంత మాత్రాన వీలవదు. 2 కోణాలు ఇస్తే, 3వ కోణం ఇవ్వక పోయినా ఇచ్చినట్టేనని భావించేలా వాళ్ళకి చెప్పాలి.

ఒక త్రిభుజంలో 2 కోణాలు $60^0$ , $30^0$ అని ఇచ్చారనుకోండి. 3వ కోణం తప్పని సరిగా $90^0$ అయి వుంటుంది. ఎందుకంటే త్రిభుజంలో మొత్తం $180^0$ కనుక.


**త్రిభుజాలలో రకాలు :**

1) సమ బాహు త్రిభుజం (*Equilateral*)

2) సమ ద్విబాహు త్రిభుజం (*Isosceles* )


3) అసమ బాహు త్రిభుజం (*Scalane*) వీటిని అన్నిటినీ గీసి చూపించాలి.

ఇవన్నీ అయ్యాక త్రిభుజానికి ఎత్తు ఎలా గీస్తామో చెప్పాలి.



*BC* ని *base* గా చేసుకుని ఈ త్రిభుజానికి ఎత్తు గీయమని హైదరాబాద్‌లోని పేరు మోసిన స్కూల్‌లో పది చదువుతున్న ఒక పిల్లవాణ్ణి అడిగాను.

వాడు ఇట్లా గీశాడు.





ఎంత అమాయకమో చూశారా?

అసలు ఎత్తును ఎలా గీయాలి. ఏదైనా ఒక త్రిభుజానికి ఏదో ఒక భుజాన్ని *base* చేసుకుని దానికి *Opposite vertex* (శీర్షము) కు *Perpenducular* (లంబం) గీస్తే దాన్నే ఎత్తు అని అంటాం.

ఎత్తు గీయండి అనగానే పైమాట మనసులో మెదిల్తే గదా ఎత్తు గీసేది.

ఈ త్రిభుజానికి *BC base* చేసుకుని ఎత్తు గీస్తే




*AD* ఎత్తు అవుతుంది. ఇంతేనా?

ఇంకో రకంగా ఎత్తు గీయలేమా?

త్రిభుజంలో మొత్తం మూడు భుజాలు కదా. మూడింటినీ *base* గా చేసుకుని 3 రకాల ఎత్తులు గీయవచ్చు. ఇందాక *BC* ని *base* గా చేసుకుని ఎత్తు గీశాం.

ఇలా త్రిభుజానికి 3 రకాల ఎత్తులు గీయ వచ్చని వారికి చెప్పాలి.

ఇట్లా చెప్పాలంటే ఇక త్రిభుజాల నుంచి చతురస్రాల్లోకీ, దీర్ఘ చతురస్రాల్లోకీ, రాంబస్‌లోకీ వెళ్ళి, వాటి నిర్మాణాలూ, వైశాల్యాలూ, వాటి మీద లెక్కలూ....

నా ఉద్దేశం ఇది కాదు.

జామెట్రీలో ఉదాహరణగా వృత్తాన్నీ, త్రిభుజాన్నీ తీసుకుని పిల్లలకు అన్నీ విడ మరచి చెబితేనే వాళ్ళకు సులువవుతుందనేది చెప్పాలని.

కోణాలు కొలవడం వాళ్ళకు వచ్చులే, వాటిని ఆరో తరగతిలోనే చెప్పేశాం కదా అనుకోకుండా ఎనిమిదో తరగతి వచ్చే దాకా వీటి మీదే దృష్టి పెట్టాలనేది ఉద్దేశం.

# ఇవన్నీ Text Booksలో లేవా?

ఇవన్నీ *Text Books* లో లేవనీ, *Text Books* ని చూసి ఏమీ నేర్చుకోలేమనీ నేను దబాయిస్తే – నాకు కళ్ళుండవు నిజంగా. ఆరో తరగతి నుంచీ పదో తరగతి వరకూ వున్న *Maths Text Book* ఒక్కోటీ ఒక్కో బంగారం ముద్ద. అవన్నీ మేధావులు వివరంగా చర్చించినవి.

నన్ను చూడండి. *Algebra* కు సంబంధించి చెప్తూ మొదట్లో *Text Book* పద్ధతి, నా పద్ధతీ అని వాగాను కదా! చివరికి తోక ముడిచాను చూడండి.

అంటే *Text Books* ను విమర్శించడానికి చీమ తలకాయంత అవకాశం కూడా లేదు. ఇందులో నేను ఇచ్చిన లెక్కలు కూడా *Text Book* లో నుంచి తీసుకున్నవే.

ఏ *Chapter* కు సంబంధించి చూసినా అందులోని *Basics* ఎంతో వివరంగా వున్నాయి. మరో తరగతికి వచ్చాక వాటి పరామర్శ వుంది. అంతా ఎంతో బాగుంది.

మరి *Maths* అంటేనే విద్యార్థి లోకం కానీ, చిన్న చిన్న *test* లు రాసే నిరుద్యోగులు కానీ ఎందుకింత భయపడి పోతున్నారు?

## తప్పంతా టీచర్లదేనా?

భిన్నాల విషయం తీసుకోండి. గంటా రెండు గంటలు భిన్నాల గురించి చెప్పేసి *exercise* లోకి వెళ్ళిపోతే పిల్లలకి ఏం అర్థమవుతుంది?

పదో తరగతి పిల్లలు కూడా భిన్నాల దగ్గరకొచ్చే సరికి వాటిని చెయ్యలేక ఎంత ఆపసోపాలు పడిపోతారో!

ఏ తరగతినైనా తీసుకోండి. *Exercise* కు ముందు *Text Book* లో వున్న చర్చను పిల్లలకు పాఠంగా చెబుతున్నామా? లేనే లేదు. ఊరికే పైపైన చెప్పేసి *exercises* లోకి దూకేస్తునాం. అందుకే ఈ అవగాహనా లోపం. విద్యా సంవత్సరం 200 రోజులనుకుంటే ఈ 200 రోజులలో రోజుకు 3/4 గంట లెక్కల సబ్జెక్టుకు కేటాయిస్తారు.

ఈ అన్ని గంటలూ కేవలం *Concept* మీదే *teacher* చర్చించే అవకాశం వుండాలి. *Teacher* కు *Syllabus* పూర్తి చేసే బాధ్యత నెత్తిన పడడంతోనే చిక్కంతా వస్తోంది.

*Syllabus* ను పూర్తి చేయడమంటే *Exercise* ను పూర్తి చెయ్యడం కాదని మైకు పట్టుకుని అరవాలనిపిస్తోంది.

ప్రతీ చాప్టర్‌కు *5 pages concept* వుంటే *30 pages exercises* వున్నాయి. అవన్నీ *teacher* ఒక్కో *exercise* లో *4 problems* వేసి మిగతావి *Home Work* ఇచ్చినా *teacher* కు *problems* వెయ్యడానికే సరిపోదు.

ఇక ఆయన బ్రాకెట్లూ, కోణాలూ, ఎత్తులూ అంటూ కూర్చోలేడు కదా.

పాలూకూడూ తినే వేలాది మంది లెక్కల టీచర్లకు ఈ విషయాలన్నీ తెలిసినా పరిస్థితుల వల్ల ఎక్సర్‌సైజులు చేసి, పిల్లల చేత చేయించీ చెమట్లు పట్టించుకుంటున్నారు.

## Text Books ఎలా వుండాలి?


ఇలా ఎందుకు ఉండకూడదో చూడండి. *Telugu, English, Hindi* భాషలకు వున్నట్టుగా *Maths* కు కూడా *Non details* వుండాలి. ఇందులో కేవలం *exercise* లే వుండాలి.

అసలు *Text Book* కేవలం *Concepts* తోనూ, ఉదాహరణ లెక్కలతోనూ వుండాలి. పిల్లలు ఏ రకంగా తప్పులు చేస్తారో కూడా లెక్కల పుస్తకాల్లో వివరంగా చర్చించాలి.

*Concepts* అన్నీ వివరంగా చెప్పేయడం వల్లా ఏ విద్యార్థి అయినా *non-detail* లో వున్న *exercise* లు చేస్తే చేస్తాడు. లేకుంటే లేదు.

ఈ *Concepts* తెలియకే కదా *B.A., B.Com., B.Sc,* లు చదివినా 'అమ్మో లెక్కల్లో మేం *Poor*' అని పెద్దలు కూడా అంటారు. పిల్లలకు అయిదో తరగతి లెక్కలు కూడా చెప్పించుకోలేక పోతున్నారు. మరి, పెద్దల్నే ఇంతగా భయపెట్టే లెక్కల్ని పిల్లల మీద పడేసి మనమంతా హాయిగా వుంటే ఎలా?

# చదువులా?
# చావులా??



# గొర్రెదాటు

పచ్చిక బయలు మీద పడి గొర్రెలు ఆవురావురుమని మేస్తున్నాయి. నోరు తెరిస్తే చాలు నోటి నిండికీ గడ్డి అంది వస్తా వుంది. అట్లా వుంది విస్తారంగా పచ్చిక.

ఒక గొర్రె బావి పక్కన మేస్తా వుండిందల్లా కాలు జారి పడిపోయింది.

'మైదానంలో వుండే పచ్చికను కావాల్సొస్తే తీరిగ్గా ఎప్పుడైనా మేసుకోవచ్చు. ఆ బావిలో వుండే పచ్చికను మేసేద్దాం, దాని కంటే ముందు. అమ్మా, తెలివి దాని అబ్బ సొత్తు అనుకుంటా వుంది గావాల!' అని చెప్పి బీదు మీద వుండే లక్షా తొంభైయ్యారు గొర్రెలూ దబదబా బావిలోకి దూకేసి కాళ్ళిరగ్గొట్టుకున్నాయి.

అట్లా వుంది ఇప్పుడు, తల్లిదండ్రులు పిల్లల్ని చదివించే తీరు!

పాత కాలంలో పిల్లలు సరైన వైద్యం అందక లేత వయసులోనే చచ్చిపోయే వాళ్ళు. ఈ కొత్త కాలంలో చేతికి అంది వచ్చిన పిల్లలు, మనం కోరిన చదువుల్ని అందుకో లేక అన్యాయంగా చచ్చిపోతున్నారు.

వాళ్ళకు భగవంతుడు అంతే రాసి పెట్టాడనీ, 'ఈ రోజు చస్తే రేపటికి రెండు' అనీ రౌడీయిజంతో మనం సరిపెట్టుకుంటున్నాం గానీ చచ్చి స్వర్గాన వున్న పిలకాయల్ని అక్కడికి వెళ్ళి పలకరిస్తే బైట పడుతుంది మన బండారం!

మీకు అర్జునుడి కథ తెల్సా! చెప్తా.

పద్మ వ్యూహాన్ని గెలాయించి వెనక్కి రాలేక అభిమన్యుడు చచ్చిపోయినాడు గదా. చెట్టంత కొడుకు పోయిన దుఃఖానికి మహా వీరుడైన అర్జునుడు శక్తే వుడిగి పోయినట్టు పిడికిడు గువ్వయి పోయినాడు. చిన్న గాలికి కూడా కొట్టుకు పోయేటట్టు కంప కంప అయిపోయినాడు పాపం!

సుభద్రను ఇచ్చిన పాపానికి శ్రీకృష్ణుడు అర్జునుడి మీద దయ తలచి, "రా బావా! వొకసారి నిన్ను స్వర్గానికి తోడుకొని పోతా. నీ అభిమన్యుణ్ణి నువ్వు చూసుకుందువు. అక్కడికి ఆ ప్రీతి పోతుంది" అనేసి తీసికెళ్ళాడు.

అక్కడ స్వర్గంలో ధవళ వస్త్రాలు కట్టుకుని చిన్న బంగారు కుండతో వొక అశోక వృక్షానికి నీళ్ళు పోస్తున్నాడు అభిమన్యుడు.

"నాయినా! అభిమన్యా! ఇంత దయ లేకపోయింది ఏమి నాయినా నీకు! నువ్వు లేని ఆ పాపిష్టి భూలోకంలో నేనెట్లా వుండగలననుకున్నావురా నా కన్నా! రా పోదాం!" అని అభిమన్యుణ్ణి కావిలించుకుని బోరున ఏడ్వబోయినాడు అర్జునుడు!

అంతే! అర్జునుడి చెంప చెళ్ళుమంది.

"ఎవడ్రా నీకిక్కడ కొడుకు! చేసేదంతా చేసేసి ఇప్పుడు నంగి ఏడుపులు ఏడస్తా వొచ్చినావా? పుట్టింది మొదలుకొని చూశా – చిన్నాయన కొడుకులని లేకుండా, పెదనాయిన కొడుకులని లేకుండా రాజ్యాల కోసం వో అని కొట్టుకుని చస్తా వుంటిరి. పద్మ వ్యూహాన్ని పన్నిస్తిరి. బలే మొగలాయి అని చెప్పి నన్నెత్తుకుని పోయి దాంట్లోకి తోస్తిరి. చచ్చేట్లు చేస్తిరి. పదపద, ఇంకొక్క మాట మాట్లాడితే ఎడం కాల్తో తంతాన్నా కొడకా!"

కథ జాగర్తగా విన్నారు కదా...

కడుపుకు కూడు తినే వాడెవడూ విజయమో వీర స్వర్గమో అని పోరాటం చెయ్యడు. అక్కడ తాతలూ తండ్రులూ యుద్ధాలు చేసి చస్తా వుంటే ఇక్కడ అభిమన్యుడు కొత్త పెండ్లి కూతురితో కులుకుతూ వున్నాడనుకుందాం కాసేపు. లోకం ఎగతాళి చేసి చంపదా! ఆ ఎగతాళికి వెరిచే ఎవరైనా చచ్చేది! ఇంక బలుసాకు ఎక్కడ తినేది, మిగిలిన బతుకెక్కడ బతికేది!

ఏ ఆత్మహత్యనైనా – పాలు తాగే పసిబిడ్డ సైతం వక్క కొరికినంత సేపు ఆలోచిస్తే చాలు – కారణం తెలుసుకోవచ్చు.

పత్తి రైతు ఎందుకు ఆత్మహత్య చేసుకుంటాడు? కారణం తెలుసుకోవడానికి తల బద్దలు కొట్టుకోవాలా?

మా వైపు పత్తి వెయ్యరు గానీ, నాకు తెలిసిన వొక రైతు బతకలేక నువాక్రిన్ తాగి చచ్చిపోయినాడు. మా చిత్తూరు జిల్లాలో రైతులు, నీళ్ళు పడతాయి గదాని బోర్లు వేసి అప్పులై పోతా వుంటారు. అట్లా వొకాయిన 30 వేలు అప్పయి పోయినాడు. తీరే మార్గమే కనబళ్ళేదు. రైతు గదా ఐ.పి. పెట్టే తెలివి లేదు.

అప్పిచ్చిన వాడు చివరి మాటగా, "నువ్వెట్లా తీర్చలేవు గానీ నీ పెళ్ళాన్నన్నా ఒక పూట పంపించు." అని నడి వీధిలో పట్టుకుని అన్నాడు.

అదీ అవమానం అంటే, అదీ ఎగతాళి అంటే! ఇంక ఆ రైతుకు ఏ మార్గమూ కనపళ్ళా. అంత తాగేసి వూపిరి పోగొట్టుకున్నాడు.

ఇట్లాంటి చావులు ఎందుకు జరగతాయో తెలుసుకోవడంలో మనం ఆరితేరి పోయి వున్నాం.

ఇప్పుడు కొత్తగా చదువుకునే పిలకాయలు చచ్చిపోతున్నారు.

పదహారేళ్ళ అమ్మాయిని తీసుకోండి. శ్రీశ్రీ చెప్పినట్లు ఎట్లా వుంటుంది?

వాన కురిసినా, హరివిల్లు విరిసినా ఆ పిల్ల కోసమే అని కదా ఆమె నమ్మకం!

ఆ వయసులో, శరీరం నిండా కవిత్వం ప్రవహిస్తూ వుంటుంది.

కాలేజీ టైం ఇంకా చాలా వుంటుంది. అయినా నడవాలని ఉండదు. పరిగెత్తాలని వుంటుంది. అదీ Life లో Poetry అంటే;

పరిగెత్తడంలో ఎదురుగా చిన్నరాయి తగిలి వేలు చిట్లుతుంది. అయినా నెప్పి అనిపించదు.

దారిలో క్లాస్‌మేట్ వొకడు కనిపిస్తాడు. వాడు ఈమె కోసం వెనక్కి తిరిగి చూడడసలు. చూడకనే వుంటాడా అని ఈ వగలాడి వెనక్కి తిరిగి తిరిగి చూస్తుంది నవ్వుతూ!

బస్సెక్కుతుంది. ఎక్కడో డ్రైవర్ సడెన్ బ్రేక్ వేస్తాడు. ఈ కాలేజి పిల్ల తూలి పడడం మానేసి బస్సంతా వినపడేటట్టు పకపకా నవ్వుతుంది. బస్సు కదిలినా నవ్వు ఆగనే ఆగదు.

బస్సు దిగేటప్పుడు చందమామ లాంటి స్టీలు కారియరు కింద పడిపోయి పెరుగన్నం రోడ్డు పాలవుతుంది. మధ్యాహ్నం భోజనం మరి! ఫ్రెండ్స్ లేరూ! పొస్తులు పెడతారా ఏం? మళ్ళీ నవ్వే....

ఇంక చెప్పలేం. ఆ పిల్ల బతికే బతుకులో అందం, ఆనందం గజ్జెకట్టి ఆడుతూ వుంటుంది.

ఇట్లాంటి వొక పిల్ల వున్నట్టుండి ఇంత కవిత్వాన్నీ కాల్తో తన్నేసి ఫ్యానుకు వురేసుకుని చచ్చిపోవడం అంటే కడుపు కాలిపోదా!

ఈ చావును ఎట్లా అర్థం చేసుకోవాలి?

రేపట్నుంచి మనం ప్యాంటూ చొక్కా వేసుకొని వీధిలోకి పోతూనే వుంటాం....ఆ పిల్ల జీన్సు వేసుకుని బజారుకెళ్ళే పనే లేదే! రేపట్నుంచి మనం ఏలకులు కొట్టేసిన టీ తాగుతూనే వుంటాం! రేపే మనం కమ్మటి పెండ్లి భోజనం తినబోతాం. అయ్యో, ఇంక ఆ పిల్ల పచ్చడి మెతుకులు కూడా చూడదే! రేపట్నించి మనం మన పెళ్ళాల పక్కన పడి పందుల్లా దొర్లుతూనే వుంటాం.

పాపం పెండ్లి చేసుకొని వొక్క పూట కూడా మొగుడి పక్కన పడుకోకనే చచ్చిపోయిందే!

EAMCETలో డెబ్భైవేలు ర్యాంకు వచ్చింది. ఆ వొక్క కారణంతో ఆమెకి లోకమంతా చీకటై పోయింది. వొద్దూ వొద్దూ నాకా దరిద్రపు లెక్కలు రావు అని నెత్తిన నోరు పెట్టుకుని అరిచినా – 50, 60 వేలు ఖర్చుపెట్టి తల్లీ దండ్రీ ఎంపీసీ చదివి ట్రై చెయ్యమన్నారు. తల్లిదండ్రుల్ని మోసం చేశామన్న భీతి! వాళ్ళకి ఈ పాపిష్టి మొహం చూపించలేనన్న రోషం!

బతికుంటే ఏదోవొక చదువు చదివి పొట్టబోసుకోవచ్చులేమ్మా అని పాపకు ఏ ఆకాశవాణీ చెప్పలేదు. చచ్చిపోయింది.

ఇట్లాంటి చావులు ఒకటా రెండా!

అది హైద్రాబాదులో చిన్న పేట. ఆ రోజు టెన్త్ రిజల్ట్స్ వచ్చాయి. టీకొట్టు దగ్గిర పెద్దలు పేపరు చూస్తున్నారు. చిన్న పిల్లవాడొకడు నెంబరు చెప్పి చూడమన్నాడు. పెద్దలు చూసి, “వొరే, నీ నెంబరు పోయిందిరా!” అనేసి అన్నారో లేదో ఆ పదిహేనేళ్ళ పిల్లాడు పరిగెత్తికెళ్ళి ఎదురుగా వస్తా వుండిన రైలు కింద తలకాయ పెట్టేసి చచ్చిపోయే దాకా వొంటికాలి మీద వున్నాడు!

నిమిషం క్రితం టెన్త్‌లో వాడి నెంబరే గదా పోయింది. ఇపుడు వాడి బతుకే పోయింది! రైలు వాడి మీద వెళ్ళిపోయినప్పుడు – బిడ్డ ఎన్ని రకాలుగా అల్లాడి పోయినాడో!

నేనింతకు ముందు School education కి సంబంధించి, ‘ఇస్కూలు పిలకాయల కత’ అనీ ‘పిల్లల భాషలో Algebra’ అనీ రెండు పుస్తకాలు రాశాను.

ఇది మూడోది. ఈ చదువులు చదివే పిల్లలు ఎంత వొత్తిడి పడుతున్నారో చెప్పాలనే పిచ్చి సంవత్సరంగా నన్ను పీడిస్తా వుంది. మొన్నటికి మొన్న కర్నూలు మెడికల్ కాలేజిలో ఒకపాప చచ్చిపోయింది. మరొకరికి ర్యాంకు వస్తే ఆ అమ్మాయికి వుక్రోషం వస్తుందంట. పరీక్షలు జరిగేటప్పుడు ఆమె ప్రవర్తనే అదొక రకంగా వుంటుందంట. తప్పు ఆమె మీదనే తోసేశారు. ఆ చావును పేపర్‌లో చూశాక, ఇంక ఈ పుస్తకం మొదలు పెట్టకుండా వుండలేక పొయ్యాను.

మామూలుగా నేనేదైనా పుస్తకం రాసేటప్పుడు ముందు టైటిల్–ఇదీ– అని అనుకోందే రాయలేను. ఈ పుస్తకానికి 'పద్మవ్యూహంలో పిల్లలు' అని టైటిలు పెట్టుకున్నాను గానీ అది నాకే నచ్చలా. ఈ టైటిలు అని అనుకున్నంత సేపూ నేను పుస్తకాన్ని మొదులే పెట్టలేక పొయ్యాను.

నా దగ్గరికి Trigonometry చెప్పించుకునే దానికి టెన్త్ చదివే ప్రీతి అని ఒక పాప (వాళ్ళది మా పక్కూరు గంగిరెడ్డి పల్లి) వచ్చింది.

ఆ పిల్లతో చెప్పాను – ఇట్లా మీరు ఇంట్లో, స్కూల్లో ఈ చదువుల్తో పడే కష్టాలన్నీ వొక పుస్తకంగా రాయాలనుకుంటున్నానమ్మా – అని. అప్పుడు "అంకుల్, దానికి పద్మవ్యూహంలో పిల్లలు అని నువ్వు పెట్టిన టైటిల్ బాగా లేదు. చదువులా? చావులా?? అని పెట్టి రాయి" అని తడుంకోకుండా చెప్పింది ప్రీతి.

ఈ పుస్తకం కథ కనీసం 50 మంది పిల్లలకు చెప్పివుంటా. అందురూ, "చదువులా? చావులా?? అనే టైటిలే పెట్టు అంకుల్" అన్నారు.

చదువుల్ని పిల్లలు ఎట్లా చూస్తున్నారో తెలిసింది గదా!

ఇంక వాళ్ళు పెట్టిన టైటిల్ కింద నేను పుస్తకం మొదలు పెడతా....

# పిల్లల మీద తల్లిదండ్రుల మోజు

**ర**క రకాల నూకలు పోసి కోడిపుంజును ఎవరైనా ఎందుకని సాకుతారు? భోగి పండుగ రోజు కత్తిగట్టి – నువ్వు చావు, లేదంటే వేరేవాళ్ళ పుంజును చంపుకోనైనా రా – అనేసి పందెంలో వొదలడానికి;

గెలిచొచ్చిన పుంజును చంకలో పెట్టుకుని, అది వోడగొట్టి తెచ్చిన పుంజుకు మసాలా పెట్టి పండగ చేసుకోవడానికి;

ఇప్పుడు పిల్లల నుంచి తల్లిదండ్రులు ఏమి ఆశిస్తున్నారు – అనే దాని గురించి గదా నేను మాట్లాడతుండేది! దీని మీద మీకు కండ్లకు కట్టినట్టు చెప్పాలంటే – నా కండ్ల ముందు జరిగినవన్నీ పూస గుచ్చినట్టు చెప్పేయడమే మార్గం!

మూడేండ్లు మార్చికీ సెప్టెంబర్‌కీ కట్టికట్టి రాసినా ఇంటర్మీడియేట్ ఇంగ్లీషు పాసు కాలేక చదువునొది లేసిన వాడొకడు పెండ్లి చేసుకుని వొక బిడ్డకు తండ్రయిపోయినాడు.

వాడు వాడి కొడుకు గురించి ఇట్లా ముచ్చటించాడు:

"మావాడు సెవెన్త్. ఫర్వాలేదు మొన్న క్వార్టర్లీకి క్లాసులో నాలుగో ర్యాంకు వచ్చాడు. 'చూడ్రా! 40 మంది వున్న క్లాసులోనే నువ్వు నాలుగో ర్యాంకు వస్తున్నావు. కానీ రేపు ఇంటర్ ఎంసెట్‌లో లక్షమందిలో ఎన్నో ర్యాంకు వొస్తుందో నువ్వే ఆలోచించు' అని మంచిగా చెప్పి చూస్తున్నాను. చూడాలి ఏం చేస్తాడో!"

అయిదేళ్ల తర్వాత జరగబోయే కథకు – ఇప్పణ్ణించి కత్తి నూరడం!

నాకు బాగా అనుభవంలోకి వచ్చిన మూడు కుటుంబాల కథ చెప్తా.

## (1) ముందు మా కుటుంబం :-

ఇక్కడ మా స్థితిగతుల గురించి కొంత చెప్పుకోవాలి.

నేను 15 సంవత్సరాలుగా ఆంధ్రజ్యోతి పేపరాఫీసులో ఉద్యోగం చేస్తుండే వాణ్ని. దాని పరిస్థితులు బాగాలేక సంవత్సరంగా అది మూతపడి పోయింది. నెలబెట్టే కొందికి పదీ పన్నెండు వేలు వస్తా వుండడంతో అప్పుడు బాగానే వుండింది. ఆ ఆదాయం పోవడంతో మాకు చెయ్యి విరిగినట్టయిపొయ్యింది.

40 ఏండ్ల వయసు. చదివిన చదువుకు వుద్యోగం వచ్చే ఇదిలేదు. ఏ దోవన పోవాలో తెలవక – కొంచం ఇబ్బందిగానే వుంది.

నాకు ఇద్దరు పిలకాయలు. మా అక్క కూతుర్ని కూడా నేనే సాకి సంతరించాలి. దీంతో మాకు, మరీ ముఖ్యంగా నా భార్యకి 'టెంసం'గా వుంది.

ఇంత చీకట్లో కూడా నా భార్యకొక వెలుగు చుక్క కనిపించి ఏడుకొండలూ, ఏడేడు పద్నాలుగు సముద్రాలూ అంత ఆశ పెట్టుకునేసింది.

ఆ ఆశ నా కూతురి మింద !

ఎవురు ఇంటికొచ్చినా నా కూతురు దీప్తిని చూసి, "పాప మంచి క్లవరు. బాగా చదివించుకోండి." అని చెప్తా వుంటారు.

"ఈ కాలంలో పిల్లలే ఆస్తి. మనం రైల్లో పోతున్నామనుకో, పక్కనుండే వాళ్ళు మీకు సొంత ఇల్లు వుందా? భూమి ఎన్ని ఎకరాలుంది? బ్యాంకీలో ఎంత కట్టిపెట్టారు– ఇట్లాంటివెవరూ అడగరు. పిల్లలెంతమంది? అంటారు. చెప్తాం. ఏం చదువుతున్నారని అడగతారు. అప్పుడు మనం మొన్ననే మా కూతురు ర్యాంకు తెచ్చుకుని మెడిసిన్‌లో జాయినయ్యిందని చెప్పామనుకో. మనకు ఎంత మతింపు? ఎంత హోదా! ఒక లెక్కలో చూస్తే ఇప్పుడు పిల్లలే మనకు ఆస్తి. వాళ్ళను బాగా చదివించేస్తే చాలు. అదే వాళ్ళకు మనం ఇచ్చేది...." ఇట్లాంటి వుప్పుకీ వూరగాయకీ పనికిరాని మాటలు అందర్లాగే నా భార్య కూడా బాగా వినేసి వుంది.

దాంతో నా భార్య గంపడేసి కళ్ళూ – నా కూతురి మీద పడిపొయ్యాయి.

దీప్తీ ఇప్పుడు తొమ్మిది చదువుతోంది. వాళ్ళమ్మ దీప్తీతో అప్పుడప్పుడూ ఏం ఖర్మ, దినానికి నాలుగు సార్లు ఇచ్చే ఉపన్యాసాల్లో కొన్ని మాటలు :

"చూడు దీదీ! నీ అబ్బుడు నీకేం సంపాయించి పెట్టలేదు. వాడి కడుపున ఎప్పుడైతే పడ్డారో అప్పుడే మీరు దరిద్రులై పోయినారు. అది గుర్తు పెట్టుకో. ఏ ఆటో ఒక ఆట ఆడి పదో తరగతి దాకా చదివించే ఇది నాది. ఆ తర్వాత నేను గాదు గదా నిన్ను పుట్టించిన బ్రహ్మదేముడు కూడా నిన్ను చదివించలేడు. నీ చదువు నువ్వే చదువుకోవాలి".

దీనికి నా కూతురు, "మీరు చదివించకపోతే ఇంకెవురు చదివిస్తారమ్మా! పెద్దోళ్లు ఫీజులు కడితేనే కదా పిలకాయలు చదువుకునేది!" అని అంటుంది.

అప్పుడీమె, "అదే గదా చెప్పేది! చెప్పేది పూర్తిగా వినకుండా దూరితే ఎట్లా? స్కూల్లో కూడా ఇట్లనే చేస్తున్నావా? ఇప్పుడు నైన్త్. నెక్స్ట్ ఇయర్ టెన్త్. టెన్త్‌లోనే గాకుండా ఇప్పట్నుంచి కష్టపడినావనుకో ఫైవ్‌ఫార్టీ తెచ్చుకుంటావు. 540 తెచ్చుకుంటే

ఇంటర్‌లో ఏ కాలేజీ కూడా ఫీజులు తీసుకోదు. వాళ్లే నిన్ను హాస్టల్లో పెట్టుకొని ఫ్రీగా చదివించుకుంటారు." అంటుంది.

"540 యే గదా. తెచ్చుకుంటాన్లే," అని అప్పటికా నస తప్పించుకోవాలని చూస్తుంది దీదీ.

మొన్నామధ్య ఇట్లాంటి మాటలు ఇంట్లో జరగతా వుండంగానే స్కూల్లో Quarterly Exams పూర్తయి పొయ్యాయి. ఇంటికి ప్రోగ్రెస్ రిపోర్టు వొచ్చేసింది.

ప్రోగ్రెస్ రిపోర్టు వొచ్చిన సంగతి తెలియకుండా నేను ధైర్యంగా ఇంటికొచ్చి నానా... నా భార్య ప్రభావతి సందిట్లావు గస పోసుకుంటూ, "ఏమబ్బా! ఈ లంజకి అమెరికాకు విమానం టికెట్టు తీసుకునే యోగం లేదు. అది పూనాకు రైలు టిక్కెటు తీసేసింది" అని ఆయాస పడింది. (మీరు నిజం చెప్పినా వింటారు. అబద్ధం చెప్పినా వింటారు. నిజంగానే ఈ మాట అనింది అక్కసుతో. మూడేండ్లు హైద్రాబాద్‌లో వుండి వచ్చింది కదా ఎవరు చెప్పుకుంటూ వుంటే వినిందో గాని.)

నేను ప్రోగ్రెస్ రిపోర్టు చూసినా.

తెలుగు-60, ఇంగ్లీషు-80, హిందీ-81, లెక్కలు-96, సైన్స్-97, సోషల్-94, టోటల్ 508.

"పర్వాలేదులే, బాగానే వచ్చినాయి." అని ధైర్యం చేసి అనేశాను.

"అవునూ ఇదే మాదిర్తో టెన్త్‌లో కూడా 500 తెచ్చుకునే సరికి నీలిగి చచ్చిందనుకో. ఇంటర్‌లో రెండేండ్లకూ 50 వేలు ఎక్కణ్నుంచి తెచ్చి పెడతాము నాయినా! ఇట్లనే వెనకేసుకొచ్చి వాళ్లను కూడా పనికి రాకుండా చేసెయ్ నీకు మాదిరిగానే," అని నామిందికొచ్చింది.

నేను ఆడంగుల చెంగణ్ణి గదా వెంటనే ప్లేటు మార్చేసి, "ఏందమ్మా ఈ మార్కులు? Maths లో 96 అంటే దారుణం. మిగతా నాలుగు మార్కులూ ఏ గాడిదలు కాయను పొయ్‌నాయి? Maths అంటే వందకు వంద తెచ్చుకుంటే గాని Life లేదు. నువ్వేదో ఉద్ధరిస్తావనుకుంటే వూహూ లాభం లేదు..." అని పాపం పుణ్యం లేకుండా మాట్లాడేసినా.

కాని పని చేసిన దాని మాదిరిగా దీప్తీ గువ్వ మాదిర ముడుక్కుని కూర్చొని వుంది. అప్పటికే వాళ్లమ్మ నాలుగేసినట్టు వుంది.

ఇక్కడ దీప్తీ చదువు ఎట్ల సాగిందీ కాసింత చెప్పుకోవాలి.

ఆమె పుట్టింది 1988 ఆగస్టులో. అప్పుడు మేం మా మిట్టూరులోనే కాపరం. అందుకని 1994లో తెలుగు మీడియం గవర్నమెంటు స్కూల్లో వొకటో తరగతి చేర్పించాం. ఆ స్కూలికి ఆర్నెల్లు పోయిందో లేదో మావూరి బస్సు రోడ్డు దగ్గిర ఎవరో కాన్వెంట్ పెట్టేసరికి ఇక్కడ మాన్పించి అక్కడ చేర్పించాం. తర్వాత 95లో మేం కాపరం తిరపతికి మార్చాం. తిరపతిలో ఆ పాపను రెండులో చేర్పించాం. రెండూ మూడూ నాలుగూ అదే స్కూల్లో చదివింది.

ఆ పాప నాలుగులో వుండంగానే చూసిన వాళ్లంతా "ఏడా! ఎనిమిదా!" అని అడుగుతుండడంతో నా భార్య, "ఇదేందో కోతి మాదిరిగా పెరిగి పోతా వుంది. దీన్ని 4లో నుంచి వొకేసారి ఆరులో చేర్పించేద్దాం." అని మళ్లీ స్కూలు మార్చి వేరే స్కూల్లో చేర్పించేసింది.

ఆ స్కూల్లో ఆరో తరగతి మూడు నెల్లు చదివిందో లేదో మాకు హైద్రాబాద్‌కు ట్రాన్స్‌ఫర్ అయ్యింది. మళ్లీ ఈ స్కూలు నుంచి కె.పి.హెచ్.బి. స్కూల్లో ఆరులో చేర్పించాం. అక్కడ ఆరూ ఏడూ చదివింది. ఆ స్కూల్లో సెవెన్త్ పబ్లిక్‌లో మా కూతురొక్కటి తప్ప మిగతా పిల్లలంతా చూసి రాసేసి పాసైపోయి, మా అమ్మాయికి ఫస్ట్ ర్యాంకు రాకుండా చేసేశారని ఎయిత్‌లో ఎర్రగడ్డ స్కూల్లో జాయిన్ చేసేసింది.

పాప నైన్త్‌కొచ్చేసరికి ఆంధ్రజ్యోతిని మూసెయ్యడం, మేం అక్కణ్ణుంచి మళ్లీ తిరప్తికి రావడం, తిరపతిలో దీప్తిని మళ్లీ వేరే స్కూలుకు మార్చడం.

ఎల్‌కెజి చదవలేదు, యుకెజి చదవలేదు, అయిదో తరగతిని చదవనివ్వ లేదు, ఏ స్కూల్లోనూ తిన్నగా చదవనివ్వలా.

అయినా మా దీదీ Performance అట్లా వుందీ అంటే మేం encourage చెయ్యాలి గదా.

నా కూతురికి పాపం పెండ్లి కాకుండానే సవితి పోరు ప్రారంభమైంది. అదెట్లా అంటే ....

మామూలుగా మనకు తెలియని విషయాల్లో మనం వేలు పెట్టకుండా వుండాలి. కానీ నా భార్య అట్లా కాదు. ఆమె కట్టకింద వెంకటాపురం హైస్కూల్లో టెన్త్ వరకూ చదివింది. యాపిల్ స్పెల్లింగ్ ఎ.పి.ఐ.ఎల్ అంట. ఒకసారి నా కొడుక్కి చెప్పిస్తూ

వుంది. APPLE అంటే అప్లె అంట. నా కొడుకే నవ్వినాడు. అయినా సిగ్గు రాలేదు.

నా భార్య నా కూతురి చదువులో వేలే గాదు – గున్న ఏనుగులాంటి ఆమె శరీరం మొత్తాన్నీ దూర్చేసింది.

1,200 రూపాయల బాడుగ ఇంట్లో మేం అయిదు మందిమి కాపరం వుంటున్నాం. నా కూతురొక మూల కూర్చుని చదువుకుంటూ వుంటుందనుకుందాం. ఈమె మనకెందుకులే అని వూరుకోకుండా పోయి పక్కన కూర్చుంటుంది.

ఒక రోజు బుద్ధిగా, దేవతలకు పుట్టిన బిడ్డ మాదిరిగా బొమ్మలా కూర్చుని చదువుకుంటున్న నా కూతురి దగ్గరకు వెళ్ళి ఈ గున్న ఏనుగు ఇచ్చిన ఉపన్యాసం:

"నువ్వు నీ అబ్బ మాదిరిగా మేధావి ఐపొయ్‌నావు. మనసులోనే చదువుకుంటే ఎట్లా సేయ్? లొడలొడా గట్టిగా అరచి అరచి చదువుకుంటే నోటికి వస్తుంది. దేన్ని గూడా కంఠస్తం పెట్టెయ్యాలి. అప్పుడు పరీక్షలో అచ్చు గుద్దినట్టు రాసేయొచ్చు. అప్పుడు 5 మార్కులకు 5 మార్కులు పడిపోతాయి. కానీ ఈ కొంపలో చదువు అట్లాగాదు. కంఠస్తం పెట్టగూడదు. అర్థం చేసుకుంటే చాలు అని ఆ వెధవ అనడం, నువ్విదే ఛాన్స్ అని పుస్తకాన్ని వొళ్లో పెట్టుకుని పెదాలు కదిలించకుండా గమ్మున కూర్చోవడం, పరీక్షలో సొంతంగా ఏదో వొకటి రాసేసి వొచ్చేయడం. కాబట్టే గదా నీకు నూటికి 95, 96లే వొస్తుండేది! ఏ రోజైనా నీకు నూటికి నూరు వొచ్చినాయా? 40 మంది వుండే క్లాసులో ఏరోజైనా నీకు మూడో ర్యాంకు నాలుగో ర్యాంకే గానీ ఫస్ట్ ర్యాంకొచ్చిందా? మర్యాదగా గడగడా గట్టిగా చదువు, పుస్తకాన్ని ఆ మూలనుంచి ఈ మూలకు కంఠతా పెట్టెయ్".

ఈ ఇన్ని మాటలకూ నా కూతురు అప్పుడప్పుడూ నోరు తెరచి, "తలకాయలు తినొద్దు. Half yearly కి ఫస్ట్ ర్యాంకు తెచ్చుకోకపోతే అప్పుడడుగు. ఇంక వెళ్లు." అంటుంది.

ఈ హామీతో నా భార్య వీరతాపం కొంచెం అణుగుతుంది.

"నా అమ్మగదా, నా బుజ్జిగదా, నా కన్నగదా. నువ్వొక్కసారి 540 తెచ్చి ఫస్ట్‌ర్యాంకు అనిపించుకో. నువ్వడుగుతుంటావే excalibre జీన్స్ తీసిస్తా" అని ముదిగారం చేస్తుంది.

ఈ కథ జరిగిన రోజున నా కూతురి మీద వున్న బాధ్యత ఒక్కటే గదా.

అది టెన్త్‌లో 540 వరకూ తెచ్చుకుని ఇంటర్‌లో ఫ్రీగా చదివి 60 వేలు ఆదా చెయ్యడం (అంటే సంపాయించడం).

నెల తర్వాత పది కిలోల బాధ్యత ఒక్కసారిగా 30 కిలోలు అయిపోయింది చూడండి. అది ఇట్లా జరిగింది.

దీని బంధువొకామె చిత్తూరు నుంచి వొచ్చి గీసిన అగ్గిపుల్ల అది. ఆ పుల్ల నా భార్యలో ఎన్ని మంటలు రేపిందో చూద్దురు గాని–

ఒక రోజు నా భార్య వున్నటుండి హిమాలయాలకు నిచ్చెనేసేసి, "దీదీ! నేన్చెప్పినట్టు వింటే నీకు TVS scooty తీసిస్తా టెన్త్ అవ్వగానే" అనింది.

దీప్తి, "నీకు అంత సీను లేదులే, నువ్వు మూస్తావా?" అనింది.

అందుకీమె, "నిజ్జం దీదీ! దేముడి తోడు నీకు టెన్త్ అవగానే TVS scooty తీసిచ్చి తీరతా. నాకెట్టా స్కూటర్ వెనకాన కూర్చుని తిరిగే యోగం లేదు. అది వీడ్ని కట్టుకున్నపుడే తేలిపోయింది. బిడ్డలకైనా తీసిచ్చి మీ వెనకాన ఎక్కాలని వుందమ్మా నాకు!" అనింది మెత్తగా.

దీప్తి తెలివైనది. ఈ సమయంలో ఏం మాట్లాడినా అది ఆ పిల్ల మెడకాయకే చుట్టుకుంటుందని తెలిసి గమ్మనుండి పోయింది. అయినా "నాన్నకు తెలియకుండా చీటీగాని వేశావా?" అనడిగింది.

"అవన్నీ నీకెందుకు? నీకు తీసిస్తా. అదే నీక్కావాల్సింది. అయితే నేన్చెప్పినట్టు చెయ్యాలి" అని వూరించింది.

"నీకు 540 తేవాల టెన్త్‌లో అంతే గదా?" అని చూసింది దీదీ.

"రోజుకు పదహారు గంటలు చదువు. Text Books అన్నీ థరో అయ్‌పో. ఒక్క బిట్టు కూడా పోనివ్వద్దు. 570 తెచ్చుకో. ఎంత మందికి రావడం లేదు! స్టేట్‌లో కనీసం పదిమందికైనా వస్తాయి. నువ్వు స్టేట్ ఫస్ట్ తెచ్చుకోకపోయినా జిల్లా ఫస్ట్ తెచ్చుకో 570" అనింది.

ఈ మాటకు దీదీ బిత్తరపోయి "అమ్మో 570 కేశావా తల్లీ ప్లాను!" అనేసి పుస్తకాల్లో తల దూర్చేసింది.

"నువ్వు 570 తెచ్చుకోవాలే గానీ TVS Scooty యే కాదు, మెళ్ళోకి బంగారు గొలుసు కూడా తీసిస్తా...." ఎందుకులెండి కొత్తగా 570 పాట ఎత్తుకునింది వొదిలే పెట్టలేదు.

ఇంతకీ విషయం ఇదీ :

మొన్న చిత్తూరు నుంచి వొచ్చిన కమలమ్మ ఇచ్చిన సమాచారం – ఆమె మరిది కొడుక్కి టెన్త్‌లో 570 వొచ్చినాయంట. వొక కాలేజి వాళ్ళు వచ్చి 'కారెక్కేసెయ్, గుడ్డా గుసురు కూడా మాదే, ఇంజనీరు కావాలంటే ఇంజనీరూ, డాక్టరు కావాలంటే డాక్టరూ చేసి పంపిస్తాం' అని కుయ్యోమొర్రో అన్నారంట. అయినా ఆమె మరిది వాళ్ళు తొందర పళ్ళేదంట. ఆ మరుసట్రోజే ఇంకో కాలేజీ వాళ్ళొచ్చి 20 వేలు కూడా ఇస్తామన్నారంట. అప్పుడు మాత్రం ఆమె మరిది వాళ్ళు "రేపు మంచిరోజు. రేపు రండి. పిల్లోణ్ణి మీతో పాటు కారెక్కిస్తాం" అన్నారంట. ఆ కాలేజి వాళ్ళు రేపే వస్తే ఏముందీ? 50 వేలు కమలమ్మ మరిది కాళ్ళమీద పోసేసి నెల్లూరు నుంచి పెద్ద కాలేజి వాళ్ళు పిల్లాణ్ణి కారెక్కించుకొని ఆ పాటికే ఎగరేసుకుపొయ్యుంటే...

"ఏం వాడికేమైనా కొమ్ములొచ్చినాయా? నీకు మాత్రం ఎందుకు రావు 570. పట్టుదల వుండాలే గానీ..." అని కూర్చునిందీమె.

ఈ కథ జరిగిన రోజుటికి నా కూతురి మీద వున్న బరువూ బాధ్యతా టెన్త్‌లో 570 సంపాయించడం, ప్రైవేటు కాలేజి వాళ్ళు మా చుట్టూ తిరిగి కాళ్ళ మీద 50 వేలు పోసేసి పొయ్యేలా చెయ్యడం.

మీరు నమ్మితే ఎంత, నమ్మకపోతే ఎంత – ఇంకొక రోజు నా భార్య చంద్ర మండలానికే నిచ్చెనేసేసింది. దీప్తి చదివే స్కూల్లో – సైడ్ బిజినెస్‌గా ఐఐటి ఫౌండేషన్ కోచింగ్ పెట్టుకున్నారు. కూతురొచ్చి ఈ విషయం అమ్మకు చెప్పడం, అమ్మ వెయ్యి రూపాయలు ఎత్తుకు పోయి స్కూల్లో ఫీజు కట్టేసి కూతుర్ని ఐఐటి కోచింగ్‌లో చేర్పించడం టకటకా జరిగి పోయినాయి.

ఒక రోజు దీప్తి పొరబాటున ఇంట్లో, "అమ్మా, మాకు ఐఐటి కోచింగ్‌లో నైన్త్‌లోనే టెన్త్ సిలబస్సు, టెన్త్‌లోనే ఇంటర్ సిలబస్సు చెప్పేస్తారంట" అని చెప్పింది.

ఇది దాన్ని పట్టుకునింది గట్టిగా. ఇంకేం? దీప్తికి ఐఐటిలో సీటు రాకపోయినా ఎంసెట్‌లో ర్యాంకు రాకుండా పోతుందా! అనే గట్టి అభిప్రాయానికొచ్చేసింది.

ఎంసెట్‌లో ర్యాంకు అంటే ఏదో 5 వేలో ర్యాంకో, వెయ్యి లోపల ర్యాంకో అనుకునేరు! ఎంసెట్‌లో ఫస్ట్ లేదా సెకండ్ లేదా థర్డ్ అట్‌లీస్ట్ బిలో టెన్!

ఎందుకంటే దీప్తి ఎట్లాగూ క్లవరు. పైగా ఐఐటి కోచింగ్ ఇప్పిస్తున్నాం. నైన్త్‌లోనే టెన్త్ అయిపోతుంది. టెన్త్‌లో ఇంటర్ అయిపోతుంది. ఇంటర్‌లో స్పీడ్ అయిపోయి రేయింబవళ్ళూ ఎంసెట్ మీదే కష్టపడుతుంది. ఎందుకు రాదు!

తిరపతిలోనే వొక కార్పొరేట్ కాలేజీ వాళ్లు ఎంసెట్ ర్యాంకర్‌కి 3 లక్షల విలువ చేసే కారు తాళాలు ప్రెజెంట్ చేశారంట.

ఒక రోజు నా కూతురే కళనుందో ఇంటికొచ్చీ రాగానే వాళ్లమ్మను కావిలించుకుని, "అమ్మా, ఈరోజు స్కూల్లో ఐఐటీ కోచింగ్ తీసుకునే వాళ్లందరికీ టెస్ట్ పెట్టారు. పీరియాడిక్ టేబుల్‌లో ఒక్క ఎలిమెంట్ కూడా పొల్లుబోకుండా నేనొకదాన్నే రాసేసి ఫస్ట్ ర్యాంకు తెచ్చుకున్నానే!" అంది.

ప్రభావతి కులుకు చెప్పనలివిగాదు.

"ఒరేయ్! ఈ పిల్లకు ఎంసెట్‌లో ర్యాంకు గ్యారంటీరా. జ్యోతిష్కుడే రోజో చెప్పేసినాడు – మీరు బాగుపడితే మీ కూతురు గుండానే బాగు పడుతారు అనేసి. దీని పుణ్యాన మనం కారెక్కి తీరతాం!"

14 ఏండ్ల నా కూతురి మీద

30 కేజీల నా కూతురి మీద

300 కిలోల బరువూ బాధ్యతా!

భగవంతుడా! వీధికొక డాక్టరూ ఇంజనీరూ వుండారు! వాళ్లకే లోటూ లేదు.

నా కండ్ల ముందర నా కూతుర్ని వుండివ్వు. అది చాలు.

## (2) ఇంకో కుటుంబం కథ

ఈ కుటుంబంలో నాకు తెలిసింది వొకరే. అది పిల్లవాడి తండ్రి. పిల్లవాణ్ణి కూడా నాకు తెలియదు. పేర్లు యధాతథంగా పెట్టుకునేది లేదు. కాబట్టి ఆ తండ్రి పేరు ఉమాశంకర్ అనుకుందాం.

నేను హైద్రాబాద్‌లో వున్న మూడేండ్లల్లో ఆయన నాకు వొద్దనుకున్నా 20 సార్లు కనిపించి వుంటాడు. ఆ ఇరవై సార్లు కూడా ఆయన–కొడుకు చదువు గురించే మాట్లాడినాడు.

ముందు ఉమాశంకర్ ఆర్థిక పరిస్థితి గురించి కాసేపు. ఆయన ఇంటి అద్దె అయిదు వేల రూపాయలు. ఆయన మాటల్లోనే ఆయన కొత్త కారుకు తీసుకున్న loan తీరిపోయింది. ఉమాశంకర్ చేస్తున్న బిజినెస్ ఏ క్షణంలో wind up చేసినా partners నుంచి కనీసం పది లక్షలు వస్తుంది. బతుక్కి గాభరా ఏం లేనట్టే లెక్క.

అబ్బాయిల చదువుకి సంబంధించి ఉమాశంకర్ నుంచి నేను విన్నదంతా మీకు చిన్న కథగా చెప్పుకుంటూ వస్తా.

ఉమాశంకర్‌కి ఇద్దరు పిల్లలు. చిన్నబ్బాయి గురించి మనం చెప్పుకోవాల్సిందేమీ లేదు. ఎందుకంటే చిన్నబ్బాయి చదువు మీద ఆయన పెద్దగా దృష్టి పెట్టలేదు. వాడి taste ని గమనించి వాణ్ణి ఒక సంగీత విద్వాంసుడిగా తీర్చిదిద్దాలనేది ఆయన తపన. వాణ్ణి గురించి నాకు ఉమాశంకర్ చెప్పిందిదే. దాన్ని మీకు చెప్పేశాను.

ఇంక పెద్దబ్బాయి గురించి. వాడి పేరు హరి అనుకుందాం.

ఈ హరీ గురించి వాళ్ళ నాయిన చెప్పింది వినీవినీ వాణ్ణి చూడాలని నేనెప్పుడు ప్రయత్నించినా ఉమాశంకర్ పడనివ్వలేదు.

హరీ వొక 'మంచి' స్కూల్లో 8th class చదివే వాడు. వాణ్ణి ఎలాగైనా ఐఐటి చెయ్యాలనేది ఉమాశంకర్ ఉద్దేశం. అంతకంటే ముందు రామయ్య కోచింగ్ సెంటర్‌లో వాడికి సీటు వచ్చేలా చూడడం.

ఉమాశంకర్ ఒకసారి, "నామిని గారూ! ఇదొక యజ్ఞం. నేనెంత వరకూ సఫలీకృతుణ్ణవుతానో కాలమే నిర్ణయించాలి. నేను మాత్రం చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నాను." అని ఆయన చేసిన ప్రయత్నాలన్నీ దఫ దఫాలుగా చెప్పినవి పాయింట్లు పాయింట్లుగా రాస్తే –

(A) మా హరీ ఉదయాన్నే నాలుగ్గంటలకి నిద్రలేవాలి. మనసు ప్రశాంతంగా వుండడానికి అరగంట ధ్యానం.

(B) తర్వాత కాలకృత్యాలు తీర్చుకుని, యూనిఫాం వేసుకుని రడీ అయిపోతాడు. 5 గంటలకంతా Maths, Physics, Chemistry చెప్పే ట్యూషన్ మాస్టారు వస్తాడు. 7 వరకూ ఆయన పాఠాలు చెప్తాడు. తర్వాత ఎనిమిదిన్నరకంతా

మరోసారి రివిజన్ చేసుకుని కప్పు నానబెట్టిన శెనగలూ, ఒక గ్లాసుడు పాలూ ... స్కూలుకెళ్లి పోతాడు.

(C) 12-45 కి మధ్యాహ్నం భోజనం. డ్రైవర్ తీసికెళ్తాడు. రోకటితో దంచిన దంపుడు బియ్యం భోజనం- అదీ 150 గ్రాములు. మరో వంద గ్రాముల దాకా పచ్చి కూరగాయలు. గుడ్డు గానీ, మటన్ గానీ నై. పిల్లవాడు sharp గా వుండడానికి వుడకబెట్టిన వంటలేవీ లేవు - అంతా పచ్చి కూరగాయలే!

(D) సాయంకాలం నాలుగు గంటలకల్లా స్కూల్‌కెళ్లి వాణ్ణిpick up చేసుకుని 4.30 కంతా - నల్లకుంట రామయ్య కోచింగ్ సెంటర్‌లో సీటు రావడానికి తీసుకునే కోచింగ్. 7.30 కి అక్కడ అయిపోతుంది.

(E) రాత్రి ఎనిమిదికి ఇంటికి రాగానే మంచినీటి స్నానం. అర్ధ గంట ప్రశాంతత కోసం flute వాయించాలి. 8.30కి పచ్చికూరలతో దంపుడు బియ్యం భోజనం.

(F) రాత్రి పదకొండు దాకా మళ్లీ subjects మీద పడడం.

- ఇలా రొటేట్ అవుతుంటుంది. దైవసాక్షిగా వొకసారి, "యజ్ఞం అని ముందే చెప్పాను కదా. సీఎంకు కూడా అంత tight schedule వుండదు. ఒక్క ముక్కలో చెప్పాలంటే వాడికి పాస్ పోసుకోవాలన్నా తీరిక లేదు." అనేసి అన్నాడు ఉమాశంకర్, నేను వాణ్ణి చూడాలి వాణ్ణి చూడాలి అని అంటూవుంటే నా పోరు పళ్లేక.

"పోనీ ఒక ఆదివారం వస్తా." అనేసి అన్నాను.

"ఆదివారాలు అస్సలు తీరిక వుండదు. ట్యూషన్ మాస్టార్లూ కోచింగ్ సెంటర్లూ గాడ్ ప్రామిస్ భలే బిజీ"! అన్నాడు.

"ఒక పండగ పూట వొచ్చి మీవాణ్ణి చూడాల కావాల సార్" అన్నానొకసారి.

"మీకొక విషయం చెప్పడం మరిచాను.చాలామంది తల్లిదండ్రులు పిల్లల్ని ఐఐటిలో చేర్పించేయాలని కలలు కంటున్నారు. అయితే పిల్లలకు ఐఐటిలో చేరాలన్న వూపు ఎలా వస్తుంది చెప్పు! అందుకోసమని నేను వాడిలో వుత్సాహం నింపడానికి పండగలప్పుడు కానీ, summer vacations అప్పుడు గానీ రెండు రోజులు తీరిక దొరికినా నేనేం చేస్తున్నానో తెలుసా? మద్రాసు, ఖరగ్‌పూర్ తీసుకెళ్లి ఐఐటి

కాలేజీలను చూపిస్తున్నాను. అక్కడి staff కి పరిచయం చేస్తున్నాను. ఇంకా local గా ఐఐటీలు చేసిన వారితో shake hand ఇప్పిస్తున్నాను. BHEL లాంటి కంపెనీలకు తీసికెళ్లి టెక్నాలజీ చూపిస్తున్నాను. ఐఐటి అంటే ఎంత గొప్పో వాడికి తెలిసొచ్చేలా చేస్తున్నాను." అనేసి గొప్పగా చెప్పాడు.

ఉమాశంకర్ చేస్తున్న పాప కార్యాలు ఇంకా ఎందుకు చెప్పుకోవడం!

**నాకు తెలిసిన ఇంకో కుటుంబం కథ**

(3) ఇది కూడా హైద్రాబాద్ దరిద్రంలో జరిగి చచ్చిందే. హైద్రాబాద్‌లో సరోజ అని వొకామె వుంది. ఆమెది బంజారా హిల్స్. బంజారా హిల్స్‌లో వున్నారని కాదు కానీ నిజంగానే మహరాజులు.

సరోజకు ఇద్దరూ అమ్మాయిలే. చిన్నమ్మాయికి వొచ్చిన తక్షణ సమస్య ఏమీ లేదు కానీ పెద్దమ్మాయి సంధ్యకు మాత్రం – తలుచుకుంటేనే బిత్తర ఎత్తుకునే సమస్య.

సావధానంగా ఈ దరిద్రపుగొట్టు కథ వినండి. సరోజకు ఇద్దరు కూతుర్లు గదా. పెద్దపాప సంధ్య ప్రస్తుతం పదో తరగతి. దీన్నట్లా వుంచండి.

సంధ్యకో మేనమామ వున్నాడు. అంటే సరోజకు అన్నయ్య. ఆయనకో కొడుకు. వాడు వజ్రమై పోయాడు. వాడు EAMCET లో బిలో హండ్రెడ్ ర్యాంకు తెచ్చుకుని వైజాగ్ మెడికల్ కాలేజీలో 1st year M.B.B.S. లో జాయినై పోయాడు.

మేనమామ కొడుక్కి ఎంబీబీఎస్‌లో సీటు దొరికిందని ఎగిరి గంతేసిన సంధ్య క్షణంలో గతుక్కుమంది.

ఇంట్లో యుద్ధ వాతావరణం నెలకొంది.

"మా అన్నయ్య నన్ను కాదని పోడు. ఖచ్చితంగా సంధ్యనే కోడలిగా చేసు కుంటాడు. పిల్లవాడు కూడా సంధ్య అంటే లోలోపల పడి చస్తూనే వున్నాడు. కానీ పైకి డైరెక్టుగా అనెయ్యలేడు కదా. మొన్నటికి మొన్న డాక్టరయ్యావు కదా ఇంక మమ్మల్నెక్కడ పట్టించుకుంటావులే అని చూశా. వాడు నాన్చకుండా తేల్చేశాడు. సంధ్యను బాగా చదివించండి. ఇదే కాలేజీలో మెడిసిన్‌లో చేరాలి. పెళ్ళి నేనెందుకు

చేసుకోను? కానీ మీరు సంధ్యను బి.ఎ చదివిస్తే మాత్రం మర్చిపోండి – అని చెప్పేశాడు. దీనికి చీమ కుట్టినట్టయినా లేదు".

ఇంక ఆ ఇంట్లో మనశ్శాంతి లేకుండా పోయింది.

సంధ్య చదువు సంగతి చూస్తే మతి పోయింది. స్కూల్లోనే ర్యాంకు రావడం లేదు. Maths లో 100 కి 70 ఎప్పుడూ దాటడం లేదు.

ఎంత డబ్బయినా సరే ఈ సంవత్సరంలో సంధ్యను సాన బెట్టాలని రంగంలోకి దిగింది సరోజ. హైద్రాబాద్‌లో Maths లో expert ఎవరు? ఇంటికొచ్చి అయినా ఎవరు చెప్తారు? నెలకు రెండు వేలైనా కేర్ ఎ జాట్!

అప్పుడీ పనికి మాలిన Maths expert పేరెవరో చెప్పినారు. నిమిషంలో నాకు phone. ఇంటి ముందరికి గంటలో కారు!

నేను బంజారా హిల్స్‌లో హాజరు!

"ముందు మా అమ్మాయి Maths లో ఎంత మటుకు వుందో కాస్తా చూసి చెప్పండి!" అని నన్ను ప్రాధేయపడింది సరోజ.

నేనో దరిద్రపు మొహం వేసి నాడి పట్టుకుని చూశాను. "ఇప్పట్నించి శ్రద్ధపెట్టి చెప్పిస్తే టెన్త్ పాసవ్వచ్చు. ఆ అమ్మాయికి $(a+b)^2$ ఫార్ములా కూడా రావడం లేదే!" అని నేను ఆపరేషన్‌కు సిద్ధం చెయ్యండి అన్నట్టు చెప్పేశాను.

మధ్యాహ్నం 12 గంటలకి వెళ్ళిన వాణ్ణి రాత్రి ఎనిమిది దాకా నేను ఆ ఇంట్లోనే వుండి పోవాల్సి వచ్చింది. లక్ష రూపాయలైనా సరే ఎక్కణ్ణించైనా మంత్ర జలం తెప్పించి ఆ పిల్లనెత్తిన చల్లి సూత్రాలు వచ్చేలా చెయ్యమని వాళ్ళు కోరారు.

నా మాటల్ని బట్టి అది నా చేతుల్లో లేదని తెలిసి వాళ్ళు నిరుత్సాహ పడి వేరేచోటికి phone చేసి రేపట్నించే ముగ్గురు ట్యూషన్ మాస్టార్లను arrange చేసుకునే పనిలో పడిపోతుంటే – నేను బైటికొచ్చేశాను.

సరోజ తపన చూసి సంధ్య ఒక మాట అనింది. ఆ మాట చెప్పేసి ముగించేస్తాను.

"మా అమ్మ సంగతి నాకు బాగా తెలుసంకుల్. నా ప్రాణం తీసేదాకా మా అమ్మ మంచినీళ్ళు కూడా ముట్టదు".

# తల్లీ, తండ్రీ, గురువూ - ఈ మూడు దెయ్యాల భాష!

నవనీత టెన్త్ చదువుతోంది. పాప రెండు ఇడ్లీల్ని కొరికి తినేసి స్కూలుకెళ్ళే పనిమీద వుంది. గండరగండడైన తండ్రి భలే కోపం మీద వున్నాడు. దాన్ని ఆయన అమ్మ మీద చూపిస్తున్నాడు.

తండ్రి అన్నాడు తల్లితో : "తల్లి చాలు బుల్లిపిల్ల అన్నారు. తల్లి రీతిగా వుంటే గదా కూతురు రీతిగా వుండేదానికి. ఆ పిల్లను టెన్తే ఫెయిల్ అవ్వనీ, నీ కథ చెప్తా. నువ్వో నేనో ఎవురో వొకరు వుండాల ఈ ఇంట్లో! ఫీజులు కట్టే వరకు నేను చూసుకుంటా గాని ఆడది చదివించాలా వొద్దా! ఇప్పుడెందుకు మాట్లాడ్డం! టెన్త్ అవనీ..."

తల్లి కుక్కిన పేను మాదిరిగా పడి వుంది. ఆయనేదో కోపంలో వున్నాడు పాపం! మాట్లాడుకోనీ... అరిచి అరిచి ఆయనే గమ్మునుంటాడు – ఇదీ తల్లి ఎత్తుగడ!

నవనీత కొంపలో నుంచి బైటపడింది. గండరగండడు కూడా డ్యూటీకి వెళ్ళిపోయాడు.

తల్లి గబగబా స్కూలు కరస్పాండెంట్‌కు ఫోను చేసింది.

"కరస్పాండెంటు సార్ నేను సార్ నవనీత వాళ్ళమ్మని. మొన్న యూనిట్ టెస్ట్‌లో మార్కులు చూసి మా ఇంటాయన తెల్లారి ఇక్కడెగిరి అక్కడ దూకినాడు సార్. మా ముండను కొంచిం పట్టించుకోండి సార్. అదేంది సార్ తెలుగులోకూడా ఫెయిలయ్యింది! ఆ పిల్ల ఫెయిలయితే ఈ కోపగల్లోడు నన్ను బతకనీడు సార్. కొంచెం చూడండి సార్. మాకేం ఆస్తులు కూడా లేవు సార్. పిలకాయల్నయినా రీతిగా చదివించుకోక పోతే ఎట్ల అనేది ఈయన మతం సార్. రానిదీ పోనిదీ చెప్పించే వగ లేదు గానీ నన్ను పట్టుకుని పెంపకం సరిగ్గా లేదని సాధిస్తా వుంటాడు సార్. బాధ్యత మీదే సార్ మాకేమీ 500లూ, 540లూ వొద్దుసార్, పాసయి పోయేటట్టు చూడండి సార్."

కరస్పాండెంట్ కుర్చీలో నుంచి లేచి టెన్త్ క్లాసులోకి వెళ్ళి నవనీతను పైకి లేవమన్నాడు.

నవనీత బిత్తర చూపులు చూస్తా పైకి లేచింది.

"ఏమమ్మా తెలుగులోకూడా ఫెయిలవుతారా ఎవరైనా? నీకు సిగ్గులేదా! కడుపుకు ఏం తింటున్నావ్? ఇట్లరా బోర్డు దగ్గరికి! అసలు నీకు చదవడం రాయడం అన్నా వచ్చా రాదా మొద్దు మొహమా! రాయి, ఆశయ సాధన రాయి."

నవనీత చాక్‌పీసు తీసుకుని కష్టంగా ఆశయ సాధన అనే దాన్ని రాయబోయింది.

ఆ పిల్ల రాసిందాన్ని చూసి కరస్పాండెంట్‌కే వున్న మతి కాస్తా పోయింది.

"ఆహా నీకు గుణింతాలు కూడా రావన్న మాట. కోస్తే నాలుగూళ్ళకు సరిపోయే టట్టున్నావు గదే దున్నపోతా! వొత్తుల్లేని పదం కూడా రాయలేక నిగిడి చస్తున్నావే! ఛా!" అనేసి కరస్పాండెంటు తెలుగు పుస్తకాన్ని తీసుకుని స్ట్రీట్ చిల్డ్రన్ అనే పద్య భాగంలో డిక్టేషను ఇచ్చాడు.

అరి చేతులకు పట్టిన చెమటను గుడ్డకు తుడుచుకుంటూ నిలబడి పోయివుంది నవనీత. క్లాసు క్లాసంతా pin drop silence.

"ప్రముఖ కవయిత్రి మహెజబీన్ గొప్ప సంఘ సేవికురాలు."

ఈ వాక్యాన్ని ఆయన రెండుసార్లు అరిచి అరిచి చెప్తే నవనీత ఇట్లా రాసింది: పురామక్క. కవియిత్యి. మహచజీన. గప్పా. చెంగ. చావుకరాలె.

వొళ్ళు తెలవని కోపం వచ్చేసింది కరస్పాండెంటుకు.

"నిన్నట్లనే నిలువున చీల్చేస్తే పాపమా! టెన్త్ అంటే నీకు సిగ్గుగా లేదా! వొక్క ముక్క కరెక్ట్‌గా రాశావా నువ్వు. వాక్యం చివర ఫులుస్టాప్ పెడతారు గానీ పదపదానికీ ఫులుస్టాపులు పెట్టుకుంటూ పోతారా ఎవరైనా?" అనేసి టేబిలు మీదున్న బెత్తం తీసుకుని అచ్చంగా గొడ్డును బాదినట్టు బాదేశాడు.

బేర్ బేర్ మని ధైర్యంగా ఏడవడానికి కూడా ఆ పాపిష్టి పిల్లకు వొప్పలేదు. నన్ను మీ ఇష్టం వచ్చినట్టు కొట్టండి సార్, నాకు పడాల్సిందే లే అన్నట్టు అన్ని దెబ్బలూ తింది.

తర్వాత కరస్పాండెంటు ఆ వాక్యాన్ని రాసి చివర మాత్రమే ఫులుస్టాప్ పెట్టి "బాగా చూడు. ఒకసారి చదువు. ఫుల్‌స్టాప్ పదపదానికి పెట్టానేమో చూడు" అని డస్టర్‌తో తుడిచేసి ఆ వాక్యాన్ని నవనీతను ఇప్పుడు రాయమన్నాడు.

అంతకంటే తమాషయిన తప్పులతో, అన్ని గాకపోయినా ఒకటి రెండు ఫుల్‌స్టాప్పులు తగ్గించి మళ్ళీ అట్లనే రాసింది నవనీత.

ఆ పిల్లకు పాపం రాయను చేతకావడం లేదని, ఆ పిల్లను కొట్టే బదులు ఆ పదేళ్ళూ ఆ పిల్లకు పాఠాలు చెప్పిన టీచర్లను కొట్టాలని ఆయన గ్రహించలేక పోయాడు.

"ఏయ్! నేన్నీకంటికి ఎట్లా కనిపిస్తున్నాను? ఏం ఎగతాళిగా వుందా? నిన్ను ఉప్పు పాతర వేసినా పాపం రాదు!" అనేసి బెత్తంతో ఆయనకు వొళ్ళు అలిసిపోయేలా కొట్టేసి అదే పోతా!

నవనీత ఏం చేస్తుంది! కడుపులోనే కాసేపు ఏడ్చుకుంది. స్కూలూ, ట్యూషను ముగించుకుని రాత్రి ఎనిమిదిన్నరకు ఇంట్లోకి పోయి నేరుగా బాత్‌రూం తలుపు లేసుకుని– బాత్రూం కడుగుతారే యాసిడ్ – దాన్ని తాగేసింది.

చచ్చినా పీడా పోయేది గానీ – డాక్టరు దగ్గరకెళ్ళి జల్సాగా రెండువేలు ఖర్చు పెట్టించి, ఆ ఉదయాన్నే డిశ్చార్జి అయింది.

ఆ మరుసట్రోజు, నవనీతతో తల్లి ఇట్లా అంది:

"అమ్మా తల్లీ! నువ్వు చదివితే చదువు చదవకపోతే పో. అంతేగాని బుడ్డ బెదిరింపులకు దిగద్దు. చదవకపోతే నువ్వుగదా పోతావు. మాకేమి?"

తండ్రి ఇట్లా అన్నాడు:

"అక్కడెక్కడన్నా చావనీ! కన్న నేరానికి టెన్త్ ఫెయిలవ్వగానే ఎవణ్ణో ఒక పంగమాలిన వెధవను చూసి తగిలించేస్తే పోతుంది!"

కరస్పాండెంట్ ఇట్లా అన్నాడు :

"నువ్వు నేర్చిన మంత్రాన్ని అందరికీ వూదొద్దు. తా చెడ్డ కోతి వనమెల్ల చెరిచిందనీ! ఛీ, నీ మొహం చూస్తేనే గోవును చంపినంత పాతకం!"

(2) స్వర్ణ స్కూలికి రడీ అవుతోంది. ఒక్క దోసెని అట్లా నంజుకుని చెంబుడు నీళ్ళు తాగేసింది.

తల్లి రెండు జెళ్ళేసేసి టీ తాగుతూ వుంది. స్వర్ణ అద్దం చేతిలోకి తీసుకుని గుండ్రటి మొహానికి Fair and Lovely పూసుకుని తిప్పించి మళ్ళించి చూసు కుంటోంది.

"చదువులో పసలేదు గానీ షోకులకేం కొదవ లేదు. పుస్తకమెత్తి నిమిషం ముందర పెట్టుకోదు కానీ అద్దం తీసుకుంటే మాత్రం వొళ్ళే తెలవదు. బిడ్డ చదివితే ముచ్చట. ఈ సోకులు చేసుకుంటే కాదు! ఆ సుజాతను చూడు. పుట్టక అంటే అదీ! school first అంట. ఆ పిల్ల చదివే స్కూలే కదా నువ్వూ చదివేది! ఆ పిల్లకు చెప్పే టీచర్లే కదా నీకూ చెప్పేదీ! అయినా మన తలకాయలో బంకమట్టి కదా వుండేది! దాని వుచ్చయినా తాగు పనికొస్తావేమో చూద్దాం!" అంది తల్లి టీ కావాలిస్తే మళ్ళీ తాగొచ్చు, ఆ మాట అనేద్దామని.

ఈ అన్ని మాటలకూ స్వర్ణ, "నువ్వు కొంచేపు మూస్తావా!" అంది తల్లిని. జెండామాను మాదిరిగా పైకి లేచేసింది తల్లి.

"అన్నంతమాట అనొద్దని నీకెన్ని సార్లే చెప్పేది! లంజాముండా! గంపడంత నోరేసుకుని తిరగబడేది తెల్సే! చదివేది తెలియదా! దాని వుచ్చ తాగమనే సరికి అంత పొడుచుకొచ్చిందే! ఆ రోషం చదువులో చూపించు. వచ్చే యూనిట్ టెస్ట్‌లో ఆ పిల్లకంటే ఎక్కువ మార్కులు తే! అదీ రోషం అంటే...." అని స్వర్ణ రెండు జళ్ళనీ పట్టుకుని నులిమేసింది.

స్వర్ణ కళ్ళల్లో నీళ్ళను కళ్ళల్లోనే కుక్కుకుంటూ స్కూలికి బయల్దేరేసింది.

ఇళ్ళల్లో, స్కూళ్ళల్లో ఇట్లాంటివి కొన్ని వందలు...

చంద్రకుమార్ ఆ క్లాసులో ఫస్ట్‌ర్యాంకు వచ్చాడు. వాడి చొక్కాకొక ఫస్ట్ ర్యాంకర్ బ్యాడ్జి తగిలించి మిగతా పిల్లల్తో అంటాడు క్లాస్ టీచరు:

"చంద్రకుమార్ దిగ్రేట్ అంటూ చప్పట్లు కొట్టండ్రా!"

టీచరు క్లాసులోకి రాగానే పిల్లలంతా పైకి లేస్తారు. టీచరు కుర్చీలో కూర్చుంటూ, "హోంవర్కు చేసుకురాని వాళ్ళు నిలబడి, చేసిన వాళ్లు కూర్చోండి."

సగం మంది నిలబడే వుంటారు.

"ఈ రోజు మీ మెడకాయల మీద తలకాయలుండవ్. భగవంతుడు కూడా మిమ్మల్ని కాపాళ్ళేడు."

ఏదో వొక బిట్‌కు వొక పిల్లాడే సమాధానం చెప్తాడు. పదిమంది చెప్పలేరు. విజేతతో సార్, "చెంపదెబ్బలు వెయ్, గంధం పూసినట్టు కాదు గంట కొట్టినట్టు వినపడాలి".

"అమ్మా తల్లీ! నీకెన్నిసార్లు చెప్పినా నీకీ ఫార్ములా రాదు. నీకు పవన్ కళ్యాణ్ మీద వుండే శ్రద్ధ సబ్జెక్టు మీద లేదు."

స్టడీ అవర్‌లో ఒకమ్మాయి గంట చదివినా రెండు మార్కుల క్వశ్చన్ కూడా కంఠస్తం పెట్టి సార్‌కు అప్పజెప్పలేక పోతుంది.

అప్పుడు మర్యాదస్తుడైన ఆ సారు : "ఎందుకమ్మా నీకు చదువు! నీకు రాదు. నా మాటవిని స్కూల్‌కు నిల్చిపో. ఒక్క ఆవుగొడ్డును పట్టుకుని మేపుకుంటే అది పాలిస్తుంది. అమ్ముకోవచ్చు. తాగవచ్చా. అది పేడేస్తుంది. పిడకలు తట్టుకోవచ్చా... గొడ్లు మేపడం అంత నామోషి అయితే ఎక్కడైనా టైలరింగ్ నేర్చుకోమ్మా. ఏడులోనే నువ్వు టైలరింగ్‌లో చేరినావనుకో, ఎనిమిది కంతా గుండీలు కుట్టేది నేర్చేసుకుని వుంటావు. ఈ పాటికంతా పావడలూ రవికలూ కుట్టేది వొచ్చేది కదా!"

అది రిజల్ట్స్ వచ్చిన రోజు. కూతురికి 380 మార్చులు వచ్చి వుంటాయి.

తల్లి నిష్ఠూరం : "దీన్ని ఇంటర్‌లో చేర్చడం దండగ. మళ్ళీ 30 వేలు ఖర్చు. ఎవరు తిన్న పాడు! ఆ మార్కులకే నిలవలేక పోతుంది చూడు. మన పనిమనిషి కూతురికొచ్చాయి 402. దాని ముందు తలెత్తుకోలేకున్నాను."

అప్పుడు తండ్రి ఇచ్చిన ఛాన్స్: "చూద్దాం ఇంటర్‌లో ఏం చేస్తుందో! నువ్వు discourage చెయ్యబాక."

చివరగా ఒకటి, ఆణిముత్యం. An ఎలా పెట్టాలో భలే చెప్పేశాడు ఇంగ్లీషు సారు. అర్థమైందనుకుంటే క్లాసులో 40 మందిలో 28 మంది University ముందు An పెట్టేశారు.

అప్పుడు దూర్వాసుల సారు : "మిమ్మల్ని చంపేసి జైలుకెళ్ళి పోతాన్రా!"

## Magic figure 500 కోసం ఇదేమైనా పద్ధతిగా వుందా?

సెవెన్త్ చదివే పిల్లవాడికొకడికి భలే కష్టం వచ్చి పడింది. వాళ్ళ హెడ్ మిసెస్ – పిల్లల క్వార్టర్లీ పరీక్షల ప్రోగ్రెస్ రిపోర్టుల్ని ఫ్యాను కింద కూర్చుని చూస్తూ వీడిది పట్టుకుంది. వాచ్‌మాన్‌ని కేకేసి పిల్లవాణ్ణి పిలిపించుకుంది.

"ఎందుకురా మీలాంటి మొద్దు మొహాలంతా స్కూల్‌లో చేరి మా దుంప తెంచుతారు? మేం బాగా బతకడం మీకు ఇష్టంలేదా? ఛా ఛా.... రేపు మీ పేరెంట్సుని పిల్చుకురా!" అని ఆర్డరేసింది.

పిల్లాడి తల్లి స్కూలుకెళ్ళింది.

"అమ్మా తల్లీ! వొక యూనిట్ టెస్ట్ చూశాం. వీడేమీ డెవలెప్ కావడం లేదు. రోజు రోజుకీ బండరాయి అయిపోతున్నాడు. ఇంక మా వల్ల కాదు. టీసీ ఇచ్చేస్తాను తీసుకెళ్ళండి. వీణ్ణి సెవెన్త్ పాస్ చేయించడం మా తరం కాదు. మీన్ మెథడ్స్ ఫాలో అయి సెవన్త్ పాస్ చేయించే చరిత్ర మా స్కూలికి లేదు. అట్లాంటి స్కూళ్లు వీధికి నాలుగేసి వున్నాయి. అక్కడెక్కడైనా చేర్చుకోండి" అని హెడ్ మిసెస్ క్లర్కుకేసి చూసింది.

క్లర్కు టీసీ బుక్ కోసం వెతుకులాడబోయాడు.

ఈ తల్లి గుండికాయలు నీళ్లయి పోయినాయి.

తొలుత, "అట్లా అనేస్తే ఎట్ల మేడమ్! Half Yearly పరీక్షల దాకా చూడండి. అప్పటికీ మేం ఇంటి దగ్గర శ్రద్ధగా చదివిస్తూనే వున్నాం. ఇంకా చదివిస్తాం. అర్లీ మాణింగ్ ట్యూషన్ కూడా పెట్టిస్తాం" అని కాళ్ళా వేళ్ళా పడింది.

హెడ్ మిసెస్ చిరాకు పడిపోయి, "మీకు దండం పెడతానమ్మా. ఇట్లాంటి వాళ్ళ వల్ల మా స్కూల్‌కి చెడ్డ పేరొస్తుంది. దీన్ని నమ్ముకుని ఎంత మంది బతుకుతున్నారో తెలుసు గదా. మీకు పుణ్యం వుంటుంది. మీ కాళ్ళు పట్టుకుంటా. ఇంకొక్క మాట మాట్లాడకుండా మీరు టీసీ తీసికెళ్ళండి." అని దౌర్జన్యానికి దిగింది.

దేముడు రాసి పెట్టినట్టు జరిగేది జరుగుతుందని తల్లి తెగాయించేసింది.

"మంచి స్కూలు కదాని మూడు వేలు డొనేషను కట్టి ఎల్‌కేజిలో చేర్పించాం. అప్పట్నించి పిల్లాడు మీ స్కూల్లోనే చదువుతున్నాడు. నెలనెలా 150 extra గా కట్టి సాయంకాలం tuition కూడా మీ స్కూల్లోనే పెట్టాం. ఇప్పుడు వాడు డవలప్ కాలేదంటే ఎట్లా మేడమ్! అది మా తప్పు ఎట్లా అవుతుంది? ఇయర్ మధ్యలో టీసీ ఇచ్చేస్తామంటే ఎట్లా మేడమ్." అని అడిగేసింది. పిల్లవాడు ఏడస్తా నిలబడి వున్నాడు. నెమిలి కంట్లో నీళ్ళు కారితే వేటగాడికేం? హెడ్ మిసెస్ టీసీ ఇచ్చి తరిమేసింది.

వాణ్ణి ఇంకో స్కూల్లో చేర్పించారు, దీంతో వాడికి, వాడి తల్లిదండ్రికీ తలగొట్టేసి నట్టయింది. వాణ్ణి బాగా చేరదీసే వాడి మేనత్త దగ్గిర వాడు అన్నాడంట: “నాకు చచ్చిపోవాలనుంది అత్తా!” అని. ఇది నేను వాడి తల్లి ద్వారా విన్న కథ. ఇంక నేను నా కండ్లతో చూసిన కథ.

నేనప్పుడు హైద్రాబాద్‌లో వున్నాను. నేను రాసిన పిల్లల భాషలో Algebra చదివి వొక స్కూల్ కరస్పాండెంట్ నన్ను పిలిపించి, “మే 1st నుంచీ June 15న School re-open అయ్యేదాకా Algebra కు సంబంధించిన fundamentals చెప్పండి, ఆరో తరగతి నుంచి పదో తరగతి దాకా. మీరు ఉదయం ఆరుకొచ్చి మధ్యాహ్నం పన్నెండు దాకా చెప్పాలి. ఆ వొకటిన్నర నెలకూ 20 వేలు ఇవ్వగలం.” అన్నాడు.

నేను ఎగిరి గంతేసినాను. కరువులో అధిక మాసం నా పరిస్థితి అప్పుడు. నెలకు 13 వేలు గిట్టుబాటవుతుంది. అంత జీతాన్ని నా జీవితంలో చూళ్ళేదు.

హమ్మయ్య, పిల్లలకు Algebra లో వుండే మర్మాలన్నీ చెప్పేసెయ్యొచ్చు అనే వుత్సాహం ఏ మూల వుండిందో కానీ, ఒకటిన్నర నెలలో 20 వేలు అనే వుత్సాహం నా వొళ్ళంతా ప్రవహించేసింది.

ఇక్కడ కూడా ఆ స్కూలు పేరు నేను వాడడం లేదు. నిద్రలేచి సెవెన్ సీటర్ ఆటో పట్టుకుని ఆ స్కూలుకు చేరేవాణ్ణి.

ఆరో గంటకంతా ఈ నిపుణుడి దగ్గర Algebra నేర్చుకోవడానికి ఆరోతరగతి పిల్లలంతా రడీగా క్లాసులో కూర్చుని వుండేవాళ్ళు.

నేనొక కొండముచ్చు మాదిరిగా క్లాసులోకి ఎంటరయ్యాను.

Summer vacations అప్పుడు కూడా ఈ నా కొడుకొకడు – అన్నట్టు నాకల్లా చూశారు పిల్లలు.

నిజమే కదా మరి, నేనక్కడ చేసిన పాప కార్యం చాలా వుంది. నా దరిద్రం కొద్దీ నేనక్కడకు వెళ్ళి Algebra చెప్పి పబ్బం గడుపుకున్నాను గానీ వాస్తవం మాట్లాడాలంటే చాలా వుంది.

నేను జాతయిన వాణ్ణయివుంటే "Summer vacations లో వొద్దులెండి సార్. మీకంత కావాల్సివస్తే School re-open అయ్యాకే వస్తాను.” అని ఆ

కరస్పాండెంట్‌తో అని వున్నాననుకోండి. 6th, 8th, 9th పిల్లల నెత్తిన పాలు పోసి వుండేవాణ్ణి. సెవెన్త్‌కి, టెన్త్‌కీ సమ్మర్ క్లాసులు తప్పవు. అది వేరే కథ. మళ్ళ దాంట్లోకి వస్తా.

Algebra కంటే ఈత గొప్పది. వాళ్ళు Algebra ను School re-open అయ్యాక క్లాసుల్లో అయినా నేర్చుకుని వుంటారు. ఈత క్లాసుల్లో నేర్చుకునేది కాదు కదా.

ఆ సమ్మర్‌లో వాళ్ళు వూళ్ళోకి వెళ్ళి వుంటే బావుల్లో ఈతలు కొట్టుకునే వాళ్ళు. ఈ హైద్రాబాద్‌లో గ్యాసు వల్లా మాగిన మామిడి పళ్ళు కాకుండా – మామిడి తోపులో అప్పుడే చెట్టు నుంచి మాగిన పండును తెంపుకుని మరీ తిని వుండే వాళ్ళు.

వాళ్ళ అమ్మమ్మల్తో, నాయినమ్మల్తో... వోహో కాలం కేళీ విలాసంగా గడిచి వుండేది.

నా వైపు నుంచి నేను చేసిన తప్పు ఇదైతే కరస్పాండెంటు ఆలోచనలు వేరే.

"వీణ్ణేదో Algebra లో expert అనీ, పిల్లలకు ఈజీగా చెప్తాడనీ అంటున్నారు. ఒక సమ్మర్‌లో వీడి చేత క్లాసులిప్పించి చూద్దాం. పిల్లలు లెక్కల్లో మెరికల్లా తయారైతే స్కూలికి పేరు గదా."

ఆ రకంగా సమ్మర్ క్లాసు వొకటి తీసుకుంటుండగా పక్క క్లాసులో జరిగిన కథే ఇది. అసలుది.

పక్క క్లాస్‌లో టెన్త్ Maths జరుగుతోంది. మరి, సమ్మర్‌లో వాళ్ళని వూళ్ళకి పంపించేస్తే ఎట్లా? సెవెన్తూ, టెన్తూ పబ్లిగ్గదా. సమ్మర్‌లోనే పాతిక భాగం సిలబస్ అయినా అయిపోవాలి.

సెవెన్తూ, టెన్తూ సిలబస్సు డిసెంబరు కంతా అయిపోతే గదా తర్వాత రివిజను. అందుకని పక్క క్లాసులో Maths టీచరు జామెట్రీ చెప్పేస్తున్నాడు.

ఈ క్లాసులో వున్నవాణ్ణి పక్క క్లాసులో జరిగిందాన్ని అప్పటికప్పుడు ఎలా వూహించను? వున్నట్టుండి ఆ క్లాసులో గోల లేచిపోయింది. ఒకరిద్దరు పిల్లలు బేర్ బేర్‌మని ఏడ్చేస్తున్నారు. కొడుతున్నాడేమోలే అనుకున్నాను. ఆ టీచరు కూడా క్లాసు బైట వచ్చేసి చెంబుతో చెంబుడు నీళ్ళు తీసికెళ్తున్నాడు. ఆ తర్వాత తెలిసిందిదీ:

మోహన్ అనే పిల్లవాడు – నాలుక బైట పెట్టేసి తేల కళ్ళు వేసేసి స్పృహ తప్పి పడిపోయాడు. ఒక వేళ చచ్చేపోయాడేమో అని కూడా పిల్లలు బిత్తరపోయారు.

ఆ రోజు ముందు క్లాసులో Maths సారు basic proportional theorem ను 20 సార్లు రాసుకురమ్మన్నాడు. సుమారు 30 pages home work. దాన్ని ఈ రోజు క్లాసులో చూడకుండా రాయాలి. అది అయిదు మార్కుల క్వశ్చను important మరి. ఆ theorem రాకుండా పిల్లల్ని exams కి కూర్చో పెట్టలేం. ఇప్పణ్ణించీ తయారు చేస్తే కదా!

వీడు మోహన్ దాన్ని రాసుకునీ రాలేదు. ఇక్కడ క్లాసులో చూడకుండా రాయనూ లేదు. అయిదారు మంది పిల్లలు ఆ theorem ను చూడకుండా కూడా రాసేసి సార్ మెప్పు పొందారు. మిగతా 15 మంది హోం వర్కయితే రాశారు గానీ ఇక్కడ రాయలేక పోయారు. కనీసం సార్ ఇచ్చిన వర్క్ చేసుకుని వచ్చారు. అక్కడికైతే సార్ గౌరవాన్ని కాపాడారు గదా. దెబ్బలు తప్పించుకున్నారు.

మోహన్ మాత్రం తప్పించుకో లేక పొయ్యాడు. Maths సార్ వీడి మీద తోడేలు లాగా పడి వీపు మీద ఇరవయ్యో, ముప్పయ్యో పిడి గుద్దులు గుద్ది అలిసి పొయ్యాడు. ఇది కాదు మంత్రం అనుకుని “వంద గుంజిళ్ళు తియ్!” అనేసి హూంకరించాడు.

పాపం, మోహన్ గుంజిళ్ళు తీశాడు. 80 తీశాక ఇంక వల్ల కాదన్నట్లు వొళ్ళంతా చెమటలు పట్టేసి వొణుకు వచ్చేసి స్పృహ తప్పి పడిపోయాడు. అది దొంగ వేషం లెండి అని పాఠం చెప్పబోయిన సార్ చివరికి మొహాన నీళ్ళు చిలకరించి చూశాడు. వాడు కళ్ళు తెరిచాడు. కథ సుఖాంతం!

మోహన్ చచ్చిపోయి వుంటే అది వేలెడు న్యూస్ అయ్యేదేమో గానీ ఇప్పుడది న్యూసే కాకుండా పోయింది. కాలకృత్యాలు కూడా తీర్చుకోకుండా పర గడుపున్నే క్లాసుకు పరిగెత్తుకు వచ్చిన పిల్లవాడు పాపం! కడుపు ఖాళీగా వుంటుంది. నిద్ర లేచి వచ్చిన పిల్లవాడికి ఏం పుష్టి వుంటుంది! ఆ సార్ కూడా బిడ్డలు గలవాడే గదా. ఆ టైంలో వంద గుంజిళ్ళు తీయించడానికి ఆయనకు మనసెలా వొప్పింది!

ఆ Maths సార్ పేరు రాజూ సార్ అనుకుందాం. నేను మెల్లగా ఆ సార్‌తో స్నేహం చేశా. ఆయన భావాలు కనుక్కుందామని.

రాజూసార్‌కి, ఆ స్కూల్‌లో గానీ, ఆ కాలనీలో గానీ, చక్కటి పేరు వుంది. పిల్లలు మటుకు ‘యముడు సార్’ అని పిలుచుకుంటారు ముద్దుగా. యముడు సార్

నిజంగానే దిట్టంగా వుంటాడు. ఆయన నాలుగు స్కూళ్ళల్లో Maths చెప్పుకుని ఒక అపార్ట్‌మెంటు కూడా కొనుక్కున్నాడు.

ఆయన అంటూ వుంటాడు : "మీరు ఎన్నయినా చెప్పండి సార్. దేముడికైనా దెబ్బే గురువు. సార్ నాలుగు తంతాడు అనే భయం వుంటేనే పిల్లలు వర్క్ చేసుకొస్తారు. నేను అనుభవం మీద చెప్తున్నాను – పిల్లలు కొట్టకుంటే చదవరు."

నేనక్కడ క్లాసులు తీసుకుంటూ వుండగానే – టెన్త్ రిజల్ట్సు వచ్చాయి. ఆ మరుసట్రోజే ఈనాడు పేపర్‌లో School యాడ్ వచ్చింది. టెన్త్‌లో 100% పాస్. ఇరవైమందిలో అయిదు మందికి 500 కూడా దాటాయి.

ఇప్పుడొచ్చాం అసలు విషయంలోకి. 7th, 10th లో రెండే రెండు magic figures 100% పాస్, తర్వాత 500. వీటి కోసం స్కూళ్ళు రకరకాల పద్ధతులు పాటిస్తాయి. ఈ మాత్రం ఫలితాలు సాధించడానికి ఆ స్కూలే కాదు, దాదాపు 90% స్కూళ్ళు పాటించే పద్ధతులు :

(1) పిల్లలు ఉదయం నాలుగు గంటలకు నిద్ర లేచేసి నాలుగున్నర కంతా స్టడీ అవర్‌కొచ్చేయాలి. అక్కడ వొకరిద్దరు సార్లు బెత్తాలు చేత పట్టుకుని, పుస్తకాన్ని ముందరేసుకుని తూగే వాళ్ళ నెత్తి మీద నాలుగేసి నిద్ర లేపుతూ చదివిస్తుంటారు.

(2) 7.30 కి స్టడీ అవర్ అయిపోతుంది. తర్వాత ఇండ్లకెళ్ళి రడీ అయిపోయి 8.30 కల్లా వచ్చేయాలి.

(3) ఉదయం తొమ్మిది నుంచీ స్టడీ అవరయితే స్టడీ అవరూ, సిలబస్ కాకపోతే సిలబస్సూ జరుగుతాయి.

(4) సాయంకాలం నాలుగున్నరకు మళ్ళీ స్టడీ అవర్లు మొదలవుతాయి. డౌట్‌లేమైనా వుంటే సార్‌లను అడిగి తెలుసుకోవచ్చు.

(5) రాత్రి ఎనిమిది గంటలకు ఇండ్లకెళ్ళి అంత తిన్నామనిపించేసి మళ్ళీ స్టడీ అవర్లు. అవి తొమ్మిది నుంచి మొదలై రాత్రి పదకొండు దాకా జరుగుతాయి.

(6) రాత్రి పదకొండుకు ఇండ్లకెళ్ళే వాళ్ళు ఇండ్లకెళ్ళవచ్చు. లేకపోతే స్కూల్లోనే కూడా పడుకోవచ్చు. మళ్ళీ ఉదయాన్నే 4.30 కు ప్రారంభమయ్యే స్టడీ అవర్లకు నిద్రలేపుతారు. ఇండ్లకెళ్ళిన వాళ్ళు ఆ టైంకి వచ్చేయాలి.

ఒకమ్మాయి అంది :

"ఆ అయిదు గంటలూ నిద్రేరాదు సార్. చదువుతా వున్నట్లే వుంటుంది. ఉదయాన్నే నిద్ర లేవమేమో అన్న భయం నిద్రే పోనివ్వదు. Parents లేపుతారను కోండి."

ఇంత బీభత్సంగా యుద్ధం చేసినందు వల్లే 100% పాసు, అయిదారుగురికి అయిదు వందలూ దాటాయి. ఆ ఫలితాలు వచ్చిన రోజునైతే Maths చెప్పే రాజూ సార్ ఆనందానికి పట్ట పగ్గాలే లేకుండా పొయ్యాయి. ఆయన సబ్జెక్టులో Class average marks 78 అట!

నేను రాజూ సార్‌ని చేతులు పట్టుకుని కాస్త దూరంగా పిలుచుకు వెళ్ళి, "సార్! నేనీ స్కూళ్ళకి కొత్త. మీరేం అనుకోనంటే నాలుగు మాటలు మాట్లాడతా. పిలకాయలకు తిండీ తిప్పలు లేకుండా చేసి మీరిప్పుడేమి సాధించేశారని? ఇప్పుడు కొత్తగా 10th కు వచ్చిన వాళ్ళు – ముందు బ్యాచ్ పడిన కష్టాలు తలుచుకుని బిత్తర పోతున్నారు. రోజుకు అయిదు గంటలు కూడా వాళ్ళకు నిద్రలు లేకుండా చేశారట గదా. అసలు మీ గురించి వాళ్ళేమంటున్నారో తెలుసా? మీరు క్లాసుకొస్తే నాగుబాము క్లాసుకొచ్చి నట్టేనట. అదెప్పుడు ఎవర్ని కాటేస్తుందో తెలియక చస్తుంటాం ఇంక లెక్కలెక్కడ వింటాం సార్ – అని చెప్పారు నాతో. కొంచెం దయగా వుండండి. మహా అయితే వొకరిద్దరు ఫెయిలవుతారేమో! Average marks 78 కి బదులు 68 వస్తాయేమో! అంతే గదా! ఈ విజయం కోసం పిల్లల్ని గానుగెద్దుల్ని చేసి వాళ్ళ వుసురు పోసుకోవాలా? ఆరూ, ఏడూ, ఎనిమిదీ, తొమ్మిదీ తరగతుల్లో శుద్ధంగా లెక్కలు చెప్పి ఏడిస్తే – టెన్త్‌లో వాళ్ళచేత వొక్కో ప్రాబ్లమ్‌ని ఇరవయ్యేసి సార్లు గుడ్డివాటంగా వెయ్యించా లంటారా..?" అని అడిగేశాను.

నిజం చెప్పొద్దా! నాచేతిలో పెన్ వొకటి వుందని ఇతరులంతా రాక్షసులూ, నేనొక్కణ్ణి దయాళువూ అని చెప్పేసుకుంటే సరిపోతుందా?

రాజు సార్ చాలా మంచి మనిషి. ఆయన నోరు తెరిచాడు. కృష్ణాజిల్లా యాసలో, "మాస్టారూ! ఈ education system అనేది వొక vicious circle. ఇప్పట్లో గాంధీ మహాత్ముడే టెన్త్‌క్లాసు Maths చెప్తున్నాడనుకోండి. బెత్తంతో వీపు వాయగొట్టి రోజుకొకర్ని NIMS కు పంపేవాడు. నేను డిగ్రీ ఫెయిల్ అయిన వాణ్ణి. నాలుగు స్కూళ్ళల్లో Maths చెప్పుకుని హాయిగా బతుకుతున్నాను.

మీరు పిల్లల్ని రక్తాలు కారేటట్టు కొట్టినా ఏ పేరెంటూ వొచ్చి గొడవ చెయ్యడు. ఒక్క పిల్లాడు ఫెయిల్ అయినా ఆ పేరెంట్ యుద్ధానికి వస్తాడు. కాబట్టి తప్పదు. నేను కొంచెం జాలి తలచాననుకో పిల్లలు వర్క్ చేసుకుని రారు. ఫెయిల్ అయి పోతారు. ఈ స్కూల్లో టెన్త్ ముగ్గురు ఫెయిల్ అయ్యారనుకోండి Maths లో. రాజూ సార్ లాభంలేదని కరస్పాండెంట్ సార్ రేపే నన్ను స్కూలికి రావద్దంటారు. ఇది మా బతుకు సార్." అనేసి అన్నాడు. ఇంకేం మాట్లాడతాం!

20 మంది పిల్లలు టెన్త్ చదువుతూంటే అయిదు మంది ఫెయిల్ అయ్యారను కోండి. ఇక ఆ స్కూల్ బతకదు. కాబట్టి నువ్వేం చేస్తావో తెలవదు. 7th, 10th పిల్లల్ని పిండి పిప్పి చేసెయ్యడం!

**తి**రపతిలో ఇంకోస్కూల్లో ఇంకొక దారుణం జరిగింది.

అసలే టెన్త్ క్లాస్, పైగా డిసెంబర్ కూడా వచ్చేసింది. మార్చి పరీక్షలు తరుముకుని వస్తున్నాయి.

అయినా సురేష్ అనే పిల్లాడు Maths లో ఏ ఫార్ములా అయినా సరే చెప్పలేక బిత్తర చూపులు చూస్తున్నాడు. ఆ స్కూల్లో యజమానే టెన్త్ Maths చెప్తుంటాడు. సురేష్‌ని చూసి ఆయనకు టెన్షన్ పెరిగిపోయింది.

ఒక లెక్కను బోర్డుమీద వొకటికి రెండుసార్లు చేసి చూపించాడు. పిల్లవాణ్ణి చెయ్యమన్నాడు. వాడు బోర్డుమీద చెయ్యలేక పోయాడు.

అంతే సార్‌కి వొళ్ళు పొగలు బోయింది. సురేష్‌ను చొక్కా విప్పమని వొట్టి వొళ్ళు మీద రూళ్లకర్రతో పూజ చేశాడు.

ఇంటికెళ్లిన సురేష్ అమ్మనూ, నాయిన్నీ గుర్తుపట్టలేనట్లు బిత్తర చూపులూ పిచ్చి చూపులూ చూశాడు. వాడికి బాగవడానికి 20 రోజులు పట్టింది, అదీ డాక్టర్ల చుట్టూ తిప్పితే!

ఈ కథంతా ఆ స్కూల్ పారెంట్ అయిన వొక తల్లి నాకు చెప్పి,

"పిల్లల్ని ఆ మాదిరిగా పట్టించుకోబట్టే ప్రతీ ఇయరూ సెంట్ పర్సెంట్. ఒకరిద్దరికి 540 కూడా వస్తాయి."

ఈ ఖ్యాతి చాలదా! ఆ స్కూలాయన ఫార్ములాలు చెప్పకపోతే పిల్లల్ని గుండుగీసి గాడిదల మీద కూడా వూరేగించడానికి.

అడిగే నాథుడేడీ?

# పిల్లల్లో సెక్స్ సమస్య : ఇదొక పెద్ద నల్లనాగుబాము

టీవీ వొక నాగుబాము, సినిమా వొక నాగుబాము, వీటివల్ల నిలిచిన చోట నిలవనివ్వకుండా చేసే సెక్స్ వొక నల్ల నాగుబాము.

ఈ chapter మొదలుబెట్టి వున్న పరువును కాస్తా చేజేతులా పోగొట్టుకునేటట్టుండాను. కానీ తప్పదు. ఆమాటా ఈ మాటా చెప్పి తప్పును సినిమా వాళ్ల మీదా, పిలకాయల మీదా తోసేసి, మసిపూసి మారేడు కాయ చేసేసి నేనీ గండం నుంచి తప్పించుకోవచ్చు. మనుషులు మెచ్చినా దేవుడు మెచ్చడు గదా.

నా వీపు నేను చూసుకుంటా.

నేను ఆరో తరగతిలో వున్నప్పుడనుకుంటా – అడవిలోకి గొడ్లను తోలుకు పోయి కాల్లో తుమ్మముల్లు గుచ్చుకునేటట్లు చేసుకునేసినాను. అది దొంగముల్లు. పొట్టుగగ్రతో తీసినా, ఉప్పురాయిపెట్టి కిరసనాయిలు చుక్క వేసినా రాలేదు. వారానికంతా కాలు కింద పెట్టలేనట్టు చీము పట్టిపోయింది.

మాయమ్మకు తప్పదు గదా. తిరప్తి రాయల్ చెరువు రోడ్డులో బస్సు దిగినాం. నన్నెత్తి చంకనేసుకుని ఆ జానా బిత్తెడు గువ్వ చంద్రశేఖరు డాక్టరు దగ్గరికి తోడుకొని పోయి ముల్లు తీయించి చీము వొత్తేయించి కట్టు కట్టించింది.

డాక్టరు దగ్గర్నించి బైటికి వొచ్చినామో లేదో 'సిల్మా సిల్మా' అని మా అమ్మను ఉప్పున బెట్టి పప్పున పామేసినా. ఇంటి కాడ గొడ్డూ గోదను, చట్టీ కుండను ఎక్కడివక్కడ వొదిలేసి వచ్చుంటుంది గదా వొద్దనే వొద్దని పుల్ల విరిచి నేలేసేసి నాకొక బన్ను రొట్టి తీసిచ్చింది. మళ్ళీ ఏడిస్తే దాన్ని అద్దుకుని తినే దానికొక టీ తీసిచ్చింది. సిల్మా మాత్రం కుదర్లా.

సిల్మా వొద్దన్నందుకు మా అమ్మకు నేనేసిన శిక్ష ఏమంటే – నన్నెత్తుకుని తిరప్తిలో నాలుగు వీధులు తిరగాలి, నేరుగా బస్సు ఎక్కెయ్యకుండా. నాలుగు వీధుల్లో పది వాల్ పోస్టర్లుంటాయి గదా. బొమ్మలు చూడొచ్చు గదా.

అంతే, మా అమ్మకు తప్పలేదు. నన్ను నాలుగు వీధులూ తిప్పింది. వాల్ పోస్టరు కాడ వొక్కోదాని కాడ అయిదు నిమిషాలు నిలపెట్టి దాంట్లో వుండేదంతా చూసి, చదివి 'ఇంక పద' అనేవాణ్ణి.

అదీ సినిమా పిచ్చి అంటే.

చిన్నప్పుడు టవునులో కాపరాలు వుండేవాళ్ళు అన్నాలే చేసుకోని తినాల్సిన పన్లేదు. మార్నింగ్ షో, మాట్నీ, ఫస్ట్ షో, సెకండ్ షో – ఇట్లా సినిమాలు చూసేస్తా వుంటే చాలు గదా అనుకునే వాణ్ణి. నేనైతే నాలుగైదు రోజులు వరసగా సినిమాలు చూస్తా అన్ని నీళ్ళు తాగేసి గమ్మనుండి పోతాను అనేది నా సిద్ధాంతంగా వుండేది.

ఏడో తరగతిలో వుండగా అనుకుంటా – మా వూరికి మూడు మైళ్ళ దూరాన వుండే వెంకటాపురంలో టెంటు పడింది. దాంట్లో చూసినాను – మొదటిసారిగా జ్యోతిలక్ష్మి పాట.

జ్యోతిలక్ష్మి మా పిలకాయలని ఎట్లా ఏడిపించి చంపిందో ఈ రకం చచ్చు పుచ్చు మాటలతో చెప్పలేను గానీ మా వూర్లో ఇలామంతు బావ సహాయం తీసుకుంటా.

వెంకటాపురంలో సినిమా చూసేసి అర్ధరాత్రి పూట మావూరు తిరిగొస్తా వుంటే ఆయనొకసారి ఇట్లా అన్నాడు : "జ్యోతిలచ్చిమే లేకపోతే – మీ పిలకాయల గెలకు నీళ్ళే దిగవురా. మీకు పెండ్లిండ్లే చెయ్యాల్సిన పన్లా."

ఇంతకంటే మాటా జ్యోతిలక్ష్మి మీద!

డిగ్రీ దాటుకున్నానో లేదో నాకు సినిమాల మీద పిచ్చి ఎట్ల పోయిందో పోయింది. ఇప్పుడైతే అవంటేనే వికారం కూడా.

కానీ ఒకమాట మాత్రం చెప్పగలను – అప్పట్లో నా నిద్ర చెడగొట్టింది జ్యోతిలక్ష్మి, జయమాలిని, సిల్క్‌స్మిత, జయప్రద, జయసుధ.. ఇట్లా వేళ్ళమీద లెక్కేసుకోవచ్చు.

ఇపుడు పిలకాయలు లెక్కెయ్యాల్సి వస్తే తల వెంట్రుకలు కూడా చాలవు. ఈ మాట నేనెట్లా చెప్పగలనంటే–

రెండేండ్లకు ముందు దాకా నాకు టీవీ అంటేనే తెలవదు. అప్పటికి మహా అయితే 3, 4 గంటలు నేను టీవీ చూసి వుండొచ్చు నా జీవితంలో.

మా పిలకాయలు పెద్దవుతున్న కొద్దీ టీవీ తెమ్మని ఒకే పోరు. సంసారం చేసుకునే ఇంటికి అదొస్తే పిలకాయలు చెడి పోతారని నేను వాయిదా వేసుకుంటూ వొచ్చినాను. మేం హైద్రాబాద్‌లో వున్నప్పుడు మా ముగ్గురు పిలకాయలకూ కాలు ఇంట్లో నిలిచేదే కాదు. ఎప్పుడూ పక్కింట్లోనే. రాత్రిపూట వాళ్ళు తలుపులేసుకున్నా తట్టడం, మేం తిడతామని భయపడితే తలుపు సందుల్లో కళ్ళు పెట్టి టీవీ చూసేద్దామన్నంత ఇది... పాపం మా పక్కింటి వాళ్ళు టీవీ చూసేప్పుడు మా పిలకాయల్ని ఏమీ అనకపోయినా, వాళ్ళు ఏదో అనేస్తున్నారని మాకిక్కడ అనుమానం.

"మేం అంత గతి లేకుండా ఏం బతకడం లేదు!" అని కేవలం పక్కింటి వాళ్ళ మీద శౌర్యంతో మేం instalments మీద టీవీ తెచ్చేశాం. పైగా ఏక్ దమ్మున పదివేలు డబ్బు కట్టేసి తెచ్చినట్లు పక్కింటి వాళ్ళకు తెలిసేటట్లు ప్లానుచేసి టివి బిగించాం.

ఇప్పుడు ఈ టీవీ చూపించిన ప్రభావం గురించి :

ఇది మా ఇంటికొచ్చిన మూడు నెలలలకే మా టాం సాయర్ నా చొక్కాయ పట్టుకుని లాగి, "నాన్నా! Ozomen ఎందుకు వాడతారు?" అని గాభరాగా అడిగినాడు.

ఈ మాటకు నా కూతురికి నవ్వు పొడుచుకుని వస్తా వుంది. ధైర్యంగా నవ్వితే వాళ్ళమ్మ తిడుతుందని భయపడి ఆపుకుంటూ వుంది. మా వాడి ప్రశ్నకు నేను బిత్తర నటించక టకీమని, "తలకాయ నెప్పికి వాడతార్రా నాయినా!" అన్నాను.

"నీమొఖం! love పెరగడానికి వాడతారు!" అనేసి అన్నాడు వాడు.

పసిబిడ్డ మీద అబద్దాలు చెప్పకూడదు. టీవీ మీద ఇంతకంటే ఏం చెప్పుకుందాం ఇంక!

ఈ టీవీ అనేది నాకు కొత్త. కానీ దాంట్లో అటువంటివి వస్తాయని కలనైనా అనుకోలేదు. ఒక రోజు రాత్రి నిద్ర పట్టక ఛానల్స్ మారస్తా వుంటే కొందురు యుక్త వయసులో వున్న ఆడపిలకాయలు రిబ్బను మాదిరిగా నడుంకు చుట్టుకుని

గుంపులు గుంపులుగా వస్తూ వుండినారు. అది Fashion TV అంట. దాన్ని నేను ఈ రెండేండ్లలో కనీసం 50సార్లు అరేసి గంట చూసి వుంటా.

ఇంక AXN అని ఏదో ఒకటి వుంది. నేను ఇంగ్లీషు సినిమాలు చార్లీచాప్లిన్ సినిమా వొకటి తప్ప (అదీ దాంట్లో మాటలు వుండవని తెలిసి) మిగతా ఏదీ చూళ్ళేదు. నాకు అవి అర్థం కావు. ఎప్పుడు మాట్లాడుకుంటారో, ఎప్పుడు తుపాకుల్తో పేల్చుకుంటారో తెలవకుండా వుంటాయవి. ఎందుకో ఒకరోజు AXN పెట్టుకున్నా. నిమిషంలో 2 నిమిషాల ముద్దు సీను కనిపించింది. సౌండు తగ్గించేసి దాన్నే చూసినా. ఇప్పుడీ రెండేండ్లలో కనీసం వందసార్లు ఆ ముద్దుసీన్ల కోసం ఆ ఛానల్ చూసి వుంటా.

ఇంక తేజ టీవీలో రాత్రయితే పాటలు వస్తా వుంటాయి. అందులే వేసినవే వేస్తా వుంటారు.

సిగ్గు విడిచి – దాంట్లో మాటిమాటికి వచ్చే వొక పాట గురించి చెప్తా.

అది వాన పాట. సినిమా ఏదో నాకు తెలవదు. ఒకసారి దాంట్లో సాహిత్యాన్ని కూడా విన్నాను. 'ఓ ఇది ఏమి మాయ...' అనుకుంటాను. చిరంజీవి, వాణీ విశ్వనాథ్ వుంటారు దాంట్లో.

ఆ పాటను వర్ణించాలంటే పైకి బడాయిగా– కోపంతో ఒళ్ళు పొగలు బోతుంది అని చెప్పవచ్చు. కానీ ఆ పాటను తలుచుకుంటేనే వొళ్ళంతా ఒక రకం మైకం, జిల..... అట్లా వుంటుందా పాట.

వానకు తడిసి ముద్దముద్దగా వెల్లికిలా పడిపోతుంది వాణీ విశ్వనాథ్. అప్పుడు చిరంజీవి – ఆమె రెండు తొడల మధ్య సైకిల్ ముందరి చక్రాన్ని ఎక్కిస్తాడు, ఇట్లా వుంటుంది.

నాకిప్పుడు 40 ఏళ్ళు. ఆ పాట చూడగానే ప్రభావతి కోసం నేను వెతుక్కో వాల్సిందే. ఈ రెండేళ్ళలో కనీసం ఆ పాటను పది సార్లయినా చూసుంటా, ఆ పది సార్లూ ప్రభావతిలో వాణీ విశ్వనాథ్‌ను చూసుకుని వుంటా. ఇంక చాలా!

ఇట్టాంటి నగ్మా పాటలు, విజయశాంతి పాటలూ ఎన్నో చెప్పలేం.

వాటిని చూసి నాకే ఇప్పుడు వాణీ విశ్వనాథ్ కావాలని వుంటే – మంచి 15, 16 ఏళ్ళ పిలకాయలు ఏమైపొయ్యేది!

పోనీ వాటిని పిలకాయలు చూడరు అనే దానికి వుందా?

లోపల ఒక రూములో తలుపేసి EAMCET prepare అవుతుంటాడొక పిలగాడు. కాస్త బోరుకొట్టి టీవీ ఆన్ చేస్తాడు. రెండు నిమిషాలు వాణీ విశ్వనాథ్‌ను చూడడం అనేది ఎట్లా కుదరకుండా పోతుంది? అది చూసేశాక వాడికి వాణీవిశ్వ నాథ్‌ను ఎవరు తెచ్చిస్తారు! ఆ సమయంలో Physics text book నాలిగ్గీసు కోడానికా!

టీవీని అట్లా ఆన్ చేసినా, బజారుకెళ్ళి ఏదో వొక సినిమాకు పోయి వచ్చినా– పిలకాయల వొళ్ళు హూనం అయిపోయే పరిస్థితి సెక్స్ కోరికలతో.

టీవీల్లో అప్పుడప్పుడూ – సినిమాల్లో కొన్ని సన్నివేశాల్ని బిట్స్ బిట్స్‌గా వేస్తుంటారు.

అందులో భాగంగా వొక బిట్ : తల్లీ ఇద్దరు కూతుళ్ళూ ఒక రూములో వుంటారు. చిరంజీవి లోపలికెళ్తాడు. అయిదు నిమిషాలు అంతా చీకటై పోతుంది. చిరంజీవి వొళ్ళు విరుచుకుంటూ వొస్తాడు. ఆ ముగ్గురిలో వొకరికి పనై పోయి వుంటుంది. అదీ అత్తకు!

సంప్రదాయము, బొచ్చు, బోద కసువు అని మన పెద్దవాళ్ళు భలే మాట్లాడతా వుంటారు బయట. పిల్లనిచ్చిన అత్త అంటే మనకు తల్లితో సమానం. కానీ తెరమీద ఇట్లా.

ఇప్పుడు సమాజంలో పిల్లలకు తప్ప – పెద్దలెవరికీ పెద్దలంటే భయంలేదు. చిన్నా పెద్దా అనేదే లేదు. నీకు నువ్వే king నాకు నేనే king. ఎవరు కానిపని చేసినా ఎవరికెవరూ interfere కారు.

ఇంత చెప్పే నేను – రేపు నా కొడుకు చిరంజీవి అంతటి వాడైతే విర్రవీగి పోనా!

అన్నింటికీ తలుపులు ఎత్తేశాం.

ఒక ఛానల్లో ఉదయభాను – ఎక్కణ్ణుంచి వస్తుందో ఆమె కంత నవ్వు – ఎద ఎగిరెగిరి పడుతుండగా ఓ అని నవ్వేస్తూ వుంటుంది. ఇంకో ఛానెల్‌లో వాణీ విశ్వనాథ్ వాన పాట వస్తా వుంటుంది. మరొక ఛానెల్లో – హీరోలు అత్తల్తో సహా హీరోయిన్లందరి పనీ పట్టేసి వొళ్ళు విరుచుకుంటూ వుంటారు.

ఇవేమీ పట్టనట్టు మన పిలకాయలు మాత్రం తలుపులేసుకుని Maths లో, Physics లో, Chemistry లో వున్న లోతుల్ని ఎంచక్కా అర్థం చేసుకుంటూ EAMCET లో ర్యాంకులు తెచ్చేసుకుంటూ ఇంజనీర్లయి పోయి మన నెత్తిన కిరీటాలు పెట్టేస్తుండాలి.

ఆహా, ఏమి లోక న్యాయం!

# కోళ్ళఫారం పెట్టినట్టే...!

నేను గొంతు చించుకునే ముందు ఒక చిన్న కథ. Arabian Nights లోది. చిన్న పిలకాయల ఇంగ్లీషు text book లో వుండబట్టి నాకు తెలిసింది. కథ పేరు The False School Master.

చిన్న పేటలో వొకడుంటాడు. డబ్బు సంపాయించే మార్గం ఏదబ్బా అని చిటికేసినంత సేపు ఆలోచించి వొక స్కూలు పెట్టేయాలనుకుంటాడు. నాలుగు బెంచీలు, నాలుగు పుస్తకాలూ, అన్ని పెన్సిళ్ళూ, వొక గ్లోబు కొనుక్కునేసి వొక బోర్డు తగిలించేసి స్కూలు పెట్టేస్తాడు.

వాడికి చదవను రాదు. రాయను రాదు. కానీ స్కూలు చూద్దుమా జెమ్మా చారంగా వుంది. సార్ కూడా గుడ్డా గుసురూ బాగానే కట్టుకుని ఫ్యాషనుగా వుండాడు. ఇంకేం? తల్లిదండ్రులంతా పిలకాయల్ని ఆ స్కూల్లో చేర్చేసినారు.

ప్రిన్సిపాలు సారు మంచి తెలివైనోడు. చదవను తెలవక పోతే ఏమి, రాయను తెలవక పోతే ఏమి? పిలకాయలు వాళ్ళంతట వాళ్ళే చదువుకుంటార్లే అని పుస్తకా లిచ్చేసి అది చదవండీ, ఇది రాయండీ అని జబర్దస్తీ చేస్తా రోజులు గడపతా వుండి నాడు. పిలకాయలు కూడా నిజంగానే వొకర్నుంచొకరు రాస్దీ పోస్దీ నేర్చుకుంటూ వుండిపోయినారు.

ఒక రోజు స్కూలు ముందర సార్ కుర్చీ యేసుకుని నిగడదన్నుకొని కూర్చొని వుండాడు. ఒకామె చేతిలో ఏదో కాగితం పట్టుకుని స్కూలుకల్లా వస్తా వుండింది. సార్ గుండికాయలు నీళ్లయి పోయినాయి. 'ఈ ముండ ఆ కాగితాన్ని చేతల్లోబెట్టి

చదవమనునా ఏమి' అని బిత్తర బిత్తరగా వుండంగానే ఆమె వొచ్చేసింది. కాగితాన్ని చేతిలో బెట్టి 'చదివి చెప్పు సా' అనడిగింది.

'అయ్యో, ఇప్పుడనగానే వొస్తివా తల్లీ! నాకు ప్రేయరుకు టైమవతా వుందే' అని తప్పించుకోబోయినాడు గానీ కుదర్లా.

కాగితాన్ని తిరగేసి మరగేసి చదివినట్లు యాక్షను చేసి మూతి నల్లంగా పెట్టుకున్నాడు. సార్ దిగులుగా పెదాలు చప్పరించడం , మూతి మూరడు పొడుగు పెట్టడం చూసి, "ఏం సా నా మొగుడేమన్నా చచ్చి గాని పోయినాడా?" అని ఏడ్చిందా పిచ్చిది.

అవునన్నట్లు తలకాయ వూగించినాడు సారు.

ఏడ్చుకుంటూ ఇంటికి పోయిందామె. ఇరుగుపొరుగు చేరి, "స్కూలికి నవ్వతా నవ్వతా పోతివి. ఇంటికి ఏడస్తా, ఏడస్తా వొస్తివి. ఏం తల్లా సంగతి!" అని అడగబట్టిరి.

"నా మొగుడు చచ్చిపోయినాడంట. ఇస్కూలు చెప్పే సారు చెప్పినాడు" అని చేతిలో వుండే కాగితం చూపించింది.

గుంపులో నుంచి వొక పాలూకూడూ తినే ఆయన, "అయ్యో నాకు నిన్ననే లెటరొచ్చిందే. ఆయన 10 రోజుల్లో తిరిగొస్తాడే!" అని ఆ కాగితాన్ని తీసుకుని చూస్తే - ఇంటి ఖర్చులకు డబ్బుకూడా పంపినట్లు దాంట్లో వుండింది. ఆమె మొగుడు పొట్టేలు పిల్ల మాదిరిగా బాగుండాడంట. అప్పుడు నిమ్మళానికొచ్చిందామె.

ఇస్కూలికి పోయి "ఏం సా, అనావశంగా నా మొగుణ్ణి చంపక తింటివే!" అని ఆమె అడిగితే ఏముందీ-

"మొత్తానికి నీ మొగుడు సౌఖ్యమే గదా, పోనీలే పాపం" అని సార్ తల వాలేసుకున్నాడు.

Arabian Nights ఏ కాలం నాటివో నాకు తెలియదు. కానీ ఈ కాలం స్కూళక్కూడా ఇది అచ్చు గుద్దినట్లు సరిపొయ్యే కథ. ఇంకేం చెప్పే పన్లేదు గానీ నా పాత్ర నేను  పోషించొద్దా!

కోళ్ళ ఫారాలు పెట్టినట్లు పెట్టేస్తున్నారు స్కూళ్ళని కూడా.

నిజంగానే.

మొన్నటికి మొన్న ఈ పాపం చేసిన చెవుల్తో ఇట్లా విన్నాను.

"ఒక షెడ్డేసి రెండు వేల పిల్లల్తో బ్రాయిలర్స్ పెట్టేశాను. మనకింకా అరవై అంకణాలుంది. దాంట్లో కూడా షెడ్డేసి స్కూలు పెట్టేశాను. ఏక్‌దమ్మున 200 మంది పిల్లలు చేరిపోయారు."

నేను ఆశ్చర్యపోయాను. ఈ మనిషిని చూసి, కొత్తగా సెవెన్త్ వరకూ పెట్టిన స్కూల్లో 200 మంది పిల్లలు ఎట్లా చేరిపోయారా? అని. ఆయన చెప్పినాడు.

"భలే ఐడియా వేశాన్లెండి. L.K.G., U.K.G., ఫిఫ్టీ రుపీస్. 1st to 7th హండ్రెడ్ రుపీస్ ఫీజు. అంతే, ముందు అట్లాగే పెట్టాలి. షెడ్ బాగుంది. మద్రాసు దాకా పోయి 5 వేలు పెట్టి టాయ్స్ అవీ కొనుక్కొచ్చాను. చేరి పోయారు."

ఆయనేం అబద్ధాలు చెప్పలేదు. కోళ్ళకెంత సౌకర్యంగా షెడ్ వేశాడో పిల్లలకూ అంతే సౌకర్యంగా షెడ్ వేశాడు. సత్య ప్రమాణంగానే ఆయన strength - 200 మంది పిల్లలు! (రెండు వేల బ్రాయిలర్స్ కాక!)

అంత ఈజీ స్కూలు పెట్టడం!

నాకు తెలిసినంత వరకూ ఆయనకు Hero Honda నడపడం, కళ్ళకు Rayban గ్లాసులు పెట్టడం తప్ప మరొక విద్య రాదు.

నేనెంత కుళ్లి చచ్చానంటే–

నేను ఈ సంవత్సరం జూన్ 15కల్లా హైద్రాబాద్ నుంచి తిరప్తి వొచ్చేశాను. ఈ సంవత్సరం స్కూలు ప్రారంభమై పోయింది గాబట్టి స్కూలు పెట్టలేం, వొచ్చే సంవత్సరం ఎట్లాగైనా స్కూలు పెట్టేయాలనేది నా ఆశ.

ఈ లోగా నా talent కాసింతయినా బైరాగిపట్టెడ ప్రజలకు చూపించి నా పెళ్ళాం బిడ్డల్ని సాక్కోవాలని ప్లాను వేసి ఇంట్లోనే ట్యూషను చెప్పుకుందామని చూశా. చివరకు ఇద్దరు ముగ్గురు పిల్లలు ఇంటికొచ్చి అదీ ఇదీ చెప్పించుకుని పోతున్నారు.

ట్యూషన్ అని బోర్డు వేలాడదీయలేదని నా దగ్గరకు పిల్లలు రాలేదంటారా? 5, 6 వేలు ఖర్చుపెట్టి వొక పెద్ద ఇల్లు తీసుకుని అట్లా కూడా వొక బోర్డు వేలాడదీసే వాణ్ణే! అదీ ఎందుకు మానుకున్నానంటే–

స్కూల్లో పిల్లలకు తీరికేదీ, నా దగ్గరకు tuition కు రావడానికీ!

స్కూల్ hours అయిపోగానే అదే స్కూల్లో tuition start అయిపోతుంటే– తప్పీదరీ ఇద్దరు పిల్లలు మన దగ్గిర చేరారే అనుకోండి. వాళ్ళని అక్కడి సార్‌లు చంపుకు తింటారు.

"ఎవడ్రా నీకీ లెక్క చెప్పింది! పనికిమాలిన వాళ్ళందరి దగ్గరా tuition చేరేదీ మమ్మల్ని చావదొబ్బేది! tuition ఇక్కడే చేరూ!" అని తాట వొలుస్తారు.

ఇది కాదు మంత్రం అని చెప్పి 20, 25 మంది parents ను కలిసి "చూడండి మీ పిల్లవాడు సెవెన్త్ చదువుతున్నాడనుకోండి. సెవెన్త్ పుస్తకంలోవే చెప్తే రావు.వాడికి అంకెల్లో divisions మీద స్పష్టమైన అవగాహన లేనప్పుడు Algebra లో divisions ఎలా చెప్తాం చెప్పండి! మీరు వోపిగ్గా ఉంటే fundamentals neat గా చెప్పించి 8th కు వచ్చేలోగా వాడికి లెక్కలంటే ఆసక్తి కలిగిస్తా. మీరు నాకు tuition fees కూడా ఏమీ ఇవ్వనవసరం లేదు." అనేసి అన్నా.

ఈ last మాట నేనెందుకు ప్రయోగించానంటే తెలివి తక్కువై కాదూ, వాళ్ళకు సేవ చేసేద్దామనీ కాదు. ఇట్లా ఉచితం అనే మంత్రానికి చక్కలిగింతలు మొదలై parents మా ఇంటికి తెల్లారి పూట 30 మంది పిల్లల్ని, సాయంత్రం పూట 30 మంది పిల్లల్ని tuition కు పంపించారనుకోండి. నా strength 60 మంది అవుతారు కదా. Next year కంతా తల్లిదండ్రుల్నీ, ఈ పిల్లల్నీ line లో పెట్టుకుని – మా నామినీ సార్ king  అనిపించుకుంటా. అంతే, ఈ 60 మంది పిల్లల్ని లడ్డూలాగా next year నేను పెట్టబోయే స్కూల్లో join చేసేసుకుంటా. స్కూలు రిజిస్టరు తెరవగానే  60 పేర్లు ఎక్కిపోతాయి గదా.

మొత్తానికి నాది నక్క తెలివే అయ్యింది. క్లిక్ అవలా.

దాదాపుగా ఏ పిల్లవాణ్ణీ స్కూలు వాడు వేరే చోట tuition చేరనివ్వడు గాక చేరనివ్వడు!

ఇంక నేను స్కూలు పెట్టేమాట. కొత్త బిచ్చగాడు పొద్దెరగడు అనే సామెత వుండనే వుంది గదా! స్కూలు ఏ area లో పెడితే బాగుంటుంది అని సర్వే చేసి తిరుపతి తుమ్మలగుంటను ఆనుకుని వుండే నలందా నగర్ అని నిర్ణయించా. నలందా నగర్‌లో పెద్దపెద్ద ఇళ్ళు . మామూలుగా ఇళ్ళు, స్కూళ్ళు పెట్టుకోవడానికి

అనువుగా కట్టరు గదా. పైగా అద్దె కనీసం 5 వేలు. అమ్మో కుదరదులే అని నోరుంది గదా అని site బేరం చేశా. ఒక చిన్న స్కూలు పెట్టడానికి కనీసం 100 అంకణాలు కావాలి. అక్కడ వంద అంకణాల బిట్ వుంది కూడా. వంద అంకణాలు 5 లక్షలవుతుంది.

సైట్‌కు అయిదు లక్షలు!

ఇక రేకుల షెడ్లు వేశామనుకోండి. second hand రేకులూ, పైపులూ తీసి వేసినా రెండు లక్షలవుతుంది! ఇక ఫర్నీచరుకూ, school recognition కూ లక్ష అనుకుందాం!

8 లక్షల పెట్టుబడి వుంటే 150 మంది పిల్లలు చేరే వీలు వుండొచ్చు. ఆ తర్వాత ఒక వ్యాను పెట్టుకుంటే...!

నేను తోక ముడిచేశా. అగో, ఆరు నెలలుగా ఈ పుస్తకం మీద కష్టపడుతున్నా...

ఇదంతా ఎందుకు చెప్పుకొస్తున్నానంటే – స్కూళ్ళు పెట్టడం అనేది కొందరికి మంచినీళ్ళ ప్రాయం!

అదీ ఎట్లాంటి వాళ్లకీ!

సొంత site వుండే వాళ్లూ, పది లక్షలయినా ఏమయిందిలే అనుకునే వాళ్లకూ ఇది నీళ్ళు తాగినంత సుళువు!

స్కూళ్ళ మీద ఇప్పుడు ఎందుకింత వేలం వెర్రి వుందంటే అందులో కనిపించే ఆదాయాలూ అట్లాగే వున్నాయి.

ఈ మధ్య సర్పంచ్ ఎన్నికలు జరిగాయి గదా! ఎంతమంది సర్పంచులు – స్కూళ్ళు పెట్టుకున్న వాళ్ళు అయ్యారో సర్వే చేసుకోండి రాష్ట్రం మొత్తం మీద మీకే తెలుస్తుంది! నాకు తెలిసి ముగ్గురు స్కూలు వాళ్ళు సర్పంచులయ్యారు.

ఒక్కరేమో నాలుగు లక్షలే ఖర్చుపెట్టి వేలంపాట పాడేసి స్వంత వూరికి యునానిమస్‌గా ఎలక్ట్ అయిపోయాడంట. మిగతా ఇద్దరూ ఖర్చుపెట్టింది 15 లక్షల పైమాటే! ఇద్దరూ కలిసి కాదు తండ్రీ ఒక్కోరు 15 లక్షలు ఖర్చు పెట్టి గెలిచారు!

ఆ ఇద్దరి కరస్పాండెంట్ల strength చెరి వెయ్యి మంది పిల్లలు!

వంద అంకణాల్లో loan లు పెట్టి కట్టిన బిల్డింగులే! లోన్‌లు ఎప్పుడో ఎగిరిపొయ్యాయి ఇద్దరికీ కూడా.

స్కూళ్ళు పెట్టిన వాళ్ళకు ఆ డబ్బు ఏం చెయ్యాలో తెలియని పరిస్థితి! తీరా రాజకీయాల్లోకి కూడా దిగేయడం.

"వేయి మంది strength వుంటే మాత్రం 15, 20 లక్షలు ఎట్లా ఎన్నికల్లో పెడతారు సార్! వొకవేళ అది పోతే వాళ్ళకు బతుకా?" అనేసి బిత్తర పోయాన్నే నొకాయన్తో, ఆయనకీ చిన్న స్కూలు వుంది పుత్తూరులో.

ఆయన నవ్వి, "వెయ్యిమంది strength అంటే 2 వేలమంది strength అని అర్థం! ఏమనుకుంటున్నారు? దోసెను తిరగేసి కూడా కాల్చుతాం కదా!" అన్నాడు.

నాకు నిజంగా అర్థం కాలా.

ఆయన మర్మం చెప్పాడు.

" ఒక్క పిల్లాడంటే ఇద్దరని అర్థం. స్కూలుకొచ్చిన గాడిద ట్యూషన్‌కు కూడా వస్తాడు గదా... ఇద్దరవలా? స్కూలు ఫీజు 300 అనుకోండి ట్యూషన్ ఫీజు 150. అంతేనా? బిల్డింగు ఫీజులూ, పుస్తకాలూ, వర్క్ బుక్కులూ, నోట్సులూ, కంప్యూటర్ ఫీజులూ – చివరకు అదే స్కూల్లో యూనిఫాం కుట్టడానికి టైలర్లు కూడా! 150 మంది పిల్లల్తో నడిచే షెడ్ కూడా 3 అంతస్తుల బిల్డింగ్ అయిపోతుంది. అన్నీ లోన్లే. అన్నీ తీరిపోతాయి కూడా."

సారాంశం ఇదీ:

భూమిని నమ్ముకున్న రైతు చెడడం, పిల్లల్ని నమ్ముకున్న స్కూలు వాడు బాగుపడి పోవడం ఖాయం!

ఇప్పుడు స్కూళ్ళు పెట్టే వాళ్ళకీ, అప్పుడే స్కూలు పెట్టిన మన false school master కీ ఒక పెద్ద తేడా వుంది. False school master పుణ్యాత్ముడు.

ఆయనెంత పుణ్యాత్ముడంటే – పిల్లల మీద ఆయనకు చాలా నమ్మకం. కాబట్టే పిల్లల నెత్తి మీదికి నలుగురు టీచర్లను తెచ్చి తొయ్యలేదు. "He knew that children can learn from each other."

వీళ్ళెంత రాక్షసులంటే – parents మెరమెచ్చుల కోసం అన్నట్టు subject కొక టీచర్‌ను వేసి బెత్తం చేతికిస్తారు!.

తేడా అల్లా ఇదే!

# మేధావుల పిల్లచేష్ట

**చిం**తకాయలమ్మే దానికి సిరొస్తే పట్టపగ్గాలుండవు. మొన్నటిదాకా వాటిని అమ్మి పొట్టబోసుకున్న సంగతి మర్చిపోయి, ఆ వొంకర టింకర కాయలేందమ్మా అట్లా వున్నాయని అడుగుతుంది.

మేధావులు గదా సిలబస్‌ను రూపొందిస్తారు.

దున్న పోతుకు ఒక పిల్లాడు ఎదురొచ్చాడనుకుందాం. పాపం ఈ కొమ్ముల్తో ఆ పసి బిడ్డను పొడవాలా ఛా వొద్దు అనేసి అది తొలగేసుకొని పోతుంది. ఈ పాటి జ్ఞానం కూడా మేధావులకు వుండదు.

పసి పిల్లల మీద వీళ్ళు ఎంత ప్రతాపం చూపిస్తారో చూడండి.

పదో తరగతి text books అన్నీ ముందరేసుకుని చూశాను. కొన్ని A4 సైజులో చాటడేసి వున్నాయి. వాటిని కూడా మామూలు text book size (1/8 డమ్మీ) ప్రకారం లెక్కేస్తే 3504 పేజీలు లెక్క తేలాయి.

3500 పేజీల సిలబస్ జీర్ణం చేసుకునే దానికా! కక్కేసే దానికా?

వీళ్ళు మాత్రం రాత్రి పూట రెండంటే రెండే పుల్కాలు తిని, వొక గ్లాసుడు మజ్జిగ తాగి ఆరోగ్యాన్ని అంత జాగ్రత్తగా కాపాడుకుంటారే!

ఒక స్కూలు ముందు బీటు కానిస్టేబుల్ మాదిరిగా తిరుగుతుంటే వొక దారుణం కంటబడింది. 55 మంది పిల్లలున్న టెన్త్ క్లాసులోంచి 15 మంది పిల్లలు గోలగోలగా ఏడ్చుకుంటూ ప్రిన్సిపాల్ రూములోకి వెళ్తున్నారు.

వాళ్ళని తెలుగు టీచరు తరిమేశాడు. కారణం – పది రోజులైనా ఈ శుద్ధ మొద్దులు వొక్క పద్యానికి కూడా ప్రతి పదార్థం చెప్పలేక పోతున్నారు కంఠతా పెట్టి.

ఆ పద్యం ఇదీ:

అల్లసాని పెద్దన రచించిన మనుచరిత్రలోని ద్వితీయాశ్వాసంలోది.

Gapsతో సహా అచ్చు పుస్తకంలో ఎట్లా వున్నదో అట్లాగే ఇక్కడ రాస్తున్నాను.

తలమే బ్రహ్మకు నైన నీనగమహత్త్వం బెన్న? నేనియ్యెడన్
గలచోద్యంబులు రేపు గన్గొనియెదన్ గాకేమి, నేడేగెదన్
నలినీబాంధవభానుతప్తరకాంతస్యందినీహారికం
దళచూ త్కారపరంపరల్ పయిపయిన్ మధ్యాహ్నమున్ దెల్పెడిన్.

ఈ పద్యాన్ని 20 సార్లు రాసుకుని రమ్మని చెప్పి హోంవర్కు ఇచ్చినా, ఫలితం కనబళ్ళా!

ఒక పద్యం మీద ఇన్ని రోజులా? అని చెప్పి తెలుగు అయ్యవారు స్కేలు నొకదాన్ని తీసుకుని ఈ 15మంది పిల్లల అరిచేతుల్ని తిరగెయ్యమని చెడామడా కొట్టేసి వుండాడు.

పిల్లలు మంటపుట్టి ఏడ్చేస్తున్నారు. ఈ శిక్ష చాలక తెలుగు అయ్యవారు – ఈ ముండల్ని మీరు కూడా దంచండి అని చెప్పి పెద్దసారు – ప్రిన్సిపాలు రూంకి పంపించినాడు.

పై పద్యంలో నేడు, రేపు ఇట్లా రెంటి మూటికి తప్ప మిగతా వేటికీ అర్థాలు నాకైతే తెలియవు.

అది, text bookలో స్టార్ వున్న పద్యం గనుక పద్యమూ నేర్చుకోవాలి, ప్రతి పదార్థమూ నేర్చుకోవాలి. ఇట్లా విధిగా నేర్చేసుకోవాల్సిన పద్యాలు 10, 12 అయినా వుండాయి.

ఈ ఒక్క పాఠంలోనే స్టార్ ఉన్న పద్యాలు మూడున్నాయి.

నేను గ్యారంటీ ఇవ్వగలను. కూడికూడి చదవగలమే గానీ మనలో 99 మందికి అర్థం తెలిసే ప్రసక్తే లేదు పై పద్యానికి.

పదో తరగతిలోగా చదివే చదువును ప్రాథమిక విద్య అని అంటారు. మహా అయితే ప్రాథమికోన్నత విద్య!

చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకోవాలని పెద్దలు అంటూ వుంటారు. అశోకుడిదే గాదు చరిత్ర, నాదీ, నీదీ కూడా చరిత్రే.

రాష్ట్రవ్యాప్తంగా ఒక physics professor నీ, ఒక chemistry professor నీ ఇట్లా 25 మందిని తీసుకుని తెలుగు పుస్తకంలో వుండే 10 పద్యాలను ఇచ్చి ప్రతి పదార్థం రాయమనండి. అత్వసంధి, ఇత్వసంధి, టుగాగమ సంధి – లక్షణాలు చెప్పమనండి.

అయ్యో ప్రొఫెసర్లకు ఇదేమి టెస్ట్ పాపం అనిపిస్తుంది. మరి అందరూ ప్రాథమిక విద్యను పూర్తిచేసి ఉన్నత విద్యను అభ్యసించిన వారే గదా!

ఇదీ చరిత్ర! దీనినుంచి మనం ఏమైనా నేర్చుకుని ప్రాథమిక విద్యలో ఇంత చేర్చడం అనవసరం. కంఠస్తం పెట్టినా ఏదీ గుర్తుండి చావదు. ఎందుకు వృథా ప్రయాస – అనుకున్నామా ?

పదో తరగతి చదివే పిల్లలకు – తెలుగు చదవడం, చక్కగా రాయడం ప్రాక్టీసు చేయిస్తే చాల్లే! మర్యాద కోసం సంధులూ సమాసాల్తో వారి నెందుకు చంపుకు తినడం అని ఈ భారాన్ని తగ్గించామా!

English కూడా ఇంతే. parts of speech చెప్పించరు, tenses చెప్పించరు, sentence construction చెప్పించరు.

Text book అని వొక్కటీ, సప్లిమెంటరీలని రెండు పుస్తకాలూ సిలబస్‌లో పెట్టి questions and answers బట్టీ పెట్టిస్తారు.

అందుకే గదా మాలాంటి వాళ్లం – డిగ్రీ రెండో సంవత్సరం దాకా అన్నేసి ఇంగ్లీషు పుస్తకాలు పెట్టినా – 4 ఎస్సేలూ, 4 annotation లూ కంఠతా పెట్టి గట్టెక్కేశాం. ఈ రోజుటికీ 4 వాక్యాలు ఇంగ్లీషులో రాయలేక పోతున్నాం!

ఒక విద్యా సంవత్సరంలో 210 రోజులు స్కూలు జరుగుతుందనుకుందాం. ఈ రోజుల్లోనే, నాలుగు యూనిట్ టెస్టులూ, క్వార్టర్లీ, హాఫ్ ఇయర్లీ, ప్రీఫైనల్ ఎగ్జామ్స్ జరుగుతాయి గాబట్టి 30 రోజులు తీసేయండి,

అంటే కేవలం పాఠాల మీద 180 రోజులు వుంటారనుకుందాం.

పాపం, ఇప్పట్లో పిల్లలకు సిలబస్ కొంచెం ఎక్కువేలే అని ఫ్యాషన్‌గా వొక కామెంట్ చేసి వొదిలేస్తున్నాం. అట్లా కుదరదు. టెన్త్ పుస్తకాలన్నీ ముందరేసుకుని కూర్చోండి తెలుస్తుంది.

Physical science పుస్తకం తెరవండి. ఏఏ నెల ఏఏ పాఠాలు చెప్పి syllabus ఎట్లా పూర్తి చెయ్యాలో కూడా ఇచ్చారు ప్రభుత్వం వాళ్లు.

అదంతా వొకసారి చదివే ఖర్మ మనకేం పట్టింది గానీ పైకి కాసేపు సరదాగా అందులో వున్న పాఠాల పేర్లయినా చూద్దాం.

జూన్ నెల్లో ఈఈ పాఠాలు చెప్పేసెయ్యండి అని వుంది. అవి ఇవీ :

(1) Circular Motion (2) Banking Roads and Rail Tracks (3) Simple Harmonic Motion (4) Electromagnetic waves - spectrum (5) Natural and Forced Vibrations (6) Progressive and stationary waves (7) Velocity of sound in air (8) Rutheford's model of atom and its drawbacks (9) Bohr's model of atom and its limitations (10) Summerfeld's elliptical model (11) Sub energy levels - quantum numbers (12) Atomic Orbitals (13) Relative energies of the atomic orbitals (14) Electronic Configuration of atoms (15) Some physical quantities of atoms (16) Covalent bond (17) Multiple Covalent bonds (18) Co-ordinate Covalent bonds (19) Shapes of some molecules.

ఇట్లా జూలై నెల్లో 26 peroids లో ఈ మొత్తం అంశాలనూ టీచర్లు చెప్పేసెయ్యాలి. పిల్లలు నేర్చుకునేయాలి.

వాళ్ల ప్రాణానికి ఈ వొక్క సబ్జెక్టే గాదే మిగతా ఆరూ కూడా ఇదే మోతాదులో జరిగిపోతూ వుంటాయి గదా.

ఇవేమీ అమ్మాయే సన్నగా అరనవ్వే నవ్వగా... గాజువాకే పిల్లా మాది గాజులోళ్లమే పిల్లా మేము... సినిమా పాటలు కాదు నాయినా టకటకటకా నేర్చుకునే దానికి! సబ్జెక్టులు!!

టీచరుకు వొకటే వొక సబ్జెక్టు!

పిల్లలకు ఆరు!!

మేధావులు ఇట్లా మడ్డి జంతువుల్లా సిలబస్‌ను పెడతారా... వాటిని పూర్తి చేశామని చెప్పుకోవడానికి స్కూళ్ల వాళ్లు కానీగానీ వేళల్లో కూడా క్లాసులు పెట్టుకుంటూ వుంటారు.

ఎండాకాలం సెలవుల్లో కూడా చెప్పడం, ఉదయాన ఆరుకే extra class లు ప్రారంభం కావడం...

పిల్లల మీదికి ఎన్ని రకాల పుస్తకాలు తోడేళ్లలా పడి పీక్కు తింటాయో చూడండి.

"సిలబస్సే పూర్తి చేయలేక చస్తున్నామండీ! ఇంక నోట్స్ ఎక్కడ ఇస్తాం!" అని చెప్పి చాలా స్కూళ్లలో maths కు తప్ప దేనికీ నోట్స్ ఇవ్వరు.

అందుకని ఆరు సబ్జెక్టులకూ ఆరు వర్కు బుక్కులు ఉరఫ్ గైడ్స్ అలియాస్ క్వశ్చన్ బ్యాంకులు.

కొంతమంది parents, "అదేంటండీ మన స్కూల్లో టీచర్లు నోట్సే ఇవ్వడం లేదు" – అంటూ logic తీస్తారని స్కూళ్లవాళ్లు ఏం చేస్తారంటే గైడ్స్ చూసి textual questions అన్నీ నోట్స్‌లో రాసుకోండమ్మా అని రాయించి చంపుతారు. ఒకసారి రాస్తే 4 సార్లు చదివినట్టు అనే పాయింటొకటి ఏడ్చింది గదా.

ఒక స్టూడెంటు కేవలం వర్కు బుక్కుకు పరిమితమైనాడనుకుందాం. గైడు చదువుతున్న పిల్లవాణ్ని పట్టుకుని పేరెంటు, "ఏంరా గైడు చదువులకు తయారయ్యావా? Text books చదవాలిరా text books! అప్పుడే bits చెయ్యగలవు. లేకపోతే నువ్వు maximum marks score చెయ్యలేవు." అని నసకు తయారౌతారు.

ఒక వేళ text book నాలుగు మూలలూ చదివితే చాల్లే అనుకుంటే, టీచరూ, స్కూలు వాడూ అంటారు : "గైడు కూడా చదవాలమ్మా! గైడ్‌లో experts ప్రశ్నలు తిరగేసి మరగేసి ఎన్ని రకాలుగా అడుగుతారో చూసి ఇస్తారు. Subject ను కాస్త expand చేసి బిట్స్ ఇచ్చి వుంటారు. వొట్టి text book చదివితే చాలదు!"

Text books, work books, వాటినే చూసి రాసిన నోట్సు... ఎన్నని!

ఈ సిలబస్ ఇట్లా పాపం పుణ్యం లేకుండా పెట్టేశారు కాబట్టే పిల్లలకు విపరీతమైన home work. కాసేపు ఇంటి దగ్గర ప్రశాంతంగా పడివుందాం అంటే కుదరనే కుదరదు.

టీచర్ల మధ్య కో ఆర్డినేషన్ ఎందుకుంటుంది చెప్పండి? తెలుగువాడూ, ఇంగ్లీషువాడూ, ప్రతీ సబ్జెక్టువాడూ – హోం వర్కు ఇవ్వడమే పని!

"ఈ రోజు 10th కి, maths సార్ exercise అంతా హోం వర్కు ఇచ్చాడట పాపం!" అని చెప్పేసి physical sciences సార్ ఆ రోజు వూరుకుని ఇంటి కెళ్తాడా? ఆయన 1998లో public కు వచ్చిన question paperకు answers రాసుకు రండి అని ఆర్డరేస్తాడు.

హోం వర్కుల్ని పిల్లలు ఎంత గుడ్డివాటంగా రాస్తారో చెప్పడానికి–

మా టాంసాయర్ 5వ తరగతి గదా. వాడి maths టీచరు ఎనిమిదో ఎక్కాన్ని 20 సార్లు రాసుకురమ్మన్నాడు. వీడు ఇంటికొచ్చి,

ముందు 8 × 1 =
8 × 2 =
8 × 3 =
8 × 4 =

ఇట్లా గుడ్డిగా వరసగా వేసుకుంటూ పోవడం, ఆ తర్వాత 8, 16, 24, 32... వరసగా వేసుకుంటూ రావడం!

దేనికీ కష్టం!

ఎట్లాగూ స్పెషలైజేషన్ వుందిగదా ఇప్పుడు. ఇంటర్ అయిపోయాక డిగ్రీలో పిల్లలు వివరంగా చదువుకుంటారు. Maths అయినా, physics అయినా ఏదైనా అట్లాగే వుండాలి. వాళ్లకు భవిష్యత్తు లేదా ఏమి?

అంతేగాని 8th లోనే linear program నీ, 9th లోనే analytical geometry నీ, 10th లోనే trigonometry నీ గుప్పించేసి ప్రాథమిక విద్యను ఉన్నత విద్య చేసేసే దాకా నిద్ర పట్టదా?

టీ గ్లాసులు కడిగే పిల్లలూ, గొడ్లు కాసే పిల్లలూ, పొలం పనులకెళ్లే పిల్లలూ వెట్టి చాకిరీ చేస్తున్నారు పాపం అని మేధావులు అనుకుంటున్నారు గానీ అదే హాయి అని పిల్లలనుకుంటున్నారు.

అసలు సిసలు నరక యాతనా, వెట్టి చాకిరీ మీరు పెట్టిన సిలబస్‌ను స్కూల్‌కెళ్లి చదవడంలోనే వుంది నాయనలారా!

# తలకాయలైతే వున్నాయి గదా, ఆలోచిద్దాం!

**పి**త్రల్ని చూసి పీటలెయ్యడం, మొహాల్ని చూసి బొట్లు పెట్టడం మన రక్తంలో జీర్ణించుకు పోయింది.

క్లవర్‌గా వున్న పిల్లల్ని చూస్తే ఎందుకు తల్లిదండ్రులూ, టీచర్లూ ప్రాణాలిచ్చేస్తారో నాకు అర్థమే గాదు.

పాఠం చెప్పేటపుడు అయ్యవారిని గమనించండి. ఆయన మొహం – క్లాసులో వుండే ఇద్దరు ముగ్గురు క్లవర్‌లనే చూస్తూ వుంటుంది.

పొరబాటున ఆయన చెప్పే పాఠం వొక డల్లర్‌కి కూడా అర్థమై పోయి, “అవును సార్ కరెక్ట్ సార్.” అంటూ వున్నాడనుకోండి. “ఏం రా మొద్దు మొహమా! తలకాయ భలే వూగించేస్తున్నావ్, పెద్ద అర్థమైపోయిన వాళ్లాగా!” అనేసి అవమానించే దాకా వూరుకోడు సారు.

Clevers కు అర్థమైతే చాలు, ఆ పాఠం అక్కడికి పూర్తయి పోతుంది.

అమాయక చక్రవర్తులకు రాక్షసంగా ‘మొద్దులు’ అని పేరు పెట్టేసి clevers వెనకాన పరుగులెత్తి ఇద్దరిముగ్గురికి 540 దాటించేసి గొప్ప టీచర్లుగా feel అయిపోతున్నారు.

పాపం parents కూడా పిల్లల్నే తిడతారు. “సార్‌లు పాఠాలు బాగా చెప్పకపోతే వాళ్లకి మాత్రం ఎట్లా వచ్చాయి 540 లు. తమరిలో పస లేదంతే!”

ఇప్పుడు రాజ్యమంతా clevers దే!

నాకీ క్లవర్‌లంటే ఎంత కోపమంటే – వొకసారి, 90 ఇసుకా 10 సిమెంటూ కలిపి ఆ కాంట్రాక్టూ ఈ కాంట్రాక్టూ చేసి బాగా సంపాయించిన వాడొకడు స్కూలుకొచ్చి, “మా అమ్మ పేరుతో సంవత్సరం సంవత్సరం 5 వేలు డొనేషన్ ఇస్తాను. ర్యాంక్ స్టూడెంట్ కివ్వండి.” అనేసి అన్నాడు.

నేనప్పుడు కరస్పాండెంట్ రూంలోనే వున్నాను. నోరు వూరుకోదు గదా.

"Ranker ఎట్లాగూ దేశాన్ని దొబ్బుతాడు సార్. వాడికెందుకు మీ సహాయం? నా మాట విని డల్లర్ కివ్వండి. వాడెట్లాగూ కాలేజీ మెట్లు ఎక్కలేడు గదా. మీ పేరు చెప్పుకుని రిక్షానో పాడో కొనుక్కుని పొట్ట పోసుకుంటాడు!"

పాపం, ఆయనకెంత కోపం వొచ్చిందో చెప్పలేను కానీ దేవుడు మాత్రం నా మాటలు విని చప్పట్లు కొట్టి వుంటాడు.

"డల్లర్‌కి ఇచ్చేదేమిటండీ డల్లర్‌కి!" అని ఆయన ఇంతెత్తు ఎగిరినాడు.

డల్లర్ అంటే ఎంత చిన్న పక్షి అంటే – 1/2 పెద్దదా, 1/4 పెద్దదా అంటే టెన్త్ అయ్యాక కూడా 1/4 పెద్దదంటాడు. మరి, ఈ తెలివి మీరిన లోకంలో ఆ పక్షి ముక్కుకి నాలుగు గింజలెట్లా దొరుకుతాయి?

ఒక నక్క వుంటుంది. అది 'ఆకాశం పడిపోతూ వుంది. పరిగెత్తండి పరిగెత్తండి' అని పుకారు పుట్టించి హెచ్చరించగలదు. దాని మాటలు నమ్మి కోడిపెట్టా, కుందేలు పిల్లా 'పదపద' అంటూ దాని వెనకాన గుడిసెలోకి చేర్తాయి. నక్క clever గదా తలుపు గెడియ పెట్టి శుభ్రంగా మూతి నాక్కుంటుంది.

కృషి బ్యాంకు పెట్టినాయన డల్లరా? క్లవరా?

– ఇట్లా ఇద్దరు ముగ్గురు clevers ని మనం నెత్తినెత్తి పెట్టుకోబట్టే పిల్లలకు స్కూలంటే రోత. టీచరు చచ్చిపోయి స్కూలికి సెలవిస్తే కులుకు.

**హై**ద్రాబాద్‌లో లక్ష్మయ్య అని నాకో స్నేహితుడున్నాడు. వాళ్ల పాప రెండో మూడో చదువుతోంది. ఒక రోజు, "యూనిఫాం మీద స్వెట్టరు వేశావ్ ఏంతల్లీ!" అన్నాడంట.

"టీచర్లు కొడుతుంటారు గదా నెప్పి తగలకుండా వుంటుందనీ..."

ఆ పిల్ల అంతమాట అనేసిందంటే విద్యా వ్యవస్థ మొత్తం సిగ్గుతో తల దించుకోవాలి గదా. ఇంకెందుకూ back to school ప్రోగ్రాంలో తల మునకలవడం!

**చే**తిలో chain పట్టుకుని parent వొక స్కూల్ ముందు నిలబడి వున్నాడు. ఆయనది తిరుమల. ఏదో వ్యాపారం చేసుకుంటూ పిల్లవాణ్ణి హాస్టల్‌లో పెట్టి తిరప్తిలో చదివించుకుంటున్నాడు. ఆయన్ని చూసి నాకు భయం వేసింది– పిల్లవాడు బైటికొస్తే

పట్టుకుని ఆ chain తో కొడతాడేమోనని! ఇప్పుడెట్లరా భగవంతుడా – అని నాకు ఉచ్చ పడుతూ వుంటే అడిగాను " ఏం సార్!" అని.

"మా వాడికి పావురాల problem సార్ అందుకనీ–" అన్నాడు.

ఆరా తీస్తే–

తిరుమలలో – వాళ్లింట్లో పావురాలు దండిగా వొచ్చి వాలేటట్టుంది. పిల్లవాడు నాలుగో తరగతి. వాటికి బాగా అలవాటై పోయి ఈ స్కూలికీ, హాస్టల్‌కీ అలవాటు కాలేక పోతున్నాడు.

స్కూల్‌లో ఏముండి చస్తుందీ! ఇంటి దగ్గరుంటే పావురాల్తో ఆడుకోవచ్చు గదా. అందుకని స్కూల్ వాళ్ల కళ్లు గప్పి మాటిమాటికీ తప్పించుకుని కొండకు నడుచుకుంటూ వెళ్లిపోవడం!

వాళ్ల నాయిన మళ్లీ వాణ్ణి తెచ్చి స్కూల్లో పడెయ్యడం. ఇదీ జరుగుతున్న కథ.

"కాళ్లకు గొలుసు వేశామనుకో, తప్పించుకోలేడు గదా. నిదానంగా స్కూల్‌కీ, హాస్టల్‌కీ అలవాటు పడిపోతాడు."

ఇంకేం మాట్లాడతాం చెప్పండి?

స్కూళ్లు ఎందుకింత నరక కూపాలుగా తయారవుతున్నాయి?

ఎందుకని పిల్లవాడు టీచర్‌ని మన మనిషి అని నమ్మలేకపోతున్నాడు?

**ము**నక్కాయ ముప్పావలా లెక్కన ముసలవ్వ వీధిలో మునక్కాయలమ్ముతోంది. ఒక బీదరాలు ఆ అవ్వ దగ్గిర మూడు మునక్కాయల్ని కొనుక్కుంది.

ముసలవ్వ చేతిలోకి రెండుం పావలా, బీదరాలి చేతికి మూడు మునక్కాయలూ చేరిపొయ్యాయి.

చదువూ సంధ్యాలేని వాళ్లిద్దరి మధ్యా భిన్నాలకు సంబంధించిన వొక పెద్ద లెక్క గుట్టు చప్పుడు గాకుండా జరిగిపోయింది!

$3/4 \times 3 = 2.25$

మూడో మనిషికి తెలీకుండా జరిగిపోయిన ఈ లెక్క ఎగురుకుంటూ స్కూలుకు వచ్చిందనుకోండి.

ఒక బోర్డూ, చాక్ పీసుల బాక్సూ, వొక పుస్తకం, నాలుగు బెత్తాలూ, వొక డిగ్రీ హోల్డరూ...

శవం పడిన ఇల్లు మాదిర్తో ఏడుపులూ, పెడబొబ్బలూ...!

Time Table

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| Mon | playing | playing | playing | playing | playing | playing | [illegible] reading |
| Tue | '' | '' | '' | '' | '' | '' | English |
| Wed | '' | '' | '' | '' | '' | '' | maths |
| Thu | '' | '' | '' | '' | '' | '' | Telu |
| Fri | '' | '' | '' | '' | '' | '' | social |
| Sat | '' | '' | '' | '' | '' | '' | Hindi |

ఇట్లా time table రాసుకున్న టుట్టీ అనే వొక పిల్లాణ్ణి అదేంరా అంటే వాడు, "ఇట్లా వుంటే ఎంత బాగుంటుందా అని తమాషాగా రాసుకున్నా!" అనేసి అన్నాడు.

స్కూళ్లనూ, టీచర్లనూ పిల్లలు పామును చూసినట్టు చూస్తున్నారు.

టీచర్లంతా గుండెల మీద చేతులేసుకుని ఆలోచించాలి.

# కొంపలు కూల్చే ఫిజిక్స్

Physics అంటేనే పిల్లలకు బిత్తర. EAMCET లో Maths లో నూటికి 70, 80 మార్కులు తెచ్చుకునే వాళ్లు కూడా physics లో 50 కి 10, 15 తెచ్చుకోలేక తేలకండ్లు వేసేస్తారు.

Speed, velocity, acceleration – ఈ మూటికీ వున్న తేడాలు తెలుసుకోవడం – ఇడ్లీకీ, దోసెకీ, వడకీ తేడాలు తెలుసుకోవడం అంత తేలికేం కాదు.

పైకి ఎంతో సులువుగా కనిపించే ఈ physics పిల్లల దుంప తెంచుతోంది.

Problem : **A bus travels a distance with a speed of 50 km/hr and returns with a speed of 40 km/hr. Find the average speed of the whole journey.**

పైకి average అనేయగానే 50 నీ 40 నీ కూడేసి రెండుతో భాగించేస్తే సరిపోతుందనుకుంటాం. Choose the correct answer లో ఆ answer కూడా వుంటుంది గానీ correct కాదే!

మా ఇంటికొక సారి హెడ్ మాస్టార్‌గా వుంటున్న సైన్స్ టీచరొకాయన వొచ్చినాడు. నా కూతురు దీప్తిని చూసి, "ఏం చదువుతోంది సార్?" అనడిగినాడు. తొమ్మిది–అని చెప్పినా. "పాప ఎట్లా చదువుతోంది?" అనేసి అడిగినాడు. "బాగానే చదవతా వుంది." అని చెప్పినా.

ఆయన, **"**Newton's third law of motion చెప్పమ్మా!" అనడిగినాడు.

"For every action there is an equal and opposite reaction" అని చెప్పింది.

హెడ్ మాస్టర్ సారు, "మీ అమ్మాయి మంచి క్లవర్ సార్" అనేసి మెచ్చుకున్నాడు.

తండ్రిగా నేను మెచ్చుకోను గదా."Third law ఏముంది? ఫిజిక్స్ చదువుకోని గుడ్డి ముసిల్ది కూడా చెప్పేస్తుంది. Newton's first law of motion అడిగి చెప్పించండి చూద్దాం." అని లా పాయింటు తీసినా.

ఆయన, "చెప్పమ్మాయ్. Newton's first law of motion చెప్పు." అనన్నాడు.

నా కూతురు కొంచెం బిత్తర చూపులు చూసి, "ఐడియా లేదంకుల్. ఒకసారి చూసుకుంటే చెప్పగలను. లేదంటే మీరు బిగినింగ్ ఎత్తివ్వండి, చెప్తా!" అనడిగింది.

"ఏంది బిగినింగ్ ఎత్తించేదీ..." అని నేను ఒంటికాలి మీద లేవబోయి, 'ఎందుకులే మూడో మనిషి ముందు...' అనేసి నిమ్మళపడి, "మీరు అర్ధమయ్యేటట్టు చెప్పండి సార్ పాపం!" అన్నాను.

అందుకా సార్, "ఆ పాప చెప్పింది నిజమే సార్. నేనైనా ఒకసారి చూసుకోవాల్సిందే...." అనేసి అన్నాడు.

ఇదంతా నేనెందుకు చెప్పుకొస్తున్నానంటే – మా గడప తొక్కిన ఒక పెద్ద మనిషిని పలచన చేద్దామని గాదు. Subject ఎంత కఠినంగా వుందో చెప్పడానికి.

ఆయన బీఎస్సీ ఎంపీపీ చేసి 25 ఏండ్లుగా సైన్సు చెప్తున్న సారు మరి!

నిజానికి Newton's first law of motion అంత కొరక రాని కొయ్యేం గాదు. మామూలు మాటల్లో చెప్పుకోవాలంటే–

నలు చదరంగా వున్న ఒక మైదానంలో foot ball ఒకటి పడి వుంది. దాని మీద ఏ శక్తీ పని చేయనంత వరకూ అది అట్లా నిద్ర పోతానే వుంటుంది. ఒకవేళ ఆ foot ball దొర్లుకుంటూ దొర్లుకుంటూ పోతూ వుందనుకోండి. అప్పుడు కూడా దాని మీద ఏ శక్తీ పని చేయకుంటే అదట్లా పోతూనే వుంటుంది.

శాస్త్ర ప్రకారం చెప్తే, Every body continues in its state of rest or of uniform motion in a straight line unless acted upon by an external force to change its state.

Physics లో పిల్లల performance బాగా లేకపోవడానికి ఒకటి రెండు మెతుకులు పట్టి చూద్దాం.

Physics లో తలమానికంగా ఉన్న kinematics ను text books రాసిన పెద్దలు – పిల్లలకు ఎట్లా introduce చేశారో ముందు చూద్దాం. పిల్లలకు kinematics 8th Class లో introduce అయ్యింది. దీని మీద text books లో 12 pages material వుంది. దాన్ని గాని టీచర్లు శుభ్రంగా చదివి, పిల్లలకు చెప్తే Super గా అర్ధమవుతుంది. అంత అద్భుతంగా వుంది. Distance అంటే ఏంది, displacement అంటే ఏంది, speed అంటే ఏంది, velocity అంటే ఏంది, వాటికున్న తేడా ఏంది – అంతా ఎంతో బాగుంది. ఆ 12 పేజీల మేటరూ ఇక్కడ రాయటం ఎందుకులెండి, అంత పొందిగ్గా వుంది.

ఇంక 9th class కి వద్దాం.

In your previous classes you have learnt about scalars, vectors, speed, velocity, acceleration and retardation. Now you will learn about the equations of motion.

అని మొదలు పెట్టి

V= u+at

$s=ut+1/2at^2$

$v^2 - u^2 = 2as$ - ఈ మూడు equations కీ deriviations ఇచ్చినారు.

ఇంతటితో మూడు పేజీలయ్యాయి. దీని కింద మరో రెండు పేజీల్లో problems ఇచ్చి work out చేశారు.

అందులో ఒక problem మనం చూడాల్సిందే.

A body starting from rest is travelling with an acceleration of $4m/sec^2$. Calculate the distance travelled by it in the 4th second.

**Solution :** Initial velocity u=0 m/sec

Acceleration $a = 4m/sec^2$

Distance travelled by it in the 4th second (S4th) = ?

Using the formula

$Sn^{th} = u+a(n - 1/2)$

$= 4(7/2)$

$= 14m$

ఇంతే

ఇందులో ఒక మాటను జాగ్రత్తగా చూడండి.

Using the formula

Snth= u + a (n – 1/2)

ఇదేం ఫార్ములా? text book లో derive చేసిన ఫార్ములాలు మూడే మూడు.

అవి :

V=u+at

$S=ut+1/2at^2$

$V^2 – u^2 = 2as$

మరి ఇదెక్కణ్ణుంచి వచ్చింది? దీన్ని example problem గా ఎందుకిచ్చారు? పైగా exercise లో కూడా ఈ formula use చేస్తేనే answer వచ్చే లెక్క వొకటి ఇచ్చినారు.

ఈ problem ను నాకిప్పటికిప్పుడు ఆగడం చేసెయ్యాలనిపిస్తోంది. ఈ kinematics లో s అనీ, u అనీ, t అనీ, a అనీ, v అనీ, ఇలాంటి అక్షరాలకు వివరాలు వున్నాయే కానీ, 'n' అనేది ఎక్కాడా లేదే!

s అంటే distance

u అంటే initial velocity

t అంటే time

v అంటే final volocity

a అంటే acceleration

అట్లాంటిది ఈ 'n' అంటే ఏందో భగవంతుడికే తెలియాలి.

ఈ లెక్క మీద మా ఇంట్లో ఎంత గొడవయ్యిందో చూడండి.

వాళ్ళమ్మ చెప్పేది – స్కూలు నుంచి వొచ్చాక నా కూతురికి ఒకటే పనంట, అది: Zee Music, MTV, B4U మార్చి మార్చి హిందీ పాటలు వినడం. రోజురోజుకూ శుద్ధ దండగ అయిపోతూ వుందంట.

అందుకని నా కూతురికి నేను వారం వారం maths లో, physics లో test లు పెట్టాలంట. నా భార్య పోరు పళ్లేక ఒక రోజు physics text book తీసుకుని "kinematics లో test పెట్టనా?" అనేసి అన్నా.

“ఓ పెట్టుకో.” అంది దీప్తీ.

నేను,

(1) Derive $S=ut + 1/2\ at^2$

(2) ఇంతకు ముందు మనం వేసిన లెక్క.

ఈ రెండూ ఇచ్చినా. ఆ పాప పావుగంటలో derivation వేసేసి ఆ లెక్క చెయ్యలేకపోయింది.

నేను–నీకు పదికి అయిదు మార్కులొచ్చినాయి పో. అనేసి గమ్మునుండి పోయినా.

ఇంక వాళ్లమ్మ ఎత్తుకునింది చాట భారతం. అంతా ఇంతా కాదు. అప్పుడే నా కూతురికి EAMCET లో ఫ్రీ సీటు రానట్టు ఆ రచ్చ ఇక్కడ చెప్పలేను.

నాకూ బాధయ్యింది. Text book లో వున్న example problem కూడా వెయ్యలేక పోతే ఎట్లమ్మా అని నేను కసిరినాను.

"నువ్వెయ్ చూద్దాం" అని నా కూతురు సవాలేసింది. నేను ఆ లెక్క తీసుకుని, "అవును formula use చేస్తే సరిపోయింది గదా." అన్నాను.

"అదేం ఫార్ములా? text book లో అసలు లేదు." అనింది.

చూస్తే నిజమే! ఆ formula నే తెలియకపోతే నేను దాన్ని ఎట్లా apply చేద్దును? ఆ పిల్లకు ఎట్లా చెబుదును?

"మీ సార్‌ని అడిగి కనుక్కోమ్మా." అనేసి నేను గమ్మునుండి పోయినాను.

"మా సార్‌కి కూడా తెలవదు. అది ఇంటర్మీడియట్‌లో వుందంట." అని ఆ మర్నాడు దీపూ చెప్పింది. అసలేంది దాని కథ? అని నాకు పంతం పెరిగి పోయింది.

గంట తర్వాత నాకు విషయం అర్థమైంది.

ముందు, $S_{nth} = u+a(n - 1/2)$ formula derivation గురించి తెలుసు కుందాం.

A |————————————————————| B

A నుంచి ఒక బస్సు B అనే చోటికి బయలు దేరడానికి సిద్ధంగా వుంది. A వద్ద నిలబడి వున్న బస్సు initial velocity zero గదా.

అంటే $u = 0$.

బస్సు బయలుదేరి ఒక సెకండులో P వద్దకు

A|______________|______________________________| B
P

చేరింది. అంటే బస్సు ఒక సెకండులో ప్రయాణించిన దూరం AP.

బస్సు రెండవ సెకండులో Q వద్దకు చేరింది అంటే,

A |____________| ___________| ____________________| B
P Q

బస్సు రెండు సెకండ్లలో ప్రయాణించిన మొత్తం దూరం AQ.

బస్సు రెండవ సెకనులో ప్రయాణించిన దూరం PQ.

బస్సు రెండు సెకండ్లలో ప్రయాణించిన మొత్తం దూరం — బస్సు ఒకటవ సెకండులో ప్రయాణించిన దూరం AQ – AP కదా.

దీన్నిబట్టి,

బస్సు 10వ సెకండులో ప్రయాణించిన దూరం = బస్సు 10 సెకండ్లలో ప్రయాణించిన మొత్తం దూరం — బస్సు 9 సెకండ్లలో ప్రయాణించిన దూరం.

ఇప్పుడు formula derivation కి వద్దాం.

$S = ut+1/2at^2$ అని మనకు తెలుసు, Text book లో derivation కూడా ఇచ్చారు.

బస్సు మొదటి సెకండులో ప్రయాణించిన దూరం $S_1 = u\times1 + {}^1/_2 \times a \times 1\times1$

$= u + a/2$

బస్సు రెండు సెకండ్లలో ప్రయాణించిన దూరం $S_2$

$= u \times 2 + {}^1/_2 \times a \times 2 \times 2$

$= 2u + 2a$

బస్సు 3 సెకండ్లలో ప్రయాణించిన దూరం $S_3 = u \times 3 + {}^1/_2\, x a x 3 x 3$

$= 3u + 9a/2$

బస్సు 2వ సెకనులో ప్రయాణించిన దూరం $S_{2nd}$

$= S_2 - S_1$

$= 2u + 2a - (u + a/2)$

$= u + a\,(2 - {}^1/_2)$

బస్సు 3వ సెకండులో ప్రయాణించిన దూరం $S_{3rd}$

= బస్సు 3 సెకండ్లలో ప్రయాణించిన దూరం $S_3$

– బస్సు 2 సెకండ్లలో ప్రయాణించిన దూరం $S_2$

$= 3u + 9a/2 - (2u + 2a)$

$= u + a\,(3 - {}^1/_2)$

జాగ్రత్తగా చూస్తే బస్సు 2వ సెకండులో ప్రయాణించిన దూరం$=u+a(2-{}^1/_2)$

3వ సెకండులో ప్రయాణించిన దూరం $u+a\,(3 - {}^1/_2)$

అట్లాగే 4వ సెకండులో.... $u+a\,(4 - {}^1/_2)$

ఇట్లా చేసుకుంటూ పోతే

'n' వ సెకండులో బస్సు ప్రయాణించిన దూరం $s_{nth} = u + a\,(n - {}^1/_2)$

ఇదీ దీని కథ.

'n' సెకండ్లలో బస్సు ఎంత దూరం పోయిందీ, 'n' వ సెకండ్‌లో ఎంత దూరం పోయిందీ అన్నదానికి ఎంత తేడా వుందో చూడండి.

ఇలాంటి derivation పిల్లలకు చేసి చూపించక పోతే ఎట్లా? పోతే పోనీలే, ఎక్కడో ఒక మూల చిన్న confusion దాన్దేముంది అనే దానికి లేదు. మరి, కాలాలు అట్లా వున్నాయి. EAMCET లో ఒక ప్రశ్న syllabus లో లేకపోయినా, తప్పుగా ఇచ్చినా దానిమీద కోర్టులో వ్యాజ్యాలు పడిపోతున్నాయి. Physics లో ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 60 కి 58 వచ్చినా ఆ రెంటి కోసం improvement రాసే పరిస్థితులున్నాయి. అట్లాంటప్పుడు చిన్న క్లాసులో ఎంత జాగ్రత్త వుండాలి?

కొన్ని పెద్దపెద్ద స్కూళ్లు – మేం పెట్టే పరీక్షలు చక్కగా రాస్తే 10th free coaching అని ప్రకటనలు చేస్తుంటాయి. చక్కగా రాయడం అంటే నూటికి నూరు తెచ్చుకోవడం. ఇలాంటి confusions తో పిల్లలు ఎలా తెచ్చుకుంటారు ?

Text books రాసే పెద్దలకు హద్దు మాలిన దయ వుండాలి పిల్లలంటే. వాళ్లకి మేధావి తనం కంటే దయ ఎక్కువగా వుండాలి.

ఇంక 9వ తరగతి dynamics లో చిన్న ఉదాహరణ చూసి వదిలేద్దాం.

Dynamics introduce అయిన 2వ పేజీలోనే W=FS CosA అని ఒక ఫార్ములా ఇచ్చేసినారు.

W సరే, F సరే, S సరే, ఈ CosA ఏంది? Sin A, Cos A అనేది Trigonometry కి సంబంధించినవి. ఇది పిల్లలకు టెన్త్‌లో Maths లో వస్తుంది.

కానీ 9th లోనే తొందర పడిపోయి trigonometry ని, physics లో ఇచ్చేస్తే ఎలా?

ఇన్ని confusions తో పిల్లలు వేగలేక ఏదో బట్టీపెట్టడం.

నా కూతురికి దాన్నీ, దీన్నీ analyse చేసి చెప్తూవుంటే ఆ పిల్ల, "పెద్ద educationalist అని ఫోజొకటి. ఇవి చెప్పడానికి నీకే ఇంత ఆయాసంగా వుంటే వాటిని నేర్చుకోవడానికి మా కెంత కష్టం వుంటుందిరా పంది నాయాలా?" అని తిట్టింది.

నా కూతురు నన్నే కదా తిట్టింది!

మూడేండ్లకు ముందర విజయవాడలో ఇంటర్ చదివే ఒక తల్లి,

"ఈ speed నూ

velocity నీ

acceleration నీ

మీ నెత్తినేసుకుని

రుద్దుకోండి.

ఈ physics లేని

లోకానికి నేను

వెళ్లిపోతున్నాను" అంటూ  పద్యం రాసిపెట్టి చచ్చిపోయినా ఎవురు మాత్రం పట్టించుకున్నారు?!

# పసి పిల్లలమైపోయి Maths చెప్పాలి!

Maths, English శుద్ధంగా చెప్పి చస్తే పిల్లలకు ఏ పీడా వుండదు.

మరీ ముఖ్యంగా Maths చెప్పే సార్ నిత్యం బాలకుడుగా వుండాలే గానీ వొక్కసారిగా మేధావి అయిపోగూడదు.

గుండెల మీద చెయ్యేసి నేను కొన్ని విషయాలు – నాకు సంబంధించినవి చెప్తా.

నేను M.Sc Maths చదివాను. అందువల్లా నాకు లెక్కలొచ్చినాయి అనేది ఎంత అన్యాయమో చెప్పలేను.  నా బాధ ఏమంటే డిగ్రీలనూ, బి.ఇడీలనూ మాత్రమే ప్రమాణాలుగా తీసేసుకుని వొక పెద్ద గుంపును టీచర్లుగా స్థిరపడిపోనీయొద్దూ అని!

నేను ఇంగ్లీషులో ఎంత పూరో చెప్పలేను.  15 సంవత్సరాలు నేను పత్రికల్లో పని చేశానన్న మాటేగానీ నేను జర్నలిస్టును ఎట్లవుతా! Hindu పత్రిక సంపాద కీయాన్ని నా చేతల్లో పెట్టి తెలుగు చెయ్యమంటే నా జీవిత కాలం సరిపోదు.  కానీ నేను జర్నలిస్టుగా 15 సంవత్సరాలు చెలామణీ అయ్యా.

ఇప్పటికిప్పుడు నేను M.A., English డిగ్రీ తెచ్చుకునేసేదా!

ఏముందీ! ఒక్కో పేపరుకు 10, 12 ఎస్సే కొసిన్లు నేర్చుకుంటా, పోయి రాసేస్తా, డిగ్రీ తెచ్చుకుంటా!

నాకు tenses మీద కూడా అయిడియా వుండదు, M.A., English అని చెప్పుకుని తిరుగుతుంటా.

అట్లాంటి M.Sc., Maths నే నేను చదివింది.

M.Sc., Maths అయిపోయిన అయిదారేళ్లకు నన్ను ఎవరో 3+2x4 ఎంత అని అడిగితే నేను కూడా పిలకాయల మాదిర 20 అని చెప్పిన దద్దమ్మనే.

ఇప్పుడు ఇస్కూలు పిలకాయల కత అనీ, పిల్లల భాషలో Algebra అనీ ఏవో రెండు పుస్తకాలు మిణికాక నన్ను అయిదారుగురు – Maths లో భలే gem అని పొరబడ్డారు.

నాకు ఎంత సిగ్గుగా వుంటుందో చెప్పలేను. నా పిలకాయలు ఎక్కి వచ్చాక నేను 5వ తరగతి నుంచీ పదవ తరగతి దాకా పుస్తకాలను ముందరేసుకుని శ్రద్ధ పెడితే పుస్తకాల్లో వున్న విషయాలు నాలుగో వంతు వరకూ నాకు వంటబట్టాయి.

వున్నట్టుండి ఎనిమిదో తరగతిలో వొక లెక్క ఇచ్చి “నువ్వేదో పెద్ద మేధావి అని ఫోజు కొడుతున్నావు. వెయ్‌రా దీన్ని!” అంటే నేను ఏరిగి పెడతాను నాశనం.

అంత భయం నాకు లెక్కలంటే. అవి అంత జటిలంగా కూడా వుంటాయి.

గుడ్డి వాటంగా నేను ఏ లెక్కనూ వెయ్యనూ లేను, పిల్లలకు చెప్పనూ లేను.

ఏ చాప్టర్‌ను తీసుకున్నా అందులో విషయాలు గడ్డివామి వేసినంత బాగా అర్థం చేసుకోనిదే నేను పిలకాయల ముందు వాటిని చెప్పలేను.

లెక్కలకు సంబంధించి వొక పెద్దాయన అన్న మాటలు నాకు బాగా గుర్తు. ఆయన ప్రొఫెసర్ కుప్పుస్వామి రావు.

“చిన్నప్పుడు నాకెట్లాంటి డౌట్లు వచ్చినాయో అవే డౌట్లు మీకెట్లా వచ్చినాయి? వాటిని భలే క్లియర్ చేశారే!” అని అన్నారాయన పిల్లల భాషలో Algebra చదివి.

నేనాయన ముందర సిగ్గుగా నవ్వుతూ నిలబడ్డానే గానీ ఏం మాటాళ్లేదు.

అట్లా ఆ ప్రొఫెసర్ మాదిరిగా ఎవరూ కూడా మన బాల్యాన్నీ, బాల్యంలో ఈ లెక్కల మీద మనం పడ్డ అగచాట్లనీ మర్చిపోకూడదు.

బిడ్డను వొళ్లో కూర్చోబెట్టుకుని మజ్జిగన్నం తినిపించి మూతి తుడిచినంత ప్రేమతో ఈ లెక్కల్ని పిల్లలకి పదే పదే చెప్పాలి.

వొక కఱ్ఱ చేతబట్టి పుటుక్కు పుటుక్కుమని కొడుతూ, తిడుతూ ఆగడం చేసేసే వాడెవడూ లెక్కల టీచరుగా పనికే రాడు.

ధర్మరాజుల్లాంటి పిల్లలకి అన్నీ డౌట్లుగానే వుంటాయి.

ఉదాహరణకి తీసివేతలు తీసుకుందాం.

అయిదో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకూ చదివే పిల్లల్ని మీరు వంద మందిని తీసుకుని ఈ ప్రశ్నపత్రం ఇచ్చి చూడండి.

(1) $5 - 3 =$

(2) $3 - 5 =$

(3) $-5 + 3 =$

(4) subtract 3 from 5

(5) subtract - 3 from 5

పైకి తీసివేతలే కదా అనిపిస్తాయి. కానీ ఈ తీసివేతల్లో ఎంత వుందో చూడండి.

పిల్లలు గానీ 5వ తరగతి వరకూ చదువులు చెప్పే టీచర్లు గానీ అయిదు నిమిషాల్లో ఈ ప్రశ్నపత్రాన్ని పూరించి ఇచ్చేస్తారు గానీ ఎంతమంది ఎన్ని రకాల ఇబ్బందులు పడి తప్పులు చేస్తారో చూడండి

5 – 3, 3 – 5 పిల్లల్ని ముద్దులు పెట్టి చెప్పాల్సిన విషయాలు చాలా వున్నాయి.

(1) $5 - 3$

అంకె 5 ముందు ఏ గుర్తూ లేదంటే అర్థం + గుర్తు వున్నది. + గుర్తు అంటే మన దగ్గర వున్నదని అర్థం.

పిల్లవాడి దగ్గర 5 మిఠాయిలు వున్నాయి. – 3 అంటే ఆ పిల్లవాడు 3 మిఠాయిల్ని తినేశాడు, లేదా చెల్లికి ఇచ్చేశాడు. 2 మిగిలాయి.

(2) 3 – 5

దీనికి గూడా పిల్లలు 2 అనే సమాధానం చెప్తారు గానీ కాదు గదా. మనం చెప్పాలి.

+3 అంటే 3 మిఠాయిలు పిల్లవాడి దగ్గర వున్నాయి. –5 అంటే 5 మిఠాయిలు వాడు స్నేహితుడికి ఇవ్వాల్సింది. వున్న మూడూ ఇచ్చేస్తే తర్వాత ఇంకా 2 ఇవ్వాలి. బాకీ కాబట్టి – 2.

ఇదీ చెప్పి ఇంకా చెప్పాలి.

3–5లో పెద్ద అంకెకు ముందు వున్న గుర్తు –, 5లో 3 పోతే 2. – గుర్తును 2 ముందు పెట్టు. – 2. పెద్ద సంఖ్యలో నుంచి చిన్న సంఖ్యను తీసేసి పెద్దదాని ముందున్న గుర్తు పెట్టాలి.

5 – 8 = – 3

7 – 10 = – 3

10 – 13 = – 3 ఇట్లా

(3) – 5 + 3

ఇదేం తీసివేత అనిపించేటట్లున్న తీసివేత. పైదీ, ఇదీ రెండూ వొకటే. ఆ విషయం చెప్పకపోతే పిల్లలకు ఏం తెలుస్తుందీ?

తీసివేతల్లో ఎప్పుడూ కూడా + గుర్తు వున్నదాన్ని ముందు రాసుకుంటే సరి.

(4) Subtract 3 from 5

5లో నుంచి 3ను తీసెయ్యండి.

5 – 3 లేదా

$$\begin{array}{r} 5 \\ 3 \\ - \\ \hline 2 \\ \hline \end{array}$$

ఇది సరే. మరి (5) subtract - 3 from 5.

దీనికీ పిల్లలు రెండు అని జవాబు చెప్తున్నారే! ఆ confusion ఎక్కణ్ణుంచి వొచ్చింది?

$$\begin{array}{r} 5 \\ -\ 3 \\ \hline \\ \hline \end{array}$$

5 లో నుంచి – 3 ను తీసివెయ్యమన్నారు గాబట్టి 5 కింద – 3 ను రాసుకున్నాం.

ఇంతకు ముందు 5లో నుంచి 3 ను తీసెయ్యమంటే

$$\begin{array}{r} 5 \\ 3 \\ - \\ \hline 2 \\ \hline \end{array}$$

ఇట్లా చేశాం గదా. తీసివేయమనగానే + 3 కాస్తా –3 అయ్యింది.

ఇప్పుడు $\begin{array}{r} 5 \\ -\ 3 \\ \hline \end{array}$

ఇంతకు ముందు 3ను తీసేశాం. ఇప్పుడు –3ను తీసేస్తున్నాం.

ఇంతకు ముందు +3 కాస్తా – 3 అయినట్టే ఇప్పుడు – 3 కాస్తా + 3 అవుతోంది.

ఇట్లా $\begin{array}{r} 5 \\ -\ 3 \\ + \\ \hline 8 \\ \hline \end{array}$

తీసివేత అనగానే గుర్తును మారుస్తాం గదా. మర్మాలు ఇంత ఇదిగా వున్నాయి. కాబట్టే పిల్లలకు పదేపదే చెప్పాలనేది. ఇన్ని జాగ్రత్తలు ఏ text book లోనూ చెప్పరెందుకనో! text books భాష బిగించుకుని వున్నట్టు వుంటుంది. పిల్లలు చేసే తప్పుల్ని కూడా ఎత్తి చూపుతూ తమాషాగా రాయవచ్చు గదా! కనీసం lower classes books అయినా –

ఈ రోజు పిల్లలకు తీసివేతలు చెబుతాం అన్న టీచర్‌కు ఆ రాత్రి ఇంత home work వుండాలి. అట్లా గాకుండా ఏదో తీసివేత అన్నట్టు చెప్పేసి చేతులు కడుక్కుంటే పిల్లలు మెరికలెలా అవుతారు?

ఒకరోజు నేను హైద్రాబాద్‌లో వుండగా వొక స్కూల్ ఫంక్షన్‌లో నేను ఐఐటి రామయ్య ఉపన్యాసాన్ని శ్రద్ధగా విన్నాను.

ఆయన subject మీద horizontal expansion వుండాలి గానీ, vertical కాదు అన్నారు. Horizontal అంటే తెలుసూ vertical అంటే తెలుసు, కానీ విషయం నాకు అర్థం కాలేదు. ఒక మేధావి మాటలు కూడా అర్థం కాని బోగస్ మేధావిని నేను.

పనిగట్టుకుని సంజీవరెడ్డి నగర్‌కెళ్లి వొక కార్పొరేట్ కాలేజీలో సీనియర్ లెక్చరర్ ఇంటర్‌వ్యూ తీసుకుని ఆయన్ని అడిగాను. ఆ సార్ నాకు అర్థమయ్యేటట్టు చెప్పినాడు.

Horizontal expansion: ఇప్పుడు Algebra లో Bases and Powers అన్న chapter తీసుకోండి. అందులో ఏ ఫార్ములా ఎందుకొచ్చిందీ, ఆ ఫార్ములాల మీద Text book లో వున్న ప్రశ్నలే గాక ఇంకా ఎన్ని రకాలుగా అడగవచ్చు... ఇట్లా ఆ chapter ను అడ్డంగా expand చేసుకోవడం అదే తరగతిలో వుండి.

Vertical expansion: Text book లో వున్న problem ను హడావుడిగా అయిపోజేసి 7వ తరగతిలోనే ఆ chapter కు సంబంధించిన ఎనిమిదో తరగతి లెక్కలూ, 8 లోనే 9 వీ, 9 లోనే 10 వీ, 10 లోనే ఇంటర్‌వీ చేయించేసి పిల్లల్ని గానుగెద్దుల్ని చేసేయడం.

అంతేగదా. మూడో తరగతిలోనే తీసివేతలు 18,776–9,687 వేయించేసి తీసివేతలన్నీ చెప్పేశామనుకుని గాభరాగా గుణకారాల్లోకీ, భాగహారాల్లోకీ తరుముకు పోవడం – vertical expansion అంటే.

ఆయన ఉపన్యాసం విన్న తర్వాత నేను నాలుగు రోజులు తీసివేతల మీద కూర్చుంటే – నాకు ఇన్ని చిక్కులు కనిపించాయి.

పిల్లలకొచ్చే డౌట్లు పరమ న్యాయంగా వుంటాయి. నేను హైద్రాబాద్‌లో ఒకటిన్నర నెల వొక స్కూల్లో చేశానని చెప్పాను గదా.

అప్పుడొక టెన్త్ క్లాసమ్మాయి నన్ను పట్టుకుని ఇట్లా అడిగింది :

"ఏమండీ మాస్టారూ! $\frac{a+b}{2}$ అనేది $\frac{a}{2}+\frac{b}{2}$ అయినపుడు $\frac{ab}{2}$

మాత్రం $\frac{a}{2}\frac{b}{2}$ ఎందుక్కాదండీ?”

“లంజాముండా! టెన్త్ చదవతా ఇదా నువ్వడిగేది” అని కసిరేసి వుంటే ఆ పిల్ల మూతి నల్లగా పెట్టుకుని కూర్చునేసేదే!

నా కెంత సంతోషం వేసిందో చెప్పలేను. నా మొహం చూసి – ఏ డౌట్ వొచ్చినా వీణ్ణి అడిగేయొచ్చు అని ఆ తల్లికి అనిపించిందంటే యస్ నా మొహంలో కళ వుందీ!

నేనిట్లా చెప్పినాను.

“చూడమ్మా! ఈ పనికి మాలిన a లనూ, b లనూ వొదిలిపెట్టు. అంకెలు మనకు బాగా తెలుసు గదా $\frac{10+8}{2}$ ఎంత?

బై టు అంటే సగం గదా. 18లో సగం 9. $\frac{10\times8}{2}$ ఎంత ?

80లో సగం 40 కదా.

$\frac{10+8}{2}$ ను తీసుకో $\frac{10}{2}=5$ కదా, $\frac{8}{2}=4$ కదా !

ఆ రెంటినీ కూడితే 9 కదా. $\frac{10\times8}{2}$ ను తీసుకో

$\frac{10}{2}=5$ కదా, $\frac{8}{2}=4$ కదా, 5 × 4 = 20 కదా....”

నన్నింక ఆ పాప చెప్పనివ్వలేదు. ఎప్పుడైతే a, b లను వొదిలి పెట్టి అంకెల్లోకి దిగానో అప్పుడే ఆ పిల్ల మొహం తెలివితో వెలిగిపోయి, “సార్‌సార్ సారీ సార్. సిల్లీ కొశిన్ వేశాను.” అంది.

Maths లో నా calibre కూడా ఆ పాప అంతదే. ప్రతిదీ కళ్లాపి జల్లి ముగ్గేసినట్టు తెలుసుకోక పోతే మనశ్శాంతి వుండదు.

అందుకే నేననేది ఏమంటే – స్కూలు టీచరు నిరంతరం హోం వర్కు చెయ్యాలి. ఆయనేం పార్లమెంటు సభ్యుడు గాదు చేతులూగించుకుంటూ దాంట్లోకి వెళ్లిపోవ డానికి. టీచరు!

కనీసం 30 ఏళ్లు వరసగా చెప్తుంటారు గాబట్టి తొలి 2,3 సంవత్సరాలు సబ్జెక్టు మీద కూర్చుని దాన్ని వొంగదీసి దాంతో పిల్లలు పడే ఇబ్బందినంతా చూసి... పిలకాయల ముందర ప్రతి లెక్కనీ దద్దమ్మను చేసిపెట్టి వొదలాలి.

7th classలో వొక పిల్లవాడు వొక లెక్కను ఇట్లా చేశాడు.

$$1000\frac{1}{2}\times 999\ \frac{1}{2}$$

$$1000\frac{1}{2} = 1000+\ \frac{1}{2}$$

$$999\frac{1}{2} = 1000-\ \frac{1}{2}$$

$$1000\frac{1}{2}\times 999\ \frac{1}{2} = \left(1000+\frac{1}{2}\right)\left(1000-\frac{1}{2}\right)$$

(a+b) (a-b) = $a^2 - b^2$ అనే ఫార్ములాను బట్టి

$$\left(1000+\frac{1}{2}\right)\left(1000-\frac{1}{2}\right)$$

$$=(1000\ )^2 - \left(\frac{1}{2}\right)^2$$

$$=1000\times 1000-\frac{1}{2}\times\frac{1}{2}$$

$$=10,00,000-\frac{1}{4}$$

$$=\frac{10,00,000}{1}-\frac{1}{4}$$

$$=\frac{40,00,000-1}{4}$$

$$=\frac{39,99,999}{4}$$

```
1) 39,99,999 (9,99,999.75
   36
   __
    39
    36
    __
     39
     36
     __
      39
      36
      __
       39
       36
       __
        39
        36
        __
          30
          28
          __
           20
           20
           __
            0
           __
```

చూడండి. బిడ్డ ఎంత ఆయాస పడ్డాడో! వాడు చేసిందాంట్లో రవ్వంత కూడా తప్పులేదు. గస.

వాడి సమస్య పది లక్షల్లోంచి 1/4 ను తీసెయ్యడం. శాస్త్ర ప్రకారం చేస్తే అంతే. L.C.M. తీశాడు. పది లక్షలు కాస్తా 40 లక్షలయ్యింది. దాంట్లోంచి వొకటి తీశాడు. 39,99,999 అయ్యింది. పద్ధతి ప్రకారం 4తో భాగించాడు.

కాసేపు బోర్డు మీద నుంచి చూపును వీధిలోకి మరల్చి చూస్తే నాకు అర్ధమయ్యింది.

ఇట్లా చెప్పాను.

“చూడురా. వెయ్యి రూపాయలు నీ జేబులో వుంది. పావలా పెట్టి గోళీ గుండు కొనాలి. నువ్వు రూపాయే కదా, జేబులో నుంచి తీస్తావు. వెయ్యి కుమ్మరించవు గదా. 999 రూపాయలు జేబులోనే వుంచి రూపాయి ఇస్తావు. కొట్టువాడు పావలా తీసుకుని నీ ముప్పావలా నీకిస్తాడు. 999తో వెళ్ళి ఈ ముప్పావలా చేరుతుంది. నీ దగ్గర 999 3/4 వుంటుంది. అంతే గదా.

10 లక్షల్లోంచి 1/4ను తీసెయ్యడమన్నా అంతేగానీ ఇంత కష్టం పడాల్సిన పన్లా. 9,99,999 ని అట్లా వుంచి వొకట్లోంచి పావలా పోతే 3/4 మిగుల్తుంది గదా. నోటి లెక్క అన్నమాట. చెయ్యి పెట్టాల్సిన పనే లేదు.

పిల్లలంతా ఎంత హాయిగా వూపిరి పీల్చుకున్నారో.

ఆ తర్వాత $100\frac{1}{2} \times 99\frac{1}{2}$ మొదలు అన్నీ సులభమై పోయాయి.

చిన్నపుడు నేను అడవికి గొడ్లను తోలుకు పోయేటప్పుడు పేడ తెద్దామని కూడా తట్ట తీసుకెళ్లే వాణ్ణి.

అడవిలోకి అన్ని వూళ్లవాళ్లూ గొడ్లను తోలుకొస్తారు గదా. సాయంకాలానికంతా తట్ట నిండిపొయ్యేది.

నేనా! లేదర బిడ్డను. అంత తట్టను ఎట్ట మోద్దును?

ఏదో ఒక రకంగా నెత్తిన పెట్టుకుని వొస్తావుంటే ఆ బరువుకు గుండెల్లో నెత్తురు దిగినట్టుండేది. కనుగుడ్లు పొడుచుకొచ్చేవి.

దోవలో ఎదురుపడే పెద్దోళ్లకు మనసే వొప్పేది గాదు. ఆడా మగా మార్చి మార్చి మా దిబ్బ దాకా నా తట్టను మోసుకొచ్చి ఇచ్చేవారు.

వేలాది మంది టీచర్లు ఇక్కడే ఆలోచించాలి. బిడ్డలు హద్దుమాలిన బరువులు మోస్తున్నారు.

మనం టీచర్లం. వాళ్ల నెత్తి బరువును నేల దించాలి గదా. మనం నెత్తికెత్తు కోవాలి గదా.

# ఇంటర్‌లో ఏం జరుగుతోంది?

**పి**ల్లల్ని ఇంటర్‌లో చేర్చడం అంటే – బిడ్డల్ని బావుల్లో వేసి లోతులు చూడ్డమే. అదృష్టాన్ని పరీక్షించుకోవాలనుకున్నప్పుడల్లా దురదృష్టమే ఎదురవు తుంటుంది.

చచ్చిపోయిన ప్రపంచ తత్వవేత్తలూ, ఇప్పుడు బతికున్న మనస్తత్వ శాస్త్రవేత్తలూ అంతా కట్టగట్టుకుని రావాల్సిందే – ఇంటర్ చదివే పిల్లల తల్లిదండ్రుల మెంటాలిటీని అసెస్ చెయ్యడానికి. మనవల్లా కాదు.

ఇళ్లు కట్టిన వాళ్ల మాటలు వింటూ వుంటాం గదా. "ఏందోనండీ 4 లక్షలు పెట్టుకుని దిగితే గృహప్రవేశం నాటికి ఆరు లక్షలు లెక్క తేలింది." అంటుంటారు బడాయిగా.

ఇల్లు మళ్లీ మళ్లీ కట్టుకోం గదా. టైల్స్ లేకుంటే ఏం బాగుంటుంది, టేకు కొయ్య లేకుంటే ఏం బాగుంటుంది, గోడల్లోనే షో కేసుల్లేకుంటే ఏం బాగుంటుంది– ఇది గదా వరస.

పిల్లల్ని కూడా మళ్లీ మళ్లీ చదివించం గదా. ఇంటర్లో బైపీసీనో ఎంపీసీనో చదివించేద్దాం! ఏమో వాళ్ల రాత ఎట్లా వుందో! ఒకవేళ ఎంసెట్‌లో ఫ్రీసీటు రావచ్చేమో!

ఇంట్లో ఫ్రిజ్జూ, టీవీ లేకుంటే ఎంత నామోషీనో టెన్త్ అయిన పిల్లల్ని ఇంటర్‌లో సైన్స్ గ్రూప్‌లో చేర్చకపోతే అంత అవమానం.

నువ్వు చేర్చావని నేనూ, నేను చేర్చానని నువ్వూ!

పిల్లల్ని కూడా ఎట్లా తయారు చేశామంటే, "ఏంరా! ఏం చేరాలనుకుంటు న్నావు?" అని టెన్త్ పూర్తయిన వాళ్లను అడిగితే చాలు, "ఎంపీసీ తీసుకుంటా నంకుల్, ఎంసెట్ ట్రైచేస్తా." అని మాట్లాడేస్తున్నారు.

టెన్త్‌లో ఫస్ట్ క్లాస్ వచ్చిన పిల్లలు వేలాదిగా వుంటారు పాపం. అదే పచ్చి మోసం. 400 మార్కులు దాటితే దరిద్రం చుట్టుకున్నట్టే లెక్క.

ఇంతవరకూ మనం school education గురించి చూశాం గదా.

టెన్త్‌లో ఆయా సబ్జెక్టుల ప్రశ్నా పత్రాలన్నీ చూడండి తెలుస్తుంది.

4 మార్కుల questions నాలుగిస్తే రెండు రాస్తే చాలు. చాయిస్ బాగా వుంటుంది. వేలాది స్టడీ అవర్లు వృధాపోవు.

దాదాపు డిసెంబర్ నుంచి పరీక్షలయ్యే దాకా ఓ అని చదివించడమే గదా పని. చదవడం రాయడం వొచ్చిన ప్రతి పిల్లాడికీ ఫస్ట్‌క్లాస్ వొచ్చేస్తుంది.

10th లో మేధావులు 700 పేజీల సిలబస్‌ను ఫిజిక్సులో పెట్టుకోనివ్వండి. ఏం పర్వాలేదు. Acceleration కు C.G.S unit తెలియకపోయినా science లో పాస్ అవడం కాదు 80 మార్కులు వొచ్చేసి వుంటాయి

$(a+b)^3$ ఫార్ములా రాకపోయినా, $a^3+b^3$ కు factors అడిగితే బిత్తర చూపులు చూసినా – 90, 92 maths లో వచ్చేసి వుంటాయి పిల్లలకు.

School education లో అంత magic వుంది మరి.

700 పేజీల పుస్తకంలో నుంచి 60 పేజీలకు సరిపడే material ను తయారు చేసి 'కమలాకుచచూ...' ప్రార్ధనా గీతాన్ని బట్టీ పెట్టినట్టు బట్టీ పెట్టిస్తే సరి. మార్కులకేం దండిగా వస్తాయి.

గ్యాస్ సిలండర్‌లో బ్యూటేన్ వాయువు వుంటుంది అని చెప్పేసినంత మాత్రాన పిల్లాడు chemistry లో రాటు దేలిపోయినట్టు కాదు. అంతా మార్కుల చదువు.

వివిధ పదవుల్లో వున్న మేధావులెవరూ ఇప్పటి 7th class పాస్ కాలేనట్టే – 10th అయ్యాక 5th class knowledge కూడా లేకుండా ఇంటర్‌లో చేరిపోతారు పిల్లలు.

టెన్త్‌లో 3rd class, 2nd class తో బయటపడి పోయే పిల్లలు పూర్వజన్మలో పుణ్యం చేసుకున్న వాళ్లు. వాళ్లని parents కూడా అంతగా పట్టించుకోరు. వీళ్ల పనైపోయిందన్నట్లు గవర్నమెంటు కాలేజీల్లో హెచ్.ఇ.సి., సి.ఇ.సి. చేర్పించేసి ఆశ వొదిలేసుకుంటారు.

మెడకు తాడు చుట్టుకునేదల్లా ఈ 1st class students కే!

ఇంటర్‌లో సైన్స్ గ్రూప్‌లో చేరే పిల్లలకి – కాలేజీ మెట్టు ఎక్కామన్న ఉత్సాహమే వుండదు.

అవి కార్పొరేట్ కాలేజీలు గదా. వాళ్ల డబ్బును క్షణాల్లో లెక్కించడానికే గదా calculator లు అనేవి పుట్టింది!

అక్కడ వొక్కో పిల్లాడికి వొక్కో నిచ్చెన వుంటుంది – నరకానికి!

సెక్షన్ల వారీగా విభజన. ఒక్కో సెక్షన్‌కి 70 మంది పిల్లలు కనీసం. $J_1$, $J_2$, $J_3$, ... ఇట్లా.

టెన్త్ క్లాస్‌లో 530 మార్కులు దాటిన వాళ్లంతా $J_1$ అనుకోండి, $J_4$ అంటే శుద్ధ మొద్దులన్నమాట. కేవలం ఫీజులు కట్టడానికి పనికొచ్చే వొక మూక అని కార్పొరేట్ కాలేజీవాళ్ల అభిప్రాయం!

ఒక నెల పోతే పరీక్షలు జరుగుతాయి గదా. $J_1$ వాడు $J_2$ కెళ్లిపోవచ్చు. $J_4$ వాడు $J_1$ కు వొచ్చేయొచ్చు!

ఈ సెక్షన్ల మార్పిడి – నరకానికి తొలిమెట్టు.

సీను ఇంట్లోకి మారుతుంది. ప్రోగ్రస్ రిపోర్టు వొచ్చి వుంటుంది గదా.

$J_1$ లో వున్న కొడుకు హఠాత్తుగా $J_3$ లో పడ్డాడు. ఆ బాధతో quarter తాగిన వొక పేరెంటు నాతో ఇట్లా అన్నాడు :

"సార్ పిల్లలకు మన బాధలు తెలవడం లేదు సార్. 5 రూపాయల వొడ్డీ పడే చీటీ నొకదాన్ని వొకటి సగంగా పాడేసి మా నా కొడుకుని కాలేజీలో చేర్పించా – 10th లో 520 వచ్చాయి గదాని. వాడు నెలైనా $J_1$ లో వుండకుండా $J_3$ లోకి పడిపోయాడు. ఆ నాకొడుకుని చూడాలంటేనే నాకు రోతగా వుంది. ఇంటర్‌లో చేరగానే ఎంత తోక పెరిగి పోయిందో చూడండి!"

ఇంక ఆ తండ్రి ఇంట్లో పిల్లాడితో ఎంత రచ్చ చేసి వుంటాడో చెప్పాలా?

10th లో 540 తెచ్చుకుని ఇంటర్‌లో మరీ హాస్టల్‌లో ఉచితంగా చదువు కుంటుంటారు కొంతమంది.

వారిదైతే క్షణం క్షణం నిప్పుల మీద నడకే.

ఒక test లో Physics లో 60కి 58 వొస్తే చాలు. ప్రిన్సిపాల్ నుంచి కబురొస్తుంది.

"అంతా ! ఓసి గదాని బాగా లాగించి నిద్ర పోతున్నావా! ఇట్లాగే అయితే మీ పేరెంట్స్‌ని పిల్చి చెప్పాల్సి వుంటుంది. ఫస్ట్‌టైం మర్యాద ఇస్తున్నాను. వెళ్లు"

డబ్బు వుండే మహరాజుకి అవసరం వచ్చి అప్పు అడిగితే – ఇవ్వడం అనేది ప్రజలకు ఫ్యాషనై పోతుంది గదా. ఇంటర్ చదివే పిల్లల ప్రివిలేజెస్ భలే వుంటాయి తల్లిదండ్రుల దగ్గిర. పుస్తకాలకు డబ్బు అడిగితే క్షణంలో వుంటుంది.

జీన్స్ అడిగితే జీన్స్. కిలో మాంసం తెస్తే 'అరకిలో నువ్వే తిను. మేం పస్తులుంటాం. నువ్వు చదవాల్సిందే మాక్కావాల్సింది.' అంటారు.

ఇంటర్‌లో హాస్టల్‌లో చదివే పిల్లలు క్షణం క్షణం అయితే తల్లిదండ్రుల నస తప్పించుకుంటారు గానీ వారం వారం తప్పవు. పాపం, హాస్టల్‌లో వున్నవాళ్లను తల్లిదండ్రులకు చూడాలని వుంటుంది. వారానికొకసారి visiting hours వుంటాయి గదా. అప్పుడు హాస్టళ్ల ముందు సంభాషణలు వినాలి.

ఒక్కరు కూడా కనీసం పైకి అయినా "చదివిన కాడికి చాలు. tension పెట్టుకోవద్దు. ఎంసెట్‌లో సీటు రాకపోతే కొంపేం మునగదు. B.Sc లో చేరవచ్చు." అని అననే అనరు.

– "మన పరిస్థితులు నీకు తెలుసు గదా. ఇంతింత పోసి చదివిస్తున్నాం. నువ్వేం చేస్తావో తలచుకుంటేనే భయంగా ఉంది!"

– "మొన్ననే ఇంటికి రిపోర్టొచ్చింది. అమ్మ భలే బాధ పడింది. సెకండ్ ఇయర్‌లో పుత్తూరు తీసుకొచ్చి అక్కడే గవర్నమెంట్ కాలేజీలో చేర్పిస్తే చాలని పోరుతూ వుంది. నాకైతే నీ మీద నమ్మకం వుంది. మనకేమీ వెయ్యిలోగా కూడా ర్యాంకు వద్దు. అమ్మాయిలకు రిజర్వేషనుంది. దండిగా కొత్త కాలేజీలొచ్చేశాయి. ఫ్రీ సీటు తెచ్చుకో చాలు. ర్యాంకు పదివేలు రానీలే, బాధలేదు."

– "బాబాయ్ కొడుక్కి వచ్చే మార్కులు నీకెందుకు రావురా? నీ దిగుల్తోనే అమ్మ చచ్చేటట్టుంది..."

ఇంకెందుకు లెండి !

కొంతమంది పిల్లలకి ఇంటర్‌లో చేరగానే అన్ని భ్రమలూ తొలగిపోతాయి. ఎంసెట్‌లో సీటైతే రానే రాదనీ, ఫస్ట్‌క్లాస్ వరకూ చాలనీ అనిపిస్తుంటుంది. ఈ

మాత్రం చదువు గవర్నమెంటు కాలేజీలో అయినా చదవొచ్చు అనిపిస్తుంటుంది కూడా.

జూదానికి అలవాటు పడిపోయిన తల్లిదండ్రులు వాళ్లను బైటికి రానివ్వరు.

ఒక పాప హాస్టల్‌లోగాక మనం వుండకూడదు, ఇంటికెళ్లిపోయి నాయుడు పేటలో చదువుకుందాం అనుకుని అడిగింది.

“సార్, మూడు నెల్ల ఫీజు పట్టుకుని తిరిగిచ్చేయండి. నేను మా వూరెళ్లి పోతాను”

పాపం అమాయకురాలు! ఏ కాలేజీ వాళ్లయినా వొప్పుకుంటారా ! వాళ్లకు తెలీదా – ఆ అమ్మాయికి ర్యాంకు రాదని ! వాళ్లకు డబ్బు వస్తుంది గదా!

ఆ అమ్మాయి చూసి చూసి వొకరోజు ఆయింట్‌మెంట్ తినేసింది. ఇమీడి యెట్‌గా హాస్టల్ నించి హాస్పిటల్‌కు! తల్లిదండ్రుల ఉరుకూ పరుగూ!

బుద్ధి మాటలు లక్షలాదిగా ...

మళ్లీ హాస్టల్‌లోనే బందీ !

కాలం గడిచిపోతూ ఉంటుంది గదా. ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలై పోతాయి. ఫలితాలు వచ్చేస్తాయి. ఇక వాతలు మొదలు!

ఎవరికీ తృప్తి వుండదు! 470 కి 440 వచ్చినా ఇంప్రూవ్‌మెంట్‌లు!

ఇంప్రూవ్‌మెంట్ చదువు వొక పక్కా సెకండియర్ చదువొక పక్కా ఎంసెట్ కోచింగ్ వొక పక్కా పిల్లల్ని రాక్షసుల్లా పట్టుకుని పిసికి పారేస్తాయి.

తీరా ఎంసెట్ రాతకు కూర్చుంటే..

కోడిని కొయ్యడానికి మెడ మీద కత్తి పెట్టాక దాని గుండికాయలు ఎంత స్పీడుగా కొట్టుకుంటాయి!

ఎంసెట్ ఫలితాల వెల్లడి !

మెడ తెగి పోతుంది....

# కామన్ సెన్స్ లేకే...!

శ్రీ వెంకటేశ్వర స్వామికి వొక తల్లి ఇట్లా మొక్కుకున్నట్టు నాతో చెప్పింది.

"స్వామీ! రమాపతి కూతురి కంటే నా కొడుక్కి టెన్త్‌లో వొక్క మార్కెక్కువొచ్చినా నీ కొండకు నడిచొచ్చి గుండు కొట్టిస్తా!"

రమాపతి అంటే ఆమె మరిది.

ఈ మొక్కు సంగతి నాతోపాటు అప్పుడే విన్న ఆమె కొడుకు ఇట్లా అన్నాడు.

"అమ్మా, బాబాయ్ కూతుర్తో మనకెందుకు చెప్పు? మాధవీకి 210 వొస్తాయి, నాకు 211 వస్తే చాలా అయితే...!"

నేను వున్న పళాన లేచి వాణ్ని వొంచి వాడి పాపిట్లో ముద్దు పెట్టుకున్నాను, వాడికి వున్న కామన్ సెన్స్‌ను చూసి.

పిల్లలకున్న కామన్ సెన్స్ పెద్దలకు లేకపోవడం వల్లే చిక్కంతా!

మనం ఏ పని చేస్తూ వున్నా పిల్లలు మనల్ని తప్పే పట్టరు. రిక్షా తొక్కుకుని పొట్ట బోసుకునే ఆయన్ని ఆయన పిల్లలు, "ఇదేం పని నాయినా?" అని ఎగతాళి చేస్తారా?

ఒక క్లర్కు పిల్లలు ఆఫీసర్‌ని చూపించి, "ఆయన్ని చూడు! ఎంచక్కా ఆఫీసరు! నువ్వేమో క్లర్కు! నీకొచ్చే జీతం థూ నాశనం!" అని పలచన చేస్తారా ?

మనం ఏపని చేస్తూవున్నా పిల్లలు మనల్ని ఎంతగానో ప్రేమిస్తారు.

నేనిప్పుడు ఉద్యోగం సద్యోగం లేకుండా ఖాళీగా వున్నాను గదా.

స్కూల్లో నా పిల్లల్ని ఎవరైనా, "మీ నాయన ఏం చేస్తుంటాడు?" అనడిగితే నా కూతురు, "మా నాన్న ఇంతకు ముందు ఆంధ్రజ్యోతిలో ఎడిటరుగా చేసే వాడు. (నేను చేసింది వీక్లీకి ఎడిటర్‌గా) దాన్ని మూసేశారు గదా. Next year తుమ్మల గుంటలో స్కూలు పెడతాడూ!" అని చెప్పుకుంటుందంట.

నా కొడుకైతే, "మా నాన్న రైటరు. మేం షాపులకు పుస్తకాలేస్తాం. మాకు డబ్బు తౌజండ్స్ తౌజండ్స్ వొస్తుందీ!" అని చెప్తాడంట గొప్పగా.

ప్రేమించడం లోనే గాదు లోకం పోకడ తెలుసుకోవడంలో కూడా మన పెద్ద వాళ్లం పిల్లల కంటే భలే Poor.

ఒక పిల్లవాడు ఇంగ్లీషు క్వార్టర్లీ పరీక్షల్లో పక్క అమ్మాయి పేపర్ల లోంచి ఏదో చూసి రాస్తుంటే సాక్షాత్తూ హెడ్ మిసెస్ వాణ్ణి పట్టుకుని పేపరు తీసుకుని మధ్యలోనే తరిమేసింది.

వాడు ఏడుస్తూ ఇంటికొచ్చి తప్పును ఒప్పుకోనూ లేదు, చెప్పనూ లేదు గదా గమ్మునుండి పోయినాడు.

ఆ మరసట్రోజు హెడ్ మిసెస్ వాడి తల్లిని పిలిపించి, "మీ వాడు అస్సలు లాభం లేదు. దొంగ కూడా అయిపోతున్నాడు. పెంపకం అస్సలు సరిలేనట్టుంద"ని ఉతికేసింది.

ఆ రచ్చ అణిగి పోయాక పిల్లాడు చెప్పాడు. ఎంత గొప్ప మర్మమో!

"మా హెడ్‌మిసెస్ లంజాముండకి భలే బడాయి. ఆమె strict అని parents ముందు drama లు వెయ్యాల గదా. అట్లా strict అనిపించుకోబట్టే parents అడిగినంత డొనేషన్లు కట్టి పిల్లల్ని చేర్పించేస్తున్నారు. ఇప్పటికి 4 బిల్డింగుల్ని కట్టేసింది మాహెడ్ మిసెస్"

Strict గా వుండడమే ఆమె బిజినెస్. Parents ఫోన్ కాలులు చేసుకొని మరీ ఆమె strict ను గురించి చెప్పుకుంటారు గదా.

ఒకసారి కార్పొరేట్ కాలేజీకి వెళ్లి వుండి నోటీసు బోర్డు చూస్తున్నా. దాంట్లో స్టేట్ ర్యాంకు 3 వచ్చిన అబ్బాయిని – రంగుల్లో ముద్రించి వున్న 3 లో వొయ్యారంగా కూర్చోబెట్టి వున్నారు.

New comers ఆరాధనగా చూస్తున్నారు. అందులో ఒక అమ్మాయి, "పెద్ద ఫోజు లేవే! ఫస్ట్ టైం గాడిదకి మూడు వేలొచ్చిందట ర్యాంకు. 3 సార్లు long term లు తీసుకుని జనగణమన పాడితే ఎవడికి రాదు?"

అర్థమయ్యింది గదా!

ఈ కాలేజీవాళ్లు చేసే మ్యాజిక్కులకు మనం ఎంత లోబడిపొయ్యామో! ఏటా వెయ్యి కోట్లకు జరిగే ఈ ఎంసెట్ వ్యాపారంలో చక్కగా భాగస్వాములై పోయాం.

వంద ఇళ్లుండే పల్లెటూళ్లకు కూడా బ్రోకర్లు కార్లు వేసుకుని వెళ్లిపోతున్నారు.

"టెన్త్‌లో 2nd class వొచ్చినా పర్వాలేదు, Inter లో pick up అయిపోతాడేమో! చెప్పలేం. అదృష్టాన్ని పరీక్షించుకోండి!" అంటూ రైతుల దగ్గిర లక్ష వసూలు చేసేసి ముగ్గురు పిల్లల్నయినా పట్టుకొచ్చి చేర్పించేసి కమీషన్లు తీసుకుంటున్నారు.

పిల్లల చదువుల కోసం ఐదెకరాల్ని రెండెకరాలు చేసుకున్న రైతులు నాకింత మంది తెలుసు! చిన్నప్పట్నించీ హాస్టళ్లల్లో పెట్టి చదివించినా.. ర్యాంకు 30, 40 వేలకు పై మాటే!

Lower Classes లో చదువు ఎలా వుందో చాలా చూశాం గదా. 15 ఏళ్ల వయసులోనే గుండెకు రంధ్రాలు పడిపోయిన వాళ్లనెందుకు పందెంలో పెట్టి పరిగెత్తించడం!

చదువు వేరూ, డబ్బు వేరూ! చదువుకున్నోళ్లంతా డబ్బు సంపాయించేస్తారనీ, ఇంజనీర్లూ డాక్టర్లూ కాని వాళ్లంతా హెర్క్యులస్ సైకిళ్లు తొక్కుకుంటూ జీవనం కోసం ఆపసోపాలు పడుతుంటారనుకుంటే అది అపోహే!

అందుకు నేనే ఉదాహరణ.

మీ భాషలో నేను M.Sc., Maths దాకా చదువుకున్న విద్యాధికుణ్ణి. కానీ నా వూరి భాషా, చివరికి నా పెళ్లాం భాషా వేరే!

నేనొక పనికి మాలిన చెంగణ్ణి!

20 వేల రూపాయల చీటీ వొకటి – ఇంక నాలుగు నెల్లే వుంది పూర్తవడానికి, chit owner నన్ను పాడనివ్వ లేదు. కారణం – నెల జీతం రాని నేను మిగతా నెలలు ఎట్లా కడతాననుకున్నారు ?

ఆ చీటీ చాకలోళ్ల సాలమ్మ పాడి జబర్దస్తీగా డబ్బు తీసుకుంది. ఆమె భర్త తిరుపతిలో నాలుగు వీధులూ తిరిగి బండి మీద గుడ్డలు తోమి దినానికి 150 సంపాయిస్తాడు.

మొన్నటికి మొన్న తిరుపతిలో వొక డాక్టరుకు పట్టిన గతి చూడండి.

డాక్టరు పాపం ఎంసెట్టూ అదీ ర్యాంకు తెచ్చుకుని మెడికల్ కాలేజీలో మెడిసిన్ చేశాడు గదా. చిన్న clinic తెరిచాడు. Equipment కోసం రోజుకు 300

రూపాయలు కడతానని ఒకడి దగ్గర 50 వేలు అప్పు తీసుకున్నాడు, 5 రూపాయల వొడ్డీకి.

ఏముంది, నెల దాకా చూసినా డాక్టరు clinic సరిగ్గా జరక్క కట్టలేక పోయాడంట.

ఇందాక వొకడు అన్నానే ఆ వొకడు మీ డాక్టరును మీ భాషలో పిచ్చకొట్టుడు కొట్టాడండీ.

ఆ వొక్కడు పదో తరగతి fail అయిన వాడు. 20 ఏళ్లుగా 5 రూపాయల వొడ్డీ వ్యాపారం చేస్తూ మూడిళ్లు కట్టుకుని దర్జాగా బతుకుతున్న వాడు.

మా fail candidate మీ ranker ని కొడితే dentist దగ్గరకి పోయి పళ్లు కట్టించుకున్నాడండీ!

మా వూళ్లో కూడా టెన్త్ fail అయిన వాళ్లు కొందరు ఆ వ్యాపారం ఈ వ్యాపారం చేసి బాగా సంపాయిస్తూ ఈ కంఠస్తం చదువుల గాణ్ణి చూసి నవ్వుతున్నా రండీ!

మద్య నిషేధం అమల్లో వున్నప్పుడు మా బంధువొకడు భలే మహరాజయ్యా డండీ. నేనీ chapter రాస్తుండగానే మా ఇంటికొచ్చి దయతో, “సుబ్రమణ్యం మొహమాటం ఏం వొద్దు. నీ పరిస్థితి తెలిసి అడుగుతున్నా. వెయ్యో, రెండు వేలో కావాల్సొంటే అడుగు. నా దగ్గిర పనికి ఆహారం పథకం కింద వచ్చిన బియ్యం దండిగా వున్నాయి. రెండు మూటలు తెచ్చుకో. రేషన్ బియ్యం అనేమీ బాధ పడొద్దు. మన పరిస్థితులకు తగ్గట్టు పోవాలి” అని ఎన్నో సలహాలు ఇచ్చాడండీ ! అంతటి వాడు మా ఇంటి కొచ్చినందుకు నా పెళ్లానికి వొంటి మీద చీర నిలవలేదండీ. “మొగోడంటే అట్లా వుండాలి. నువ్వూ వుండావు దేనికి? గంగ జాతరకు నరకనా?” అని ఎత్తిపొడిచి, కేజీ skinless chicken తీసుకు రమ్మని నన్ను బజారుకి పంపించిందండీ !

కాబట్టి పిల్లలు చదువుకుని ర్యాంకులు తెచ్చుకోక పోతే వాళ్ల భవిష్యత్తు ఏమై పోతుందో అని ఆందోళన చెందే లక్షలాది తల్లిదండ్రులారా! మీ ఆందోళన కాస్తా కట్టి పెట్టండి.

ఎందుకు డబ్బును మంచినీళ్ల మాదిర్తో ఖర్చుబెట్టి ప్రతి బిడ్డనూ, ఎంపీసీ బైపీసీ చేర్పించి లాంగ్‌టర్మ్‌లు పెట్టించి పేమెంట్‌లు కట్టి గస పోస్తారు?

మీ దగ్గర ఉన్నదేదో వాళ్లకుండనివ్వండి.

పిల్లలు పెద్దయ్యాక ఏం బతక లేకుండా పోరు. మనలాగే వాడికీ వీడికీ టోపీ పెట్టి ఆ మోసం ఈ మోసం చేసి మన కంటే మంచి బతుకే బతుకుతారు. మీ క్కావాల్సింది వాళ్లు లక్ష చేతులతో సంపాయించడమే గదా...

ఎన్టీ రామారావు ఈ పాటికి ఎక్కడో పుట్టి పెరగతానే వుంటాడు. మళ్లీ ముఖ్యమంత్రి అవుతాడు. మద్య నిషేధాన్ని విధిస్తాడు. అప్పటికి మన పిల్లలూ పెద్ద వాళ్లయి పోయి వుంటారు గదా, కాపు సారా కాయించి వొక విడత మహరాజులై పోతారులెండి.

అంతగా కాకపోతే 5 రూపాయలేం ఖర్మ బీదా బిక్కీకి 10 రూపాయలకీ 20 రూపాయలకీ కూడా వొడ్డీలకు మార్చి మిద్దెలు మేడలు కట్టుకుంటారు. కనీసం ఒక రాజకీయ నాయకుడి ముందైనా జై జై అంటూ తిరిగి, వెనకన దొంగనోట్లు మార్చి కోటీశ్వరులై పోతారు. మీరు నిశ్చింతగా వుండండి.

మనం చచ్చిపోయాక మన మీద పడి మన బిడ్డలు ఏడిస్తే కదా మన శవాలు సంతోషించేది!

ఈ లోగానే మనం తొందర పడిపోయి మన కళ్ల ముందే పిల్లల్ని చంపుకునేసి వాళ్ల శవాల మీద పడి మనం ఏడ్చెయ్యడం తప్పు గదా!



# కాకమ్మ-చీమమ్మ

కాకమ్మ, చీమమ్మ అక్కా చెల్లి. కాకమ్మకూ చీమమ్మకూ చెరొక కయ్య వుండేది. ఆ సంవత్సరం వానలు బాగా కురిసి చెరువులు నిండిపోయినాయి.

"అక్కా అక్కా ! వూళ్లో అందరూ మడకలు కట్టి దున్నుకుంటున్నారు. మనం కూడా దున్నుకుందాం రా అక్కా !" అని పిలిచింది చీమమ్మ కాకమ్మను.

"నా కయ్య నక్కడ పెట్టి నీ కయ్యలో దున్నుకో పో !" అనింది కాకమ్మ.

చీమమ్మ రెండు కయ్యాలూ దున్నేసొచ్చింది.

"అక్కా అక్కా ! వూళ్లో అందరూ పైర్లు నాటుకుంటున్నారు. మనం కూడా నాటుకుందాం రా అక్కా !" అని పిలిచింది చీమమ్మ కాకమ్మను.

"నా కయ్య నక్కడ పెట్టి నీ కయ్యలో నాటుకో పో !" అనింది కాకమ్మ.

చీమమ్మ రెండు కయ్యలూ నాటేసొచ్చింది.

"అక్కా అక్కా! వూళ్లో అందరూ కలుపులు తీసుకుంటున్నారు. మనం కూడా తీసుకుందాం రా అక్కా!" అని పిలిచింది చీమమ్మ కాకమ్మను.

"నా కయ్య నక్కడ పెట్టి నీ కయ్యలో తీసుకో పో !" అనింది కాకమ్మ.


చీమమ్మ రెండు కయ్యలూ కలుపు తీసేసొచ్చింది.

"అక్కా అక్కా ! వూళ్లో అందరూ వరిమళ్లు కోసుకుంటున్నారు. మనం కూడా కోసుకుందాం రా అక్కా !" అని పిలిచింది చీమమ్మ కాకమ్మను.

"నా కయ్య నక్కడ పెట్టి నీ కయ్యలో కోసుకో పో !" అనింది కాకమ్మ.

చీమమ్మ రెండు కయ్యలూ కోసేసొచ్చింది.

"అక్కా అక్కా ! వూళ్లో అందరూ పన కొట్టుకుంటున్నారు. మనం కూడా కొట్టుకుందాం రా అక్కా !" అని పిలిచింది చీమమ్మ కాకమ్మను.



"నా కయ్య నక్కడ పెట్టి నీ కయ్యలో పన కొట్టుకో పో!" అనింది కాకమ్మ.

చీమమ్మ రెండు కయ్యలూ పన కొట్టేసొచ్చింది.

"అక్కా అక్కా! వూళ్లో అందరూ వడ్లగింజలు తెచ్చి ఇంట్లో పోసుకుంటున్నారు. మనం కూడా –" చీమమ్మ నోట్లో మాట నోట్లో వుండగానే కాకమ్మ బండీ ఎద్దులు కట్టుకుని కళ్లం కాడికి బయలుదేరింది.

చీమమ్మకు చిట్టెడొడ్లు కూడా వదలకుండా అన్నీ బండిలో పోసుకుని ఇంటికి తెచ్చుకునింది కాకమ్మ.

'ఇంక నా బిడ్డలను ఏ గంప కింద మూసి పెట్టేదిరా దేవుడా !' అని కంటికి కడవడు నీళ్లు కారుస్తూ కళ్లం కాడనే వుండిపోయింది చీమమ్మ.

'చీమ ఏమి, కంటికి కడవడు నీళ్లు కార్చడం ఏమి' తెలుసుకుందామని ఆకాశ మార్గాన పోతున్న పార్వతీ పరమేశ్వరులు రథాన్ని కిందికి దించినారు.

చీమమ్మ కష్టం విన్నాక, "చీమమ్మా ! నేరుగా చెరువు కట్టకు చేరుకో. చిన్న పిడకెత్తు, చిన్న రూక దొరుకుతుంది. పెద్ద పిడకెత్తు, పెద్ద రూక దొరుకుతుంది. పుట్టలో చేయి పెట్టు, పుట్టెడు వరహాలు దొరుకుతాయి. ఆకాశంలోకి ఎగజూడు, బండీ ఎద్దులు నేల పడతాయి" అని వరాలిచ్చింది పార్వతమ్మ.

చీమమ్మ నేరుగా చెరువు కట్టకు చేరుకునింది.

చిన్న పిడకెత్తింది, చిన్న రూక దొరికింది. పెద్ద పిడకెత్తింది, పెద్ద రూక దొరికింది. పుట్టలో చేయి పెట్టింది, పుట్టెడు వరహాలు దొరికినాయి.

ఆకాశంలోకి ఎగ చూసింది, బండీ ఎద్దులు నేల పడినాయి.

ఆ వరహాలన్నీ ఎత్తి బండిలో పోసుకుని ఇంటికి పోయింది చీమమ్మ.

"చెల్లీ చెల్లీ ! నీకీ వరహాలన్నీ ఎక్కడివి చెల్లీ !" అనడిగింది కాకమ్మ చీమమ్మను.

"చెరువు కట్ట కాడ – చిన్న పిడకెత్తినాను, చిన్న రూక దొరికింది. పెద్ద పిడకెత్తినాను, పెద్ద రూక దొరికింది. పుట్టలో చేయి పెట్టినాను, పుట్టెడు వరహాలు దొరికినాయి. ఆకాశంలోకి ఎగ చూసినాను, బండీ ఎద్దులు నేల పడినాయి." అని చెప్పింది చీమమ్మ.

కాకమ్మ నేరుగా చెరువు కట్టకు చేరుకుని, చిన్న పిడకెత్తింది – చిన్న తేలు కుట్టింది. పెద్ద పిడకెత్తింది, పెద్ద తేలు కుట్టింది. పుట్టలో చేయి పెట్టింది, పూడుబాము కరిచింది.

ఆకాశంలోకి ఎగ చూసింది, కండ్లూ కాళ్లూ పోయినాయి.

దేక్కుంటూ దేక్కుంటూ చీమమ్మ పంచన చేరింది కాకమ్మ.

'అయ్యో పాపం' అని చెప్పి అక్కకు చచ్చే కాలంలో అంత సంగటి పెడుతూ వచ్చింది చీమమ్మ.

## 1. పొలం పనులు

**పి**ల్లలూ! ఇవి పదాలు కాదు, పనులు! కొంచెం చూడండి, చేయండి :

మడక దున్నడం – కలుపు తీయడం – వరికోత కోయడం – పన కొట్టడం– బండి తోలడం.



వరినాట్లు

వూళ్ళల్లో వున్న పిల్లలకు ఇవన్నీ వెన్నతో పెట్టిన విద్య.

పట్టణాలలో వున్న పిల్లలకు చెప్పుకోవాలి కదా.

మడకను నాగలి అని కూడా అంటారు. వూళ్లకు వెళ్లినప్పుడు మడకను, కాడిమానును చూడండి. మడక కఱ్ఱును కూడా.

మేడి పట్టుకుని మీరు కూడా కాసేపు దున్నండి.

వరిపైరుకూ, కలుపుకూ వున్న తేడా గమనించండి. మన అత్తలు కలుపును ఎంత ఒడుపుగా పసిగట్టి పీకి పారేస్తారో చూడండి. పంట మొక్క కంటే ఏపుగా పెరిగిపోయి వున్న కలుపు మొక్కను పెరికి పారేయడం నేర్చుకోండి.

చేయి తెగకుండా ఎంత చక చకా రైతులు వరికోతలు కోస్తుంటారో చూడండి. మనం పెన్ పట్టుకుని ఎంత చక చకా రాస్తామో అంతకంటే జోరుగా కొడవలితో ఎట్లా కోస్తారో తెలుసుకుని నేను కూడా కోస్తాను అంటూ పొలంలోకి దిగండి.



వరి కోత

పొలం పనులు చెయ్యడం చాలా సంతోషాన్ని యిస్తుంది మీకు.

రాత్రి అమ్మ పక్కన పడుకుని ఈ కత చెప్పండి.

మీరు తెలివైన పిల్లలు కదా, వూహించండి. చీమమ్మ వరి పైరు గాకుండా చెరుకు తోట వేసిందనుకోండి, లేదా వేరుశెనగ వేసిందనుకోండి. అప్పుడు చీమమ్మ మాటలూ, కాకమ్మ మాటలూ ఎలా వుండేవో చెప్పుకోండి.

మీరు కాకమ్మ–చీమమ్మ కతను నాటికగా వేయండి. ఎట్లా వేయాలో కూడా మీకు చెప్పవలసిన పనిలేదు. మీరు నాటికగా వేయగలరు.

తరగతిలో ఇద్దరు పిల్లలు పైకి లేవండి. ఒకరు కాకమ్మ, ఒకరు చీమమ్మ.

చీమమ్మ ఇట్లా అంటుంది. 'నా పార్టీలో చేరే వాళ్లంతా చేరవచ్చు'.

అప్పుడు పిల్లలంతా చీమమ్మ పక్కన నిలబడి, "మేమంతా నీ పార్టీ" అనేస్తారు. చూశారా! మంచి వైపే అందరూ నిలబడతారు. చెడు వైపు ఒక్కరూ నిలబడరు.

# అన్నదానంలో వున్న మహిమ

ఒకూళ్లో ఒక బాపనాయన. ఆ బాపనాయన వూరంతా భిక్షం పెట్టించుకుని వస్తాడు, అంత వండుకుంటాడు, ఆ వండుకున్న దాంట్లో ఎవరినైనా పిలిచి వాళ్ల చేతుల్లో అంత పెడతాడు, తర్వాత ఆయన అంత తిని, కొడుక్కి అంత పెట్టి పడుకుని నిద్ర పోతాడు.

“నాయనా నాయనా! నువ్వే నాలుగిళ్లల్లో భిక్షం పెట్టించుకుని వస్తావే. దాంట్లో కూడా నువ్వు అన్నదానం చేసేది ఏమిటికి నాయినా!” అనడిగినాడు ఆ బాపనాయన కొడుకొకనాడు.


అందుకా బాపనాయన, “నాకు మాత్రం ఏమి తెలుసు నాయనా ! అన్న దానంలో వుండే మహిమ ఏందని బ్రహ్మ దేముణ్ణి పోయి అడుగు చెప్తాడు” అనేసి అన్నాడు.

అన్నదానంలో వుండే మహిమేందని అడిగేదానికి ఆ బాపనాయన కొడుకు బ్రహ్మ దేవుడి దగ్గరకు ప్రయాణమైనాడు.

మంచి అడవి మార్గం పట్టి పోయినాడు పోయినాడు పోయినాడు. చీకటి పడిపోయింది. ఆ అడవిలో గుడిసె వేసుకుని కాపురం వుండిన ఒక ఆలీ మొగుడు ఈ చిన్నవాణ్ణి చూసినారు.

“చూడ చక్కగా వుండావు. కోరగల్ల జంతువు, విషగల్ల జంతువు వుండే అడివిది. ఈ రాత్రికి మా దగ్గర వుండి తెల్లవారాక నీ దోవన నువ్వు పోదువులే నాయినా!” అనన్నాడు, మొగుడైన వాడు ఈ చిన్నవాడితో.

చిన్నవాడు సరేనని ఆ గుడిసెలో నిలిచినాడు. “ఏమే ఏమే! మనింటికి వచ్చిన ఈ చిన్నవాణ్ణి రాత్రికి పస్తులు పెట్టలేం గదా. నీ సంగటి ముద్దలో నువ్వు కొంచెం పెట్టు. నా సంగటి ముద్దలో నేను కొంచెం పెడతా” అనన్నాడు మొగుడు, పెళ్లాంతో.



"దోవన పోయేవాణ్ణి ఇంటికి పిలిచింది చాలక ఇదొక సంబడమా? అంతగా వుంటే నీ సంగటి ముద్దలో నువ్వు ఇచ్చుకో, నన్ను మాత్రం అడగొద్దు" అనింది ఆ పెళ్ళాం.

సరేనని చెప్పి మొగుడు ఆ చిన్నవాడికి సగం ముద్ద ఇచ్చినాడు.

ఆ అడవిలో ఆ ఆలీమొగుడు మృగాలకు భయపడి రాత్రిపూట పడుకునే దానికి ఒక మంచెను ఏర్పాటు చేసుకుని వుండినారు.

"ఏమే ఏమే! మంచె మీద నువ్వు కొంచెం చోటివ్వు, నేను కొంచెం చోటిస్తా. ఆ చిన్నవాణ్ణి మంచె మీద మనిద్దరి మధ్యా పడుకో బెట్టుకుందాం" అనన్నాడు ఆ మొగుడైన వాడు పెళ్లాంతో.

"దోవన పోయేవాణ్ణి ఇంటికి పిలిచింది చాలక ఇదొక సంబడమా? అంతగా వుంటే నీ చోటు నువ్వు ఇచ్చుకో. నన్ను మాత్రం అడగొద్దు" అనింది ఆ పెళ్లాం.

సరేనని చెప్పి మొగుడు ఆ చిన్నవాడికి సగం చోటు ఇచ్చి మంచె నడిమధ్య పడుకోబెట్టి ఆయన మాత్రం మంచె కడన పడుకున్నాడు. అలవాటు తప్పి నిద్దర్లో కింద పడి జంతువుకు ఆహారమై పోయినాడా మొగుడైన వాడు.

చిన్నవాడు నిద్ర లేచి మంచె దిగి మళ్లీ అడవి మార్గం పట్టి పోయినాడు పోయినాడు పోయినాడు.

'ఈ చిన్నవాడు ఇంక ఈ మాదిరిగా ఎంత దూరం పోతాడు పాపం' అని దయ దలచి బ్రహ్మ దేముడు ఆ చిన్నవాడికి ప్రత్యక్షమైనాడు.

"అన్నదానంలో వుండే మహిమేమి స్వామీ!" అనడిగినాడా చిన్నవాడు బ్రహ్మ దేముణ్ణి.

"అన్నదానంలో వుండే మహిమేదో చెప్పడానికి నావల్ల కూడా కాదు. నేరుగా అక్కడ కనిపించే ఆ రాజ్యానికి పో, ఆ రాజు పెళ్లాం నాలుగు నాళ్లల్లో ఒక మొగ బిడ్డను కంటుంది. ఆ మొగ బిడ్డను అడుగు" అన్నాడు బ్రహ్మదేముడు.

ఆ చిన్నవాడు నేరుగా ఆ రాజ్యానికి పోయినాడు. నాలుగు నాళ్లల్లో ఆ రాజు పెళ్లాం ఒక మొగ బిడ్డను కనింది.

"అన్నదానంలో వుండే మహిమేమి?" అనడిగినాడా చిన్నవాడు ఆ మొగబిడ్డను.

"అన్నదానంలో వుండే మహిమ చెప్పేదానికి నావల్లా కూడ కాదు. అక్కడొక దొమ్మరామె గుడిసె వుంది. ఆమెకొక కుంటి పంది వుంది. ఆ కుంటి పంది నాలుగు నాళ్లల్లో పది పిల్లల్ని ఈనుతుంది. వాటిల్లో తొమ్మిదో పిల్లను అడుగు చెప్తుంది" అన్నాడా మొగ బిడ్డ.

ఆ చిన్నవాడు నేరుగా ఆ దొమ్మరామె గుడిసెకు పోయినాడు. ఆ దొమ్మరామె కుంటి పంది నాలుగు నాళ్లల్లో పది పిల్లల్ని ఈనింది.

"అన్నదానంలో వుండే మహిమేమి?" అనడిగినాడా చిన్నవాడు తొమ్మిదో పంది పిల్లను.

"ముందు జన్మలో ఒక చిన్నవాడు అడివి మార్గాన పోతా వుంటే – నా మొగుడు ఆ చిన్నవాడికి తినడానికి అంత ముద్ద పెట్టినాడు, పడుకోవడానికి అంత చోటిచ్చినాడు. అంత అన్నదానం చేసినందుకు నా మొగుడు ఆ రాజు కడుపున మొగ బిడ్డగా పుట్టె! ఆ పని నేను చెయ్యక పోబట్టి ఈ కుంటి పంది కడుపున తొమ్మిదో పిల్లగా పుడితి! ఇంతకంటే అన్నదానంలో వుండే మహిమ ఏమీ లేదు నాయనా!" అని చెప్పిందా తొమ్మిదో పందిపిల్ల.

## 2. తిండి గింజలు

పస్తులు: వేళకు అన్నం తినక పోవడం. ఆకలి అయికూడా తినలేక పోవడం!

అమ్మ అలిగి పస్తు పడుకుంటే నాకు దుఃఖం వస్తుంది.

ప్రపంచంలో అందరూ వేళకు అన్నాలు తినేస్తూ వుండాలి. ఒక్కరు కూడా పస్తు లేకుంటే ఎంత బాగుంటుందో.

**సంగటి ముద్ద :** వుడికే వుడికే అన్నంలో రాగిపిండి పోసి కెలికి ముద్ద చేస్తే తయారయ్యేదే సంగటి ముద్ద. ఈ సంగటి ముద్దలను రాయలసీమ ప్రజలు ఇష్టంగా తింటారు. చక్కెర వ్యాధికి సంగటి ఎంతో మంచిది.

ఏదైనా ఒక కొట్టుకు వెళ్లి బియ్యం, రాగులు, గోధుమలు, జొన్నలు, కొర్రలు, సజ్జలు చూపించమనండి. తేడాలు మీకే తెలుస్తాయి. వూరికెళ్లినప్పుడు ఈ పైర్లన్నీ చూడండి.



జొన్న

వడ్ల గింజ లోపల ఏమి వుంటుంది? బియ్యపు గింజ వుంటుంది కదా. మరి, రాగి గింజ లోపల ఏమి వుంటుంది? రాగి గింజే వుంటుంది.

వడ్ల గింజలను రోట్లో పోసి దంచి దాన్ని అట్లాగే ఎసుట్లో పోసుకుని అన్నం వండలేము.

వడ్లగింజ మీద గట్టిగా పొట్టు వుంటుంది. ఆ పొట్టును శుభ్రంగా తీసి వేస్తేనే బియ్యం వచ్చేది. ఆ బియ్యాన్నే అన్నం వండుకుంటాం.

వడ్ల గింజల్ని రోట్లో పోసి దంచి ఆ పొట్టును చేటతో చెరిగి వేరు చేస్తే – అదే దంపుడు బియ్యం.

ఇట్లా రోట్లో పోసి దంచే వీలు లేనప్పుడు వడ్ల గింజలను మన నాన్న రైస్ మిల్లుకు తీసుకెళ్లుతాడు.

అక్కడ మిషనులో పోస్తే బియ్యం విడిగా, తవుడు విడిగా వస్తాయి.

పొట్టు నుంచి వచ్చేదే తవుడు. ఈ తవుడును కడుగు నీళ్లల్లో కలిపి పశువులకు పెడితే అవి ఎంతో ఇష్టంగా తింటాయి.

మీరొక రోజు ఎద్దులకు తవుడు పెట్టి చూడండి.

రాగుల్ని, సజ్జల్ని దంచితే పొట్టు వస్తుం దా? ఆ పొట్టును కూడా వేరు చేయాలా? అమ్మను అడిగి తెలుసుకోండి.

చేరడు కాగ పెట్టిన నెయ్యిలో రాగి పిండి కలపండి. తర్వాత కాస్తా చక్కెర కూడా వేసి పిసికి తినండి. ఏ చాక్లెట్టుకూ తీసిపోదు నేతి రాగిపిండి.



సజ్జ

# గువ్వచాతుర్యం

ఒక గువ్వ కంపలో గింజలేరుకుని తింటూ వుంటే ముక్కులో ముల్లిరిగి పోయింది.

ఆ దోవన మంగలాయన పోతా వుంటే, “మంగలాయనా మంగలాయనా! నా ముక్కులో ముల్లిరిగింది. కొంచెం తియ్యవా?” అనడిగింది.

“నేను రెడ్డికి తల పని చెయ్యను పోతా వుంటే నీ ముక్కులో ముల్లును నేనెందుకు తీస్తాను? నేను తియ్యను పో!” అన్నాడు మంగలాయన.

“అయితే రెడ్డితో చెప్పి నీకు మేర గింజలు ఎగరేయించేస్తాను చూడు” అనింది గువ్వ.

“నువ్వు రెడ్డితో చెప్పి మేర గింజలు ఎగరేయించిన కాలానికి చూద్దాం పో!” అన్నాడు మంగలాయన.

గువ్వ నేరుగా రెడ్డి దగ్గరకు పోయి, “రెడ్డీ రెడ్డీ! నా ముక్కులో ముల్లిరిగితే మంగలాయన తియ్యనన్నాడు. ఆ మంగలాయనకు నువ్వు మేర గింజలు ఎగరేసెయ్” అనింది.


“మా మంగలాయనకు నేనెందుకు మేర గింజలు ఎగరేస్తాను? నేను ఎగ రెయ్యను పో!” అన్నాడు రెడ్డి.

“అయితే కొంగల్తో చెప్పి నీ వరిమడిని తొక్కించేస్తాను చూడు” అనింది గువ్వ.

“నువ్వు కొంగల్తో చెప్పి వరి మడిని తొక్కించిన కాలానికి చూద్దాం పో!” అన్నాడు రెడ్డి.

గువ్వ నేరుగా కొంగల దగ్గరకు పోయి, “కొంగలారా కొంగలారా! నా ముక్కులో ముల్లిరిగితే మంగలాయన తియ్యనన్నాడు. ఆ మంగలాయనకు మేరగింజలు ఎగరెయ్య మంటే రెడ్డి ఎగరెయ్యనన్నాడు. ఆ రెడ్డి వరి మడిని మీరు తొక్కెయ్యండి” అనింది.

“మా రెడ్డి వరి మడిని మేమెందుకు తొక్కుతాం? మేం తొక్కం పో!” అన్నాయి కొంగలు.



"అయితే వేటగాడితో చెప్పి మిమ్మల్ని వలేసి పట్టించేస్తాను చూడండి" అనింది గువ్వ.

"నువ్వు వేటగాడితో చెప్పి మమ్మల్ని వలేసి పట్టించిన కాలానికి చూద్దాం పో" అన్నాయి కొంగలు.

గువ్వ నేరుగా వేటగాడి దగ్గరకు పోయి, "వేటగాడా వేటగాడా! నా ముక్కులో ముల్లిరిగితే మంగలాయన తియ్యనన్నాడు. ఆ మంగలాయనకు మేరగింజలు ఎగరేయమంటే రెడ్డి ఎగరెయ్యనన్నాడు. ఆ రెడ్డి వరిమడిని తొక్కమంటే కొంగలు తొక్కమన్నాయి. ఆ కొంగల్ని నువ్వు వలేసి పట్టెయ్!" అనింది.

"మా కొంగల్ని వలేసి నేనెందుకు పడతా? నేను పట్టను పో" అన్నాడు వేటగాడు.

"అయితే ఎలికతో చెప్పి నీ వలను కొరికించేస్తాను చూడు!" అనింది గువ్వ.

"నువ్వు ఎలికతో చెప్పి నా వలను కొరికించిన కాలానికి చూద్దాం పో" అన్నాడు వేటగాడు.

గువ్వ నేరుగా ఎలిక దగ్గరకు పోయి, "ఎలికా ఎలికా! నా ముక్కులో ముల్లిరిగితే మంగలాయన తియ్యనన్నాడు. ఆ మంగలాయనకు మేరగింజలు ఎగరేయమంటే రెడ్డి ఎగరెయ్యనన్నాడు. ఆ రెడ్డి వరిమడిని తొక్కమంటే కొంగలు తొక్కమన్నాయి. ఆ కొంగల్ని వలేసి పట్టమంటే వేటగాడు పట్టనన్నాడు. నువ్వు ఆ వేటగాడి వలను కొరికెయ్" అనింది.

"మా వేటగాడి వలను నేనెందుకు కొరికేస్తాను? నేను కొరకను పో"అనింది ఎలిక.

"అయితే పిల్లితో చెప్పి నిన్ను చంపించేస్తాను చూడు" అనింది గువ్వ.

"నువ్వు పిల్లితో చెప్పి నన్ను చంపించిన కాలానికి చూద్దాం పో" అనింది ఎలిక.

గువ్వ నేరుగా పిల్లి దగ్గరకు పోయి, "పిల్లీ పిల్లీ! నా ముక్కులో ముల్లిరిగితే మంగలాయన తియ్యనన్నాడు. ఆ మంగలాయనకు మేర గింజలు ఎగరేయమంటే రెడ్డి ఎగరెయ్యనన్నాడు. ఆ రెడ్డి వరిమడిని తొక్కమంటే కొంగలు తొక్కమన్నాయి. ఆ

కొంగల్ని వలేసి పట్టమంటే వేటగాడు పట్టనన్నాడు. ఆ వేటగాడి వలను కొరకమంటే ఎలిక కొరకననింది. ఆ ఎలికను పట్టేసి చంపెయ్" అనింది.

"మా ఎలికను నేనెందుకు పట్టి చంపేస్తా? నేను చంపను పో!" అనింది పిల్లి.

"అయితే అవ్వతో చెప్పి నీకు పెరుగూ కూడూ పెట్టనీకుండా చేస్తా చూడు" అనింది గువ్వ.

"నువ్వు అవ్వతో చెప్పి నాకు పెరుగూ కూడా పెట్టనీకుండా చేసిన కాలానికి చూద్దాం పో!" అనింది పిల్లి.

గువ్వ నేరుగా అవ్వ దగ్గరికి పోయి, "అవ్వా అవ్వా! నా ముక్కులో ముల్లిరిగితే మంగలాయన తియ్యనన్నాడు. ఆ మంగలాయనకు మేర గింజలు ఎగరేయమంటే రెడ్డి ఎగరెయ్యనన్నాడు. ఆ రెడ్డి వరి మడిని తొక్కమంటే కొంగలు తొక్కమన్నాయి. ఆ కొంగల్ని వలేసి పట్టమంటే వేటగాడు పట్టనన్నాడు. ఆ వేటగాడి వలను కొరకమంటే ఎలిక కొరకననింది. ఆ ఎలికని పట్టి చంపేయమంటే పిల్లి పట్టననింది. ఆ పిల్లికి నువ్వు పెరుగూ కూడూ పెట్టొద్దూ!" అనింది.

"మా పిల్లికి నేనెందుకు పెరుగూ కూడూ పెట్టను? నేను పెడతాను పో!" అనింది అవ్వ.

"అయితే తాత్తో చెప్పి నీ నడ్డి మీద దుడ్డు కట్టితో కొట్టిస్తాను చూడు" అనింది గువ్వ.

"నువ్వు తాత్తో చెప్పి నా నడ్డి మీద దుడ్డు కట్టితో కొట్టించిన కాలానికి చూద్దాం పో!" అనింది అవ్వ.

గువ్వ నేరుగా తాత దగ్గరకు పోయి, "తాతా తాతా! నా ముక్కులో ముల్లిరిగితే మంగలాయన తియ్యనన్నాడు. ఆ మంగలాయనకు మేర గింజలు ఎగరేయమంటే రెడ్డి ఎగరెయ్యనన్నాడు. ఆ రెడ్డి వరిమడిని తొక్కమంటే కొంగలు తొక్కమన్నాయి. ఆ కొంగల్ని వలేసి పట్టమంటే వేటగాడు పట్టనన్నాడు. ఆ వేటగాడి వలను కొరకమంటే ఎలిక కొరకననింది. ఆ ఎలికని పట్టి చంపేయమంటే పిల్లి పట్టననింది. ఆ పిల్లికి పెరుగూ కూడూ పెట్టొదంటే అవ్వ పెడతాననింది. ఆ అవ్వను నడ్డి మీద నీ దుడ్డు కట్టితో వొక్కటెయ్ తాతా!" అనింది.

తాత, "పిడికెడు గువ్వవి, నిన్ను ఇంతమంది ఇన్ని రకాలుగా ఏడిపించినారా పాపం!" అని చెప్పి అవ్వ నడ్డి మీద వొక్కటేసే దానికి దుడ్డు కట్టి చేతికి తీసుకున్నాడు.

అవ్వ బిత్తర పోయి పిల్లికి పెరుగూ కూడూ పెట్టనంది.

పిల్లి బిత్తర పోయి ఎలికను పట్టి చంపేసేదానికి బయలుదేరింది.

ఎలిక బిత్తర పోయి వేటగాడి వలను కొరికేసే దానికి పరిగెత్తింది.

వేటగాడు బిత్తర పోయి కొంగల్ని వలేసి పట్టేదానికి పోయినాడు.

కొంగలు బిత్తర పోయి రెడ్డి వరిమడిని తొక్కేదానికి పరుగులెత్తినాయి.

రెడ్డి బిత్తరపోయి మంగలాయనకు మేర గింజలు ఎగరేస్తానన్నాడు.

మంగలాయన బిత్తర పోయి గువ్వను ఒళ్లో పెట్టుకుని ముక్కులో విరిగిన ముల్లు తీసేసినాడు.

## 3. రెండు తాతలూ - ఒక మనవడూ!

గువ్వ అవ్వతో ఏమనెను?

అవ్వ గువ్వతో ఏమనెను? - ఇలాంటి ప్రశ్నలెన్నయినా సరే మీరు కళ్లు మూసుకుని సమాధానాలు చెప్పేస్తారు కదా. సరే.

ఈ కతల పుస్తకం చేతికి తీసుకోగానే మీరు ఎంతో ఇష్టంతో బొమ్మలు చూశారు గదా. మరి, మన కోసం ఇంత మంచి బొమ్మల్ని వేసిన తాత గురించి తెలుసుకోవద్దూ!



బాపూ తాత - రమణ తాత

ఈ బొమ్మల తాత పేరు బాపు. మనకు పెరుగూ కూడూ అంటే ఎంత ఇష్టమో ఈ తాతకు బొమ్మలు వెయ్యడం అంటే అంత ఇష్టం.

ఈ తాతకు ముళ్లపూడి వెంకటరమణ అని ఒక స్నేహితుడున్నాడు. ఆ ముళ్లపూడి వెంకటరమణ కూడా మనకు తాతే. ఈ ఇద్దరి తాతలకూ బుడుగు అని ఒక మనవడున్నాడు.

బుడుగు అంటే మన మాదిరే ఒక పిలకాయ. బలే పిలకాయ. ట్యూషను చెప్పే అయ్యవారి నెత్తి మీద కూడా గాఠిగా కొఠేస్తాడు. ఛ-దవడు. దేముడికి ఒక గుడి కట్టినట్టు ఈ తాతలిద్దరూ మన బుడుగు గాడికొక పుస్తకం కుట్టారు. పుస్తకం పేరు కూడా బుడుగే.

ముళ్లపూడి తాత బుడుగు కత చెప్తే బాపూ తాత బొమ్మలు చూపించాడు. ఈ బుడుగుతో కూడా సీగాన పెసూనాంబ అని ఒక చిన్నమ్మి ఎలికతోక అంత జడ పెట్టుకుని తమాషాగా వుంటుంది.

పండగకు కొత్త బట్టలు తీసివ్వమని మీరు అమ్మనీ, నాన్ననీ పోరుతారు కదా. ఈ సారి పండగకి బుడుగు పుస్తకం కొని పెట్టమని మారాం చెయ్యండి. అవి విశాలాంధ్ర వారి పుస్తకాల షాపుల్లో దొరుకుతాయి.

టపాసుల పండగకంతా మీరీ బుడుగును చదివేయాలి సుమా! ఇంకా ఈ తాతలిద్దరూ తీసిన సంపూర్ణ రామాయణం, ముత్యాలముగ్గు, మనవూరి పాండవులు, భక్తకన్నప్ప సినిమాలను కూడా వీలైనప్పుడల్లా టీవీలల్లో చూడండి.



# లొట్టిగాడు

ఒకూళ్లో ఒక లొట్టిగాడు. వాడికిద్దరు పెళ్లాలు.

ఒక రోజు లొట్టిగాడు మడిలో మడక దున్నుతూ వుంటే చిన్న పెళ్లాం మొగుడికి చద్దికూడు ఎత్తుకు పోయి,

"బావా బావా! చద్దికూడు తిందువురా బావా!" అని మూడు సార్లు మర్యాదగా పిలిచింది.

లొట్టిగాడు మర్యాదకు మనిషి గాదు. ఉలకలా పలకలా.

మర్యాదకిది కాలం కాదని చెప్పి,

"లొట్టిగా లొట్టిగా! చద్దికూడు తిందువు రారా!" అని పిలిచింది.

లొట్టిగాడు కోపానికి పోయి చిన్న పెళ్లాన్ని నరికేసినాడు.

మధ్యాహ్నం పెద్ద పెళ్లాం లొట్టిగాడికి సంగటి ఎత్తుకు పోయి,

"బావా! బావా! సంగటి తిందువురా బావా" అని మూడు సార్లు మర్యాదగా పిలిచింది.

లొట్టిగాడు మర్యాదకు మనిషి గాదు, ఉలకలా పలకలా.

మర్యాదకిది కాలం కాదని చెప్పి,


"లొట్టిగా లొట్టిగా! సంగటి తిందువు రారా!" అని పిలిచింది.

లొట్టిగాడు కోపానికి పోయి పెద్ద పెళ్లాన్ని కూడా నరికేసినాడు.

పెళ్లాలిద్దర్నీ నరికేసి పూడ్చి పెట్టినాడు గదా. ఆ గుంతల్లో నుంచి నాలుగు నాళ్లకు నాలుగు గోగు చెట్లు మొలిచినాయి.

ఆ చెట్లమీద కోపానికి పోయి లొట్టిగాడు ఆ గోగాకును పెరికి చట్టిలో వేసి వుడక బెట్టినాడు. ఆ గోగాకు వుడకతా వుడకతా,

"కుత కుతా లొట్టోడా
కుత కుతా లొట్టోడా" అనింది.



గోగాకుకు కూడా మనం అలుసై పోయామా అని చెప్పి ఆ వుడికే గోగాకును కుడితిలో పోసినాడు. ఎనుము ఆ గోగాకును తింటూ తింటూ,

"అంబా లొట్టోడా

అంబా లొట్టోడా" అనింది.

ఎనుముకు గూడా మనం అలుసై పోయామా, అని చెప్పి ఎనుమును నరికేసి దాని చర్మాన్ని చెప్పులు కుట్టే ఆయనకిచ్చినాడు. చెప్పులు కుట్టే ఆయన లొట్టిగాడికి చెప్పులు కుట్టించి ఇచ్చినాడు.

లొట్టిగాడు ఆ చెప్పులేసుకుని తిరగ్గానే ఆ చెప్పులు,

"కిర్ కిర్ లొట్టోడా

కిర్ కిర్ లొట్టోడా" అన్నాయి.

చెప్పుల గ్గూడా మనం అలుసై పోయామా అని చెప్పి ఆ చెప్పుల నెత్తుకుపోయి కుక్క ముందు వేసినాడు.

ఆ కుక్క ఆ చెప్పుల్ని కొరుక్కుని తింటూ తింటూ,

"భౌ భౌ లొట్టోడా

భౌ భౌ లొట్టోడా!" అనింది.

కుక్కకు గూడా మనం అలుసై పోయామా అని చెప్పి ఆ కుక్కను పట్టుకుని పోయి బావిలో వేసేసినాడు.

బావిలో నీళ్లు,

"బుడ బుడా లొట్టోడా

బుడ బుడా లొట్టోడా!" అన్నాయి.


బావిలో నీళ్లకు కూడా మనం అలుసై పోయామా అని చెప్పి నీళ్లను ఎగిసెగిసి తన్నేద్దామని గుభిళ్లుమని బావిలోకి దూకినాడు.

మునిగిపోయి చచ్చిపోయినాడు.

# 4. ఆంధ్రమాత గోంగూర

**జత చేయండి :**

| | |
|---|---|
| గోగాకు | కిర్‌కిర్ |
| ఎనుము | బుడ బుడా |
| చెప్పులు | భౌ భౌ |
| కుక్క | కుత కుతా |
| నీళ్లు | అంబా అంబా |



*గోగునారతో తాడుపేని అల్లిన నులక మంచం*

**చెప్పుకోండి, రాసుకోండి :**

1. లొట్టిగాడు గోగాకుని పెరికి ఏమి చేసినాడు?
2. లొట్టిగాడితో చెప్పులు ఏమన్నాయి?

మరి కొన్ని ప్రశ్నలు మీరే తయారు చేసుకుని చెప్పుకోండి. రాసుకోండి.

అమ్మను అడిగి గోంగూర పచ్చడి చేయించుకోండి. మన ఒంటికి గోంగూర చాలా మంచిది. శరీరానికి అవసరమైన 'ఇనుము' గోంగూరలో దండిగా వుంటుంది. మన ఆంధ్రులకు చాలా ఇష్టం గోంగూర. అందుకే 'ఆంధ్రమాత' అని ముద్దుగా పిలుచుకుంటాం.

ఈ కతలో లొట్టిగాడు వుడికే గోగాకును తీసుకు వెళ్లి కుడితి తొట్టెలో పోశాడు గదా.

ఒకరోజు ఆవును నీళ్లు తాపండి. అది మంచినీళ్లు ఇష్టంగా తాగుతుందో, కుడితి నీళ్లు ఇష్టంగా తాగుతుందో చూడండి.

మీకు తెలిసి చీటికీ మాటికీ కోప్పడి పోయే మావయ్య వున్నాడనుకోండి. మీరు ఆ మావయ్యకి ఈ లొట్టిగాడి కత తప్పకుండా చెప్పండి.

ఈ కత విన్నాక కూడా మీ మావయ్య మళ్లీ కోప్పడడం మానలేదనుకోండి.

'కోపం ఒంటికి మంచిది కాదు మావయ్యా! లొట్టిగాడి కత గుర్తు తెచ్చుకో!' అని చీటీలో రాసి మీ మావయ్య జేబులో పెట్టండి!

# అబ్బోడు

ఒక అవ్వ, ఆ అవ్వకొక కోడి. ఆ కోడి ఒకనాడు చిన్న గుడ్డు పెట్టింది. ఆ అవ్వ ఆ చిన్న గుడ్డును ఎత్తుకు పోయి చిన్న చట్టిలో పెట్టింది.

ఆ కోడి ఒకనాడు పెద్ద గుడ్డు పెట్టింది. అవ్వ ఆ పెద్ద గుడ్డును ఎత్తుకుపోయి పెద్ద చట్టిలో పెట్టింది.

ఆ పెద్ద గుడ్డులో నుంచి,

బారడు మీసంతో
మూరడు గడ్డంతో
బిత్తెడు మనిషి

బయటకు వచ్చి, "అవ్వా ఓ అవ్వా!" అన్నాడు.

"ఏమిరా అబ్బోడా!" అనడిగింది ఆ అవ్వ.

"అవ్వా అవ్వా! నా చేతికొక చిన్న కొడవలి ఇయ్యి!" అన్నాడా అబ్బోడు.

అవ్వ ఆ అబ్బోడి చేతికొక చిన్న కొడవలి ఇచ్చింది.

ఆ అబ్బోడు నేరుగా రాజు వరి మడి దగ్గరకు పోయి ఆ కొడవలితో అంతా కోసేసి, కోసినంత సేపట్లో పన కొట్టేసి ఏనుగెత్తు వడ్లరాశిని నిలబెట్టినాడు.

రాజు ఈ కథ తెలుసుకుని మడి దగ్గరకొచ్చి,"అబ్బోడా అబ్బోడా! నీ రెక్కల కష్టానికి మెచ్చినాను. నీ కేమి కావాలో అడుగు" అనడిగినాడు.


"నా రెండు చెవుల్లో ఎన్ని వడ్ల గింజలు పడతాయో అన్ని వడ్ల గింజల్ని పోసి పంపించు రాజా!" అన్నాడా అబ్బోడు.

"నీ చెవుల్లో మహా అయితే పిడికెడు గింజలు పట్టునా? అదేమి కోరికలే, ఇంకా ఏమైనా అడుగు అబ్బోడా!" అన్నాడు రాజు.

"నువ్వు నా చెవుల్లో వడ్లగింజల్ని పోసి – చూడు రాజా!" అన్నాడా అబ్బోడు.

ఆ రాజు ఆ అబ్బోడి చెవుల్లో వడ్ల గింజల్ని, పోసి – చూసును గదా –

ఏనుగెత్తు వడ్ల రాశిలో సగం పోస్తే ఆ అబ్బోడి ఎడమ చెవి సగం నిండింది. మిగతా సగం పోస్తే ఆ అబ్బోడి కుడి చెవి సగం నిండింది.



ఆ ఏనుగెత్తు వడ్ల రాశినీ రెండు చెవుల్లో పోసుకుని, "ఇంక నేను పోయి వస్తా రాజా!" అన్నాడా అబ్బోడు.

"పోయి రా అబ్బోడా!" అన్నాడు రాజు.

అబ్బోడు నేరుగా అవ్వ దగ్గరకు పోయి, "అవ్వా! అవ్వా! ఇంట్లో వుండే అడ్డదుడ్డాలన్నీ ఎత్తి శుభ్రంగా తోసి పెట్టవా!" అన్నాడు.

ఆ అవ్వ ఇంట్లో వుండే అడ్డదుడ్డాలన్నీ ఎత్తి శుభ్రంగా తోసి పెట్టింది.

ఆ అబ్బోడు ఇంట్లోకి వచ్చి మెడకాయని ఇట్ల వాల్చినాడు. ఎడమ చెవిలో వుండే వడ్లన్నీ రాశిగా పడినాయి. మెడకాయని అట్ల వాల్చినాడు. కుడి చెవిలో వుండే వడ్లన్నీ రాశిగా పడినాయి.

"అవ్వా ఓ అవ్వా! నాకొక పైసా ఇవ్వు" అన్నాడా అబ్బోడు.

అవ్వ ఆ అబ్బోడి చేతికొక పైసా ఇచ్చింది. ఆ పైసాకు తాళిబొట్టు కొనుక్కుని నేరుగా రాజు దగ్గరకు పోయి, "రాజా రాజా! నీ కూతుర్ని నాకిచ్చి పెండ్లి చెయ్" అన్నాడు.

"నీకంటే మించినోడు ఎవరు!" అని చెప్పి రాజు కూతుర్నిచ్చి ఆ అబ్బోడికి పెండ్లి చేసినాడు.

## 5. శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి

**మ**ంచి నీళ్ళు తాగినంత సుళువుగా ఈ ఖాళీలను మీరు పూర్తి చేయగలరు. చేయండి.

అబ్బోడి మీసం .......................

అబ్బోడి గడ్డం ........................

అబ్బోడు పుట్టగానే అవ్వ ....................చేతికి ఇచ్చింది.


వరిమడిని ................... తో కోస్తారు.

శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి అని గొప్ప కతలు రాసిన ఒక ముత్తాత మనకున్నాడు. ఆ ముత్తాత ఇప్పుడు లేక పోయినా ఆయన రాసిన కథలు మనకున్నాయి కాబట్టి ఆ



తాత వున్నట్టే కదా. ఆ తాత 'వడ్లగింజలు' అని ఒక కథ రాసినాడు. మీరు పెద్దయ్యాక ఆ కథను తప్పకుండా చదువుతారు కదూ!

ఒక చదరంగం బల్లను తీసుకోండి. చేటడు చింత గింజలు సంపాయించండి. ఈ ఆట ఆడండి. చదరంగంలో 64 గళ్లు వుంటాయి గదా. మొదటి గడిలో ఒక చింతగింజ, రెండో గడిలో 2, మూడో గడిలో 4, నాలుగో గడిలో 8, అయిదో గడిలో 16, ఆరో గడిలో 32 గింజల్ని... ఇట్లా గడి గడికీ గింజల్ని రెట్టింపు చేసి పెడుతూ పొండి. చేటడు గింజల్నీ ఎన్ని గళ్లలో పెట్టగలరో చూడండి.



ప్రతీ సంవత్సరం నవంబరు 14 మన నెహ్రూ తాత పుట్టిన రోజు వస్తుంది కదా. ఆ రోజు మీ నాన్నతో చెప్పి అబ్బోడి వేషం వేయించుకుని బడికి రండి. పిల్లలంతా ఎంతో సంతోషంతో మీ చుట్టూ మూగుతారు.

అప్పుడు మీరు చిన్న కొడవలి చేత పట్టి వరి మడిని కోసినట్టూ, పన కొట్టినట్టూ నటించండి. తమాషాగా వుంటుంది.

# పెంపెం

ఒక కోతి. ఆ కోతికి కాల్లో ముల్లిరిగింది. ఆ దోవన మంగలాయన పోతావుంటే,

"మంగలాయనా మంగలాయనా! నా కాల్లో ముల్లిరిగింది. దీన్ని కొంచెం పెరికి పారెయ్!" అనడిగింది.

మంగలాయన కోతి కాల్లో ముల్లును పెరికి పారేసినాడు.

"నాకు నా ముల్లిస్తావా,

నీ కత్తిస్తావా?" అని మొండికి కూర్చునింది కోతి.

పారేసిన ముల్లును ఎక్కణ్ణుంచి తెచ్చిచ్చేది?

మంగలాయన కోతికి కత్తిచ్చేసినాడు.

కోతి ఆ కత్తినెత్తుకు పోయి కట్టెలు కొట్టుకునే ఆయనకిచ్చింది. ఆయన కట్టెలు కొట్టుకుంటూ వుంటే ఆ కత్తి పళక్‌మని రెండుగా విరిగి పోయింది.

"నాకు నా కత్తిస్తావా

నీ కట్టెలిస్తావా?" అని మొండికి కూర్చునింది కోతి.

విరిగి పోయిన కత్తిని ఎక్కణ్ణుంచి తెచ్చిచ్చేది?

కట్టెలు కొట్టుకునే ఆయన కోతికి కట్టెలిచ్చేసినాడు.

కోతి ఆ కట్టెలనెత్తుకు పోయి, కాళ్లూ చేతులూ పొయ్యిలో పెట్టి దోసెలు పోసుకునే ఒక ముసలవ్వకిచ్చింది. ముసలవ్వ ఆ కట్టెల్ని పొయ్యిలో పెట్టి దోసెలు పోసేసింది.

"నాకు నా కట్టెలిస్తావా

నీ దోసెలిస్తావా?" అని మొండికి కూర్చునింది కోతి.

కాలి బూడిదై పోయిన కట్టెల్ని ఎక్కణ్ణుంచి తెచ్చిచ్చేది?

ముసలవ్వ కోతికి ఆ దోసెలిచ్చేసింది.

కోతి ఆ దోసెలెత్తుకు పోయి ఒక భిక్షగాడికిచ్చింది. ఆకలిగా వున్న భిక్షగాడు ఆ దోసెల్ని తినేసినాడు.



"నాకు నా దోసెలిస్తావా

నీ పిల్లనిస్తావా?" అని మొండికి కూర్చునింది కోతి.

తినేసిన దోసెలు ఎక్కణ్ణుంచి తెచ్చిచ్చేది?

భిక్షగాడు కోతికి పిల్లనిచ్చేసినాడు.

కోతి ఆ పిల్లనెత్తుకు పోయి దొమ్మరోళ్లకిచ్చింది. దొమ్మరోళ్ళు ఆ పిల్లకు గెడెక్కేది నేర్పిస్తూ వుంటే కింద పడి చచ్చి పోయింది.

"నాకు నా పిల్లనిస్తారా

మీ డోలు నిస్తారా?" అని మొండికి కూర్చునింది కోతి.

చచ్చి పోయిన పిల్లను ఎక్కణ్ణుంచి తెచ్చిచ్చేది?

దొమ్మరోళ్లు కోతికి ఆ డోలు ఇచ్చేసినారు.

కోతి ఆ డోలును మెడకు తగిలించుకుని ఒక మానెక్కి,

"ముల్లూ బాయ కత్తీవచ్చె డాం డాం డాం

కత్తీ బాయ కట్టెలూ వచ్చె డాం డాం డాం

కట్టెలూ బాయ దోసెలూ వచ్చె డాం డాం డాం

దోసెలూ బాయ పిల్లా వచ్చె డాం డాం డాం

పిల్లా బాయ డోలూ వచ్చె డాం డాం డాం" అని పాట పాడింది.

## 6. కోతి వుత్తరం

కోతి పాడిన పాట చాలా తమాషాగా వుంది కదూ! మరి. మనం తెలుసుకున్న పాటను నలుగురికీ చెప్పి నవ్వించాలి కదా.

కాబట్టి పోస్టాఫీసుకు వెళ్ళి ఒక కవరు కొనుక్కోండి. రాజమండ్రిలో మీ పిన్నమ్మ వుంది కదా. పిన్నమ్మ కూతురు చిట్టికి ఈ పాట తెలిస్తే సరదాగా పాడుకుంటుంది కదూ!

ఇంకేం! కాగితంలో ఆ జగమొండి కోతి కత అంతా రాయండి. కోతి పాటను మాత్రం పెద్ద అక్షరాలతో రాయండి. కాగితాన్ని కవరులో పెట్టి అంటించి అడ్రసు

చక్కగా రాయండి. పిన్‌కోడ్ నంబరును నాన్ననడిగి జాగ్రత్తగా రాయండేం. రాశారు కదూ! ఇక కవరును పోస్టు డబ్బాలో వేసేయండి.

నాలుగు రోజుల్లో మీ వుత్తరం మీ చెల్లాయికి చేరిపోతుంది లెండి.

మీరు మామిడి తోపులో స్నేహితుల్తో కోతి కొమ్మచ్చి ఆడుకుంటూ కోతి పాటను పాడుకోండి.

ఇంకా కావాలంటే చిన్న తమాషా చేయండి.

కోతిపాటలో డాం డాం బదులు కాంకాం, గాం గాం, చాంచాం, జాంజాం... ఇట్లా, తేలికపాటి హల్లులను దీర్ఘాలు తీస్తూ ఇష్టం వచ్చినట్టు పది రకాలుగా పాడుకుని నవ్వుకోండి.

మీరప్పుడప్పుడూ పెళ్ళిళ్లకు వెళ్తుంటారు కదా. అక్కడ డోలు మామయ్య లుంటారు. ఒక మావయ్యను అడిగి డోలు తీసుకుని డోలు వాయిస్తూ ఈ పాట పాడి పెళ్లి వాళ్లని భలేగా నవ్వించండి.

# ఎవరు బలశాలి!

**తూ**ర్పు దిక్కున ఒక బలశాలి వుండేవాడు. పడమర దిక్కున ఇంకొక బలశాలి వుండేవాడు.

ఒకనాడు తూర్పు దిక్కు బలశాలి, పడమర దిక్కు బలశాలిని ఓడించాలని చెప్పి వాళ్ల వూరు పోయినాడు.

"నా మొగుడు జుట్టుకు ఏడు బళ్లను ముడేసుకుని కట్టెలు కొట్టుకుని వచ్చేదానికి అడివికి పోయినాడు" అని చెప్పింది పడమర దిక్కు బలశాలి పెళ్లాం.

"తల వెంట్రుకలకు ఏడు బళ్లను ముడేసుకుని అడివికి పోయినాడా? చూద్దాం వాడి గొప్పతనం నా ముందు ఏ మాత్రమో!" అని చెప్పి తూర్పు దిక్కు బలశాలి అడివికి పోయి పడమర దిక్కు బలశాలిని తొడ తట్టి కొట్లాటకు పిలిచినాడు.

"ఈ అడివిలో మనిద్దరం కొట్టుకుంటే గెలిచిందెవరో ఓడిందెవరో చెప్పేదెవరు? మన కంటికి మూడో మనిషి కనిపించినాక కొట్లాటకు దిగదాం పద" అని ఒక వూరి మార్గం పట్టినారు ఆ ఇద్దరు బలశాలులూ.

ఏడు దుత్తలను నెత్తిన పెట్టుకుని ఒకామె చద్దికూడు ఎత్తుకు పోతూ వీళ్లకి కనిపించింది.

"అమ్మా అమ్మా! నువ్వు కొంచెం నిలబడి చూడు, మేం కొట్టుకుంటాం. ఎవరు గెలిచినారో చెప్పు" అనడిగినారు బలశాలులిద్దరూ.

"అయ్యలారా అయ్యలారా! నా మొగుడు ఎద్దుల్ని మేపుతూ చేనులో వున్నాడు. ఆయన ముందే కోపగల్లోడు. నేను వేళకు ఆయనకు చద్దికూడు పెట్టాలి. నేను నిలబడ లేను. మీకు సమ్మతమైతే మీ ఇద్దరూ చెరొక బుజం మీద ఎక్కి కొట్టుకుంటూ వుండండి. నా దోవన నేను పోతూ వుంటా" అనింది.

ఆ వీరులిద్దరూ ఇంక చేసేది లేక ఆమె భుజాల మీద ఎక్కి యుద్ధం చేసేదానికి మొదలయ్యారు.

ఆమె వీరుళ్లతో, ఏడు దుత్తలతో వస్తుండే సరికి ఆమె మొగుడు, 'నిన్న రెండు దెబ్బలు కొట్టాం గదా, ఆ కోపంతో మన పెళ్లాం మన మీదికి కొట్లాటకు వస్తా వుంది



గదరా స్వామీ!' అని బిత్తర పోయి, భుజాన వుండిన కంబళి పరచి ఆయన మేపుతూ వుండిన నూరు ఎద్దుల్నీ దాంట్లోకి తోలి, వాటిని మూట గట్టుకుని భుజాన పెట్టుకుని పరిగెత్తుతూ పోయి ఒక మర్రిచెట్టు ఎక్కేసినాడు.

తిరుపతి నుంచి ఒక ముసల్ది ఆ దోవన వస్తూ వస్తూ ఒళ్లు అలిసి పోయి ఆ చెట్టు కింద అప్పుడనగా నడుము వాల్చింది. నూరు ఎద్దుల్ని కంబట్లో కట్టుకుని కొమ్మ మీది కెక్కేసరికి ఆ కొమ్మ ఫర్రీకి వొంగి పోతూ వుంటే ఆ చెట్టుకింద ముసల్ది ఆ కొమ్మను కింద పడనీకుండా తల వెంట్రుక వొకటి పెరికి ఆనించింది.

ఇదంతా చూసి బుద్ధి వచ్చిన బలశాలురు భుజాల మీద నుంచి దిగి, "అమ్మా తల్లీ! మా కంటే నువ్వు బలశాలివి. నీకంటే నీ మొగుడు బలశాలి. నీ మొగుడి కంటే ఆ ముసల్ది బలశాలి. ఇంక మేం వస్తాం" అని అదే పోతా.

# 7. ఈత నేర్చుకోండి

ఎండా కాలం సెలవుల్లో పట్టణం నుంచి ఒక అబ్బాయి మీ పల్లెకి వచ్చి, "మా స్కూల్‌లో నాది ఫస్ట్ ర్యాంకు నీదెన్నో ర్యాంకు?" అని బడాయి చూపిస్తున్నాడనుకోండి.

ఆ అబ్బాయికి ఈ కత చెప్పి వూరుకోండి. అర్థమైతే అవుతుంది లేకపోతే లేదు!

ఈ పనులు చేయండి.

ఎండా కాలంలో మట్టితో తయారు చేసిన దుత్తలో మజ్జిగ పోసుకుని వుల్లిపాయ నంజుకుంటూ తాగండి.

మీ నాన్నను దగ్గర పెట్టుకుని సొరకాయ బుర్ర నడుముకు కట్టుకుని బావిలోకి దూకి ఈత నేర్చుకోండి.

నాలుగు కానగాకులను పెరికి మొలతాడు చుట్టూ ఉదయం దోపుకుని సాయంకాలం తీసి చూడండి.

మామిడి తోపులో ఒక కోయిల 'కుహూ' అనిందనుకోండి. మీరు పోటీకి దిగి 'కుహూ కుహూ' అనండి. అది అలానే అంటూ వుంటే మీరు కూడా అలా అంటూనే వుండండి. మీరే గెలవాలి సుమా!

# ఆలీ - మొగుడు

ఒక ఆలీ మొగుడు. ఆ ఆలీ మొగుడికి తిట్టుకునే దానికీ, కొట్టుకునే దానికీ రేయింబవళ్లూ చాలేవి గాదు.

ఒకనాడు ఆ ఆలీ మొగుడు అంత పిండిని సంపాయించి రొట్టెలు కాలిస్తే – అవి అయిదయ్యాయి.

"నాకు మూడు

నీకు రెండు"

"నాకు మూడు

"నీకు రెండు" అని ఆ ఆలీ మొగుడు తగరారుకు దిగినారు.

ఎంత సేపటికీ తగరారు తెగలేదు. కడకు వాళ్లొక తీర్మానం చేసుకున్నారు.

"మన ఇద్దరిలో కదలకుండా మెదలకుండా ఎవరైతే పడుకుంటారో వాళ్లకు మూడు రొట్టెలు!"

ఇద్దరూ పడుకున్నారు. కదల్లేదు మెదల్లేదు. తెల్లవారి పోయింది. అయినా ఆ ఆలీ మొగుడు కదల్లేదు మెదల్లేదు.

"ఏమబ్బా రాత్రనగా పడుకున్నోళ్ళు ఇంకా నిద్ర పడక లేవ లేదే!" అని చెప్పి ఇరుగమ్మా పొరుగమ్మా చేరి చూసినారు.

"అయ్యో అయ్యో! బిడ్డాపాప కూడా లేరే! వీళ్లకు చచ్చి పోవాల్సిన కర్మ ఏమి పట్టింది?" అని బాధ పడి ఏడ్చినారు.

వూళ్లో వాళ్లు పాడె కట్టినారు. ఆ ఆలీ మొగుణ్ణి చెరొక పాడె మీద పెట్టి స్మశానికి చేర్చినారు. రెండు గుంతలు తవ్వినారు. చెరొక గుంతలో పెట్టి ఇంక మట్టి పోస్తారనగా,

"నాకు మూడు

నీకు రెండు" అని అరుస్తూ ఆ ఆలీ మొగుడు పైకి లేచినారు.



"అమ్మో అమ్మో! ఈ ఆలీ మొగుడు దెయ్యాలై పోయినారు. నాకు మూడు నీకు రెండు అని జనాలను తినే దానికి పంపకాలేసుకుంటున్నారు" అని బిత్తర పోయి వూళ్లో వాళ్లు పరుగులెత్తుకున్నారు.

"నాకు మూడు

నీకు రెండు" అంటూ ఇంకా ఆ బుద్ధిలేని ఆలీ మొగుడు రొట్టెల కోసం కొట్టుకుంటూనే వున్నారు.

# 8. అమ్మకి జేజే!

పుస్తకం ముందర పెట్టుకుని ఒకసారి చదివేసిన తర్వాత రెండోసారి పుస్తకం చూడకుండా కళ్లు మూసుకుని ఈ కత చదవండి.

కళ్లు మూసుకుని కూడా నేను పుస్తకం చదవగలను అని అమ్మతో పందెం వేసుకోండి. ఈ కత కాకపోతే ఇంకో కత. అప్పుడు మీ అమ్మ భలేగా నవ్వి మీ తలకాయ చుట్టూ చేతులు తిప్పి దిష్టి తగలకుండా మెటికలు విరుస్తుంది.

మీ అమ్మ మీకు చిట్టుడుకు నీళ్లతో స్నానం చేసి పెరుగూ కూడూ తినిపిస్తుంది.

ఒకరోజు, అమ్మానాన్నా మాటలాడుకునే మాటలన్నీ నోటు పుస్తకంలో రాసి వాళ్లకు చూపించండి.

ఇంకో రోజు – అమ్మ నీతో మాట్లాడిన మాటలన్నీ రాసి పెట్టుకో.

రాసేటప్పుడు మీ అమ్మ ఎట్లా మాట్లాడుతుందో గుర్తు తెచ్చుకుని ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ రాయండి.

ఎంత సులభంగా మాట్లాడేస్తామో అంత సులభంగా రాయడం నేర్చుకోండి.

మీరు మీ అమ్మతో కలిసి అప్పుడప్పుడూ పనిచేస్తూ వుండాలి. పని అంటే పొలం పనే కానవసరం లేదు. అమ్మ కత్తిపీట ముందేసుకొని వంకాయలు కోస్తూ వుంటే ఒక్కొక్క కాయా అందించండి. మొత్తానికి మీరు అమ్మతో కలసి పనిచేస్తూ వుండాలి.

# పాపిష్టి పిల్లి

ఒక కొంగ, ఒక కాకి, ఒక పిచ్చిక. ఈ మూటికీ భలే సావాసం. ఈ మూడూ ఒక చెట్టు మీద ముంతంత ఇండ్లు మూడు కట్టుకుని వుంటే పిల్లి చెట్టు కింద పిడకలింట్లో కాపరం వుండింది.

ఒక రాత్రిపూట వాన తిప్పించి మల్లించి కొట్టింది. ఈ వానకు పిల్లి పిడకలిల్లు కొట్టుకుని పోయింది.

నడి జాముకాడ పిల్లి వణుకుతూ వణుకుతూ చెట్టు మీదికొచ్చి "కొంగమ్మా కొంగమ్మా! వానకు నా పిడకలిల్లు కొట్టుకొని పోయింది. ఆ వానలో తడిసి చలీ జ్వరంగా వుంది. కొంచెం సేపు నీ ఇంట్లో నాకు తావిస్తావా" అనడిగింది కొంగమ్మను.

కొంగమ్మ ఆ ముంతంత ఇంట్లో నుంచి బయట కొచ్చి కొమ్మ మీద కూర్చుని పిల్లికి చోటిచ్చింది.


కొద్దిసేపటికి పిల్లి పటక్ పటక్ మని ఏదో కొరుక్కు తినడం విని కొంగ బిత్తర పోయి, "పిల్లి బావా పిల్లి బావా! ఇంత రాత్రి పూట పటక్ పటక్‌మని కొరుక్కు తింటున్నావు ఏంది బావా! నడిరాత్రి కాడ మేత ఏమి దొరికింది స్వామీ!" అనడిగింది.

దీనికి పిల్లి, "మా అత్తగారు నిన్ననే మురుకులు కాల్చి పంపించినారు. ఈ చలికి వాటిని నాలుగు తెచ్చుకుని కొరుక్కుంటున్నాను కొంగమ్మా!" అనింది.

ఎప్పుడు తెల్లవారిందో, పిల్లి బావ ఎప్పుడు పోయిందో తెలవదు.

కొంగమ్మ ముంతంత ఇంట్లోకి పోయి చూసును గదా – ఒక్క గుడ్డు కూడా లేదు!

"పిల్లి ఎంత పని చేసిందో చూసితిరా!" అని జరిగిందంతా కాకికీ, పిచ్చిక్కీ చెప్పి వాటిని తోడుకొని న్యాయం అడిగే దానికి కొంగమ్మ ఆ వూరి రెడ్డి దగ్గరకు పోయింది.



రెడ్డి పిల్లిని పిలిపించి అడిగితే, "నేను కడుపుకు తినేది కూడా? పేడా? అట్లా పాపం పనులు నేను చేస్తానా? కొంగమ్మ గుడ్లు కాకో, పిచ్చికో తినేసి ఆ తప్పు నా మీద తోస్తున్నాయి" అని అడ్డం తిరిగేసింది.

రెడ్డి, "పిల్లిబావా పిల్లిబావా! నీకు దేముడంటే భయమూ భక్తీ వున్నాయా?" అనడిగినాడు.

"దేముడంటే నాకెందుకు భయమూ భక్తీ లేవు? నిద్ర పడక లేవగానే మొహాన బొట్టు పెట్టుకోందే నేను గడపే దిగను" అనింది పిల్లి.

"అయితే మీరంతా మన వూరి చెరువులో దిగి –

నేనెరుగ నేనెరుగ కొంగమ్మ గుడ్లు

తేలించు గంగమ్మ తేలించు! అని పాడుకుంటూ ఈ పక్క మునిగి ఆ పక్క తేలండి. ఎవరైతే మునిగి చస్తారో వాళ్లే కొంగమ్మ గుడ్లు తిన్న పాపాత్ములు!" అని చెప్పినాడు రెడ్డి.

"నేనెరుగ నేనెరుగ కొంగమ్మ గుడ్లు

తేలించు గంగమ్మ తేలించు" అని పాడుకుంటూ కాకి ఈ పక్క మునిగి ఆ పక్క తేలింది.

"నేనెరుగ నేనెరుగ కొంగమ్మ గుడ్లు

తేలించు గంగమ్మ తేలించు" అని పాడుకుంటూ ఈ పక్క మునిగి ఆ పక్క తేలింది పిచ్చిక.

"నేనెరుగ నేనెరుగ కొంగమ్మ గుడ్లు

తేలించు గంగమ్మ తేలించు" అని పాడుకుంటూ ఈ పక్క మునిగిందో లేదో పిల్లి ఆ పక్క తేలకుండానే చచ్చిపోయింది.

## 9. చల్లకుండ

**ఆ**వు పేడతో, ఎనుము పేడతో పిడకల్ని ఎట్లా చేస్తారో చూడండి. మీరు కూడా చేయండి.

ఒకరోజు గ్యాస్ స్టవ్ మీద అల్యూమినియం పాత్రలో పాలు కాయండి. పెరుగు తినండి. మజ్జిగ తాగండి.

ఒకరోజు మట్టి కుండలో పాలుపోసి ఆ కుండను మట్టి పొయ్యి మీద పెట్టి పొయ్యిలో పిడకలు వేసి పాలు కాచండి. అప్పుడు తయారైన పెరుగు తినండి. మజ్జిగ తాగండి.

ఏది కమ్మగా వుంటుందో కనిపించిన వాళ్లకంతా చెప్పండి.

మీ వూళ్లో వున్న బయోగ్యాస్ యూనిట్‌ను చూడండి.

నాట్లు వేసిన వరి మడిలోకి పురుగుల్ని ఏరుకుని తినడానికి కొంగలు వచ్చి వాలుతుంటాయి. మరి లేత పైరును కొంగలు తొక్కేస్తే ఎలా? మీరేం చేస్తారంటే, ఒక ఖాళీ కిరసనాయిలు డబ్బా, చిన్న కర్రా తీసుకుని వరిమడి దగ్గరకు వెళ్లండి. కర్రతో దబదబా డబ్బాను కొట్టండి.

పొద్దు తిరుగుడు పూల మీద వాలిన గువ్వలు అరిస్తే పోవు. ఒక మిరపకాయ టపాసు కాల్చి చూడు.

పొద్దు తిరుగుడు పువ్వు మీద వాలిన గువ్వను బొమ్మగా గియ్యాలని వుంటే గీయి.

# అవ్వ-పొటేలు

ఒక అవ్వకొక పొటేలు.

ఒకనాడు ఆ పొటేలు అవ్వతో, "అవ్వా అవ్వా! ఇప్పుడు నేను బక్కగా వున్నాను. నన్ను అడివికి పంపించు.

వెదురు కోనకు పోయి వెదురాకు మేస్తా
చేమ కోనకు పోయి చేమాకు మేస్తా
ఆవుల చెరువుకు పోయి నీళ్లు తాగతా
సందిట్లావున బలిసి పోయి వస్తా!

అప్పుడు నువ్వు నన్ను అమ్ముకుంటే దండిగా రూపాయలొస్తాయి. కోసుకుంటే దండిగా కూరవుతుంది" అని చెప్పింది.

అవ్వ సరే అని చెప్పి ఆ పొటేలును అడివికి పంపించింది.

ఆ పొటేలు అడివిలోకి పోగానే పొట్టి నక్క అడ్డగించుకుని, 'నిన్ను తినాల కావాల!' అనింది.

పొటేలు ఆ పొట్టి నక్కతో, "నేనిప్పుడు బక్కగా వున్నాను. అర్ధాకలి కూడా నీకు తీరదు. నన్ను అడవిలోకి పంపించు.


వెదురు కోనకు పోయి వెదురాకు మేస్తా
చేమకోనకు పోయి చేమాకు మేస్తా
ఆవుల చెరువుకు పోయి నీళ్లు తాగతా
సందిట్లావున బలిసిపోయి వస్తా!

అప్పుడు కడుపు నిండికి తిందువులే!" అనింది.

పొట్టి నక్క ఆ పొటేలు మాట విని దోవ వొదిలింది.

ఇంకొంచెం దూరం పోగానే తోడేలు ఆ పొటేలును అడ్డగించి, 'నిన్ను తినాల కావాల' అనింది.

పొటేలు ఆ తోడేలుతో, "నేనిప్పుడు బక్కగా వున్నాను. అర్ధాకలి కూడా నీకు తీరదు. నన్ను అడివిలోకి పంపించు.



వెదురు కోనకు పోయి వెదురాకు మేస్తా
చేమకోనకు పోయి చేమాకు మేస్తా
ఆవుల చెరువుకు పోయి నీళ్లు తాగతా
సందిట్లావున బలిసి పోయి వస్తా!
అపుడు, కడుపు నిండా తిందువులే!" అనింది.

తోడేలు ఆ పొటేలు మాట విని దోవ వొదిలింది.

ఇంకొంచెం దూరం పోగానే పులి, 'నిన్ను తినాల కావాల' అని ఆ పొటేలును అడ్డగించింది.

పొటేలు ఆ పులితో, "నేనిపుడు బక్కగా వున్నాను. అర్ధాకలి కూడా నీకు తీరదు. నన్ను అడవిలోకి పంపించు,

వెదురు కోనకు పోయి వెదురాకు మేస్తా
చేమ కోనకు పోయి చేమాకు మేస్తా
ఆవుల చెరువుకు పోయి నీళ్లు తాగతా
సందిట్లావున బలిసి పోయి వస్తా!
అప్పుడు కడుపు నిండా తిందువులే!" అనింది.

పులి ఆ పొటేలు మాట విని దోవ వొదిలింది. పొటేలు నేరుగా,

వెదురు కోనకు పోయి వెదురాకు మేసింది. చేమ కోనకు పోయి చేమాకు మేసింది. ఆవుల చెరువుకు పోయి నీళ్లు తాగింది. సందిట్లావున బలిసి పోయింది.

'దేముడా! నన్ను భద్రంగా మా అవ్వ దగ్గిరికి చేర్చు'. అనుకోగానే ఆ పొటేలుకు ఒక పెద్ద సొరకాయ కనిపించింది. ఆ సొరకాయ బుర్రలోకి దూరుకుని మూత వేసుకుని దొర్లుకుంటూ దొర్లుకుంటూ వూరి మార్గం పట్టింది.

పులి దొర్లుకుంటూ దొర్లుకుంటూ వస్తుండిన ఆ సొరకాయని చూసి, "సొరకాయా సొరకాయా! అడివిలో ఎక్కడైనా పొటేలు కనిపించిందా?" అనడిగింది.

"వెదురు కోనలో వెదురాకు మేస్తా కనిపించింది" అని చెప్పింది సొరకాయ.

దొర్లుకుంటూ దొర్లుకుంటూ వస్తుండిన ఆ సొరకాయను చూసి తోడేలు, "సొరకాయా సొరకాయా! అడివిలో ఎక్కడైనా పొటేలు కనిపించిందా?" అనడిగింది.

"చేమకోనలో చేమాకు మేస్తా కనిపించింది" అని చెప్పింది సొరకాయ.

దొర్లుకుంటూ దొర్లుకుంటూ వస్తుండిన ఆ సొరకాయని చూసి పొట్టి నక్క "సొరకాయా సొరకాయా! అడివిలో ఎక్కడైనా పొటేలు కనిపించిందా?" అనడిగింది.

"ఆవుల చెరువులో నీళ్లు తాగుతూ కనిపించింది" అని చెప్పిందా సొరకాయ.

వూరు దగ్గరకు రాగానే బుర్రలో నుంచి బయటికొచ్చి అవ్వ ముందర నిలబడింది పొటేలు. "అవ్వా అవ్వా! ఇంక నన్ను అమ్ముకుంటావో కోసుకుంటావో నీ ఇష్టం!" అనింది పొటేలు.

"నిన్ను అమ్మనూ అమ్మను. కొయ్యనూ కొయ్యను. నేను బతికినంత కాలం నాతోనే నువ్వు!" అనింది అవ్వ.

# 10. ఆడుకోండి

**వూ**రి బయట చేమ తోటకు వెళ్లి చేమాకు కోసుకుని రండి. వెదురు పొద దగ్గరకు వెళ్లి వెదురాకు తెండి. మీ పొటేలు పిల్లకు కానీ, మేక పిల్లకు కానీ పెట్టండి. అవి తింటాయో తినవో చూడండి.

మనం మన అమ్మ కడుపులో తొమ్మిది నెలలు వున్నాం కదా. మరి, పొటేలు పిల్ల గొర్రె కడుపులో ఎన్ని నెలలు వుంటుందో అడిగి తెలుసుకోండి. మేక పిల్ల మేక కడుపులో ఎన్ని నెలలు ఉంటుందో కూడా తెలుసుకోండి.

పొటేలు పిల్లతో, మేక పిల్లతోనే కాకుండా గాడిద పిల్లతో కూడా ఆడుకోండి. గాడిద పిల్ల చాలా ముద్దుగా వుంటుంది.

# పిల్లల్తో
# మాట్లాడాల్సిన మాటలు ...



# పిల్లల్తో మాట్లాడాల్సిన మాటలు

**పి**ల్లలతో తల్లిదండ్రులు గానీ, టీచర్లు గానీ ఏం మాట్లాడుతుంటారో ముందుగా చూద్దాం.

ఉదాహరణకు ఇండ్లకు బంధువులు గానీ, స్నేహితులు గానీ వస్తే, "చేతులు జోడించి నమస్తే చెప్పమ్మా!" అని బలవంతం చేస్తుంటాం. వాళ్లు వెళ్లేటప్పుడు పిల్లల చేతుల్లో ఏమైనా పెడితే, పిల్లలు అమాయకంగా చేతులు చాచేస్తుంటే, "అలా తీసుకోవడం తప్పు" అని కసురుతుంటాం.

పిల్లవాడు ఎప్పుడైనా నోరు చవి చెడిపోయి ఒక బూతు మాట అంటే పిర్ర మీద రెండు వాయించి "భడవా! ఇవెక్కడ నేర్చావ"ని బూతులు తిడతాం.

ఇంకా ఎవరైనా పిల్లలు దయాదాక్షిణ్యాలకు పోయి అడుక్కు తినే వాళ్ల చేతుల్లో రూపాయి బిళ్ల పెట్టేస్తే, ఆ రూపాయి ఎంత కష్టపడితే వొచ్చిందో తెలుసా? అని ఉపన్యాసాలకు తగులుకుని పిల్లల్ని పీనాశం పట్టేవాళ్లుగా మార్చి పెట్టేస్తాం. ఇట్లాంటివి సవాలక్ష. కింద నేలమిండ ఎట్ల పడితే అట్లా కూర్చునే పిల్లల్ని, "సరిగా కూర్చునేది కూడా నేర్చవా?" అని ఏదో నేర్పించబోతాం.

15 ఏళ్ల లోపు పిల్లలతో తల్లిదండ్రుల కంటే కూడా టీచర్లు ఎక్కువగా మాట్లాడుతుంటారు. ముఖ్యంగా ప్రేయరు హాలు దాటుకుని క్లాసు రూంకి వెళ్లే లోపలే ఏవేవో మాటలు!

ముందుగా ప్రేయరు పరిస్థితి చూద్దాము.

పిల్లవాడు ఇంటి నుంచి వెళ్లిన వెంటనే ముందుగా ప్రేయరు హాలుని ఎదుర్కోవాలి.

నేను నా పుస్తకాల పనిమీద కొన్ని వందల స్కూళ్లకు వెళ్లాను. ప్రేయర్ హాళ్లు ఎంత నరకంగా వుంటాయో మనకు అర్థం కావాలంటే మనం చదివిన నాటి ప్రేయరు హాళ్లనైనా తలచుకోవాలి, లేదా ఇప్పుడైనా ఓ డజను స్కూళ్ల ప్రేయరు హాళ్ల పరిస్థితినైనా చూడాలి.

వేలాదిగా వున్న ఇంగ్లీషు మీడియం స్కూళ్లలో అయితే ఒక లీడరును స్టేజీ ఎక్కించి ఆరోజు వచ్చిన Hindu పత్రిక Head Lines 1st page లో వున్నవన్నీ దాదాపుగా చదివి వినిపింప చేస్తారు. అవేవో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకూ చదివే పిల్లలకే గాదు పదో తరగతి చదివే పిల్లలకూ అర్థం కాకపోయినా నోర్మూసుకుని పెళపెళార్భాటాలతో కాసే ఎండలో నిలబడుకుని భరించాల్సిందే. (ప్రేయర్ హాలు అంటే దాదాపు తొంభై శాతం స్కూళ్ళల్లో ఎండలు కాసే బీళ్లే!)

ప్రేయరు హాల్లో దాదాపు ప్రతిరోజూ – ఆరోజు పుట్టిన రోజు కలిగిన వాళ్లు ఇద్దరినో ముగ్గురినో స్టేజీ ఎక్కిస్తారు. కరస్పాండెంటో, ఆ స్కూలు హెడ్ మాస్టరో ఎవరో ఒకరు వాళ్లిచ్చే చాక్లెట్లు అందుకుని, వాళ్ల బుగ్గలు గిల్లి 'హ్యాపీ బర్త్‌డే టూ యూ' అని చప్పట్లు కొడతారు. పిల్లలంతా గొంతు కలిపి చేతులు పగిలేలా చప్పట్లు కొట్టాలి.

ఇంక టర్మ్ ఫీజుల గొడవ. అవి కట్టని పిల్లవాళ్లని వుద్దేశించి, "స్కూలు నడవాలంటే ఫీజులు very important. ఎన్నిసార్లు అడిగినా మీరు ఇంట్లో చెప్పరు. మీ తల్లిదండ్రులకైతే ఆ ధ్యాసే వుండదు. ఈ పేర్లగల వాళ్లకంతా టైమ్ దాటిపోయింది కాబట్టి పనిష్మెంట్‌గా అరగంట నిలబడండి. రేపైనా దీన్ని గుర్తు పెట్టుకుని ఇంట్లో మీ పేరంట్స్‌ని అడగండి" – ఇట్లా ఏదో ఒక గొడవ.

ఇంకా నాలుగు మంచి మాటలు మాట్లాడడంలో భాగంగా, "పిల్లలు చాలా దొంగలై పోతున్నారు. ఒకరి బ్యాగుల్లో నుంచి ఒకరు పెన్నులూ, పెన్సిళ్లూ, చాక్లెట్లూ దొంగిలిస్తున్నట్టుగా మాకు కంప్లైయింట్లు వస్తున్నాయి. మీకు moral వాల్యూస్ లేకుండా పోతున్నాయి. దొంగతనం తప్పని కూడా చదువుకునే పిల్లలకు చెప్పాలా?" అని మందలింపులు.

ఒకటి కాదు రెండు కాదు. ఇలాంటివి కూడా సవాలక్షనే.

పిల్లలు ఇంగ్లీషులోనే మాట్లాడుకోవాలనే బెదిరింపులు కూడా ప్రేయరు హాలులో చెప్పే మంచి మాటల్లో భాగమే.

మార్కుల గురించి కూడా ప్రేయరు హాల్లోనే. "చాలామంది ట్యూషనుకు రావడం లేదు. మేమైతే స్కూల్లోనే హోం వర్కు చేయిస్తాం గదా. మీరు రారు. హోం వర్కులు శుభ్రంగా చేసుకొస్తారా అంటే అదీ లేదు. మీకెప్పుడూ టీవీ గోలే".

జ్వరాలొచ్చి ఆబ్సెంట్లయినా తప్పే, ఆబ్సెంట్ల మీద ఒక లెక్చరు.

"ఏం సాకు దొరుకుతుందా అని చూస్తుంటారు. జ్వరం, తలనెప్పి వస్తే చాలు ఇంట్లో వాళ్లను పోరి చెప్పా పెట్టకుండా స్కూలు మానేయటం. Leave letter పెట్టాలన్న జ్ఞానం కూడా మీకు వుండడం లేదు. పర్మిషను లేకుండా మీరు స్కూళ్లకు ఎట్లా నిలిచిపోతారసలు?"

టీచర్లను వుద్దేశించే మాటలు కూడా ప్రేయరు హాల్లోనే.

"కొంతమంది టీచర్లు సిలబస్‌ను కంప్లీట్ చేయడం లేదు. పిల్లలెంత బాధ్యతా రాహిత్యంతో వున్నారో టీచర్ల పరిస్థితీ అలాగే వుంది."

సంవత్సరంలో ఎన్ని పొద్దులు స్కూళ్లు జరిగినా అన్ని పొద్దులూ ఇదే గోల.

చివరగా పిల్లలందరి చేతా జాతీయ గీతం పాడిపించి క్లాసు రూముల్లోకి తోలేయడం.

**పి**ల్లలతో ఎలాంటి మాటలు మాట్లాడితే వాళ్లకు స్కూలు పట్లా, పుస్తకాల పట్లా, మనుషుల పట్లా, జీవితం పట్లా ఆసక్తి కలుగుతుందో మనం ఆలోచించాలి.

ఈ కింద వుండే సంగతులన్నిట్నీ స్కూళ్ల వాళ్లూ, తల్లిదండ్రులూ పిల్లలతో పదే పదే ప్రస్తావిస్తుండాలనేది నా కోరిక. ఇట్లా ఏడాదికి 210 రోజులు స్కూలు జరిగితే 210 మంచి మాటలు మనం మాట్లాడుతుండలేమా?

1) చిన్న చిన్న విషయాలు అల్పమైనవీ కావు, పెద్దపెద్ద విషయాలు వున్నతమైనవీ కావు అనేది పెద్దలు తెలుసుకొని వుండాలి. చిన్నపిల్లలకు వాళ్లంతట వాళ్లను కాపాడుకోవడం నేర్పాలి.

ప్రేయరు హాలుకు టయానికే చేరుకోలేక పోతే టీచర్లు తలగిల్లి మొలెయ్యరులే అని ధీమాగా స్కూలుకెళ్లే అలవాటును ఇటు టీచర్లూ నేర్పాలి, అటు తల్లిదండ్రులూ అలవాటు చెయ్యాలి. ప్రేయరు హాలులో స్కూలు పెద్దాయన ఇట్లా మాట్లాడితే తప్పేం వుందీ!

"పిల్లలూ! హడావిడి పడకండి. నెమ్మదిని అలవాటు చేసుకోండి. రోడ్లు దాటేటప్పుడు ఈ ట్రాఫిక్కులో పడుతూ లేస్తూ ఎలా పడితే అలా దూరేయకండి.

నిదానించి రండి. ఒక రోజు స్కూలికి కాసింత లేటుగా వస్తే ప్రాణమేమీ పోదు. కావాలంటే రేపు అయిదు నిమిషాలు ముందే వచ్చి ఆడుకోవచ్చు. రోడ్లు దాటేటప్పుడు ఏదైనా ప్రమాదం జరిగితే అమ్మో ఆ వూహే ఎంత భయంగా వుంటుందో చూడండి. నన్నే తీసుకోండి. నేను కదా ఈ స్కూలికి పెద్ద. నేనే ఎన్నోసార్లు ప్రేయరు హాలుకి లేటయి పోతుంటా. నిద్ర టైంకు లేవకనో, ఇంట్లో టిఫిను అవకనో ఇట్లా ఏదో లేటు కావడం అనేది మామూలే. మన భయం మనల్ని వెనకన తరిమినట్టు వుండకూడదు. ఇది రోజూ వుండే పనే గాబట్టి రోజూ కాసింత ముందే మేలుకుని టయానికి రావడానికి అలవాటు పడండి కానీ తపన పడిపోకండి, గస పోయకండి, ఆరాటపడి పోకండి.

ఇట్లాగే హోంవర్కు విషయం కూడా. ఏదో కారణాన వారానికోసారి హోంవర్కు చేసుకో రాలేదనీ, టీచర్లు కొడతారేమోననీ వొణుకుతూ రాకండి. టీచర్లు కూడా అలివి మాలిన విధంగా హోంవర్కులు ఇచ్చేయకూడదు. హోంవర్కు కూడా ఆడుతూ పాడుతూ చేసుకునేటట్టు వుండాలే గానీ... ఆ హోంవర్కు కూడా మీకోసం మీరు చేసుకునేదిగా మీరు అనుకోవాలి. టీచర్ల కోసం కాదుగదా మీరు హోంవర్కు చేయాల్సింది! మీకు పాఠాలు బాగా అర్థం కావడానికి కదా!

ఒక సినిమా చూడడానికి వెళ్లేటప్పుడు ఎంత సంతోషంగా వెళతారో అంత సంతోషంగా మీరు ఇంటి నుంచి స్కూలుకు రావాలంటే మా టీచర్లందరం ఏమేమి చేయాలో ఈ రోజే మీరు కాగితాలు తీసి రాసి మీ పేరు, మీ క్లాసుతో సహా బాక్సులో పడేయండి. సరేనా?

2) తెల్లారి వచ్చిన పిల్లలు సాయంకాలం దాకా స్కూళ్లలోనే పడి వుంటారు. పాపం వాళ్లకి చక్కటి బాత్‌రూము సౌకర్యాలు వుండవు. ఒకవేళ ఒకటి రెండు వున్నా అందులోకి పోవడానికి పిల్లలు జడుసుకుంటారు.

పిల్లలు ఎక్కువ మంది బయటే వుచ్చయినా, దొడ్డికైనా ఇప్పుడు ఈ కాలంలో అయిదో తరగతి వరకూ చదువుకునే మగ పిల్లల నిక్కర్లకు గానీ, పదో తరగతి చదువుకునే పిల్లల ప్యాంట్లకు గానీ గుండీలు వుండడం లేదు. జిప్పులే వాడుతుంటారు. చాలామంది పిల్లలు డ్రాయరు వేసుకోరు.

ఎక్కడపడితే అక్కడ పిల్లలు వొంటేలు పోసుకున్నాక హడావిడిగా జిప్పు లాగేసుకుని 'అబ్బా' అని పొలికేక వేస్తుంటారు. ఈ ఏడెనిమిదేళ్లలో నేను పది పన్నెండు

మంది పిల్లల్ని అట్లా చూశాను. వాడు అల్లల్లల్లా అని నోరు కొట్టుకుంటూ వుంటే అప్పటికప్పుడు డాక్టరు దగ్గిరికి స్కూలు వాళ్లు తీసుకెళ్లడం!

ఈ విషయాన్ని ఎందుకు ప్రేయరు హాల్లో ప్రస్తావించకూడదు? స్కూళ్లు నడిపే వాళ్లకూ, టీచర్లకూ, తల్లిదండ్రులకిదేం కొత్తగాదు.

"మగ పిల్లలంతా ప్యాంటుకు బటన్లనే వాడాలి. అప్పుడే సమస్యా వుండదు. మొన్న చూడండి, పలానా వాడికి ఎలా అయ్యిందో!" అని వివరించాలి.

తల్లిదండ్రులు ఫీజు కట్టడంలో ఆలస్యం జరిగిన వెంటనే పాఠశాలల యాజ మాన్యాల నుంచి లెటర్లు పరుగులెత్తుతుంటాయి. తల్లిదండ్రులకు సూచనగా "అయ్యా! మీ పిల్లలకి మా స్కూలు యూనిఫాంకి సంబంధించి నిక్కర్లకు గానీ, ప్యాంట్లకు గానీ గుండీలే పెట్టండి. దయచేసి జిప్పులు వద్దు. ఇది మా స్కూలు వారి ఆర్డరు." అని ఒక లెటరెప్పుడైనా ఏ స్కూలు నుంచైనా వెళ్లిందా నిదానంగానైనా.

3) పిల్లలకు పళ్లు తినడం చక్కటి అలవాటు. జాంపళ్లూ, రేగుపండ్లూ, వెలక్కాయలూ ఇలా ఏవి పడితే అలా పెరుక్కు తింటారు.

పట్టణాల్లో పిల్లలు పల్లెటూళ్లకు వెళ్లినా, పల్లెటూరి పిల్లలే అయినా కనిపించిన పళ్లన్నిటినీ చెట్లెక్కి మరీ కోసుకుని తినేస్తుంటారు.

అన్ని పళ్లూ మంచివి కాదనీ, కాయల్లో, పళ్లల్లో కూడా విషపు కాయలూ, విషపు పళ్లూ, విషపు చెట్లూ వుంటాయని పిల్లలకు చెప్పాలి.

ఆ చెట్టును గురించీ, ఆ పండుని గురించీ తెలియకుండా ఏ పిల్లా పిల్లవాడూ ఆ పండును నోట పెట్టకూడదు.

'విషపు కాయలు, పళ్లు తిని పదిమంది పిల్లలకు అస్వస్థత' అని పేపర్లలో రాని వారం వుంటుందా?

టీచర్లూ తల్లిదండ్రులూ ఈ విషయాన్ని పిల్లలకు పదేపదే చెబుతుండాలి.

"పరిచయస్తులు కాని వారెవరైనా బిస్కట్లు ఇస్తే మీరు తీసుకుంటారా? తీసుకోరు గదా. అట్లాగే అది ఏ చెట్టో తెలియకుండా ఏ చెట్టు పడితే ఆ చెట్టు నెక్కేసి ఏ కాయ పడితే ఆ కాయ తినేయకూడదు. చచ్చి వూరుకుంటామంతే ఏమనుకుంటారో!

అసలు మనం కాయల దాకా పండ్ల దాకా వెళ్లిపోతున్నాము. కొన్ని రకాల ఆకులు కూడా విషం తెలుసా? మీరెప్పుడైనా మీ వూరెళ్లినప్పుడు వడిశె చెట్టు చూపించమని మీ నాన్న నడగండి. ఆ ఆకులు తింటే ఇంక మరణమే.

పసుప్పచ్చటి పూలు పూసే గన్నేరు చెట్టు కాయలు పచ్చగా వున్నాయి కదాని పెరుక్కు తినేయొచ్చా? మహా విషం ఆ కాయలు.

కాబట్టి కనిపించిన కాయ జోలికల్లా పోవచ్చా! జాగ్రత్త అమ్మా!

4) పిల్లలూ! మీకు చంక కెత్తుకుని ఆడించుకోవడానికి చెల్లిగానీ, తమ్ముడు గానీ వున్నారా! మీ తల్లిదండ్రులతో పాటు మీరు కూడా వాణ్ణి జాగ్రత్తగా చూస్తుండాలి సుమా. మీ తమ్ముళ్ల దగ్గరా మీ చెల్లెళ్ల దగ్గరా మిమ్మల్ని కాపలా పెట్టేసి అమ్మా నాన్నా పొలానికో బజారుకో వెళ్లిపోతుంటారు. మీరు జాగ్రత్తగా చూసుకుంటారనే నమ్మకంతోనే గదా. మరి జాగ్రత్తగానే చూసుకుంటున్నారా?

దోగాడే పిల్లలు మామూలుగా ఏది చేతికందితే దాన్ని నోట్లోనో ముక్కులోనో పెట్టేసుకుంటూ వుంటారు. ఉదాహరణకు మీ అమ్మ వేరుశెనక్కాయల్ని వొలిచి గింజలు నేలమీద వొదిలేసి వెళ్లిందనుకోండి. మీ తమ్ముళ్లు గానీ మీ చెల్లెళ్లు గానీ... వాళ్ల దగ్గర జాగ్రత్తగా వుండాలేం.

మొన్నటికి మొన్న ఇలాగే ఒక వూర్లో ఓ అన్నా తమ్ముడూ ఇంట్లో పురుగు మందుల సీసా కనిపిస్తే దాన్ని జ్యూస్ అనుకుని నోటబెట్టి చప్పరించేసి స్పృహతప్పి పడిపోయారు. పాపం ఇరుగమ్మా పొరుగమ్మా సకాలంలో చూసి ఆస్పత్రిలో చేర్చబట్టి సరిపోయింది. దేన్నయినా సరే మనం మన చిన్ని బొజ్జలోకి పంపించేటప్పుడు చాలా జాగ్రత్తగా వుండాలి. అమ్మనో, నాన్ననో, ఇరుగమ్మనో అడిగి మాత్రమే నోట బెట్టాలి. సరేనా? ఇంతకీ మీరు పొలాలకు చల్లే యూరియాను చూశారా ఎప్పుడైనా? అచ్చం చక్కెరలాగే వుంటుంది కదా. కానీ ఉప్పు ఉప్పే గదా కర్పూరం కర్పూరమే గదా. చక్కెర చక్కెరే గదా యూరియా యూరియానే గదా! యూరియాను చక్కెరనుకొని నోట్లో పోసేసుకునే పిల్లలు ఎంతమందో!

5) పిల్లలూ! ఈరోజు... ఈ చల్లటి ఉదయాన మనం అనాథలై పోతున్న మన చెరువుల్ని గురించీ, అభాగ్యులై పోతున్న కొంతమంది పిల్లల్ని గురించీ మాట్లాడు కుందాం.

ఎప్పుడైనా ఎండిపోయిన చెరువును చూశారా? ఎంతమంది చూశారో చేతులెత్తండి చూద్దాం. ఓహో దాదాపు ఎల్.కె.జి. నుంచి పదో తరగతి దాకా పిల్లలంతా చూసేశారే, భలేభలే.

ఆ చెరువులు ఎలా వున్నాయంటారు? ఎండిపోయిన మంచినీటి తొట్టిలా వుందా? లేదు కదా బాగా చెప్పారు... కంపచెట్లతో నిండిపోయి వుంది కదా!

ఇక్కడే మీరు నిదానంగా నిలిచి ఆలోచించాలి. చెరువెందుకని వుంది? మన తాత ముత్తాతలు తొవ్వించిన చెరువెందుకని వుంది? మనకూ, మన పొలాలకూ, మన గొడ్డూ గోదకూ, మన చిలకా గోరింకలకూ నీరందించడానికని వుందికదా. వానలు పడితే ఎక్కడెక్కడో పడిన చినుకుల్నన్నిట్నీ పోగేసుకుని వచ్చే వంకలూ, వాగుల్ని పొట్టలో దాచుకుని మనందరికీ ఇవ్వాలని వుందన్న మాట. మరి ఈ కంప చెట్లెందుకొచ్చాయి? ఎండాకాలంలో చెరువెండి పోయినప్పుడు మొలిచినవి వానా కాలానికంతా పాపం పెరిగినట్టు పెరిగి పోయి 'నీళ్లచెరువు' కాస్తా 'కంపచెట్ల' చెరువై పోయింది గదా. అదే బాధ. మన చెరువుల్నే మనం నిర్లక్ష్యం చేస్తున్నాం! మొత్తానికి మన చెరువుల పరిస్థితయితే ఇదీ!

రేపు వానాకాలం వస్తుంది. నాలుగైదు వానలు పడగానే చెరువు నిండిపోతుంది. అప్పుడు కంపచెట్లు కనిపిస్తాయా? కనిపించవు. దొంగ మొసళ్లలాగా చెరువు అడుగున వుంటాయి.

అక్షరాలు చెరువు నిండగానే పాపం పిల్లలైన మీరు దాన్ని మరిచి పోతారు. వూళ్ల కెళ్లినప్పుడు పట్టణాలల్లో వున్న మీలాంటి పిల్లలు గానీ, అక్కడే పుట్టి పెరిగిన పిల్లలు కానీ చెరువులోకి ఈతకని తయారైపోతారు.

పాపం చాలామంది ఈత వచ్చిన పిల్లలు కూడా ఆ చెరువులో మునుగుతూ తేలుతూ ఈతలు కొడుతూ కొడుతూ ప్రాణాలు పోగొట్టుకుంటారు.

ఎందుకో తెలుసా? ఎందుకేముందీ! చెరువులో మునుగుతారా? ఆ రాకాసి కంపచెట్లకు పిల్లల ప్యాంట్లు తగులుకు పోతాయి. పాపం ఈత వచ్చినా పైకి రాలేక చచ్చిపోతుంటారు.

తెలిసిందా? కాబట్టి నిండు చెరువుల్నన్నిట్నీ నిండు చెరువులనుకుని అడుగున కంపచెట్లు వున్న విషయం తెలీకుండా చెరువులో మునకలేయొచ్చా! వొద్దమ్మా!

6) పిల్లలూ! మా అమ్మ గుర్తుకొచ్చీ, మా అమ్మ చేసిపెట్టిన వంటలు గుర్తొచ్చీ ఈ రోజు మిమ్మల్ని చూస్తే నాకు జాలేస్తోందిరా!

'అమ్మా తినేదానికేమైనా వుంటే పెట్టమ్మా!' అని మీరంటే ఒకటో, రెండో, అయిదు రూపాయలో చేతిలో పెట్టి అంగట్లోకి తరిమేస్తోందా మీ అమ్మ? అప్పుడు మీరు చాక్లెట్టో, ఫైవ్ స్టారో, ఐస్‌క్రీమో, కుర్‌కురే... ఇట్లా ఏదో ఒకటి తీసుకుని తినేసి అదే తిండి అని అనుకుంటున్నారు కదా.

అందుకే మిమ్మల్ని చూస్తే నాకీ రోజు చాలా జాలేస్తోంది. నేనీరోజు మీకు చెప్పేదంతా విని ఇంటికెళ్లి మీ అమ్మతో తగాదా పెట్టుకుంటారు కదూ!

మా కాలంలో మా అమ్మ నాకు తినేదానికి ఏమైనా అంత పెట్టు అంటే వేయించిన వేరుశెనగ పప్పు, అంత బెల్లమూ చేతిలో పెట్టేది.

ఈ ఒక్కటే అనుకున్నారా? నెయ్యి కాచే గిన్నె అడుగున కాసింత నెయ్యి వుంటే అందులో అంత రాగిపిండి వేసి, చక్కెర కలిపి ఇచ్చేది.

ఇంకా ఎన్నెన్ని చేసేదో తెలుసా? సజ్జలతో రొట్టె, బియ్యప్పిండీ బెల్లప్పాగూ వేరుశెనగ పలుకూ కలిపి చేసిన వుంటలూ, మినపట్లూ...!

మీ బర్గర్లూ, మీ పిజ్జాలూ, మీ ఐస్‌క్రీములూ బలాదూర్ తెలుసా సజ్జరొట్టె ముందు!

ఇంటికెళ్లంగానే అమ్మతో రచ్చకు దిగుతారు కదూ! మొదట తినేదానికి ఏమైనా అంత పెట్టు అనండి. ఏమైనా ఇంట్లో చేసి పెట్టలేదనుకోండి, చిల్లర చేతికిచ్చిందనుకోండి. ఏం పర్లేదు. చిల్లరను నేలకేసి విసిరి కొట్టండి. నేనున్నాను ఏం పర్లేదు తగాదాకు దిగండి. "ఒక రోజయితే పోనీలే అనుకోవచ్చు. రోజూ ఇంతేనా! ఈ రోజు నాకు సజ్జరొట్టె కాల్చి పెట్టు. స్కూల్లో మా సార్ చెప్పాడు. కొట్లో దొరికే వాటికంటే అమ్మ చేసి పెడితేనే బాగుంటాయంట. కేకుల కంటే బర్గర్లకంటే సజ్జరొట్టెలు భలే వుంటాయంట. నేనీ రోజు సజ్జరొట్టె తినాల్సిందే!" అని తగాదా పెట్టుకోండి తమాషాగా. రేపు మీరు నాకు చెప్పాలి – అమ్మ చేతి సజ్జరొట్టె తిన్నారో లేదో!

7) అబ్బా! ఈ రోజు నా తల పగిలిపోతోందిరా నెప్పితో! నాక్కావాల్సిందేలే ఇది! ఈ నెప్పికి మీరేం బాధ పడకండి. నన్నే బాధ పడనివ్వండి. ఇంకో తమాషా

చెప్పనా? ఈ తలనెప్పిని నేను 50 రూపాయలు డబ్బిచ్చి మరీ కొనుక్కున్నాను. ఏం నవ్వుతున్నారు? నిజంగా రా, ఇది డబ్బిచ్చి కొనుక్కున్న తలనెప్పి.

120 రోజులు వాయిదా వేసి మరీ ఇంక ఆగలేక కొనుక్కున్నాను తెలుసా?

ఏం లేదు రాత్రి ఇంట్లో తిని పడుకోక మీరంతా ఈలలేసి మరీ అభిమానించే మీ హీరో సినిమా కొకదానికి పోయా!

అదీ ఈ తలనొప్పికి కారణం!

అదేం సినిమా రా థూ నాశనం! అంత అన్యాయంగా, ఘోరంగా వుంటున్నాయా ఇప్పటి సినిమాలు!

అబ్బో!

టైటిల్ సాంగ్ అయ్యే సరికే నా గూబలు రెండూ పగిలి పొయ్యాయి. అంతటి సౌండును మీరు మాత్రం ఎలా భరాయిస్తున్నార్రా? మీరంతా ఒక్కొక్కరు ఒకటికి రెండుసార్లు చూడబట్టే గదా ఆ సినిమా 120 రోజులు దాటి కూడా ఆడుతోంది?

ఇంతకీ ఆ సినిమాలో ఏముందిరా! హీరో అయితే మాత్రం వాడు చెయ్యెత్తితే చాలు వున్న పళాన నలుగురు నెత్తురు కక్కుకుంటూ ఆమడదూరం పోయి పడిపోతారా?

ఒక్కడేందిరా అంతమందిని కొట్టి కొట్టి చంపేయడం? మీరు తెరమీద గాకుండా జనాల్లో అంత వింత చూశారా?

అబ్బబ్బో సినిమా నిండా కార్లూ మండిపోవడమే, షాపులూ మండిపోవడమే, మనుషులూ మండిపోవడమే!

హీరో కారు 50 కార్లను నుజ్జునుజ్జు చేసేయడం!

ఒక్క హీరో అంతెత్తు నుంచి గాల్లోనే ఎగురుకుంటూ వచ్చి అంతంత మందిని చంపుకుంటూ రావడం!

ఏదీ రమ్మనమనండి మీ హీరోను. మన స్కూలికొచ్చి మన పిట్టగోడనెక్కి దూకమనండి, నడుములు విరిగి చస్తాడు పీనుగ!

ఛీఛీ దుర్మార్గం రా!

అందులో వున్న ఒక్క ఆడమనిషన్నా ఆడమనిషిలా వుందా రా! ఒక్కరి ఒంటి మీదైనా చిన్న గుడ్డ పేలిక వుందా రా!

చూడకండి రా అట్లాంటి సినిమాలు చూడకండి రా!

మనం ఆ మధ్య మన స్కూల్లో విషపు చెట్ల గురించీ విషపు కాయల గురించీ చెప్పుకున్నాం చూడండి. అట్లాగే ఈ సినిమాలు కూడా విషం చిమ్ముతాయి రా. ఇవి విషపు కాయలు రా, విషపు పండ్లు రా.

ఒరే మంచిమంచి పళ్ల లాగే మంచి మంచి సినిమాలూ వున్నాయమ్మా! నా బుజ్జికొండలు గదా. పది రోజులు మీకు టైమిస్తున్నాను. మీ ఇళ్లల్లో గానీ బంధువుల ఇళ్లల్లో గానీ సి.డి.లు వేసుకుని చూసే వీలుంది కదా.

మిస్సమ్మ అని పాత సినిమా ఒకటి వుంది చూడండి. భానుమతిది మల్లీశ్వరి అని వుంది. దాన్నీ చూడండి.

మీ హీరో నాగార్జున వాళ్ల నాయన తీసిన 'దొంగ రాముడు' చూడండి కనీసం. పది రోజుల్లో మీరంతా ఒక మంచి సినిమా చూసి నాకు చెప్పాలి.

అప్పటికి గానీ నాకీ తలనెప్పి పోదు.

8) పిల్లలూ! ఇదేమైనా న్యాయంగా వుందేమో మీరే చెప్పండి.

నిన్నటికి నిన్న అనూష నా దగ్గిరికొచ్చి... అమ్మా అనూషా ఏం అనుకోవద్దు తల్లీ మాట వరసకు నీ పేరెత్తుతున్నానంతే... సార్ సార్ సోషల్ స్టడీస్‌లో నాకు important questions టిక్కు పెట్టివ్వండి సార్. వాటినే నేర్చుకుంటాను అనేసి అంది.

రేపా అమ్మాయి సోషల్ స్టడీస్‌లో పాస్ అయినా ఫెయిల్ అయినా అది వేరే కథ. ముందు ఆ అమ్మాయికి ఇంత కాలం సోషల్ పాఠాలు చెప్పిన నేను ఫెయిల్ అయినట్టు లెక్క. అంతేమరి.

ప్రధాన మంత్రి విధులు వద్దులే అది పెద్ద important కాదులే అనే దానికి వుందా!

మనింట్లో మనకు అందరూ ముఖ్యమే. మీ కుటుంబంలో వున్న మనుషుల మీద నేను కొన్ని ప్రశ్నలు అడుగుతాననుకోండి. మీరు చెప్పలేరా? సార్ సార్ మా

అమ్మ మీదే ప్రశ్నలడగండి సార్, మా నాన్న మీద ప్రశ్నల్నీ, మా చెల్లి మీద ప్రశ్నల్నీ నేనింకా నేర్చుకోలేదు సార్ అని అంటారా?

దయచేసి పిల్లలంతా తెలుసుకోవడానికీ నేర్చుకోవడానికీ తేడా లేదని, గ్రహించండి.

నాకు సైకిల్ తెలుసు అంటే ఏమి అర్థం? నేను సైకిల్ అంటే ఎట్లా వుంటుందో ఒకసారి చూశానూ అని అర్థమా! కాదే! సైకిల్ తొక్కడం తెలుసూ అని.

నేర్చుకోవడమనే సరికి పిల్లలు భయపడేటట్టున్నారు చూడబోతే. తెలుసుకోవడమే నేర్చుకోవడమంటే అని మీరు అనుకున్నారనుకోండి అప్పుడా భయం పోతుంది.

మీ అమ్మ వుద్యోగానికి పోతే నాన్న ఇంట్లో వంటా అదీ చేసి పెడుతుంటాడనుకోండి. మీ అమ్మను గురించి అడిగినా మీ నాన్నను గురించి అడిగినా అది చెప్తే చాలుగదా. ఆ విషయం మీకు తెలుసు గదా. దాన్ని నేర్చుకోవాలా?

ఇదీ అంతే.

మీరు అనవసరంగా పరీక్షలన్నా, మార్కులన్నా భయపడబోకండి. కొన్ని ప్రశ్నల్ని క్షుణ్ణంగా చదవడం, కొన్ని ప్రశ్నల్ని అస్సలు చదవకుండా వదిలేయడం పద్ధతే కాదు. అసలు మీరు ముందే ప్రశ్నల గురించి ఎందుకాలోచిస్తారు? సంగతులు ముందు, ఆ తర్వాత వాటిపై వచ్చే ప్రశ్నలు.

ఒక కుటుంబంలో అమ్మా నాన్నా చెల్లీ తమ్ముడూ అన్నా అక్కా... అలాగే ఎవరి పని వాళ్లదే. అట్లాగే రాష్ట్రపతీ, స్పీకరూ, ప్రధానీ, ముఖ్యమంత్రీ, గవర్నరూ... అంతే!

మన శరీరాన్నే తీసుకోండి. ఏది important ఏది un-important? తలే గదా అని వొదిలేస్తామా? శుభ్రంగా నూనె పెట్టుకుని దువ్వుకుంటాం కదా. పాదాలే కదా అని వొదిలేస్తామా? చెప్పులేసుకుంటాం కదా!

కాళ్లు ఇంపార్టెంటా, చేతులు ఇంపార్టెంటా? ఒక్కటీ un-important కాదు.

సోషల్ లాగే సైన్స్ కానీ, మ్యాథ్స్ కానీ! సైన్సులో వృక్ష శాస్త్రమూ ముఖ్యమే. జంతు శాస్త్రమూ ముఖ్యమే. గణితంలో అంక గణితమూ ముఖ్యమే. బీజ గణితమూ ముఖ్యమే.

ప్రశ్నలూ జవాబుల జోలికి పోకుండా విషయాలూ, ఆయా అంశాలూ తెలుసుకోవడం మీదే శ్రద్ధ పెట్టాలమ్మా! సరేనా?

9) పిల్లలూ! writing skills, communication skills ఈమధ్య బాగా మన జనాల్లో వినిపిస్తున్న పదాలు కదా!

వీటిని గురించి ఎప్పుడైనా ఆలోచించారా?

ఏం లేదమ్మా ఇవన్నీ బడాయి పదాలు. వీటిని మన వాకిట్లోకి లాక్కొచ్చి అర్థం చేసుకుంటే ఓస్ ఇంతేనా? అనిపిస్తుంది.

మీ అమ్మ వంట గదిలో పని చేసుకుంటూ వుంది. వుయ్యాల తొట్లో వున్న మీ చెల్లి గుక్కపట్టి ఒక్క ఏడుపు ఏడుస్తుందంతే!

మీ అమ్మ పరుగెత్తుకొచ్చి పాప నోటికి పాలిస్తుంది గదా. పాప అమ్మ ఒళ్లో బొజ్జొని హాయిగా పాలు తాగుతుంటుంది. ఏడుపెప్పుడో పరార్!

వుయ్యాల తొట్లో వున్న ఆ పాప, "అమ్మా నాకు ఆకలిగా వుంది. వచ్చి పాలివ్వు" అని అరిచి చెప్పిందా?

మీ అమ్మ ఆ మాట విని వంటింట్లోంచి పరుగెత్తుకొచ్చిందా?

లేదే! భాషకు సంబంధించి ఒక్క మాట లేకుండా ఎంత పని జరిగిపోతోందో చూడండి మరి!

వుయ్యాల తొట్లో వున్న బుజ్జాయికే అంత communication skills వుంటే యూనిఫాం వేసుకుని స్కూలికొచ్చిన మీకు వుండదా ఏం?

ఇంక writing skills గురించి చెప్పుకుందాము.

నేనొక ప్రశ్న వేస్తా. సమాధానం నోటితో చెప్పండి.

మీకు గబుక్కున ముల్లిరిగితే ఏమంటారో చెప్పండి.

'అమ్మా!' అంటారా? అవునా!

దీన్నే రాయండి.

నాకు ముల్లిరిగితే 'నేను అమ్మా' అంటాను అని ఒకరు రాస్తారు.

దీన్నే రకరకాలుగా అనుకోని రాసుకోవచ్చు.

నేను మామిడి తోపులో తిరుగుతుంటే నాకు ముల్లిరిగింది. నేను అమ్మా అని బాధతో మూలిగాను – అని ఒకరు రాయొచ్చు.

ఇంకొకరు దీన్నే – నేను ముల్లిరగ్గానే అమ్మా అని మా అమ్మను తల్చుకున్నాను అని రాయొచ్చు.

ఇంకొకరెవరైనా – నాకు ముల్లిరిగే ఛాన్సే లేదు. నా కాళ్లకు ఎప్పుడూ బాటా షూస్ వుంటాయి మరి – అని రాయొచ్చు.

ఎన్ని రకాలుగా రాసినా అన్నీ రైటింగ్ స్కిల్సే.

నోటికొచ్చిన విషయాన్ని పేనా తీసుకుని కాగితం మీద పెట్టడానికి భయమేమీ అక్కర లేదు.

అక్షర దోషాలు వుంటాయని భయమా? వున్నా ఏం పర్వాలేదు. ఎవ్వరూ ఎగతాళేం చేయరు. వుంటే గింటే నిదానంగా సరిదిద్దుకోవచ్చు.

మామిడితోపు అనేదాన్ని మాడితోపు అని రాసినా ఎవ్వరూ జైలు కేయరు. మన అవ్వ అనేది 'మాడితోపు' అనే మరి!

గుణింతాలూ పాడూ బీడూ వొచ్చిన వెంటనే రాసెయ్యడమే మరి.

రాయడం అంటే భయం పోయి ఆసక్తి కలగాలి.

నోటితో ఏ ట్రైనింగూ లేకుండా నీళ్లు తాగినంత సుళువుగా మాట్లాడేస్తాం గదా, అంతే సుళువుగా చేత్తో రాసేయడమే. ట్రైనింగులేం అవసరం లేదు.

నోటితో మాట్లాడిందాన్ని చేత్తో రాసే దానికేం అన్నంత ఈజీగా తీసుకోవాలి.

ఇప్పుడు సైకిలు తొక్కడమే వుంది. తొలిరోజు వూరికూరికే నడుములు తిప్పతాం సీటు మీద కూర్చోంగానే. రెండో రోజు నడుమూగించేది కొంచెం తగ్గించి చేతుల్తో హ్యాండిల్‌ను గట్టిగా పట్టుకుంటాం. మూడో రోజుకంతా నడుమూగించడమే పోతుంది. గట్టిగా హాండిల్ పట్టుకోవడం మీదే ధ్యాస వచ్చేస్తుంది.

నోటి కొచ్చిందాన్ని రాసేటప్పుడు కూడా అంతే. తొలి రోజు కొన్ని దీర్ఘాలు పోవచ్చు. రెండో రోజు దీర్ఘాలు పోకుండా నాలుగు వత్తులు పోవచ్చు. నాలుగు నాళ్లు రాస్తే ఏమీ పోవు. అంతా శుభ్రంగా వచ్చేస్తుంది!

ఆవు మీద వ్యాసం రాయమన్నారనుకోండి. మీ ఇష్టం. అన్ని ఆవులూ వెనకాళ్లతో తంతే మా ఆవులో విచిత్రం ఏమంటే ముందరి కాళ్లతో కూడా తంతుంది అని కూడా రాయండి. ఏం పోతుంది? మీ ఆవును గురించి మీరేం రాసినా అదంతా కరెక్టే అయివుంటుంది.

పది రోజులు మీకు నోటికొచ్చిన వాక్యాలన్నీ చేతుల్తో రాసేయండి. ఆ వాక్యాలే మంచి ముత్యాలు, రత్నాలు, మధుర మాణిక్యాలంతే!

10) పిల్లలూ! నేనీ రోజొక నిర్ణయం తీసుకున్నాను. అది మంచిదో కాదో నాకే తెలీడం లేదు. అసలు మీకీ ప్రేయరు హాల్లో దాన్ని చెప్పొచ్చో చెప్పకూడదో కూడా అర్థం కావడం లేదు.

నా కష్టం, సుఖం నా పిల్లలతో కాక మరెవరితో చెప్పుకోను?

ఏం లేదు. నిన్నట్నించీ నేను మాంసాహారం ముట్టనని శపథం చేసుకున్నాను.

ఎందుకంటే – ఈ గాలి ఎవరిది? మనందరిదీ. సముద్రంలో వున్న నీరెవరిదీ మనందరిదీ. అగో దూరంగా కనిపిస్తున్న ఆ అడివి ఎవరిదీ మనందరిదీ. ఆ ఆకాశం ఎవరిదీ? మనందరిదీ.

ఆకాశం అనేనా అన్నాను? అవును, ఆకాశమే! ఆ ఆకాశం, ఒట్టి మన మనుషుల దేనా? దాంట్లో ఎగిరే కొంగలది కాదా, కాకులది కాదా, పిట్టలది కాదా! వాటిది కూడా కదా!

అలాగే ఆ సముద్రం వొట్టి మన మనుషులదేనా? అందులో ఈదులాడే కోట్లాది చేప పిల్లలది కాదా!

ఈ ప్రకృతి సమస్త ప్రాణికోటిదీ గదా! అందులో హాయిగా తిరుగులాడే కాకినీ, పిట్టనీ, కుందేలునీ తుపాకీతో కాల్చి చంపి తినేస్తున్నామే! చేపల్ని వలవేసి పట్టేస్తున్నామే!

ఇన్ని రకాలుగా నిన్ననే నేనెందుకాలోచించానంటే నిన్న ఆదివారం కదా. ఒక కిలో చికెన్ తెద్దామని చికెన్ సెంటర్ కెళ్లానా! చికెన్ షాపతను బోనులో పది కోళ్లుంటే ఒకదాని కాళ్లు పట్టుకొని గొంతుకోసి సలసలా కాగే నీళ్లలో వేశాడు. పాపం మీకు చెప్పాలంటేనే నాకు భయంగా వుంది. మిగతా కోళ్లన్నీ భయంతో దడదడలాడి పోయాయి. నాలాగే ఇంకొకతను వచ్చేసరికి ఇంకో కోడి. పాపం ఆ కోళ్లన్నీ వాటి వంతుల్ని అవి తప్పించుకోలేక అల్లాడిపోయాయి.

నాకు అయ్యోమనిపించింది. మనిషి ఎందుకీ మాంసాహారానికి అలవాటు పడ్డాడా అని దిగులు దిగులుగా అయిపోయింది.

పాపం ఫారం కోళ్లను పుట్టించిందీ మనమే. గింజలు వేసి పెంచిందీ మనమే. తీరా మనమే... ఇలా!

నిజమే, కొన్ని లక్షల సంవత్సరాలకు పూర్వమెప్పుడో మనిషి వేటాడి జంతువుల్ని చంపి తినేవాడట. అప్పటి పరిస్థితులు వేరే.

ఇప్పుడు మనకు తినే దానికి వరి అన్నం, సజ్జలు, కొర్రలు, గోధుమలు, రాగులు ఎన్ని గింజలున్నాయి. అలాగే కూరల కోసం వంకాయ, బెండకాయ, దొండకాయ, అనపకాయ, దోసకాయ... అబ్బ ఎన్నో కదా!

ఈ రోజున మన పొట్టకి మన తోటి ప్రాణి అవసరమా!

చిన్నప్పుడు నేను మేపిన పొట్టేలు పిల్ల గుర్తొచ్చి కడుపంతా దేవినట్టయ్యింది.

ఏ పాపం ఎరగని పొట్టేలు పిల్లల్ని నరికేస్తుంటే ఒక్కటైనా మన మీద కోపంతో కుమ్మడానికొచ్చిందా! అయినా మనుషుల కెందుకంత జాలి లేకుండా పోయింది!

అసలెందుకు తినాలి ఈ మాంసాహారాన్ని! గొర్రెల్నీ, మేకల్ని మేపుకుని జీవనం సాగించే వాళ్లున్నారు. కొన్ని లక్షల మంది చేపలు పట్టే జాలర్లు వున్నారు. ఈ లెక్కన మరి వాళ్లెలా బతకాలో?

రాత్రి నాకో కల వచ్చింది. నేనో పొట్టేలు పిల్లను వెంట మేపాను. నాలుగేళ్లకు అది దానంతట అదే చనిపోయింది. అప్పుడు మనిషిని పూడ్చినట్టు పూడ్చి దండం పెట్టుకుని వచ్చేశాను.

అలా జంతువుల్ని ప్రేమిస్తే ఎంత బాగుంటుందో కదా! మీరూ ఇలాంటి కలల్ని కనరాదా!

సారీ మీకేదేదో చెప్పేశాను, బాధ పెట్టేశాను. ఇంతకీ డాక్టర్లేమో గుడ్లు, మాంసం మానవులకు అవసరమనే అంటున్నారు. ఏమో నా కడుపులో వున్నదంతా మీ ఎదుట నిలబడి చెప్పేశాను.

నిజమే కదా అనిపిస్తే మీరూ మాంసాహారం మానేయండి. తినాలని వుంటే నా వాగుడేం పట్టించుకోకుండా తినేయండి. ఏం పర్లేదు.

11) పిల్లలూ! ఈ పూట మనమంతా మనందరికీ ఎంతో మంచి మిత్రుడైన డిక్షనరీని గురించి మాట్లాడుకుందాం.

నేనొకటి అడగనా మిమ్మల్ని? మీరు రోజూ అన్నం గిన్నెలో ఎన్నిసార్లు చేయి పెడుతున్నారు? మూడు సార్లా! మంచిది.

మరి డిక్షనరీలో తెలియని ఇంగ్లీషు పదాలకు అర్థాలు తెలుసుకోవడానికి... ఇంతేసి ఫీజులు కట్టి ఇంగ్లీషు మీడియంలో చదువుతున్నారే... తెలుగు మీడియం పిల్లలకి కూడా ఇంగ్లీషు ఒక సబ్జెక్టుగా వుందే... మ్మరి అలాంటి డిక్షనరీలో రోజూ కనీసం మూడుసార్లు చేతులు పెట్టి రోజుకు మూడు పదాలకు అర్థాలు తెలుసుకుంటే నెలకెన్ని పదాలు పరిచయం అవుతాయి? 90 కదా. అంటే ఏడాదికి వెయ్యికి పైగా గదా. మీరింకా 10, 12 ఏళ్లు చదువుకుంటూ వుంటారు గదా. ఇలా నేర్చుకుంటే మీకు చదువై పోయేసరికి 10, 12 వేల ఇంగ్లీషు పదాలకు అర్థాలు తెలిసిపోతాయి.

అమ్మో! మిమ్మల్ని చూస్తూంటే నాకు అసూయగా వుంది. నాకైతే ప్రస్తుతానికి రెండు వేల పదాలకంటే ఎక్కువ రావేమో తెలుసా?

మీరు ఇలా రోజూ ఒక అలవాటుగా చేసుకుంటే మీకు బోలెడు vocabulary వచ్చేస్తుంది. అప్పుడు ఎంచక్కా మీరు Hindu Paper హాయిగా చదివేసుకుంటారు గదా. ఎన్నో విషయాలు చులాగ్గా తెలిసిపోతుంటాయి. ఆంగ్లంలో వున్న మంచి మంచి పుస్తకాలన్నీ మీరు కాలుమీద కాలేసుకుని చదివేస్తారన్న మాట.

ఆంగ్ల భాషా ప్రాముఖ్యత మీకు తెలిసిందే కదా. ఇప్పుడు ప్రపంచాన్నే ఒక కుగ్రామంగా అంటున్నారు పెద్దలు. మీకింకో విషయం తెలుసునా! ముందు మన మాతృభాష అయిన తెలుగు వొంట బడితేనే ఇంగ్లీషు అయినా వొంటబట్టేది!

దేన్నీ తక్కువ అంచనా వేయకుండా రెండు భాషల్లోనూ మీరు బాగా రాణించి రాయగలగాలేం!

12) పిల్లలూ! నిజం మాట్లాడుకుందాం. స్కూళ్లు నడుస్తూ వుంటే మీకు కష్టంగా వుంటుందీ, సెలవులిచ్చి మూసేస్తే సుఖంగా వుంటుంది కదా. మీకే కాదులెండి చిన్నప్పుడు మాకూ అంతే. ఆ మాటకొస్తే మీ వయసులో వున్న పిల్లలకు లోకమంతా ఇంతే. అమెరికాలో పిల్లలైనా ఇంతే. ఇంగ్లండులో పిల్లలైనా, చైనాలో పిల్లలైనా ఇంతే.

ఎందుకంటారు? ఎక్కడ లోపముందంటారు?

చిన్నప్పుడు నా వరకు నేను కంఠస్తం పెట్టడమే చదువు అనుకునే వాణ్ణి. 'హమ్మయ్య ఈ ఇంగ్లీషు ఎస్సే నోటికొచ్చేసింది. ఇంకో ఎస్సే ఈ రాత్రికి కంఠస్తం పెట్టేయాలి' అనుకునే వాణ్ణి.

అందువల్ల చదువు నరకాన్ని చూపిస్తుంది. అదే అర్థం చేసుకుని చదువుకున్నా మనుకోండి. సునాయాసంగా వుంటుంది. ఎనుము పాలిస్తుంది. ఎనుమును మనం చూశాం. అది పాలిచ్చేది మనం చూశాం. ఇంకా ముక్కను కంఠస్తం పెట్టేదేముంది? ఈ ఒక్క ముక్కా ఫ్రాన్స్ దేశంలో పదో తరగతి చదివే పిల్లవాడు తెలుగులో నేర్చుకో వాలనుకోండి. ఆ పిల్లవాడు ఈ ముక్కను కంఠస్తం పెట్టడం, ఇట్లాంటి వాక్యాలను వొక వంద బట్టీ పెట్టడం వాడికి నరకం చూపించదూ! అదే ఎనుముని ఫ్రెంచిలో ఏమంటారో తెలుసుకుని పాలను ఏమంటారో తెలుసుకుని, ఇస్తుంది అనే పదానికి ఫ్రెంచ్‌లో అర్థం తెలుసుకున్నాడనుకోండి వాడికి ఈజీ అయిపోదూ!

అర్థం కాని చదువూ, కంఠస్తం పెట్టే చదువూ వొట్టి దండగ.

ఎంత కంఠస్తం పెట్టినా ఆ కంఠతా పెట్టిందాన్ని పరీక్షల్లో అరకొరగా రాసినా, ఒకవేళ పూర్తిగా రాసినా మూడు రోజులు పోతే మెదడంతా ఖాళీనే.

ఏదైనా సరే అర్థం చేసుకుని చదవాల్సిందే. ఉదాహరణకు మీరు తొమ్మిదో తరగతిలో ఫిజిక్సులో sound పాఠం చదువుతున్నారు. అది అర్థం కావడం లేదనుకోండి. మీరేం చెయ్యాలంటే ఆ sound మీద వచ్చే ప్రశ్నలను బట్టీ పెట్టేయకూడదు. వెనక్కి వెళ్లాలి. అంటే ఆరులోనో ఏడులోనో sound chapter మొదలై వుంటుంది. అక్కణ్ణించీ concepts అన్నీ నిదానంగా చదువుకుంటూ వచ్చామనుకో. ఏముందీ తొమ్మిదిలో sound ఈజీ అయిపోతుంది. అర్థమైందా కొండలూ! ఏ సబ్జెక్టు అయినా ఇంతేగానీ కంఠస్తాలకు దిగిపోయి చదివిందే చదువుతూ హింసలు పడకండి.

13) పిల్లలూ! మీరెప్పుడైనా మీ నాన్న పొలానికి ఎరువులు వేస్తుంటే చూశారా! చూశారు గదా. జాగ్రత్తగా గమనించండి. పంట మొక్కల్లోంచి కలుపు మొక్కల్ని పీకేశాక నాన్న ఎరువుల్ని చల్లుతాడా, కలుపు మొక్కలు వుండంగానే ఎరువుల్ని చల్లుతాడా!

కరెక్ట్. కలుపు మొక్కలు పీకేశాకే ఎరువులు చల్లుతాడు. లేకపోతే ఏమవుతుంది? పంట మొక్కలకి అందాల్సిన ఎరువులు కాస్తా కలుపు మొక్కల పాలై పోయి పంట మొక్కల్ని అణిచి పారేసి కలుపు మొక్కలు బలిసి పోతాయి. ధాన్యం దిగుబడి అస్సలుండదు.

పొలంలో కలుపు మొక్కలు ఎలాంటివో మీ చదువులో ఈ గైడ్స్, వర్కు బుక్కులు అలాంటివే. గైడ్సనూ, టెక్స్టు బుక్సనూ కలిపేసి మీరు చదివారో... అంతా నాశనమై పోతుంది.

పిల్లలెవ్వరూ గైడ్స్ కొనకూడదు. టెక్స్టు బుక్స్ మాత్రమే నిదానంగా చదువుకోవాలి. ముఖ్యాంశాలన్నిట్నీ క్రోడీకరించుకుని మీ అంతట మీరే Notes prepare చేసు కోవడం తెలుసు కోవాలి. అప్పుడు మీరు కట్టుకున్న ఇంట్లో మీరున్నంత హాయిగా వుంటుంది.

చాలా మంది పిల్లలు Guides కొంటే ప్రశ్నలకన్నిటికీ సమాధానాలు వుంటాయి, Notes రాసుకునే పని వుండదు అని పొరబడతారు. గైడ్స్ ప్రకారం ప్రశ్నల వారీగా చదువుకుంటూ పోతే మీకేమీ అర్థం కావు విషయాలేవి కూడా.

ఉదాహరణకు మీరు శ్రీరామచంద్రుడి కథ తెలుసుకోవాలనుకున్నారనుకోండి– ప్రశ్నల ప్రకారం చదువుకుంటూ పోతే మీరు గందరగోళంలో పడిపోయి, వీలుగాక, ఏవో కొన్ని ప్రశ్నలకు సమాధానాలు బట్టీ పట్టి పరీక్ష రాసి ఏదో ఒక రకంగా గట్టెక్కేస్తారు.

మూణ్ణెల్ల తర్వాత కంఠతా ఎగిరి పోయి వుంటిందా, సీత రాముడికేమవుతుం దంటే నీళ్లే నముల్తారు.

అలా గాక రామ జననం మొదలు రావణ వధ దాకా వున్న 'రామ కథ'ను వరసగా చదువుకుంటూ పోయారనుకోండి, ఏ ప్రశ్న అడిగినా మీరు టకీమని సమా ధానం రాసేస్తారు.

కాబట్టి Bit banks, Guides కొనకండి. అది విషాహారం కంటే కూడా ప్రమాదం.

14) పిల్లలూ! ఈరోజు మనం ఎ.సి. స్కూళ్లను ముందరేసుకుని సరదాగా తిట్టుకుందాం, అసహ్యించుకుందాం, ఎగతాళి చేసుకుందాం. సరేనా?

కొంపదీసి ఎయిర్ కండిషన్డ్ స్కూళ్లలో చదువుకునే పిల్లల్ని చూసి మీరు ఈర్ష్య పడుతున్నారా ఏం? వొద్దమ్మా వొద్దు. జాలి చూపండి పాపం. అట్లాగని ఆ పిల్లల్ని ద్వేషించకండి. పిల్లల తప్పేముంది? తప్పంతా తల్లిదండ్రులదే. స్టేటస్ సింబల్ కోసం తెలిసీ తెలియక లక్షల కొద్దీ ఫీజులు చెల్లించి అభం శుభం తెలియని పిల్లల్ని అందులో పడేస్తున్నారు.

ఇదేంది, సార్ ఇట్లా మాట్లాడుతున్నాడు, ఎ.సి.లలో పిల్లలు చల్లగా హాయిగా వుంటారు కదా! అని అనుకుంటున్నారా పాపం? పగలు పన్నెండు గంటలూ రాత్రి 12 గంటలూ పిల్లలు ఎసిలలో పడి వుండడం ఎంత ప్రమాదమో తెలుసా?

మీరెప్పుడైనా ఏపుగా పెరిగిన చెరుకు తోటను చూశారా? చూడక పోతే ఈసారి చూడండి. ఆ చెరుకు తోటలో నీడన పడివున్న గడ్డి మొక్కల్ని చూడండి. మెత్తగా అలా పట్టుకు పీకితే చేతికొచ్చేస్తాయి. ఆ మొక్కలకు వేళ్లు ధృడంగా వుండవు, మొక్క బలంగా వుండదు.

పార్కులో చెట్టు నీడన వున్న గడ్డి మొక్కల్ని కూడా చూడండి. ఆ గడ్డిని పిడికెడు అలా పట్టుకుంటే వచ్చేస్తుంది.

అలాగే ఎర్రటి ఎండలో పొలం గట్టున వున్న గడ్డి మొక్కల్ని చూడండి. అమ్మో ఎంత బలంగా వుంటాయో. అందుకే మన తల్లులు పొలానికి కొడవళ్లు తీసుకెళతారు, గడ్డిని కోసుకోవడానికి!

అంటే ఎండ అనేది ప్రాణికి చాలా బలవర్ధకమైనది. ఎండలో పని చేసి అలిసిపోయిన వాడికే నీడ విలువ తెలుస్తుంది.

ఇప్పుడు ఎ.సి. స్కూళ్లల్లో చదువుకునే ఆ చిన్నారుల్ని తీసుకోండి. రేపు ఎండా కాలంలో పల్లెటూరికెళ్లి మామిడి తోపు కెళ్లారనుకోండి. అయ్యబాబోయ్ రోళ్లు పగిలే ఆ ఎండలో రెండు నిమిషాలు నడవగలరా పాపం? అలవాటు లేక ఆయాస పడిపోరూ! మామిడి తోపులో కూడా కొలిమి దగ్గర వున్నట్టు తన్నుకులాడిపోరూ! నాకేమో వాళ్లని తలచుకుంటే బిత్తరగా వుంటోంది.

మీరు పొరబాటున ఎ.సి. స్కూళ్లల్లో చదువుకోలేక పోతున్నామే అని దిగులు చెందకండి. దాన్ని Luxury అని భ్రమ పడకండి. తెలిసిందా!

15) పిల్లలూ! మీకున్న లేనిపోని భయాల్ని ఇక్కడ ప్రస్తావించి మీకు ఎక్కడ లేని ధైర్యాన్నివ్వడానికి నాలుగు మాటలు మాట్లాడుతాను వినండి.

లెక్కల్లో చాలామంది poor అని పుట్టి పుణ్యానికి దిగులు పడిపోతుంటారు. తొమ్మిదో తరగతి చదువుతున్నా $(a+b)^2$, $(a-b)^2$ సూత్రాలు రావడం లేదే అని ఆందోళన పడి పోతుంటారు. సబ్జెక్టులు మీకెన్ని? బోలెడున్నాయి. ఒక్క లెక్కలేనా? లెక్కలు రానంత మాత్రాన మిమ్మల్ని మీరే 'మొద్దులు' అనుకోని దిగులు పడిపోతే ఎట్లా చెప్పండి?

నేను గమనించాను గదా. లెక్కల్లో poor గా వున్న అమ్మాయీ, Algebra అనగానే గాభరా పడిపోయే mind వున్న అబ్బాయీ, Social Studies లో యమా intelligence చూపిస్తుంటారు. కొంతమంది పిల్లల్లో languages లో ఎంత నిపుణత వుంటుందో చెప్పలేం. వీళ్లంతా కూడా ఈ పాడు లెక్కలు రాలేదని, దీంతో చదువు అబ్బడం లేదని నిరాశలో పడి కూరుకు పోతుంటారు.

M.Sc., Maths చేసినా, ఇంజనీరింగ్ పూర్తి చేసినా, M.A. English చదివినా అంతా ఆ అమ్మే. ఎక్కడ చూసినా ఏ సబ్జెక్టుకైనా బొచ్చెడు అవకాశాలు ఉంటాయి.

మీ కింకో విషయం తెలుసునా? మీకు కానీ, మీ తల్లిదండ్రులకు గానీ... ఐ.ఎ.ఎస్. పరీక్షల మీద మోజు వుంటుంది గదా.

చెపుతున్నా వినండి. మెడిసిన్, ఇంజనీరింగ్, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసిన వాళ్లు కూడా ఐ.ఎ.ఎస్. పరీక్షను హిస్టరీ, పొలిటికల్ సైన్స్, ఇంగ్లీషు, తెలుగులను options గా తీసుకుని రాస్తుంటారు. పాసవుతుంటారు.

అంటే అర్థం? బొచ్చులో లెక్కలు రాకపోతే జీవితంలో పైకి రాము – అనే ఆవేదన అనవసరం అని కదా.

మీకు ముగ్గురు మేనత్తలున్నారనుకోండి. వాళ్లల్లో ఒక మేనత్తంటే చాలా ఇష్టంగా వుంటారు కదా మీరు. మాటిమాటికి ఆ అత్త దగ్గిరికి వెళ్లి పోతుంటారు గదా. మీ ఎదుట ఇన్ని సబ్జెక్టులుంటాయి కదా. ఈ ఇన్నిట్లో మీకేది ఇష్టమో దానిమీద బాగా శ్రద్ధ పెట్టి చదవండి. పై క్లాసులకు పోయాక ఆ సబ్జెక్టులో ఇక మీరే వజ్రం.

కాబట్టి లెక్కలు రానంత మాత్రాన తెలివి తక్కువ వాళ్లం అని మీరనుకోకండి. ఎవరైనా అన్నా వెవ్వెవ్వె అని వెక్కిరించి పారేయండి ఏం పర్లేదు.

16) పిల్లలూ! మనం ముప్పూటలా హొట్టి భోజనమే చేసి బతుకుతున్నామా? లేదు కదా! పచ్చి చెనిక్కాయల కాలంలో వాటిని పెరుక్కు తినమూ! ఇంకా నిప్పుల్లో కాల్చుకునీ, వుడక బెట్టుకునీ తింటాం గదా. అంతటితో వూరకుంటామా? జాంకాయల సీజనులో దోరదోర జాంకాయల్ని చిలక కొరికేసినా సరే వొదిలి పెడతామా! రేగు పండ్లూ, నేరేడు పండ్లూ, తాటి ముంజలూ, మొక్కజొన్న పొత్తులూ, ఎలక్కాయలూ... ఓ... ఒకటనేమి కొన్ని వందల రకాలు తింటాము కదా. అప్పుడే పౌష్టికాహారంతో మన మొహం కళకళలాడేది.

అలాగే చదువుకునే పిలకాయలు కూడా కేవలం క్లాసు పుస్తకాలకే పరిమితం కాకూడదు. చదవడం అంటే క్లాసు పుస్తకాలనే చదవడం అని కాదు. చాలా మంది పిల్లలు క్లాసు పుస్తకాలు తప్ప వేరే ఏవీ చదవరు. ఇది చాలా తప్పుడు పని.

మనం మన పొట్టకు ఎన్ని రకాల తిండ్లు తింటామో అన్ని రకాల పుస్తకాలు చదివి మన మెదడుకు కూడా మేత పెట్టాలి. పరీక్ష లెప్పుడూ వుండేవే. అమ్మో నెలలో పరీక్ష వుంది అని చెప్పి మహాత్ముడి జీవిత చరిత్ర పుస్తకం ఇంట్లో వున్నా నెలల తరబడి దాని జోలికి పోకుండా వుంటామా! పరీక్షల్లో మంచి మార్కులు రావడానికి క్లాసు పుస్తకాలు చదివేస్తున్నాం కదా, చదువంటే ఇదే అని భ్రమ పడ కూడదు.

అలాగైతే మీరు మహానుభావుల జీవిత చరిత్రలను ఎప్పటికీ చదవరా? అలా వుండకూడదు. టెక్ట్స్ బుక్స్ అనేవి కేవలం సిలబస్‌లో భాగం అంతే కాని అవి జీవితంలో భాగం కాదు.

చరిత్ర పుస్తకాలు, జీవిత చరిత్రలు, కవిత్వం పుస్తకాలు, కథల పుస్తకాలు, మంచి మంచి నవలలు బోలెడు చదవాలి. అప్పుడు మీ మెదడు వికసిస్తుంది. ఈ టెక్ట్స్ బుక్స్ చదువులనేవి అప్పుడే ఈజీగా వంటబట్టి పోతుంటాయి.

పుస్తకాలు కొనడం అనేది మీకొక అలవాటుగా మారాలి. ఎంతసేపూ వూర్లో వున్న లైబ్రరీ మీదే ఆధారపడకూడదు. మీరంటూ 20, 22 ఏళ్ల వయసు వచ్చేసరికి కనీసం అయిదారు వందల పుస్తకాలు మీ సొంత లైబ్రరీలో వుండాలి.

మీరెన్ని చిల్లర మల్లర విషయాలకు ఖర్చులు పెడుతుంటారో పాపం! పుట్టిన రోజు కేకులకు డబ్బు ఖర్చు పెట్టడం దండగ. ఒక మహానుభావుడు ఏమన్నాడో

తెలుసా? చిరిగిన చొక్కా అయినా వేసుకో, ఒక పుస్తకాన్ని కొనుక్కో అనేసి అన్నాడు. మనం వేసుకునే బట్టలు కూడా పరిమితంగానే వుండాలి. కానీ పుస్తకాలు అపరిమితంగా ఏర్పాటు చేసుకోవాలి. చెత్త సినిమాలు 40 చూసేకన్నా 50 మంచి పుస్తకాలు కొనడం మంచిది. ఏమో భవిష్యత్తులో మీరు కూడా పుస్తకాలు రాయొచ్చేమో తెలుసా?

మీరు చిన్నచిన్న పిల్లలు కదా. పాపం మీరు అమాయకత్వం కొద్దీ టీవీని 'వినోదం పంచే పెట్టె' అని నమ్ముతూ వుంటారు. అందులో టాం అండ్ జెర్రీ, మిక్కీ మౌస్, చోటా భీం లాంటి మంచివి కూడా వస్తుంటాయి. పిల్లలు వీటి వరకు చూడడం మంచిదే కానీ టీవీలో వచ్చే నానా చెత్తకూ అతుక్కు పోకూడదు.

ఎనిమిదీ, తొమ్మిదీ చదివే పిల్లలు కూడా టీవీల్లో వచ్చే సీరియల్స్‌కు అలవాటు పడిపోవడం మాత్రం దారుణం. అందులో ఏం వినోదం వుంటుందో చెప్పండి. ఇవన్నీ సమయాన్ని వృథా చేసుకోవడం తప్ప మరొకటి కాదు.

మీకు నిజంగా వినోదం, జ్ఞానం కావాలనుంటే నే చెప్తా వినండి – అది మీ పిల్లల సాహిత్యం పుస్తకాల్లో బోలెడుంది.

మార్క్‌ట్వెయిన్ అని అమెరికా మహా రచయిత ఒకాయన వున్నాడు. పాపం పిల్లలు చదువుకుంటారు కదాని ఆయన ప్రపంచంలో వున్న పిల్లలందరి కోసం ఎన్ని పుస్తకాలు రాశాడో తెలుసా? టాంసాయర్ అనీ, హకల్ బెరిఫిన్ అనీ, విచిత్ర వ్యక్తి అనీ, రాజు–పేద అనీ ఇట్లా మీకు మరో ప్రపంచంలో వున్నట్లు వుంటుంది. అవన్నీ చదివితే, పరవశించిపోతారు.

ఇంకా 80 రోజుల్లో భూ ప్రదక్షిణం అని ఒక పుస్తకం వుంది. రాసినాయన పేరు గుర్తులేదు కానీ ఆ యాత్ర చేసినాయన పేరు గుర్తుంది. ఫిలియాస్ ఫాగ్. ఈ పుస్తకం గాని చదివితే మీరు ఫిలియాస్ ఫాగ్‌ను ఎంతిష్టపడిపోతారో చెప్పలేను. అప్పుడు మీ పనికి మాలిన హీరోలంతా మీకు ఈగల్లా కనిపిస్తారు.

ఇంకా మీ పిల్లల కోసమే లూయీ స్టీవెన్‌సన్ అనే ఆయన Treasure Island అని ఒక పుస్తకం రాశాడు. అచ్చంగా పిల్లల కోసమే. అందులో జాన్ సిల్వర్ అనే కుంటి మనిషి చూపించే తెలివితేటలకు మీరు ఖచ్చితంగా ఆశ్చర్య పోతారు.

ఈ పుస్తకాలన్నీ కూడా తెలుగులో కానీ, ఇంగ్లీషులో కానీ విశాలాంధ్ర పుస్తకాల షాపుల్లో దొరుకుతాయి. కొని చదవండి.

సారీ మరిచే పోయాను. మన ఆంగ్లో ఇండియన్ రచయిత – అంటే ఇండియా లోనే పుట్టినా ఆంగ్లంలో పుస్తకాలు రాశాడూ అని అర్థం – ఆర్.కె. నారాయణ్ Swamy and his friends ను చదవండి. మీరు కూడా ఆ మిత్ర బృందంలో చేరిపోక పోతే నామీద వొట్టు.

పిల్లలు చిల్లర కొట్లకి వెళ్లి నిజం డబ్బులు అయిదో పదో ఇచ్చి ప్లాస్టిక్‌తో తయారు చేసిన నకిలీ నోట్లు కొనుక్కొని, 'నా దగ్గర 500 రూపాయల నోట్లూ, 1000 రూపాయల నోట్లూ నాలుగేసున్నాయ్, నీ దగ్గరెన్నునాయ్?' అని ఆడుకొంటూ వుంటారు. ఎంత తప్పుడాట? దీన్ని గమనించి ఇట్లాంటి ఆటలు మంచివి కాదని చెప్పకపోతే ఎలా? ఆడుకోవాలంటే గోలీలాట, కోతికొమ్మచ్చి లేవా అని సరదా మాటలతో పిల్లలకు మంచీ చెడ్డా చెప్పాలి.

ఇంకా ఒకరోజు మహాకవి శ్రీశ్రీని ప్రేయర్ హాల్లో పరిచయం చేసి ఆయన పిల్లల మీద రాసిన శైశవ గీతిని చదివి అర్థం చెప్పచ్చు.

... ఇట్లా పిల్లలతో బోలెడు విషయాల గురించి ఇంట్లోనూ, ప్రేయర్ హాల్లోనూ మాట్లాడితే మనదేం పోతుందీ!

To

The Correspondent,
Socrates High School,
Bairagi Patteda, Tirupati.

Dear Sir,

I am suffering from Tirumala Hills. So, Please grant me one day leave.

Yours Sincerely,
K. Vani,
5th Class.

లీవు లెటర్లను రాయడానికి అయ్యవార్లు, Suffering from fever, from head ache, from stomach ache అని గుడ్డి వాటంగా చెప్తా వుంటారు కదా ! ఆ పిల్ల Suffering దగ్గిరకొచ్చే సరికి Tirumala hills అని fill up చేసింది. ఆ రోజు ఆ పిల్ల – అమ్మా నాయినతో కూడా కొండకు పోతా వుంది. అదీ కత.

---

మునక్కాయ ముప్పావలా లెక్కన ముసలవ్వ వీధిలో మునక్కాయలమ్ముతోంది. ఒక టీచరాలు ఆ అవ్వ దగ్గిర మూడు మునక్కాయల్ని కొనుక్కుంది. ముసలవ్వ చేతిలోకి రెండుం పావలా, టీచరాలి చేతికి మూడు మునక్కాయలూ చేరిపొయ్యాయి. చదువూ సంధ్యాలేని వాళ్లిద్దరి మధ్యా భిన్నాలకు సంబంధించీ, దశాంశ స్థానాలకు సంబంధించీ, వొక పెద్ద లెక్క గుట్టు చప్పుడు గాకుండా జరిగిపోయింది!

$3/4 \times 3 = 2.25$ (లేదా) $0.75 \times 3 = 2.25$

మూడో మనిషికి తెలీకుండా జరిగిపోయిన ఈ లెక్క ఎగురుకుంటూ స్కూలుకు వచ్చిందనుకోండి. ఒక బోర్డూ, చాక్ పీసుల బాక్సూ, వొక పుస్తకం, నాలుగు బెత్తాలూ, వొక డిగ్రీ హోల్డరూ, ఇంకా బి.ఇడి. తోకా... శవం పడిన ఇల్లు మాదిర్తో ఏడుపులూ, పెడ బొబ్బలూ...!

**పిల్లల కోసం, పిల్లలున్న పెద్దల కోసం**
**నామిని ఇస్కూలు పుస్తకం!**